


తెలంగాణ ప్రభుత్వం

మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ - చైల్డ్ లైన్ ఫౌండేషన్

బడిలోగానీ, బడి బయటగానీ వేధింపులకు గురవుతున్నా

ఆపదలో, కష్టాలలో ఉన్న పిల్లలను రక్షించడానికి

CHILD LINE 1098 NIGHT & DAY

24 HOUR NATIONAL HELPLINE

పిల్లలతో పనిచేయిస్తున్నా, వారిని బడికి పంపకుండా వేరే కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నా

కుటుంబ సభ్యులు గానీ, బంధువులు గానీ ఇబ్బందికరంగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నా

1098 (పది-తొమ్మిది-ఎనిమిది) ఉచిత టెలిఫోన్ సేవా సౌకర్యానికి ఫోన్ చేయండి

IN ANY EMERGENCY

DIAL 100

TELANGANA POLICE

www.tspolice.gov.in

@ Telangana State Police





రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణాసంస్థ

తెలంగాణ, హైదరాబాదు.






# సింగిడి - 1

## తెలుగు వాచకం

## తొమ్మిదో తరగతి

(ప్రథమ భాష)



Free




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాదు

# తెలుగువారిలో జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు

**1. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ :**



(1895-1976)

తెలుగులో జ్ఞానపీఠ అవార్డుపొందిన ప్రథమవ్యక్తి కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. ఈయన కృష్ణాజిల్లా నందమూరు గ్రామంలో జన్మించాడు. తండ్రి శోభనాద్రి, తల్లి పార్వతమ్మ. ఈయనకు బందరు హైస్కూలులో చెళ్లపిళ్ళ వేంకటశాస్త్రి తెలుగు ఉపాధ్యాయుడుగా ఉన్నాడు. ఈయన కొంతకాలం అదే హైస్కూల్లో ఉపాధ్యాయునిగా కూడా పనిచేశాడు. సంస్కృత, ఆంగ్లభాషలపై పట్టుసాధించాడు. ఉద్యోగం చేస్తూనే మద్రాసు విశ్వవిద్యాలయం నుండి M.A.పట్టాపొందాడు. ఈయన నేషనల్ (కృష్ణాజిల్లా), ఎ.సి., హిందూ (గుంటూరు), యస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల (కరీంనగర్) కళాశాలల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులుగా, శాసనమండలి సభ్యుడుగా పనిచేశాడు. ఈయన కావ్యం, గేయం, నవల, కథ, వ్యాసం, నాటకం, విమర్శ, శతకంవంటి విభిన్న ప్రక్రియల్లో రచనలు చేపట్టాడు. లెక్కకు మించి గ్రంథాలకు పీఠికలు రాశాడు. ఈయనను కేంద్రప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతోటి సత్కరించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదుతో, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటుతోటి సన్మానించింది. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా ఉన్నాడు. ఈయన రచనల్లో ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి ఆంధ్రపౌరుషం, ఆంధ్రప్రశస్తి, శ్రీమద్రామాయణ కల్పవృక్షం, వేయిపడగలు, విశ్వనాథ మధ్యాక్కరలు, కిన్నెరసానిపాటలు మొదలయినవి. వీటిలో **'శ్రీమద్రామాయణ కల్పవృక్షాని'**కి 1971లో జ్ఞానపీఠ పురస్కారం లభించింది. ఈయనకు తెలుగుభాష అన్నా, తెలుగుతనం అన్నా వల్లమాలిన అభిమానం.

**2. డా॥ సి.నారాయణరెడ్డి :**



(1931-2017)

"ఊపిరాడదంలేదు ఉక్కపోస్తుంది ఎ.సి.గదిలో, కారణం తెలుస్తుంది కవిత రాయలేదివాళ" అని కవిత్వం రాయనిదే ఉండలేని సింగిరెడ్డి నారాయణరెడ్డి సి.నా.రె.గా సాహిత్యాభిమానులకు పరిచితుడు. ఈయన రాజన్నసిరిసిల్ల జిల్లాలోని హనుమాజీపేట గ్రామంలో జన్మించాడు. కరీంనగర్, హైదరాబాదులలో విద్యాభ్యాసం చేశాడు. "ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు – ప్రయోగములు" అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందాడు. నిజాం కళాశాలలో, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేశాడు. అధికారభాషా సంఘం అధ్యక్షునిగా, డా॥ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాలకు ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక భాషా వ్యవహారాల సలహాదారునిగా పదవులధిష్ఠించాడు. రాజ్యసభ సభ్యునిగా సేవలందించాడు. ఈయన రాసిన "మంటలూ – మానవుడూ" కావ్యానికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 1988లో **'విశ్వంభర'** కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారం లభించింది. నవ్వనిపువ్వు, కర్పూర వసంతరాయలు, ప్రపంచపదులు, తెలుగుగజళ్లు, విశ్వనాథ నాయకుడు, ఋతుచక్రం మొదలైన కావ్యాలు ఆయన రాసినవే. వివిధ సంస్థలు అనేక బిరుదులతోటి సత్కరించాయి. 1992లో వీరిని భారత ప్రభుత్వం పద్మభూషణ్‌తోటి సత్కరించింది.

**3. డా॥ రావూరి భరద్వాజ :**

ఈయన అవిభక్త హైదరాబాద్ సంస్థానపు పరిటాల జాగీర్‌లోని మొగులూరు గ్రామంలో జన్మించాడు. తండ్రిపేరు కోటయ్య, తల్లిపేరు మల్లికాంబ. పెరిగింది గుంటూరు జిల్లాలోని తాడికొండ గ్రామంలో. పొట్టకూటి కోసం వ్యవసాయ కూలీగా, పశువులకాపరిగా, రంపంలాగే పనివాడిగా, పేపరు బాయ్‌గా పనిచేశాడు. ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న ఆయన కలంపట్టి రచయితగా మారాడు. ఆయన చదువుకున్నది అంతంత మాత్రమే. ఆయన తన బలహీనతలన్నింటినీ సవరించుకొని తనదైన సొంత శైలిలో రచనలు చేపట్టాడు. పిల్లలకు, పెద్దలకు పాపులర్ సైన్స్‌పుస్తకాలు, అనేక కథలు, నవలలు రాశాడు. 17వ ఏట నుండే రచనలు ప్రారంభించాడు. ఈయన రాగిణి, దైవరాజకీయాలు, జీవన సమరం, పాకుడురాళ్ళు మొదలయినవి రచించాడు. ఈయన రచనలు అనేకం ఇంగ్లీషు, హిందీ, తమిళం, కన్నడం, మళయాళం భాషల్లోకి అనువాదమైనవి. మూడు విశ్వవిద్యాలయాలు వీరికి గౌరవ డాక్టరేట్ పట్టాలు ఇచ్చి సత్కరించాయి. 2012 సంవత్సరానికి **"పాకుడు రాళ్ళు"** నవలకు జ్ఞానపీఠ పురస్కారం లభించింది.



(1927-2013)

# విద్యార్థులకు సూచనలు

విద్యార్థులూ!

- మీరందరూ ధారాళంగా చదువగలగాలి. తెలిసిన దాని గురించి సొంతంగా రాయగలగాలి. మీకు చదువడం, రాయడం రాకుంటే మీ ఉపాధ్యాయుడి సాయంతో నేర్చుకోవాలి.
- మీరు నేర్చుకోవలసిన అంశాలను దృష్టిలో పెట్టుకొని మీకోసమే తెలుగుపుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకంలో మీరు సాధించవలసిన సామర్థ్యాల గురించి ఒక పేజీలో ఇచ్చారు. విద్యా సంవత్సరం పూర్తయ్యేసరికి వీటిని మీరు చేయగలగాలి. వాటిని చదువాలి.
- ప్రతి పాఠం మొదట్లో బొమ్మ / పేరా / సంఘటన / పద్యం... ఇట్లా ఏదైనా ఉంటుంది. వాటి గురించి మాట్లాడండి. ప్రశ్నలకు జవాబులు చెప్పాలి. దీనివల్ల మీకు పాఠం ఉద్దేశం, నేపథ్యం, ఇతివృత్తం గురించి అర్థమౌతుంది.
- 'విద్యార్థులకు సూచనలు' అనే గడిలోని సూచనలు చదివి, అర్థం చేసుకొని పదాల అర్థాలు తెలుసుకోవాలి.
- తరగతి గదిలో చర్చలు జరుగుతున్నప్పుడు, జట్టుపనులు నిర్వహిస్తున్నప్పుడు మీరు పాల్గొనాలి. మాట్లాడాలి. అవసరమైతే ప్రశ్నించాలి.
- పాఠం చివరలో 'ఇవి చేయండి' అనే పేరుతో అభ్యాసాలున్నాయి. వీటిని మీరు సొంతంగా చేయాలి. ప్రశ్నలకు మీరే ఆలోచించి సొంతంగా జవాబులు రాయాలి. ఎట్టి పరిస్థితుల్లో గైడ్లు, స్టడీ మెటీరియల్, ప్రశ్నల బ్యాంకులు మొదలైన వాటిలో చూసి రాయవద్దు. ఒకవేళ అట్లా రాస్తే ఫార్మేటివ్ (నిర్మాణాత్మక) మూల్యాంకనంలో మీకు మార్కులు ఇవ్వరు.
- సృజనాత్మక అంశాలను ఎట్లా చేయాల్నో తరగతి గదిలో మీ ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోవాలి. మీరు తరగతి గదిలో రాసి చూపాలి. దీనిపైన చర్చ జరిగిన తరువాతనే మీ నోటు పుస్తకాలలో రాయాలి.
- పాఠంలోని ప్రాజెక్టుపనులు, సృజనాత్మకతకు సంబంధించిన ప్రశ్నలను మీరు మీ మిత్రుల సహాయంతో చేయవచ్చు. వీటిని ఎట్లా చేయాలో మీ ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోండి. వీటిని చేసిన తరువాత మీరు ఎట్లా చేశారు? ఏం చేశారు? ఏం నేర్చుకున్నారు? మొదలైన వాటి గురించి మీరే సొంతంగా చెప్పగలగాలి.
- అభ్యాసాలను మీరే సొంతంగా చేయండి. చేయలేని వాటి గురించి మాత్రమే ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోవాలి.
- అభ్యాసాలలో ఇచ్చిన వ్యాకరణాంశాలు మీకు అర్థంకావడానికి మొదట ఉదాహరణలు ఇచ్చారు. వాటి ఆధారంగా మీకు అర్థం అయ్యేటట్లు సూత్రాన్ని ఇచ్చారు. కాబట్టి ఉదాహరణలను జాగ్రత్తగా పరిశీలించి వాటిని విశ్లేషించి సూత్రాన్ని తెలుసుకోవాలి.
- ఉపవాచకం పాఠాలను మీరే సొంతంగా చదువాలి. వాటి గురించి మాట్లాడాలి. చర్చించాలి. విశ్లేషించాలి.
- పాఠాలకు సంబంధించిన ఇతర పుస్తకాలను పాఠశాల గ్రంథాలయానికి పోయి అడిగి తీసుకొని చదువాలి.
- మీరు తప్పనిసరిగా నిఘంటువును ఉపయోగించుకోవడం అలవాటు చేసుకోవాలి. వార్తాపత్రికలు, మ్యాగజైన్లు, కథలపుస్తకాలు మొదలైనవి చదువడం అలవాటు చేసుకోవాలి.
- కొన్ని పాఠాలలో నాటకీకరణ చేయడం, ఏకపాత్రాభినయం చేయడం, గేయాలను రాగంతో పాడడం, అభినయం పద్యాలను కంఠస్థం చేయడం వంటివి ఉన్నాయి. వీటిని మీరు తప్పనిసరిగా సాధన చేయాలి.
- మీరు తప్పనిసరిగా వ్యాసాలు, లేఖలు, నినాదాలు, కరపత్రం, సంభాషణ, పోస్టరు తయారీ వంటివి రాయగలగాలి. అవసరమైతే మీ ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోవాలి. తోటివారి సహాయంతో చేయాలి.
- సృజనాత్మకతకు సంబంధించిన అంశాలను మీరు రాసిన తరువాత ఒక పుస్తక రూపంలో సంకలనం చేసి తరగతి గదిలో ప్రదర్శించాలి.

SCERT TELANGANA

# సింగిడి - I

## తెలుగు వాచకం (ప్రథమభాష)

# తొమ్మిదో తరగతి


### సంపాదకమండలి

**ఆచార్య ఎస్. వి. రామారావు,** విశ్రాంత ఆచార్యుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**డా॥ దహగాం సాంబమూర్తి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ఉపాధ్యాయ విద్యా కళాశాల వరంగల్.

**డా॥ నందిని సిధారెడ్డి,** విశ్రాంత ఉపన్యాసకుడు, మెదక్ జిల్లా.

**డా॥ నలిమెల భాస్కర్,** విశ్రాంత ఉపన్యాసకుడు, కరీంనగర్ జిల్లా.

**డా॥ ఎస్. రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**దేశపతి శ్రీనివాస్,** ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి, ముఖ్యమంత్రి కార్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

### సమన్వయం, విషయనిపుణులు

**సువర్ణ వినాయక్,**
కో-ఆర్డినేటర్,
ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాద్, తెలంగాణ.

**డా॥ నన్నూరు ఉపేందర్ రెడ్డి,**
సలహాదారు, విద్యా సంస్కరణలు,
పాఠశాల విద్యాశాఖ,
హైదరాబాద్, తెలంగాణ.

**చిత్రాలు : బి. కిషోర్ కుమార్,** ఉపాధ్యాయుడు, యు.పి.యస్., ఊట్కూర్, నిడ్మనూరు (మం), నల్లగొండ జిల్లా.

**ముఖచిత్రం : కూరెళ్ల శ్రీనివాస్,** ప్రధానోపాధ్యాయుడు, జి.ప.ఉ.పా. కుర్మేడు, నల్లగొండ జిల్లా.



### పాఠ్యపుస్తక ప్రచురణ సమితి

**ఎస్. జగన్నాథ రెడ్డి**
సంచాలకులు,
రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణాసంస్థ,
తెలంగాణ, హైదరాబాద్.

**కె. కృష్ణమోహన్ రావు**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక,
పాఠ్యపుస్తక విభాగం,
రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణాసంస్థ,
తెలంగాణ, హైదరాబాద్.

**బి. సుధాకర్**
సంచాలకులు,
ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం
తెలంగాణ, హైదరాబాద్.


విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

చట్టాలను గౌరవించాలి
హక్కులను పొందాలి

"నా తెలంగాణ కోటి రత్నాల వీణ"


**తెలంగాణ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21




SCERT TELANGANA

© Government of Telangana, Hyderabad

*First Published 2015*
*New Impressions 2016, 2017, 2018, 2019, 2020*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Director of School Education, Hyderabad, Telangana.

This Book has been printed on 70 G.S.M. Maplitho
Title Page 200 G.S.M. White Art Card

తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

*Printed in India*
at the Telangana Govt.Text Book Press,
Mint Compound, Hyderabad,
Telangana.

SCERT TELANGANA



# ముందుమాట

2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సందర్భంగా మన రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, సాహిత్యం, చరిత్రను తెలిపే విధంగ పాఠాలు ఉండాలని నిర్ణయించింది. ఇందుకోసం కవులు, రచయితలు, భాషావేత్తలు, క్షేత్రస్థాయి విషయనిపుణులతో ఒక కమిటీని నియమించింది. కమిటీ సభ్యులు ప్రస్తుతం అమల్లో ఉన్న తెలుగు పాఠ్యపుస్తకాలను పరిశీలించి తెలంగాణ సాహిత్యం, సంస్కృతి ప్రతిబింబించేలా పాఠ్యపుస్తకాలను రూపొందించారు. తెలుగు సాహిత్యంపట్ల అవగాహన ఏర్పడడానికి ఇతర ప్రాంతాలకు చెందిన కవులు, రచయితల పాఠాలను కూడా పొందుపరచారు.

భాషావాచకాల ద్వారా విద్యార్థి తమ స్థానిక సంస్కృతి సాహిత్య విశేషాలను, చారిత్రక వైభవాలను తెలుసుకోగలగాలి. దాంతోపాటు ఆలోచించడం, విమర్శనాత్మక విశ్లేషణ, స్పష్టమైన భావవ్యక్తీకరణ సామర్థ్యాలు పెంపొందించుకోగలగాలి. నిరంతరం సాహిత్య పఠనం ద్వారా జ్ఞానపరిధిని విస్తృతపరచుకుంటూ ఉన్నత వ్యక్తిత్వాన్ని, విశిష్ట వైఖరులను సంతరించుకోవాలి. దీనికి అనుగుణంగా ఈ తొమ్మిదో తరగతి ప్రథమభాషకు తెలుగువాచకాన్ని రూపొందించారు. దీని ద్వారా పిల్లల్లో అవగాహన చేసుకొని ప్రతిస్పందించే సామర్థ్యాలు, జీవకారుణ్యం, పర్యావరణం, భాషాభిరుచి, సామాజిక స్పృహ, సమాజసేవ, నైతికవిలువలు, దేశభక్తి, మానవ సంబంధాలు మొదలగు ఇతివృత్తాలతో పాఠాలు ఉన్నాయి. పాఠ్యాంశాలు ప్రాచీన, ఆధునిక పద్యం, కథానిక, ఆత్మకథ, గ్రాంథిక వచనం, పాట, అచ్చతెలుగు కావ్యం, కరపత్రం, వచనకవిత మొదలైన ప్రక్రియల్లో ఉన్నాయి. పిల్లల్లో స్ఫూర్తి, దేశభక్తి, విలువలు పెంపొందింపజేయడానికి గిరిజన నాయకుడు 'కుంరం భీం', తెలంగాణ జాతిపిత 'జయశంకర్', ప్రముఖ ప్రజా కవి 'కాళోజి', రాజకీయ దురంధరుడు తొలి తెలుగు ప్రధాని 'పి.వి.నరసింహారావు', బడుగువర్గాల ఆశాజ్యోతి తొలి మహిళా ఉపాధ్యాయిని 'సావిత్రిబాయి పూలే', భారత కీర్తిప్రతిష్ఠలను ఖండాంతరాలకు చాటిన దేశభక్తుడు 'స్వామి వివేకానంద' గురించి ఉపవాచక పాఠాలుగా పెట్టారు.

ప్రతి పాఠంలో సామర్థ్యాల సాధనకనుగుణంగా **'ఇవి చేయండి'** శీర్షికతో అభ్యాసాలున్నాయి. ఆలోచించడం, ప్రతిస్పందించడం, అభిప్రాయాలు చెప్పడం, బహుకోణాల్లో విశ్లేషించడం, విభిన్న కోణాల్లో ఆలోచించడం, సకారణంగా వివరించడం, అన్వయించడం, సృజనాత్మకంగా, ప్రశంసాత్మకంగా వ్యక్తీకరించడం వీటి స్వభావం. పిల్లలు పాఠ్యపుస్తక పరిధిని దాటి నేర్చుకోవడానికి వీలుగా ప్రాజెక్టుపనుల వంటివి చేర్చారు. ఇవి స్వయం అధ్యయనాన్ని, అదనపు / పరామర్శ గ్రంథాలను సంప్రదించడాన్ని ప్రోత్సహించేటట్లు ఉన్నాయి. పాఠంలోని విషయాన్ని అవగాహన చేసుకొనుటకు వీలుగా సందర్భోచిత అర్థాలను పదవిజ్ఞానం పేరుతో పుస్తకం చివర చేర్చారు. వీటిలో వీలయినంత మేరకు తెలంగాణలో వినియోగించే పదజాలాన్ని పొందుపరచారు.

ఉపాధ్యాయులు సోపానక్రమం ప్రకారం పాఠాన్ని బోధించుటకు వీలుగా పాఠంలోని విషయాలను అమర్చారు. గద్య, పద్య పాఠాలను వేర్వేరుగా ఇవ్వకుండా పాఠాల స్వభావం, నిడివి ఆధారంగా వరుస క్రమంలో ఉంచారు. వ్యాకరణ సూత్రాలను సులభంగా ఆకళింపు చేసుకునేలా ఉదాహరణలు పొందుపరిచారు. భాషోపాధ్యాయులు పాఠంలోని విషయాన్ని నేరుగా బోధించకుండా పాఠ్యాంశం ముందున్న అంశాలతో ప్రారంభించాలి. తర్వాత పాఠ్యాంశాన్ని చర్చలు, ప్రతిచర్చల ద్వారా అవగాహన కల్పించాలి. ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. అభ్యాసాలపై సాధన చేయించాలి. పాఠ్యాంశంలోని జాతీయాలు, పదబంధాలు, ముఖ్యమైన సందేశాత్మక వాక్యాలు, సంఘటనల గురించి లోతైనచర్చ ద్వారా అవగాహన, విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలి. భాషాసామర్థ్యాల సాధనలో పాఠ్యపుస్తకం ఉపాధ్యాయుడికి ఒక సహకారి మాత్రమే. పరామర్శ గ్రంథాలను, పాఠశాల గ్రంథాలయాన్ని తాను వినియోగించుకుంటూ పిల్లలు వినియోగించుకునేటట్లు భాషావాతావరణాన్ని కల్పించాలి.

తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన తొలి వాచకం ఇది. కాబట్టి భాషాపరంగా లేదా ఇతర అంశాల గురించి విజ్ఞులు ఇచ్చే సలహాలు, సూచనలను ఎస్.సి.ఇ.ఆర్.టి. స్వీకరించి తగు చర్యలు చేపడుతుంది. పాఠ్యపుస్తకాల రూపకల్పనకోసం ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇచ్చి ప్రోత్సహించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి గౌరవనీయులు **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు** గారికి, గౌరవ విద్యాశాఖ మంత్రి **శ్రీ కడియం శ్రీహరి గారికి,** పూర్వ విద్యాశాఖ మంత్రి **శ్రీ జి. జగదీశ్ రెడ్డి** గారికి, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి **శ్రీమతి రంజీవ్ ఆర్. ఆచార్య** గారికి, పాఠశాల విద్యాశాఖ పూర్వ సంచాలకులు **శ్రీ ఎమ్.జగదీశ్వర్** గారికి, ప్రస్తుత సంచాలకులు **శ్రీ టి.చిరంజీవులు** గారికి, ప్రభుత్వ సలహాదారు **డా॥ కె.వి.రమణాచారి** గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ వాచక రూపకల్పనలో పాల్గొన్న కమిటీ సభ్యులు, సంపాదకమండలి సభ్యులు, విషయనిపుణులు, ఉపాధ్యాయులు, చిత్రకారులకు ధన్యవాదాలు. ఈ వాచకం పిల్లల్లో భాషాభిరుచి, సాహిత్యాభిలాష, భాషాసామర్థ్యాల సాధనకు దోహదపడి ఉత్తమవైఖరులు కల్గిన వ్యక్తులుగా ఎదగడానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాం.

తేది : 31-01-2015

స్థలం : హైదరాబాద్.

**సంచాలకులు**

రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణాసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

SCERT TELANGANA

# పాఠ్యపుస్తక సమీక్ష మరియు అభివృద్ధి కమిటీ సభ్యులు

## విశ్వవిద్యాలయ స్థాయి

**ఆచార్య రవ్వా శ్రీహరి,** పూర్వ ఉపకులపతి, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం.
**ఆచార్య ఎన్. గోపి,** పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య,** విశ్రాంత ఆచార్యుడు, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.
**ఆచార్య ఎస్. వి. రామారావు,** విశ్రాంత ఆచార్యుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**ఆచార్య బన్న అయిలయ్య,** తెలుగుశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.
**డా॥ ఎస్. రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**డా॥ ఎన్. రజని,** తెలుగు విభాగాధిపతి, డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**డా॥ జి. బాలశ్రీనివాస మూర్తి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్ జిల్లా.

## విద్యావేత్తలు, విషయనిపుణులు

**డా॥ చుక్కా రామయ్య,** విద్యావేత్త, హైదరాబాద్.
**డా॥ దహగాం సాంబమూర్తి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ఉపాధ్యాయ విద్యా కళాశాల వరంగల్.
**డా॥ నందిని సిధారెడ్డి,** విశ్రాంత ఉపన్యాసకుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేట, మెదక్ జిల్లా.
**డా॥ నలిమెల భాస్కర్,** విశ్రాంత ఉపన్యాసకుడు, ఎస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల, కరీంనగర్ జిల్లా.
**డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి,** విశ్రాంత ప్రధానాచార్యుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చండూరు, నల్లగొండ జిల్లా.
**డా॥ ముదిగంటి సుజాతారెడ్డి,** విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్, ఆర్.బి.వి.ఆర్.ఆర్. కళాశాల, హైదరాబాద్.
**వేణు సంకోజు,** విశ్రాంత ఉపన్యాసకుడు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నల్లగొండ జిల్లా.
**సంగిశెట్టి శ్రీనివాస్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జోగిపేట, మెదక్ జిల్లా.
**దేశపతి శ్రీనివాస్,** ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి, ముఖ్యమంత్రి కార్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.
**డా॥ ఎన్. ఉపేందర్ రెడ్డి,** సలహాదారు, విద్యా సంస్కరణలు, పాఠశాల విద్యాశాఖ, హైదరాబాద్, తెలంగాణ.
**కె. కృష్ణమోహన్ రావు,** ప్రొఫెసర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**దీపిక,** ఉపన్యాసకురాలు, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**సువర్ణ వినాయక్,** కో-ఆర్డినేటర్, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**కె.రాజేందర్ రెడ్డి,** కో-ఆర్డినేటర్, విద్యా ప్రణాళిక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ.
**తల్లావజ్ఝల మహేశ్‌బాబు,** ఉపన్యాసకుడు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, నిజామాబాద్ జిల్లా.

## క్షేత్ర స్థాయి

**పల్లెర్ల రామమోహన రావు,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.
**వి. చెన్నయ్య,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా., జగద్గిరి నగర్, రంగారెడ్డి జిల్లా.
**వొజ్జల శరత్‌బాబు,** భాషోపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., సీతాఫల్‌మండి, హైదరాబాద్.
**అవుసుల భానుప్రకాశ్,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పా., లోనికలాన్, మెదక్ జిల్లా.
**కందాడై రంగరాజు,** ఎస్.ఎ. (తెలుగు), జి.ప.ఉ.పాఠశాల, రంగాపురం, రంగారెడ్డి జిల్లా.
**ఎల్.ఎం.ప్రసాద్,** భాషోపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., హిమాయత్‌నగర్, సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాద్.
**పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లీహిల్స్, హైదరాబాద్.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

# ఈ పాఠ్యపుస్తకం గురించి...

ఆరు దశాబ్దాల తెలంగాణ స్వప్నం సాకారమైంది. కొత్త రాష్ట్రం, కొత్త ప్రభుత్వం ఏర్పడిన చారిత్రక సందర్భంలో అన్నిరంగాల్లో కొత్త ప్రణాళికలు రూపొందుతున్నాయి. ఏ మార్పుకైనా విద్యారంగం ముఖ్య భూమిక పోషిస్తుంది. భావితరాలను జాతి ఆకాంక్షలకు అనుగుణంగా తయారుచేసేది విద్యారంగమే. కొత్త ప్రభుత్వం కొత్త పాఠ్యాంశాల రూపకల్పన కోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటుచేయడం గొప్ప సంబురం.

మలిదశ తెలంగాణ ఉద్యమం దీర్ఘంగా కొనసాగిన దశాబ్దంనర కాలంలో విద్యారంగంలో వలసాధిపతులు స్థిరపర్చిన వివక్షను ప్రశ్నించవలసి వచ్చింది. చెప్పేటందుకు, పెత్తనం చెలాయించేటందుకు తెలుగు భాష సెంటిమెంటును (భావోద్వేగాన్ని) ఒకపక్క ముందుకు తెస్తూనే మరో పక్క ఆంధ్రభాషే అసలు తెలుగుగా, ఆ ప్రాంత చరిత్రే ప్రధానచరిత్రగా బలవంతంగా మన నెత్తిన రుద్దుతున్న విషయాన్ని గుర్తించాం. పద్ధతి ప్రకారం కావాలని స్థానిక సంస్కృతిని, స్థానిక చరిత్రలను, కవులను నిర్లక్ష్యం చేస్తున్నారని, అణచివేస్తున్నారని ఒక సోయి కలిగింది. పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సంస్కృతీసాహిత్యాలను తప్పించటంలో దాగి ఉన్న లోతులు ఎరుకపర్చుకున్నాం. తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ పాఠ్యాంశాలే ఉంటాయనీ స్వంతభాష, స్థానిక సంస్కృతి పాఠాల్లోనికి ఎక్కుతుందని ప్రకటించుకున్నాం.

మనకాలంలో మనం చేసిన ఒక ఉద్యమం సఫలం కావటం చరిత్ర. ఒక కల నిజమై రాష్ట్రం ఏర్పడిన చరిత్ర అద్భుతం. రాష్ట్రం ఏర్పడితే ఎన్ని పార్శ్వాల్లో ఎన్ని విశేష పరిణామాలు సంభవిస్తాయో అవతలిప్రాంత మూలాలు కదులుతుంటే తెలుస్తున్నది.

సాధారణంగా ఒక సంవత్సరం ఒక తరగతి చొప్పున పాఠ్యపుస్తకాలను రూపొందిస్తుంటారు. కాని ఒకే సంవత్సరం పాఠశాల స్థాయిలోని అన్ని తరగతుల పాఠ్యాంశాలు మార్చటం రికార్డు. గొప్ప విశేషం. విశేషమైన ఈ పనికి కమిటీ నియమించటం వినూత్నం. ఈ తెలంగాణ పనిలో భాగం కావటం, తెలంగాణ పాఠ్యాంశాల రూపకల్పనలో పాలుపంచుకోవటం భావోద్వేగ భరితం. మరెంతో సంబురం. ఉద్యమస్ఫూర్తితోనే పనిసాగింది. భాష గురించి, పరిణామాల గురించి జరిగిన చర్చలు కొత్త ఆలోచనలకు తలుపులు తెరిచాయి. పది జిల్లాల ప్రాతినిధ్యం వల్ల ఇదొక భాషా సాంస్కృతిక సమ్మేళనం. భవిష్యత్ తెలంగాణకు మార్గదర్శకం. అయితే తెలంగాణలో వినియోగిస్తున్న క్రియాపదాల విషయంలో ఏకాభిప్రాయం చోటుచేసుకోనందున ప్రస్తుతం శిష్ట వ్యవహారిక భాషను వినియోగించడం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ఎస్.సి.ఇ.ఆర్.టి. సంకల్పం నెరవేరాలి. పిల్లల్లో ఆలోచనాశక్తి పెరగాలి. సమాజాన్ని అర్థం చేసుకోవాలి. మన భాషలో రాయగల్గాలి. మన భాషను గర్వంగ వినియోగించాలి. పిల్లల్లోని సృజనాత్మకత బయటికిరావాలి. కొత్త పాఠ్య పుస్తకాలు తెలంగాణ జాతికి వికాసం కలిగిస్తాయని, విద్యార్థులకు విజ్ఞానవినోదాలతోపాటు తమ పాఠాలు చదువుతున్న సంబురం చేకూరుస్తాయని మా నమ్మకం.

తేది : 31-01-2015
స్థలం : హైదరాబాద్.

**పాఠ్యపుస్తక అభివృద్ధి కమిటీ,**
తెలంగాణరాష్ట్రం, హైదరాబాద్.

SCERT TELANGANA



# ఉపాధ్యాయులకు సూచనలు

- ఉపాధ్యాయుల పనిభారాన్ని, పనిదినాలను దృష్టిలో పెట్టుకొని ఆచరణకు వీలుగా పాఠ్యాంశాల సంఖ్యను తగ్గించి రూపొందించిన వాచకం ఇది. ఒక నెలలోని పనిదినాలను దృష్టిలో పెట్టుకొని మాసవారీగా పాఠాలను కేటాయించారు.
- **'ముందుమాట, పాఠ్యపుస్తకం ద్వారా సాధించాల్సిన సామర్థ్యా'లను** తప్పనిసరిగా చదువాలి. **'విద్యార్థులకు సూచన'లను** ముందుగా మీరు చదువండి. వాటిని మీ పిల్లలతో చదివించండి. వారికి అవి అర్థమైనాయో లేదో పరిశీలించండి.
- ఈ వాచకాన్ని 180 కాలాంశాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు. వీటిలో 168 కాలాంశాలు పాఠ్యాంశాల బోధనకు, మిగతా కాలాంశాలను ఉపవాచకంలోని అంశాలను చర్చించడానికి వినియోగించాలి.
- ఉపవాచకాన్ని పిల్లలతో తప్పక చదివించాలి. ముఖ్యాంశాలపైన మాట్లాడించాలి. పఠనావగాహనకు సంబంధించిన అభ్యాసాలను రూపొందించి నిర్వహించాలి.
- సగటున ఒక్కొక్క పాఠానికి 14 కాలాంశాలు అవసరమవుతాయి.
- వీటిలో **'చదువండి – ఆలోచించండి, నేపథ్యం / ఉద్దేశం, కవిపరిచయం, విద్యార్థులకు సూచనల్లో'** ఇచ్చిన అర్థసంగ్రహణ కృత్యాలకు కలిపి రెండు కాలాంశాలను వినియోగించుకోవాలి.
- పాఠ్యాంశ విషయంపై చర్చించి అవగాహన కల్పించేందుకు పాఠంలోని విషయం నిడివిని బట్టి రెండు నుండి నాలుగు కాలాంశాల వరకు కేటాయించుకోవాలి. ఇందుకనుగుణంగా పాఠాన్ని విభజించి రోమన్ అంకెల్లో సూచించారు.
- **'ఇవిచేయండి'**లో ఇచ్చిన అభ్యాసాలకు మిగతా 7 కాలాంశాలను వినియోగించాలి, 'అవగాహన–ప్రతిస్పందన' అభ్యాసాలకు 2 కాలాంశాలు, 'వ్యక్తీకరణ–సృజనాత్మకత'కు 2 కాలాంశాలు, భాషాంశాలలో ఇచ్చిన 'పదజాలం, వ్యాకరణాంశా'లకు కలిపి 2 కాలాంశాలు, 'ప్రాజక్టుపని'ని ప్రదర్శింపజేసి చర్చించడానికి 1 కాలాంశాన్ని కేటాయించుకోవాలి.
- పాఠం ప్రారంభంలో ఇచ్చిన **'చదువండి – ఆలోచించి చెప్పండి'** అనే అంశాలు ఉన్ముఖీకరణకు సంబంధించినవి. వీటిని పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.
- పాఠ్యాంశం ఉద్దేశం / నేపథ్యం, పాఠ్యభాగ వివరాలు, కవిపరిచయంలోని అంశాలను పిల్లలతో చదివించి చర్చించాలి.
- **'విద్యార్థులకు సూచనలు'**లోని అర్థ సంగ్రహణ కృత్యాలను వ్యక్తిగత కృత్యాలుగా నిర్వహించాలి. ఇందుకోసం తరగతి గదిలో తప్పనిసరిగా నిఘంటువులను అందుబాటులో ఉంచాలి.
- పాఠంలోని విషయం పట్ల పిల్లలకు అవగాహన కల్పించేటందుకు చర్చాపద్ధతి, ప్రశ్నోత్తర పద్ధతి, కథాకథనం, ప్రదర్శనా పద్ధతి, నాటకీకరణ వంటి పద్ధతులను ఆయా పాఠాల స్వభావాన్ని బట్టి ఉపయోగించాలి. పాఠం మధ్యలో **'ఆలోచించండి–చెప్పండి'** అనే పేరుతో గడిలో ప్రశ్నలున్నాయి. వీటిని పాఠం బోధించే సమయంలో అడుగాలి. ఆలోచించి జవాబులు చెప్పుమనాలి.
- పాఠం బోధించడమంటే విషయాన్ని వివరించడం మాత్రమే కాదు. దాంట్లోని విలువలను, కవి హృదయాన్ని, అంతరార్థాన్ని పిల్లలు అర్థం చేసుకునేటట్లు చూడాలి. ఇందుకోసం ఆలోచింపజేసే ప్రశ్నలు అడుగాలి. పదబంధాలు, జాతీయాలు, ఆలోచనాత్మక, సందేశాత్మక వాక్యాలపట్ల చర్చద్వారా, ప్రశ్నించడం ద్వారా పిల్లలే అవగాహన పొందేటట్లు చేయాలి. పిల్లల అభిప్రాయాలను చెప్పించడం, సమకాలీన అంశాలతో అన్వయించడం, బహుకోణాల్లో విశ్లేషించడంవంటివి జరుగాలి.
- 'ఇవిచేయండి'లోని అభ్యాసాలు పిల్లల భాషా సామర్థ్యాలను పెంపొందించడానికి ఉద్దేశించినవి. వీటిని పిల్లలే సొంతంగా రాసేటట్లు చూడాలి.
- గైడ్లు, స్టడీ మెటీరియల్లు, ప్రశ్నల బ్యాంకులు వంటివి చూసిరాయడాన్ని పూర్తిగా నిషేధించాలి. ఎందుకంటే పరీక్షలలో ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్లుగానే రావు. పాఠంలోని అభ్యాసాలను సొంతంగా రాయగలిగిన పిల్లలు మాత్రమే వీటికి సమాధానాలు రాయగల్గుతారు. కాబట్టి యాంత్రికంగ పాఠాలు పూర్తిచేసి సిలబస్ పూర్తయినట్లుగా భావించరాదు. సామర్థ్యాలు సాధించేటట్లు చూడాలి.
- **'అవగాహన–ప్రతిస్పందన'** అభ్యాసంలో ఇచ్చిన **'వినడం–మాట్లాడటం'**కు సంబంధించిన ప్రశ్నలను పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. 'చదువడం–అర్థంచేసుకోవడ'ానికి ఉద్దేశించిన అభ్యాసాలను వ్యక్తిగత కృత్యంగా నిర్వహించాలి. పాఠం చదివి జవాబు రాయాల్సిన ప్రశ్నలను ఇంటిపనిగా ఇవ్వాలి.
- **'వ్యక్తీకరణ–సృజనాత్మకత'** అభ్యాసంలోని ప్రశ్నలు స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస సామర్థ్యాలకు సంబంధించినవి. వీటిలో లఘు సమాధాన ప్రశ్నలను పాఠం బోధించేటప్పుడే ఇంటి పనిగా ఇవ్వాలి. వ్యాసరూప సమాధాన ప్రశ్నలకు జవాబులు రాయడానికి పూర్తి తరగతి గదిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత వ్యక్తిగతంగా రాయించాలి. వాటిని చదివించాలి. పిల్లలు రాసిన అంశాలను భావాత్మకంగా వాక్యాలు, పదాలు, అక్షరదోషాలపరంగా సరిచేయాలి.

SCERT TELANGANA

- సృజనాత్మకత/ప్రశంసకు సంబంధించిన ప్రశ్నలకు పిల్లలు సమాధానాలు రాయడానికి తగిన ఉదాహరణలిచ్చి అవగాహన కల్పించాలి. జట్లలో రాయుమనాలి. వీటిని ప్రదర్శింపజేసి చర్చద్వారా సరిదిద్దాలి. ఆ తరువాత వీటిని వ్యక్తిగతంగా రాయుమనాలి.
- ప్రాజెక్టు పనులను కూడా ఇదేవిధంగా నిర్వహించాలి.
- పాఠం పూర్తి కావడమంటే **'చదువండి - ఆలోచించి చెప్పండి'** అనే ఉన్ముఖీకరణ అంశంతో మొదలుకొని పాఠంలో చివర ఇచ్చిన సూక్తివరకు అన్ని అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి అవగాహన కల్పించడం. ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులు తయారుకావాలి.
- ఇందుకోసం ఉపాధ్యాయులు వార్షిక, పాఠ్య ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- వార్షిక ప్రణాళికలో కింది అంశాలుంటాయి.

1) తరగతి 2) సబ్జెక్టు (విషయం) 3) అవసరమైన కాలాంశాల సంఖ్య

4) విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాలు

5) మాసవారీగా పాఠాల విభజన

| మాసం పేరు | బోధించే పాఠం | అవసరమైన కాలాంశాలు | అవసరమైన వనరులు / సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| | | | | |

6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు 7) ప్రధానోపాధ్యాయుని సలహాలు సూచనలు

- ఒక పాఠాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠ్యప్రణాళికను కింది విధంగా రూపొందించుకోవాలి.

1) పాఠం పేరు 2) అవసరమైన కాలాంశాల సంఖ్య 3) పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు

4) కాలాంశాల వారీగా విభజన

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహం | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | | | |

5) ఉపాధ్యాయుడి తయారీ, అదనపు సమాచారసేకరణ 6) ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు

- ప్రతికాలాంశంలో భాషాబోధనను కింది సోపానాల ప్రకారం నిర్వహించాలి. అవి–

**I. ఉపోద్ఘాతం** : పలకరింపు, ఉన్ముఖీకరణ, శీర్షికా ప్రకటన, ఉద్దేశం, కవిపరిచయం లేదా పలకరింపు, పునశ్చరణ.

**II. పాఠ్యాంశబోధన చర్చ – అవగాహన** : విద్యార్థుల ప్రకాశ పఠనం, ఉపాధ్యాయుల ఆదర్శ పఠనం, మౌనపఠనం, అర్థసంగ్రహణం, పాఠ్యాంశ విషయంపై చర్చ – అవగాహన, సామర్థ్యాల సాధన.

**III.** సామర్థ్యాల సాధన కోసం 'ఇవి చేయండి' లో అభ్యాసాలు చేయించాలి.

- నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా జూలై, ఆగస్టు, నవంబర్, ఫిబ్రవరి మాసాల్లో నిర్మాణాత్మక మూల్యాంకనంలో పుస్తక సమీక్ష, రాత అంశాలు, ప్రాజెక్టుపనులు, లఘుపరీక్ష ఆధారంగా పిల్లల ప్రగతిని అంచనావేసి నమోదు చేయవలసి ఉంటుంది.
- అట్లాగే సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని సామర్థ్యాల ఆధారంగా రూపొందించిన ప్రశ్నాపత్రంతో నిర్వహించాలి.
- భాషాబోధనను పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయరాదు. పాఠశాల గ్రంథాలయాన్ని, అంతర్జాలాన్ని (ఇంటర్నెట్), మేగజైన్‌లు, వార్తాపత్రికలు, బాలసాహిత్యం వంటివి ఉపయోగించుకునేటట్లు చూడాలి.
- తరగతి గదిలో పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించే వాతావరణాన్ని కల్పించాలి.
- తరగతి గదిలో భాషావాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన నిఘంటువులు, కవుల జీవిత చరిత్రలు, దృశ్యశ్రవణ సామగ్రి వంటివి సమకూర్చుకొని వినియోగించాలి.
- పాఠశాలలో భాషాభివృద్ధికి దోహదపడే కార్యకలాపాలు, భాషామేళాలు, భాషోత్సవాలు, బాలకవిసమ్మేళనాలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, వార్షికోత్సవాలు వంటివి నిర్వహించాలి.
- పిల్లలు రాసిన సృజనాత్మక అంశాలను సంకలనం చేసి తరగతి గదిలో ప్రదర్శించాలి.

# వందేమాతరం

- బంకించంద్ర ఛటర్జీ

వందేమాతరం, వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం; వందేమాతరం
శుభ్రజ్యోత్స్న పులకిత యామినీం
ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందేమాతరం.

# జాతీయ గీతం

- రవీంద్రనాథ్ ఠాగూర్

జనగణమన అధినాయక జయహే !
భారత భాగ్య విధాతా !
పంజాబ సింధ్ గుజరాత మరాఠా,
ద్రావిడ ఉత్కళ వంగా !
వింధ్య హిమాచల యమునా గంగా,
ఉచ్ఛల జలధి తరంగా !
తవ శుభనామే జాగే !
తవ శుభ ఆశిష మాగే !
గాహే తవ జయ గాథా !
జనగణ మంగళదాయక జయహే !
భారత భాగ్య విధాతా !
జయహే ! జయహే ! జయహే !
జయ జయ జయ జయహే !

# ప్రతిజ్ఞ

- పైడిమర్రి వేంకట సుబ్బారావు

భారతదేశం నా మాతృభూమి.
భారతీయులందరూ నా సహోదరులు.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.
సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం.
దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.
నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను.
ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.
జంతువులపట్ల దయతో ఉంటాను.
నా దేశంపట్ల, నా ప్రజలపట్ల, సేవానిరతి కలిగి ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.
వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

SCERT TELANGANA

# రూపకల్పనలో పాల్గొన్నవారు

**సువర్ణ వినాయక్,** కో-ఆర్డినేటర్,
ఎస్.సి.ఇ.ఆర్.టి. తెలంగాణ, హైదరాబాద్.

**వొజ్జల శరత్ బాబు,** భాషోపాధ్యాయుడు,
ప్ర.ఉ.పా., సీతాఫల్‌మండి, హైదరాబాద్.

**పల్లెర్ల రామమోహన రావు,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.

**ఎల్.ఎం.ప్రసాద్,** భాషోపాధ్యాయుడు,
ప్ర.ఉ.పాఠశాల, సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాద్.

**శ్రీమతి పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని,
భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల,
జూబ్లిహిల్స్, హైదరాబాద్.

**అవుసుల భానుప్రకాశ్,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., లోనికలాన్, మెదక్ జిల్లా.

**కందాడై రంగరాజు,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పాఠశాల, రంగాపురం, రంగారెడ్డి జిల్లా.

**డా॥ బి.వి.యన్.స్వామి,** ఉపాధ్యాయుడు,
జిల్లా విద్యా శిక్షణ సంస్థ, కరీంనగర్.

**వి. చెన్నయ్య,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., జగద్గిరి నగర్, రంగారెడ్డి జిల్లా.

**గాజుల రవీందర్,** ఎస్.ఎ. (తెలుగు),
ప్ర.ఉ.పా., సప్తగిరి కాలనీ, కరీంనగర్ జిల్లా.

**చక్రవర్తుల శ్రీనివాస్,** భాషోపాధ్యాయుడు,
జి.ప.ఉ.పా., చర్లపల్లి, పరకాల (మం), వరంగల్ జిల్లా.

**నందిగామ కిశోర్‌కుమార్,** భాషోపాధ్యాయుడు,
జి.ప.ఉ.పా., ఇప్పటూరు, నవాబుపేట (మం),
మహబూబ్‌నగర్ జిల్లా.

**దాసోజు జ్ఞానేశ్వరాచారి,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., చండూరు, నల్గొండ జిల్లా.

**కటుకోజ్వల మనోహరాచారి,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., తక్కళ్ళపల్లి, కథలాపూర్ (మం),
కరీంనగర్ జిల్లా.

**కన్నెగంటి వేంకటయ్య,** ఎస్.ఎ. (తెలుగు),
జి.ప.ఉ.పా., ముదిగొండ (మం), ఖమ్మం జిల్లా.

**డా॥ కాసర్ల నరేశ్‌రావు,** భాషోపాధ్యాయుడు,
జి.ప.ఉ.పా., సుద్దులం, డిచ్‌పల్లి (మం), నిజామాబాద్ జిల్లా.

**డి.టి.పి., లే ఔటు & డిజైనింగ్ : ప్రతిమ పాతూరి,** హైదరాబాద్.

SCERT TELANGANA

# విద్యార్థులు సాధించవలసిన సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలు

## I. అవగాహన - ప్రతిస్పందన

- ఇచ్చిన అంశాన్ని గురించి ఊహిస్తూ మాట్లాడగలగాలి.
- విన్న, చూసిన, చదివిన అంశాలపై విమర్శనాత్మకంగా మాట్లాడడం, చర్చల్లో పాల్గొనడం.
- చుక్క గుర్తుగల పద్యాలకు ప్రతిపదార్థాలు రాయగలగాలి.
- అపరిచిత అంశానికి సంబంధించిన పేరాలలోని కీలకపదాలను రాయగలగాలి.
- పద్యాలను, గేయాలను, కవితలను భావస్ఫోరకంగా చదవగలగాలి.
- చదివిన అంశం గురించి తార్కికంగా ప్రశ్నించడం, సమర్థిస్తూ, విభేదిస్తూ మాట్లాడగలగాలి.
- అపరిచిత అంశాలను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.
- చదువుతున్న అంశానికి చెందిన భావాన్ని గ్రహించడం, కీలక అంశాన్ని పదాలను గుర్తించగలగాలి.
- ఇచ్చిన అంశంపై అభిప్రాయాన్ని స్పష్టంగా తెలుపగలగాలి.
- పాఠ్యాంశంలోని స్వభావాల గురించి చెప్పగలగాలి. రాయగలగాలి.
- సగటున నెలకు మూడు, నాలుగు కథల పుస్తకాలు, మాసపత్రికలను చదువగలగాలి.
- రచనల్లోని శైలి భేదాలననుసరించి చదువడం, కొత్త పోకడలను గుర్తించగలగాలి.

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

- కథలను, విజ్ఞానశాస్త్రానికి చెందిన కాల్పనిక అంశాలను, వివిధ ప్రక్రియలను చదివి అర్థం చేసుకొని, సొంతమాటల్లో రాయగలగాలి.
- జీవిత విశేషాలు వర్ణనాత్మకంగా రాయగలగాలి.
- ఇచ్చిన ప్రశ్నలకనుగుణంగా విశ్లేషణాత్మకంగా జవాబులు రాయగలగాలి.
  స్వీయరచన చేయగలగాలి.
- పాఠ్యాంశాల ఆధారంగా ప్రాజెక్టుపనులు పూర్తిచేసి, నివేదికలు రూపొందించగలగాలి.
- ప్రక్రియలను ఒకదాన్ని మరొకరూపంలోకి మార్చగలగాలి. ఉదా॥ (కథను గేయంగా / సంభాషణగా)
- విరామ చిహ్నాలను సమర్థంగా ఉపయోగిస్తూ దోషరహితంగా క్రమపద్ధతిలో రాయగలగాలి.
- కరపత్రాలు, నివేదికలు, ఆహ్వానపత్రికలు రాయగలగాలి.
- భాషాసంఘంలో సభ్యులుగా చేరి పాఠశాల పత్రిక (మ్యాగజైన్) రూపకల్పనలో భాగస్వాములు కావడం, సాహితీ సమావేశాలు నిర్వహించడం వంటివి చేయగలగాలి.
- పాఠాల నుంచి గ్రహించిన అంశాలను వ్యక్తిత్వ నిర్మాణానికి ఉపయోగించుకోగలగాలి.
- పద్యాలకు సొంతంగా భావాలు రాయగలగాలి.
- ఇతర భాషలకు చెందిన కథలు, పాటలు, గేయాలు, వివిధ ప్రక్రియలకు చెందిన ఇతివృత్తాలను అవగాహనతో ప్రశంసించడం, బహుభాషాతత్వాన్ని గుర్తించి అభినందించడం చేయగలగాలి.

## III. భాషాంశాలు

- వివిధ రంగాలకు చెందిన (క్రీడలు, కళలు, సాంకేతిక విజ్ఞానం, నిర్మాణాలు, వృత్తులు మొ॥) పదజాలంపై పట్టు సాధించడం, చదివేటప్పుడు, రాసేటప్పుడు ఈ జ్ఞానాన్ని వినియోగించుకోగలగాలి.
- వివిధ పదజాలాలకు చెందిన అర్థపరిణామం గుర్తించగలగాలి.
- నిఘంటువుతోపాటు విద్యార్థి కల్పతరువులాంటి పుస్తకాలను వినియోగించగలగాలి.
- సంధి, సమాస లక్షణాలను అవగాహన చేసుకోవడం, ప్రయోగించడం చేయగలగాలి.
- ప్రత్యక్ష, పరోక్ష కథనాలు, కర్తరి, కర్మణి వాక్యరూపాలు అవగాహన చేసుకోగలగాలి.
- కావ్యభాష / ప్రాచీనభాషలోని వాక్యాలను ఆధునిక వ్యావహారికరూపంలోకి మార్చగలగాలి.
- వివిధ వాక్యభేదాలను గ్రహించి, ప్రయోగించగలగాలి.

SCERT TELANGANA



# 9వ తరగతి - విషయసూచిక

## పాఠ్యాంశాలు


| క్ర.సం. | పాఠం పేరు | కవి/రచయిత | ఇతివృత్తం | ప్రక్రియ | మాసం | పుట |
|---|---|---|---|---|---|---|
| 1. | ధర్మార్జునులు | చేమకూర వేంకటకవి | నైతిక విలువలు | ప్రబంధం | జూన్ | 2 |
| ★ 2. | నేనెరిగిన బూర్గుల | పి.వి.నరసింహారావు | స్ఫూర్తి | అభినందన వ్యాసం | జూలై | 14 |
| ★ 3. | వలసకూలీ | డా॥ ముకురాల రామారెడ్డి | సామాజిక స్పృహ | గేయం | జూలై | 25 |
| 4. | రంగాచార్యతో ముఖాముఖి | | సాహిత్య సేవ | ఇంటర్వ్యూ | ఆగష్టు | 34 |
| 5. | శతక మధురిమ | శతక కవులు | నైతిక విలువలు | శతకం | ఆగష్టు | 45 |
| 6. | దీక్షకు సిద్ధంకండి | | దేశభక్తి | కరపత్రం | సెప్టెంబరు | 60 |
| 7. | చెలిమి | పొన్నికంటి తెలగన | మానవ సంబంధాలు | అచ్చతెలుగు కావ్యం | అక్టోబరు | 68 |
| ★ 8. | ఉద్యమ స్ఫూర్తి | సంగెం లక్ష్మీబాయి | ప్రేరణ, దేశభక్తి | ఆత్మకథ | నవంబరు | 81 |
| ★ 9. | కోరస్ | సలంద్ర లక్ష్మీనారాయణ | సామాజిక స్పృహ | వచనకవిత | నవంబరు | 91 |
| 10. | వాగ్భూషణం | డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి | భాషాభిరుచి | వ్యాసం | డిసెంబరు | 98 |
| 11. | వాయసం | మామిండ్ల రామగౌడు | జీవకారుణ్యం | ఆధునిక పద్యం | జనవరి | 113 |
| 12. | తీయని పలకరింపు | ఇల్లిందల సరస్వతీ దేవి | మానవ సంబంధాలు | కథానిక | ఫిబ్రవరి | 123 |


## ఉపవాచకం


1) కుంరం భీం (జూలై) - 135
2) సురవరం ప్రతాపరెడ్డి (ఆగష్టు) - 143
3) కాళోజి (సెప్టెంబరు) - 148
4) ఆచార్య కొత్తపల్లి జయశంకర్ (అక్టోబరు) - 152
5) స్వామి వివేకానంద(నవంబరు) - 156
6) నేను... సావిత్రిబాయిని(డిసెంబరు) - 163

పదవిజ్ఞానం - 167


గమనిక : 1. పాఠంలో ✿ పువ్వు గుర్తుగల పద్యాలు కంఠస్థం చేయాలి.
2. విషయసూచికలో ★ గుర్తుగల పాఠాలను కాంపోజిట్ కోర్సువారు చదువాల్సిన అవసరంలేదు.

SCERT TELANGANA

# 1 ధర్మార్జునులు

– చేమకూర వేంకటకవి

## చదువండి – ఆలోచించి చెప్పండి.

✿ కుజనుల్ గొందరు రేగి యీ వసుమతిన్ క్రూరస్వభావంబుతో
సుజనాళిన్గడు గుందజేయునెడ రాజుల్ వారి వారింపకే
నిజ దౌర్బల్యము జూపిరేని చెడదా నిక్కంబుగా రాజ్యమో
త్రిజగత్కారణ! భక్తపాలన! హరా! శ్రీగుంటుమల్లేశ్వరా!

– యర్రం విశ్వనాథం గుప్త

**ప్రశ్నలు:**

1. సజ్జనుల బాధలను నివారించే వాళ్ళెవ్వరు?
2. దుర్మార్గులు విజృంభించినప్పుడు రాజులు ఏం చేయాలి?
3. ఈ పద్యాన్ని అనుసరించి రాజుల పరిపాలన ఎట్లా ఉండాలని మీరు అనుకుంటున్నారు?

## పాఠం నేపథ్యం, ఉద్దేశం

పాండవుల నియమావళిననుసరించి, అర్జునుడు తీర్థయాత్రలు చేస్తాడు. ఈ క్రమంలో సక్రమ రాజ్యపాలనకు కావలసిన అంగబలాన్ని సాధిస్తాడు. రాజ్యవిస్తరణకు అవసరమైన పరాక్రమ ప్రదర్శన చేస్తాడు. ఉలూచి, చిత్రాంగద, సుభద్రలను పెండ్లి చేసుకుంటాడు. ఈ కథను ఆధారంగా చేసుకొని వర్ణనలతో పెంచి, 'విజయవిలాసం' అనే ప్రబంధాన్ని చేమకూర వేంకటకవి రచించాడు. కావ్యారంభంలో ఇంద్రప్రస్థపుర వర్ణనలో భాగంగా దానికి రాజైన ధర్మరాజు, అతని సోదరుల గుణగణాల గురించి తెలిపాడు.

కోరిన కోర్కెలు తీర్చడంలోనూ శత్రువులను జయించడంలోనూ పాండవులు పేరు గాంచారు. అన్నదమ్ముల అనుబంధం, ప్రేమ, స్నేహభావం, సహనశీలత వంటి మంచిలక్షణాలను ముఖ్యంగా ధర్మరాజు ఆజ్ఞాపరిపాలనావ్రతాన్ని, అర్జునుని పౌరుష, సత్త్వస్వభావాలనూ ప్రతిమానవుడు అలవరచుకోవలసిన మంచిలక్షణాలను ప్రబోధించడం ఈ పాఠం ఉద్దేశం.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21
SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'ప్రబంధ' ప్రక్రియకు చెందినది. ఇతిహాస, పురాణాలలోని ఓ చిన్న కథను వర్ణనలతో చెప్పడమే ప్రబంధం. 'ప్రబంధం' వర్ణన ప్రధానమైనది. దీనిలో పద్దెనిమిది రకాల వర్ణనలు ఉంటాయి.

ఈ పాఠ్యభాగం 'ప్రతి పద్య చమత్కారచణుడు' చేమకూర వేంకటకవి రచించిన 'విజయవిలాసం' ప్రబంధంలోని ప్రథమాశ్వాసం లోనిది.

## కవి పరిచయం



(ఊహాచిత్రం)

17వ శతాబ్దం

చేమకూర వేంకటకవి లక్ష్మణామాత్య పుత్రుడు. ఈయన తంజావూరు రాజ్యాన్ని పాలించి, 'విజయభవన' కవిపండిత సభను నిర్వహించిన, 'అభినవ భోజరాజు' బిరుదాంకితుడైన రఘునాథ నాయకుని ఆస్థానకవి. ఈయన 'సారంగధర చరిత్ర' కావ్యంలో రాజుకు అంకితమియ్యదగిన గుణవిశేషాలు లేవని తలచి, సర్వ కావ్యగుణ సంపన్నంగా 'విజయవిలాసం' కావ్యాన్ని రచించాడు.

చేమకూర వేంకటకవి భారత కథలో అవసరమైన కొన్ని చక్కని మార్పులుచేసి, 'ప్రతిపద్య చమత్కారం'తో స్వతంత్ర కావ్యంగా విజయవిలాసాన్ని రాసి, రాజుకు అంకితమిచ్చి తన జన్మసార్థకమైందని ఆనందించాడు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA

## ప్రవేశిక

ప్రాచీన కాలం నుంచీ రాముడు, హరిశ్చంద్రుడు, శిబిచక్రవర్తి, నలుడు వంటి ధర్మపాలనా తత్పరులు విలసిల్లిన పుణ్యభూమి మనదేశం. వారు పాటించిన ప్రజారంజక విధానాలే అనంతర కాలానికి ఆదర్శాలయినాయి. మహాభారత కాలంలోనూ భీష్ముడు, విదురుడు, ధర్మరాజుకు స్ఫూర్తినిచ్చారు. "యథా రాజా తథా ప్రజాః" రాజు ఎట్లా ఉంటే ప్రజలు అట్లా ఉంటారు. కాబట్టి, ధర్మరాజు మహాపురుషుల మార్గంలో నడుస్తూ తన సోదరులపట్ల, ప్రజలపట్ల ప్రదర్శించిన ధర్మనిరతి ఎటువంటిదో తెలుసుకొనేటందుకు ఈ పాఠం చదువండి.

## I

✿ఉ. ఆ పురమేలు 'మేలు బళి!', యంచుఁ బ్రజల్ జయవెట్టుచుండ నా
జ్ఞా పరిపాలన వ్రతుఁడు, శాంతి దయాభరణుండు; సత్య భా
షా పరతత్త్వకోవిదుఁడు, సాధు జనాదరణుండు, దాన వి
ద్యా పరతంత్ర మానసుఁడు ధర్మతనూజుఁ డుదగ్రతేజుఁడై.

సీ. అవలఁ బోయిన వెన్కనాడు టెన్నఁడు లేదు,
మొగము ముందఱ నంట మొదలెలేదు,
మనవి చెప్పినఁ జేయకునికి యెన్నఁడు లేదు,
కొదవగా నడుపుట మొదలెలేదు,
చనవిచ్చి చౌక చేసినది యెన్నఁడులేదు,
పదరిహెచ్చించుట మొదలెలేదు,
మెచ్చినచోఁ గొంచె మిచ్చుటెన్నడుఁ లేదు,
మొకమిచ్చకపు మెచ్చు మొదలెలేదు.

తే. మఱియుఁ దొల్లిటి రాజుల మహిమలెన్న
నితడెఁపో సార్వభౌముఁడ ప్రతిముఁ డనఁగఁ
బ్రజలఁ బాలించె సకల దిగ్భాసమాన
కీర్తి విసరుండు పాండవాగ్రేసరుండు.



### ఆలోచించండి - చెప్పండి

- 'ఆజ్ఞాపరిపాలనా వ్రతం' అంటే ఏమిటి? మీ అభిప్రాయం చెప్పండి.
- 'మొకమిచ్చకపు మెచ్చు!' అంటే మీరేమనుకుంటున్నారు?
- మంచి వారిని ఎందుకు అనుసరించాలి?

SCERT TELANGANA

## II

సీ. ఎంత లెస్సగ నున్న నంత వేడుకె కాని
ప్రజల కల్మికసూయపడుట లేదు
తనుc గొల్వవలెనందఱను ప్రియంబేకాని
మానిసి వెగ టించుకైన లేదు
నిచ్చ వేcడిన నర్థికిచ్చు చిత్తమె కాని
మునుపింత యిచ్చితి ననుటలేదు;
రేవగల్ ధర్మమార్జించు దృష్టియె కాని
న్యాయంబు దప్పిన నడకలేదు;
తే. కలcడె యిటువంటి రాజులోకమున నెందు?
జలధి వలయిత వసుమతీచక్ర మెల్ల
నేలవలె శాశ్వతముగాగ నీ ఘనుండె;
యేలవలె నన్యు? లన నా నృపాలుcడలరు. 3

✿ఉ. కోపమొకింతలేదు; బుధకోటికిc గొంగుcబసిండి; సత్యమా
రూపము; తారతమ్యములెఱుంగు; స్వతంత్రుcడు; నూతన ప్రియా
టోపములేని నిశ్చలుc డిటుల్ కృతలక్షణుcడై చెలంగc గా
ద్వాపర లక్షణం దనగవచ్చునొకో యల ధర్మనందనున్? 4

**ఆలోచించండి -చెప్పండి**

- స్నేహభావం ఎవరెవరితో పెంపొందించుకోవాలి?
- ‘కొంగు బంగారం’ అనేమాట ఎప్పుడైనా విన్నారా? అయితే దాని గురించి మీరేమనుకుంటున్నారో చెప్పండి.

## III

క. దుర్జయ విమతాహంకృతి
మార్జన యాచనకదైన్యమర్దనచణ దోః
ఖర్జులు గలరతనికి భీ
మార్జున నకుల సహదేవులను ననుజన్ముల్. 5

క. పంచామర తరులో! హరి
పంచాయుధములో! గిరీశు పంచాస్యములో
యంచున్ సకల జనంబులు
నెంచన్ బాండవులు వెలసిరేవురు ఘనులై. 6

చ. ఒరిమయు, భక్తియున్, నెనరు నోర్పుc, గనంబడc, బెద్దపిన్నయం
తరువులెఱింగి, మాటజవదాcటకె, చెయ్యుల వేఱులేక, యొం
డొరుల మనమ్ములో మెలcగుచుండిరి, “పాండు కుమారులెంత నే
ర్పరు? లిల నన్నదమ్ముల సరాగము వారలదే సుమీ!”యనన్. 7

**ఆలోచించండి -చెప్పండి**

- అసూయపరులంటే ఎవరు? వారి వల్ల ఎవరికి నష్టమో చెప్పండి.
- ‘దానగుణం మనిషికి అవసరం’ ఎందుకో మీ అభిప్రాయాలు చెప్పండి.
- యాచకుల దీనత్వాన్ని పోగొట్టడానికి పాండవులు ఉత్సాహం చూపేవారు. ఎందుకో చెప్పండి.

SCERT TELANGANA

## IV

ఉ. అన్నలపట్లఁ దమ్ముల యెడాటమునన్ సముఁడంచు నెన్నఁగా
నెన్నిక గన్నమేటి, యెదురెక్కడలేక నృపాల కోటిలో
వన్నెయు వాసియున్ గలిగి వర్తిలు పౌరుషశాలి, సాత్త్వికుల్
దన్నుఁనుతింపఁగాఁ దనరు ధార్మికుఁడర్జునుఁ డొప్పునెంతయున్ 8

✿చ. అతని నుతింప శక్యమె? జయంతుని తమ్ముఁడు సోయగమ్మునన్
బతగ కులాధిపధ్వజుని ప్రాణసఖుండు కృపారసమ్మునన్
క్షితిధర కన్యకాధిపతికిన్ బ్రతిజోదు సమిజ్జయమ్ము నం,
దతని కతండె సాటి చతురబ్ధి పరీత మహీతలమ్మునన్. 9

తే. పాఱఁ జూచినఁ బరసేన పాఱఁజూచు
వింటి కొరిగిన రిపురాజి వింటికొరుగు,
వేయు నేటికి? నలపాండవేయు సాటి
వీరుఁడిలలేడు; ప్రతి రఘు వీరుఁడొకఁడు. 10

### ఆలోచించండి - చెప్పండి

- 'ప్రాణసఖుడు' అని ఎవరినంటారు? వాళ్ళ లక్షణాలు ఎట్లా ఉంటాయి?
- 'ధర్మప్రవర్తన కలిగి వుండటం' అంటే ఏమిటి?
- స్నేహభావం పెంపొందించుకోవడం వలన ఎటువంటి ప్రయోజనాలు ఉంటాయో చెప్పండి.

### తాత్పర్యాలు

1) యమధర్మరాజు వరపుత్రుడైన ధర్మరాజు తాను ఇచ్చిన ఆజ్ఞల ప్రకారం తాను కూడా ప్రవర్తించాలన్న దీక్ష కలవాడు. శాంతి, దయ అనే మహాగుణాలనే ఆభరణాలుగా ధరించినవాడు. నిజం చెప్పడంలోని స్వారస్యాన్ని బాగా తెలిసినవాడు. మంచి వారిని ఆదరించి పోషించేవాడు. దానం చేయడమనే విద్యపట్ల ఆసక్తిగల మనసున్నవాడు. నిశిత పరాక్రమం కలవాడై విశేషంగా రాజ్యపాలన చేస్తుండేవాడు. అటువంటి ధర్మరాజును గూర్చి ఆ ఇంద్రప్రస్థ ప్రజలంతా 'మేలు, బళి!' అంటూ జేజేలు పలుకుతున్నారు.

2) ఇతరుల గురించి చాటుమాటుగా చెడుగా మాట్లాడటం ఎప్పుడూ లేదు. ముఖప్రీతి కోసం మంచిమాటలు చెప్పడం మొదటి నుంచీ లేదు. ఏదైనా సాయంకోసం మనవి చేసుకుంటే ఆ సాయాన్ని చేయకుండా ఉండటం ఎప్పుడూ లేదు. సంపూర్ణ సహాయం చేసేవాడు. పరిచయమైనప్పుడు ఎక్కువ మర్యాద యిచ్చి కాలక్రమేణా అమర్యాదగా ప్రవర్తించడం ఎప్పుడూలేదు. యోగ్యతను గుర్తించి గౌరవించేవాడు. పండితులను, ప్రవీణులనూ మెచ్చినప్పుడు వారికి తక్కువ యివ్వడమనేదే లేదు. ముఖప్రీతికోసం ఎవరినీ మెచ్చడం అసలే లేదు. అట్లాగే పూర్వకాలపు సుప్రసిద్ధ రాజుల గొప్ప గుణాలు ఎన్ని పరిశీలించినా ఈ ధర్మరాజే సాటిలేని చక్రవర్తి అనే రీతిగా అన్ని దిక్కులకు తన కీర్తి కాంతులను ప్రసరింపజేస్తూ (పాండురాజు జ్యేష్ఠకుమారుడగు ధర్మరాజు) ప్రజలను పాలించేవాడు.

3) ప్రజలు ఎంత గొప్పగా ఉంటే అంతగా సంతోషపడేవాడు కానీ ప్రజల సంపదలను చూసి అసూయపడేవాడు కాదు. అందరితో కలిసిమెలిసి ఉండటం ఇష్టమేకాని, ఎవరిపై అసూయ కలిగినవాడు కాదు. తన్ను వేడుకునే యాచకులకు దానం చేసేవాడే కాని, ముందు ఇచ్చాను కదా! అని సాగనంపేవాడు కాదు. రాత్రింబగళ్ళు ధర్మకార్యాలు చేస్తూ పుణ్యం సంపాదించాలనే దృష్టేకాని, న్యాయం తప్పి ప్రవర్తించేవాడు కాదు. ఇటువంటి

SCERT TELANGANA

రాజు లోకంలో ఎక్కడైనా ఉన్నాడా? (లేదు) సముద్రంచే ఆవరించబడిన ఈ భూమండల మంతటినీ ఈ గొప్ప గుణాల ధర్మరాజే శాశ్వతంగా పాలించాలి. ఇతర రాజులెందుకు? అని ప్రజలు అనుకునేటట్లు ఆ ధర్మరాజు ప్రకాశిస్తున్నాడు.

4) కోపం కొంచెం కూడా లేదు. పండిత సమూహానికి మూటగట్టిన కొంగు బంగారం. సత్యస్వరూపుడు. మనుష్యులలో వ్యత్యాసాలు తెలిసినవాడు. మంచిచెడ్డలను తాను ఆలోచించి నిర్ణయాలు తీసుకోగల స్వతంత్రుడు. కొత్త విషయాలపట్ల ఆడంబరాలులేని స్థిర స్వభావం గలవాడు. ఈ విధంగా ప్రసిద్ధమైన మంచి లక్షణాలు కలవాడైన ఈ ధర్మరాజును ద్వాపర లక్షణుడు అంటే సందిగ్ధ లక్షణాలు కలవాడు (ద్వాపరయుగం వాడు అని కూడా) అని అనవచ్చునా? (అనకూడదు.) కృతలక్షణుడు (కృతయుగలక్షణుడు) అని అనాలి.

5) ఆ ధర్మరాజు నలుగురు తమ్ములు ఓటమినెరుగని వారిగా పేరొందిన శత్రువులనైనా ఓడించడానికీ, యాచకుల దీనత్వం పోగొట్టడానికీ ఎల్లప్పుడూ ఉత్సాహం కలిగి వుంటారు. ఈ నలుగురు సోదరులు చాలా పరాక్రమం గలవారు.

6) అయిదు దేవతా వృక్షాలో, విష్ణుమూర్తి అయిదు ఆయుధాలో, ఈశ్వరుని అయిదు ముఖాలో అని లోకులు పొగిడేటట్లుగా పాండవులు ఐదుగురూ గొప్ప గుణవంతులై ప్రవర్తించేవారు.

7) స్నేహభావం, భక్తి, ప్రేమ, సహనమూ కనబడేటట్లు, పెద్దాచిన్నా అనే వ్యత్యాసాలు తెలుసుకొని, ఒకరిమాట ఒకరు మీరకుండ, చేసే పనులలో భేదాలు లేకుండా, ఒకరి మనసుననుసరించి మరి ఒకరు నడుచుకుంటూ ఉండేవాళ్లు. "పాండుకుమారులు ఎంతో నేర్పరులు. ఈ లోకంలో అన్నదమ్ముల ఒద్దిక అంటే వారిదే సుమా" అని ప్రశంసించేటట్లుగా ప్రవర్తించేవారు.

8) అన్నలపట్ల, తమ్ములపట్ల సమానమైన భావాలు కలవాడని ప్రజలు అనుకునేటట్లుగా పేరుపొందిన ఘనుడు. రాజులందరిలో ఎదురులేనివానిగా ప్రసిద్ధి, గొప్పతనం కలిగి ప్రవర్తించే పరాక్రమవంతుడు. సాత్త్వికులు కూడా ప్రశంసించేవిధంగా అర్జునుడు ధర్మప్రవర్తన కలిగి వుండేవాడు.

9) అందంలో జయంతుని (ఇంద్రుని కుమారుడు) వంటివాడు. దయా స్వభావంలో గరుడ ధ్వజుడైన (విష్ణువుకు) కృష్ణునికి ప్రాణమిత్రుడు. పర్వతరాజపుత్రిక పార్వతికి భర్తయైన శివునికి యుద్ధ విజయాలలో పోటీ పడేవీరుడు. నాలుగు సముద్రాలచే ఆవరించబడిన ఈ భూమండలంలో అతనికి అతనే సాటి (మరింకెవ్వరూ సాటికాదు). అటువంటి అర్జునుడిని పొగడటం సాధ్యమా? (సాధ్యంకాదు అని భావం).

(చేమకూర వేంకటకవి ప్రతిపద్యము చమత్కృతికి నిదర్శనం. ఈ కవి మనం వాడుకొనే శబ్దాలతోనే సులభంగా రెండు అర్థములను సాధిస్తాడు. ఉదాహరణకు ఈ పద్యంలో జయంతుని తమ్ముడు అర్జునుడు – ఇక్కడ జయంతుడు ఇంద్రుని కుమారుడు, సౌందర్యానికి లోకప్రసిద్ధుడు. అర్జునుడు ఇంద్రుని వరపుత్రుడు – కాబట్టి జయంతుడు, అర్జునుడు సోదరులు అందంలో జయంతుని వంటివాడని శ్లేష సాధించబడింది. అట్లే ఈ పద్యములో ప్రతి పాదానికి శ్లేష ఉన్నది.)

10) తేరిపార జూస్తే చాలు శత్రుసైన్యం పారిపోవడానికి సిద్ధపడుతుంది. విల్లు ఎత్తి పట్టుకోవడానికి వంగితే చాలు శత్రుసమూహం వీర స్వర్గం దారిపడుతుంది. ఇక వేయి మాటలెందుకు? ఆ అర్జునునితో సాటి అని చెప్పదగినవాడు, పోల్చదగిన వీరుడు రఘురాముడేకాని, ఈ లోకంలో మరొకడులేడు.

SCERT TELANGANA



# ఇవి చేయండి



## I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది అంశాల గురించి చర్చించండి.**

అ) ధర్మరాజు సుగుణాల గురించి విన్నారు కదా! వీటిని దృష్టిలో పెట్టుకొని నేటి పాలకులకు ఉండవలసిన లక్షణాలను గురించి చర్చించండి.

ఆ) 'మంచి చెడులను ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి' ఎందుకో చర్చించండి.

**2. పువ్వు గుర్తుగల పద్యాలను భావస్ఫోరకంగా చదువండి.**

**3. కింద నాలుగో పద్యానికి ప్రతిపదార్థం ఉన్నది. ఇదేవిధంగా 1, 9 సంఖ్యగల పద్యాలకు ప్రతి పదార్థం రాయండి.**

| | | |
|---|---|---|
| కోపము | = | కోపం |
| ఒక + ఇంత | = | కొంచెంకూడా |
| లేదు | = | లేదు |
| బుధకోటికిన్ | = | పండితుల సమూహానికి |
| కొంగుపసిండి | = | కొంగున మూటగట్టిన బంగారం (అవసరానికి ఉపయోగపడుతుంది) |
| సత్యము | = | సత్యం (చెప్పడం సంగతంటారా!) |
| ఆరూపము | = | దాని స్వరూపమే అతడు |
| తారతమ్యములు | = | వ్యత్యాసాలు (మనుష్యులలో) |
| ఎఱుంగు | = | తెలియును |
| స్వతంత్రుడు | = | స్వేచ్ఛగలవాడు (నిర్ణయాధికారంలో) |
| నూతన ప్రియ + ఆటోపము | = | కొత్త విషయాలపట్ల ఆడంబరం |
| లేని | = | లేనటువంటి |
| నిశ్చలుడు | = | స్థిర స్వభావం గలవాడు |
| ఇటులే | = | ఈ విధంగా |
| కృతలక్షణుండు + ఐ | = | కృతయుగ (మంచి) లక్షణాలు కలిగి |
| చెలంగగన్ | = | ప్రవర్తిస్తుండగా / ప్రకాశిస్తుండగా |
| అల ధర్మనందనున్ | = | ఆ యమధర్మరాజు వరపుత్రుడైన ధర్మరాజును |

SCERT TELANGANA

ద్వాపర లక్షణుండు = (సందిగ్ధమైన) ద్వాపరయుగ లక్షణాలు కలవాడనీ

అనగ వచ్చునొకో = అనవచ్చునా? (అనకూడదు) కృతలక్షణుడనాలి.

(అనగవచ్చును + ఒకొ)

**4. కింది భావాలు గల పద్య పాదాలు ఏయే పద్యాల్లో ఉన్నాయో గుర్తించండి.**

అ) ధర్మరాజే సాటిలేని చక్రవర్తి.

ఆ) గరుడధ్వజుని స్నేహితుడు.

ఇ) ఎల్లప్పుడు ధర్మాన్ని సంపాదించే దృష్టేగాని న్యాయం తప్పలేదు.

ఈ) అర్జునుడు సాత్త్వికులతో కూడా ప్రశంసల నందుకునే ధర్మవర్తన గలవాడు.

**5. కింది పద్యాన్ని చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి.**

✿ కుసుమ కోమల భావముల్ కూర్చువేళ
సరసకవులకు కలములన్ నెరసు లేక
జాలు మకరంద ధారల తీరు రసము
తేలికన జిల్కు మా ముద్దు తెలుగుపలుకు

– శిరశినహాళ్ కృష్ణమాచార్య

**ప్రశ్నలు :**

అ) పై పద్యాన్ని రాసిన కవి ఎవరు?

ఆ) కవులు ఎటువంటి భావాలను కూర్చగలరు?

ఇ) కలం నుండి తెలుగు పలుకులు ఎట్లా జాలువారుతాయి?

ఈ) తెలుగు పలుకులను కవి దేనితో పోల్చాడు?

ఉ) ఈ పద్యానికి శీర్షికను నిర్ణయించండి.

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) పాండవుల గుణగణాల గురించి కవి ఏమని వర్ణించాడు? ఎందుకు?

ఆ) ఈ పాఠానికి "ధర్మార్జునులు" అనే పేరు తగినవిధంగా ఉన్నదని భావిస్తున్నారా? ఎందుకు?

ఇ) 'పాండవులు ఉదారస్వభావులు' సమర్థిస్తూ రాయండి.

ఈ) మంచివారిని ఆదరించి పోషించవలసిన ఆవశ్యకతను గురించి రాయండి.

SCERT TELANGANA

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) ధర్మరాజు వ్యక్తిత్వాన్ని గురించి మీ సొంతమాటల్లో రాయండి.

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.**

అ) మీకు తెలిసిన మంచిగుణాలు కలిగిన ఒకరిని గురించి 'అభినందన వ్యాసం' రాయండి.

ఆ) పాఠం ఆధారంగా చేమకూర వేంకటకవి గురించి ప్రశంసిస్తూ రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలకు అర్థాలు రాస్తూ సొంతవాక్యాల్లో ప్రయోగించండి.**

అ) సోయగం =

ఆ) ఏవురు =

ఇ) వెగటు =

ఈ) బుధుడు =

**2. కింది పదాలకు వ్యుత్పత్తి అర్థాలు రాయండి.**

అ) తనూజుడు ఆ) నృపాలుడు ఇ) నందనుడు

**3. కింది పదాలకు పర్యాయ పదాలు రాయండి.**

అ) క్షితి =

ఆ) కుమారుడు =

ఇ) మొగము =

ఈ) పురము =

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

**4. కింది వాక్యాలను గమనించండి. ఆయా వాక్యాలలోని ప్రకృతి వికృతుల్ని గుర్తించి పట్టికగా కూర్చండి.**

అ) బుద్ధుని యొక్క దమ్మం ఎందరినో ధర్మమార్గంలో నడిపింది.

ఆ) ఉపాధ్యాయుని గౌరవించాలి. ఒజ్జ చూపిన మార్గంలో నడవాలి.

ఇ) ప్రకృతి ఆజ్ఞను ధిక్కరించను. ఇదే నా యొక్క ఆన.

ఈ) తెలుగు భాషను కాపాడుతానని బాస చేస్తున్నాడు.

**5. కింది వాటిలో నానార్థాలు గుర్తించండి, పట్టిక రాయండి.**

అ) రాజు =

అ) తరువు, చెరువు ఆ) ప్రభువు, ఇంద్రుడు ఇ) చిలుక, పలక ఈ) రాముడు, భీముడు

ఆ) ప్రియం =

అ) హెచ్చు, ఇష్టం ఆ) పేరు, ఊరు ఇ) చౌక, తేలిక ఈ) బాధ, సంతోషం

ఇ) దిక్కు =

అ) దిశ, ఆశ్రయం ఆ) కన్ను, ఆకాశం ఇ) మార్గం, ఆశ్రయం ఈ) తూర్పు, నేర్పు

ఈ) చిత్తము =

అ) బొమ్మ, కాగితం ఆ) ఉత్తరం, నది ఇ) ఇష్టం, కష్టం ఈ) మనసు, ఇష్టం

## వ్యాకరణాంశాలు

### కర్మధారయ సమాసం

✷ **కింది సమాసపదాలను, విగ్రహవాక్యాలను పరిశీలించండి.**

అ) ఉదగ్రతేజం – ఉదగ్రమైనతేజం

ఆ) తొల్లిటిరాజులు – తొలివారలైన రాజులు

- *పై వాటిని పరిశీలిస్తే*
- *సమాసపదాల్లోని పూర్వపదాలు వరుసగా 'ఉదగ్ర, తొల్లిటి' అని ఉన్నాయి. ఇవి విశేషణాలు. అనగా గుణాలను తెలిపేవి.*
- *ఉత్తరపదాలు పరిశీలిస్తే వరుసగా 'తేజం, రాజులు' అని ఉన్నాయి, ఇవి నామవాచకాలు. అనగా విశేష్యాలు.*



SCERT TELANGANA

అంటే విశేషణ విశేష్యాల (నామవాచకాల)తో ఏర్పడిన పదాలు. ఇట్లాంటి వాటిని కర్మధారయాలని అంటారు. ఆ సమాసం కర్మధారయసమాసం. కాగా అందులో

- విశేషణం పూర్వపదంగా ఉండి ఉత్తరపదం నామవాచకంగా ఉంటే అది **విశేషణ పూర్వపదకర్మధారయ సమాసం** అని గుర్తించాలి.

కింది సమాసపదాలకు విగ్రహవాక్యాలు రాసి పై వివరణ (సూత్రం)తో సరిచూసుకోండి.

- సకలజనములు
- ధార్మికుడర్జునుడు
- పరసేన

**✷ కింది సమాసపదాలను, విగ్రహవాక్యాలను పరిశీలించండి.**

అ) తమ్ముకుర్రలు – కుర్రలైన తమ్ములు

ఆ) కార్మికవృద్ధులు – వృద్ధులైన కార్మికులు

> విశేషణం ఉత్తరపదంగా ఉండే కర్మధారయ సమాసం విశేషణ ఉత్తరపద కర్మధారయ సమాసం.

**పై సమాస పదాలను పరిశీలిస్తే**

విశేషణ పదాలైన 'కుర్రలు, వృద్ధులు' అనేవి ఉత్తరపదాలుగా ఉన్నాయి. తమ్ములు, కార్మికులు సోదరులు అనే నామవాచకాలు పూర్వపదాలుగా ఉన్నాయి.

అంటే... విశేషణం ఉత్తరపదంగా ఉండి నామవాచకం పూర్వపదంగా ఉంటే అది **విశేషణ ఉత్తరపద కర్మధారయ సమాసం** అని గుర్తించాలి.

- **కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి ఏ సమాసాలో గుర్తించి రాయండి.**

అ) పాదపద్మం –

ఆ) చారుసంసారం –

## ప్రాజెక్టు పని

- **ఉత్తమ పాలనను "రామరాజ్యం"తో పోలుస్తారు కదా! శ్రీరాముని పరిపాలన ఏవిధంగా ఉండేదో తెలుసుకొని నివేదిక రాయండి.**

**సూక్తి**

**ఇతరులు మనపట్ల ఏ కార్యాలు చేస్తే, ఇబ్బందిగా ఉంటుందో అవి ఇతరులపట్ల మనం చేయకూడదు. ఇదే ధర్మాలన్నింటిలోనూ ఆచరించదగిన శ్రేష్ఠమైన మార్గం.**

**– మహాభారతం**

SCERT TELANGANA

## మన సామెతలు

1) అతి రహస్యం బట్టబయలు
2) నక్క నదిల కొట్టుకుపోతూ ప్రపంచమంత మునుగుతుందన్నదట
3) మావోనికి ముప్పైరెండు గుణాలు మంచియే రెండే రెండు పాడు తనకు దెలది ఒకడు చెపితే వినడు
4) చెరువుల పడ్డోన్ని తీసి బావిలేసినట్లు
5) చిల్లికి చింతపండొత్తినట్లు
6) గుమ్మినింఢ గింజలుండాలె గూటాలోలె బిడ్డలుండాలె
7) గుట్టకు కట్టెలు మోసినట్లు
8) గాలికి గడ్డపారలు కొట్టుకపోయినయట
9) కట్టకు పుట్టచేటు చెట్టుకు తొర్రచేటు
10) ఏనుగు కూసున్నా గుర్రమంతెత్తు
11) ఊరుదూరమైంది కాడు దగ్గరైంది
12) ఉరికురికి కొట్టినా మోటపారలేదు
13) ఈతకు లోతులేదు
14) ఉడుకేసుకుని తిని తడకేసుకుని పన్నట్లు
15) అక్కచుట్టమైతే లెక్కచుట్టమా
16) కొన్నది బింకెడు కొసిరేది లొట్టెడు
17) ఎనుగర్ర (వెన్నుకర్ర) బలముంటే ఎన్నివాసాలైనా ఎక్కియ్యచ్చు
18) అన్నంలేక కోతిరూపు బట్టల్లేక బాంచ రూపు
19) దొప్పెడంబలి కోసం దోసిట్లంబలి ఒలుకపోసె
20) తోచని పనికి తక్కులాటెక్కువ
21) రొట్టెలోనికంటె తునుకలోడే నయం
22) కన్నుపెద్ద కడుపుచిన్న
23) ఎన్నేషాలేసినా కూటికే ఎన్నేండ్లు బతికినా కాటికే
24) అయినోళ్ళకు ఆకుల్ల కానోళ్ళకు కంచాల్ల
25) అంతట నానినా అరికాలుకింద నానది
26) అంగణంపట్టి గొడ్డు వంగడం పట్టి బిడ్డ

## మన జాతీయాలు

| జాతీయం | | సందర్భం |
|---|---|---|
| 1) అగ్గిబుక్కుట | - | కోపంతో ఉడికిపోవుట |
| 2) ఉడుంపట్టు | - | గట్టిపట్టుదల |
| 3) ఒంటికోతి | - | ఏకాకి, ఒంటరివాడు |
| 4) కడుపు కుటకుట | - | ఓర్వలేనితనం |
| 5) కాకిగోల | - | భరించలేని శబ్దాలు |
| 6) కుడితిలోపడ్డ ఎలుక | - | అటు, ఇటు కాక ఇబ్బందిపడటం |
| 7) కూసమిడిచినపాము | - | ఉల్లాసం, చలాకీతనం |
| 8) కోడిమెదడు | - | మతిలేకపోవడం |
| 9) గాడిదమోత | - | వెట్టిచాకిరి |
| 10) గోడకేసిన సున్నం | - | తిరిగిరానిది |
| 11) చచ్చినపాము | - | ఏమీ చేయలేనిస్థితి |
| 12) చంకలోపిల్లి | - | చెడుశకునం, కార్యహాని సంకేతం |
| 13) చుక్కతెగిపడ్డట్లు | - | అకస్మాత్తుగవచ్చుడు |
| 14) చూపులగుర్రం | - | కేవలం రూపం మాత్రమే అందంగా ఉండటం |
| 15) డూ డూ బసవన్న | - | ఆలోచించకుండా ప్రతిదానికీ తలూపడం |
| 16) నల్లికుట్లోడు | - | బయటికి కనిపించకుండా హానిచేసేవాడు |
| 17) నిండుచెరువు | - | సమృద్ధి |
| 18) నీళ్ళునములు | - | సందేహించడం |
| 19) నూరిపోయు | - | విషయాన్ని బలంగా అందజేయడం |
| 20) పీనుగ సింగారం | - | వ్యర్థం |

SCERT TELANGANA

# 2 నేనెరిగిన బూర్గుల

– పి.వి.నరసింహారావు

## చదువండి – ఆలోచించి చెప్పండి.

సహనమ్ము, సత్యమ్ము, శాంతగంభీరమ్ము,
ఆత్మవిశ్వాసమ్ము, నహరహమ్ము
సాధన, దక్షత, సాధుభాషణమును,
సద్వివేచనమును, సద్గమనము,
దానమ్ము, ధైర్యమ్ము, త్యాగమ్ము, సునిశిత
బుద్ధి, మేల్గాంచుట, పుణ్యగుణము,
కరుణ, క్షమ, పరోపకారబుద్ధియనెడి
యాలోచనారీతు లమరియుండు
మనుజులెపుడును మాన్యులు, మంగళస్వ
రూపులు, మహోన్నతులు, విరాడ్రూపశోభి
తులు, సుకీర్తికాంతవరపతులు, సుమతులు,
జగతిగతి విరచితులు, సజ్జనులువారు.

## ప్రశ్నలు:

1. ఈ పద్యం దేన్ని గురించి చెబుతున్నది?
2. ఈ పద్యం ద్వారా గుర్తించిన లక్షణాలేవి?
3. మంచి లక్షణాలు కలిగిన వారినేమంటారు?
4. అలాంటివారి గురించి ఎందుకు తెలుసుకోవాలి? వారితో ఎందుకు సాంగత్యం చేయాలి?

## పాఠం ఉద్దేశం

సమాజంలో కొద్దిమందే ప్రభావశక్తి సంపన్నులు ఉంటారు. వీరి సాంగత్యం పొందినా, వీరి గురించి తెలుసుకున్నా, స్ఫూర్తి కలుగుతుంది. మంచిమార్గంలో నడవడానికి అవకాశం కలుగుతుంది. ఇలా స్ఫూర్తిదాయకులైన వారిలో బూర్గుల రామకృష్ణారావు ఒకరు. ఈయన హైదరాబాదు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసి, రాజనీతిజ్ఞుడిగా బహుభాషావేత్తగా పరిపాలనాదక్షుడిగా పేరెన్నికగన్నాడు. ఈయన మహోన్నత వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించేలా పి.వి.నరసింహారావు వ్యాసం రాశాడు. మహోన్నత వ్యక్తిత్వాల నుండి స్ఫూర్తి పొందడమే ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం వ్యాస ప్రక్రియకు చెందినది. గొప్పవారి జీవితాన్ని, వారి వ్యక్తిత్వంలోని ఉదాత్తమైన, స్ఫూర్తివంతమైన జీవన కోణాలను విశ్లేషిస్తూ, ప్రశంసిస్తూ రాసిన అభినందన వ్యాసం ఇది.

ఈ పాఠ్యభాగం ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక 1972 సం॥పు డిసంబర్ సంచిక నుండి తీసుకొనబడింది.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21
SCERT TELANGANA

## రచయిత పరిచయం



(1921 - 2004)

భారత ప్రధానిగా బహుభాషావేత్తగా భారతదేశ ఆర్థిక సంస్కరణల పితామహులుగా పేరొందిన పి.వి.పూర్తిపేరు పాములపర్తి వేంకట నరసింహారావు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలంలోని లక్నేపల్లి గ్రామంలో జన్మించాడు. వరంగల్ దగ్గర భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామస్థులు రుక్మిణమ్మ, రంగారావుగారలకు దత్తపుత్రుడు. స్వామి రామానంద తీర్థ పి.వి.కి రాజకీయ గురువు. బూర్గులవారు గురుతుల్యులు.

విద్యార్థిదశలోనే హైద్రాబాద్ సంస్థాన విముక్తి పోరాటంలో పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరణకు గురైనాడు. 1938లో హైద్రాబాద్ రాష్ట్రకాంగ్రెస్‌లో చేరి రాజకీయ జీవితాన్ని ఆరంభించాడు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలో బహుకాలం మంత్రిగాను, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగాను, భారతప్రధానిగాను విశిష్టమైన సేవలందించాడు. చతురతతో భారత రాజకీయయవనికపై ఒక వెలుగు వెలిగిన రాజనీతిజ్ఞుడు.

తెలుగుభాషతో సహా హిందీ, ఉర్దూ, ఆంగ్లం, మరాఠీ మొదలగు 17 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన బహుభాషావేత్త. తెలుగులో 'కాకతీయ' అనే పత్రికను నడిపించాడు. విశ్వనాథ 'వేయిపడగలు' నవలను హిందీలోకి "సహస్రఫణ్" అనే పేరుతో అనువదించాడు. దీనికి కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి లభించింది. ఈయన ఆత్మకథగా ప్రసిద్ధికెక్కిన 'ది ఇన్‌సైడర్' అనేక భాషల్లోకి అనువదించబడింది. 'పన్‌లక్షత్‌కొన్‌ఘతో' అనే మరాఠి పుస్తకాన్ని తెలుగులో 'అబలా జీవితం'గా ఈయన అనువదించాడు.

నిరాడంబరజీవితం, నిజాయతీ, దేశభక్తి కలిగిన పి. వి. నరసింహారావు జీవిత పర్యంతం నిండుకుండలా స్థితప్రజ్ఞుడిగా వెలిగాడు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.

SCERT TELANGANA

## ప్రవేశిక

*ప్రతి మానవునిలోనూ సాధారణంగా ఉన్నదానికంటే తనను గురించి ఘనంగా చిత్రించుకొనే స్వభావం ఉంటూ ఉంటుంది. ఇందుకు భిన్నంగా ప్రవర్తించేవారు బహు అరుదుగా ఉంటారు. రకరకాల ఒడిదుడుకులను ఎదుర్కొన్నా విపత్కర పరిస్థితులు సేనావాహినిలా చుట్టుముట్టినా చలించకపోవడం, మనఃస్థైర్యాన్ని, సమచిత్తాన్ని విడనాడక పోవడం గొప్పవారికే సాధ్యమౌతుంది. జయాపజయాలను సమానంగా స్వీకరించడం, మిత్రులుసైతం ద్రోహం తలపెట్టినా ప్రత్యర్థులు దూషించినా "సరే! ఇవన్నీ ఆటలో భాగమేగా!" అని స్థితప్రజ్ఞతను ప్రదర్శించడం అందరికీ సాధ్యమౌతుందా? మరి ఇటువంటి వ్యక్తిత్వం కలిగిన వారు ఎవరు? ఈ పాఠం ద్వారా తెలుసుకొండి.*

### I



డా॥ బూర్గుల రామకృష్ణారావు

స్వర్గీయ డా.బూర్గుల రామకృష్ణారావు గారి 5వ వర్ధంతి సందర్భంలో వారిని గురించి వ్యాసమేదైనా యివ్వవలసిందిగా మిత్రులు కొందరు నన్ను కోరారు. డా.రామకృష్ణారావుగారి పేరు వినగానే గత స్మృతులెన్నో ముప్పిరిగొని భావోద్రేకంతో నా మనస్సు ఉక్కిరిబిక్కిరైపోతూ ఉంటుంది. నా భావాలన్నింటిని యీ వ్యాసంలో వివరించడం ఎలాగ? అవన్నీ వ్రాస్తే ఒక పెద్ద గ్రంథమే అవుతుంది. అందుకని రేఖామాత్రంగా నా భావాలను యిక్కడ పొందుపరుస్తాను.

కీ.శే.డా.రామకృష్ణారావుగారిని గురించి చరిత్రకారులు ఏమి వ్రాస్తారో మనం తేలికగానే ఊహించుకోవచ్చు. "డాక్టరు రామకృష్ణారావుగారు ఫలాన తేదీన ఫలాన గ్రామంలో పుట్టారు. పూనాలోని ఫెర్గూసన్ కాలేజి నుండి పర్షియన్‌భాష ఐచ్ఛిక విషయంగా తీసుకొని పట్టభద్రులయ్యారు. పర్షియన్ ట్యూటరుగ కొంతకాలం పనిచేశారు. తరువాత న్యాయవాద పట్టా పొంది ఫలానా సంవత్సరంలో న్యాయవాదిగా నమోదు అయ్యారు. ఇన్ని సంవత్సరాలు న్యాయవాదిగా పనిచేసారు. ఇన్ని ప్రజా ఉద్యమాలలో ఇన్నిసార్లు సత్యాగ్రహం జరిపి జైలుకు వెళ్ళారు. హైదరాబాదు స్టేటు కాంగ్రెసులో వారొక ప్రముఖ నాయకులు. మంత్రిగాను, ముఖ్యమంత్రిగాను, రెండు రాష్ట్రాలకు గవర్నరుగాను పని చేశారు. కొంతకాలం రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. అనేక కమిటీలకు, కమీషన్లకు అధ్యక్షులుగా ఉన్నారు. గుండెపోటు వలన 1967 సెప్టెంబరు 14వ తేదీన కన్నుమూశారు" మొదలయిన అంశాలు వ్రాస్తారు. చారిత్రకంగాను, కాలక్రమ ప్రకారంగాను అది అంతా నిజమే. కాని, అంతమాత్రం చేత డా.రామకృష్ణారావుగారి అసలు వ్యక్తిత్వం మనకు అవగతం కాదు.

SCERT TELANGANA

ప్రతి మానవునిలోను సాధారణంగా ఉన్నదానికంటే ఘనంగా తనను గురించి చిత్రించుకొనే స్వభావం ఉంటూ ఉంటుంది. దానిని గురించి వాని అంతరాత్మ బోధిస్తూనే ఉంటుంది. అయినప్పటికీ తాను చిత్రించుకొన్న ఆ కృత్రిమ ఘనతను ఇతరుల ముందు ప్రదర్శించి ఇతరులకంటే తాను అధికుడననిపించుకోవాలనే ఉబలాటం, పెనుగులాట ప్రతినిత్యం ఉంటూనే ఉంది. తత్ఫలితంగా ఒకరినొకరు కించపరుచుకొంటూ తమ శక్తిసామర్థ్యాలను, అమూల్య సమయాన్ని వ్యర్థపరుచుకొంటూ ఉండడం మనం చూస్తూనే ఉన్నాం. కాని యిందుకు డా.రామకృష్ణారావుగారు మాత్రం అరుదుగా కనవచ్చే ఒక చక్కని మినహాయింపు అని చెప్పవచ్చు. వారెల్లప్పుడు అన్ని విషయాలు ఆఖరికి తమలోని లోపాలను కూడా ఉన్నవి ఉన్నట్లుగా చెపుతూ వుండేవారు. ఎంత ఉంటే అంతే. వీసం ఎత్తు ఎక్కువాలేదు, వీసం ఎత్తు తక్కువా లేదు.

వారి పొట్టితనం కొంతవరకు వారిని మరుగుపరుస్తూ ఉండేదని కొంతమంది అంటారు. కాని అంతకంటే సత్యదూరమైన విషయం మరొకటి లేదని నా భావన. నిజానికి ఒడ్డూ పొడుగూ ఉన్న చాలామందికంటే కూడ వారు అతి చక్కగా గుర్తింపబడుతూ ఉండేవారు. తమ వామన రూపాన్ని గురించి స్నేహపూరితమైన ఎన్నో పరిహాసాలను వారే స్వయంగా చక్కటి భావనిర్లిప్తతతో చెప్తూ ఉండేవారు. లోగడ మన దేశంలో అమెరికా రాయబారిగా పనిచేసిన ప్రొఫెసర్ గాల్‌బ్రైత్ అసాధారణ పొడగరితనం కంటె డా.రామకృష్ణారావు గారి పొట్టితనం వారిని ఏమాత్రం మరుగుపరచలేదు. పూర్వపు హైదరాబాదు సంస్థాన ముఖ్యమంత్రిగా ఉంటున్న రోజులలో డా.రామకృష్ణారావు గారు బేగంపేట విమానాశ్రయంలో అరేబియా రాజు ఇబన్‌షాఉద్‌ను పుష్పమాలాలంకృతునిగా చేసిన సందర్భంగా అతిథి ఆతిథేయులిర్వురు పరస్పర సౌజన్య సౌహార్ద్రాలతో ఎటువంటి ఫీటు చేయవలసి వచ్చిందో ఆ వినోదకర దృశ్యం యిప్పటికీ చాలా మందికి జ్ఞాపకముండే ఉంటుంది. అలాగే ఒక విందు సందర్భంలో ప్రొ.గాల్‌బ్రైత్, డా.రామకృష్ణారావు గార్ల ఫొటో తియ్యడం ఫొటోగ్రాఫర్ల కళానైపుణ్యానికొక గీటురాయి అయి ఆ సందర్భానికొక చక్కని వినోదాన్ని చేకూర్చింది.

**ఆలోచించండి - చెప్పండి**

- *అంతరాత్మ బోధించడం అంటే ఏమిటి? మీకు ఎప్పుడైనా ఇలాంటి అనుభవం ఎదురైందా? ఎప్పుడు?*
- *ఇతరులకంటే తాను అధికుడనని-పించుకోవాలనే ఉబలాటం. పెనుగులాట ప్రతినిత్యం ఉంటూనే ఉంటుంది. ఈ వాక్యం ద్వారా మీరేమి గ్రహించారు?*
- *సత్యదూరమైన విషయం అంటే ఏమిటి? దీన్ని ఏఏ సందర్భాలలో వాడుతారు?*

## II

### అవసరమైతే విరాట్ రూపం....

వారు గుర్తించబడడానికి, గుర్తించబడకపోవడానికి వారి శరీరాకృతి కారణం కానేలేదు. అంతకన్న గహనమైన దేదో వారి వ్యక్తిత్వంలో వుండి ఉండాలి. ఏదో నిత్య నైమిత్తికంగా **(routine)** వారు గుర్తించబడడంకాని, గుర్తించబడకపోవడం గాని జరుగలేదు. అవసరం వచ్చినప్పుడు వారు అలనాటి వామనమూర్తివలె ఇంతింతై ముల్లోకాలు ఆక్రమించి తమ విరాట్ రూపాన్ని ప్రదర్శించేవారు. పని పూర్తి అయిన వెంటనే తిరిగి తమ వామన రూపంలో ఇమిడిపోతూ ఉండేవారు, మరొక అవసరం వచ్చేవరకు. అందుచేత వారు కావాలని నిరాడంబరంగా తెరమరుగున ఉండడం జరుగలేదు. అసలు రహస్యం ఏమిటంటే చిన్న మూర్తిలో యిమిడి ఉన్న వారి బహుముఖ ప్రతిభాయుత మూర్తిమత్త్వం అవసరం వచ్చినప్పుడు తమ మహోన్నత రూపంలో ప్రదర్శితం కావడం, అవసరం తీరగానే తిరిగి స్వస్వరూపంలో యిమిడిపోవడం అనేది వారి స్వభావంలోనే ఉంది. విచిత్రం ఏమిటంటే డా.రామకృష్ణారావుగారి వ్యక్తిత్వపు మహోన్నత శిఖరాలు దాని అగాధపు లోతులలోనే పరిలక్షితమౌతూ ఉండేవి.



SCERT TELANGANA

## న్యాయవాదిగా

న్యాయవాదిగా వారికి కొన్ని ప్రత్యేక లక్షణాలుండేవి. వారి ప్రాక్టీసు **roaring practice** (క్షణం తీరికలేనిది) అని చెప్పడానికి వీలులేదు. అలా అని వారికి కేసుల కొరత ఎప్పుడూ ఉండేదికాదు. కాని వాటిలో ఎక్కువ కేసులు రాజకీయాలకు సంబంధించినట్టివి. ఫీజు లేనట్టివీను. ప్రజాహిత జీవితం కొందరు న్యాయవాదులకు ఫైలు పెరగడానికి, ధనసంపాదనకు ఉపకరిస్తే, డా.రామకృష్ణారావుగారి విషయంలో మాత్రం అది తారుమారైంది. వారి వద్దకు వచ్చే క్లయింట్లలో చాలామందికి ఒక రకమైన మిశ్రిత భావం ఉంటూ ఉండేది. డా.రామకృష్ణారావుగారి శక్తిసామర్థ్యాలు, ప్రజ్ఞా ప్రాభవాలలో సంపూర్ణ విశ్వాసానికి తోడు వారు రాజకీయ వ్యగ్రతవలన కేసులమీద ఎక్కువ ధ్యానముంచలేరేమో అన్న అనుమానంకూడా ఆ క్లయింట్ల మనస్సులలో ఉంటూ ఉండేది. నిజానికి రామకృష్ణారావుగారికి కేసును క్షుణ్ణంగా చదివి తయారవడానికి అవకాశమే ఉండేదికాదు. కేసు చేపట్టేటప్పుడే వారు విషయమంతా శ్రద్ధగా విని ఆ కేసు తాలూకు ఫైలు యొక్క వెనుక అస్పష్టమైన నోటులను కొన్నిరేఖామాత్రంగా వ్రాసిపెట్టుకొనే వారు అంతే. నిజానికి వాటిని కేసుకు తయారీ అనడానికి వీలు లేదు. కాని కోర్టులో ఆ రేఖామాత్రపు నోట్సే డా.రామకృష్ణారావుగారి జాజ్జ్వల్యమానమైన ప్రతిభా విశేషతతో ఎదుటి న్యాయవాదుల వాదనాఘాతములకు దుర్భేద్యమైన కంచుగోడలుగా నిలవడం నేను స్వయంగా చూచాను. న్యాయవాద వృత్తిలో నిష్ణాతమైన సునిశిత మేధాసంపత్తిని వారు ప్రదర్శిస్తున్నారా అన్నట్లుగా ఉండేది వారి అనన్యమైన వాదనా పటిమ.

## ప్రోత్సాహం

సీనియర్ న్యాయవాదిగా వారిదొక ప్రత్యేక తరహా. నేను వారివద్ద అందరికంటె జూనియర్‌గా ఉండేవాడిని. కాని తల్లికి తన కడగొట్టు బిడ్డపై ఎటువంటి విశేషమమకారం ఉంటుందో అటువంటి మమకారమే డా.రామకృష్ణారావుగారికి నామీద ఉంటూ ఉండేది. చొరవతోను, నిరాఘాటంగాను, నేను వారి ఆఫీసును ఒక న్యాయవాద కాఫీ పానశాలగా పరిగణించి నాకు కావలసిన కేసులను – ముఖ్యంగా జూనియర్లకు కొరుకుడుపడని చిక్కు కేసులను – స్వయంగా ఏరుకొని చదువుతూ ఉండేవాడిని. నా యీ చొరవ వారి సీనియర్ గుమాస్తాకు కోపకారణమై ఆయన నామీద కారాలు మిరియాలు నూరుతూ ఉండేవాడు. ఒకసారి డా.రామకృష్ణారావుగారు దానిని గమనించి నా చేష్టపై తమ ఆమోదముద్ర వెయ్యడం, అంతటితో కారాల మిరియాల ప్రకరణం ముగియడం జరిగింది. అప్పటినుండి మా యిరువురి మధ్య సీనియర్, జూనియర్ సంబంధంపోయి నిష్కాపట్యంతో కూడిన సమానస్థాయి చర్చాసంబంధం ప్రారంభమైంది. నేను అంచనా వేసుకొన్న దానికంటే ఎక్కువగానే నాలో శక్తిసామర్థ్యాలున్నాయని, స్వయంగా గుర్తించగలిగేలా నన్ను రూపొందించిన డా.రామకృష్ణారావుగారి విశేష నైపుణ్యానికి నేను ఎల్లప్పుడూ జోహారు లర్పిస్తూనే ఉంటాను. వారు నాలో పూరించిన ఆ ఆత్మవిశ్వాసమే నాకు శాసనసభలలోను, యితర చోట్లను కూడ శ్రీరామరక్షగా ఉంటూ వస్తూంది. ప్రాతఃస్మరణీయులైన నా సీనియర్ రామకృష్ణారావుగారి విశిష్టవ్యక్తిత్వ మట్టిది.

రాజకీయాలలో వారి సమ్యక్ దృష్టికోణం సంకుచిత సైద్ధాంతిక అరలకు తావివ్వలేదు. వారు పుట్టింది జాగీర్‌దారీ కుటుంబంలో అయినప్పటికి వారు పూర్వపు హైదరాబాద్ సంస్థానంలో తరతరాల నుండీ వస్తూఉన్న జాగీర్‌దారీ వ్యవస్థను రూపుమాపడానికి వెనుకాడలేదు. వారి స్నేహకోటిలో పెద్ద పెద్ద భూస్వాములు చాలామంది ఉండేవారు. అయినప్పటికినీ వారు పూర్వపు హైదరాబాద్ రాష్ట్రంలో దున్నేవానికి భూమిహక్కు నిచ్చే కౌలుదారీచట్టాన్ని తయారుచేసి, దేశంలో సామ్యవాద వ్యవస్థకు మార్గదర్శకులైనారు. ఆ చట్టాన్ని అమలు పరచడానికి వారు ఎంపిక చేసిన జిల్లాల్లో ఎక్కువగా నష్టపోయిన భూఖామందులు వారి బంధువులూ, రాజకీయ సహచరులే.

పూర్వపు హైదరాబాద్ సంస్థానవిచ్ఛిత్తి తన రాజకీయ ప్రాబల్యానికి స్వస్తివాచకం పలుకుతుందని వారికి ముందే తెలుసు. అయినప్పటికీ తనకు నష్టం ఇతరులకు మేలు చేకూర్చే నిర్ణయాలు తీసుకొంటూ తన రాజకీయ జీవితాన్నంతా ఆత్మపరిత్యాగానికీ, చివరకు సక్రియ రాజకీయాలనుండి తన నిష్క్రమణకు దారితీసే పరిస్థితులకు వీరివలె అంకితం చేసుకొనే రాజనీతి విశారదులు బహు అరుదు. డా.రామకృష్ణారావుగారు ఏ నిర్ణయం తీసుకొన్నా దానిని అన్ని విధాలైన జాగ్రత్తలతోను, మంచి వ్యవహార దక్షతతోను తీసుకొనేవారు. ఒకసారి నిర్ణయం తీసుకొన్నారంటే ఆరునూరైనా దానిమీద స్థిరంగా నిల్చేవారు. ఇదీ డా.రామకృష్ణారావుగారి సంక్షిప్త రాజకీయచరిత్ర.

**ఆలోచించండి - చెప్పండి**

- ఎవరైనా గుర్తింపుపొందడానికి శరీరాకృతి కారణం కాదని తెల్సుకొన్నారు కదా! దీన్ని మీరెలా సమర్థిస్తారు?
- అనన్యమైన వాదనాపటిమ అంటే ఏమిటి? ఇది ఎవరికి అవసరం? ఎందుకు?
- 'కొరుకుడు పడకపోవడం' అంటే ఏమిటి? దీన్ని ఏఏ సందర్భాలలో వాడతారు?

## III

### సౌజన్యానికి మారుపేరు :

వారి విశిష్టవ్యక్తిత్వానికి సంబంధించిన మరో ముఖ్యాంశం ఉంది. గత తరంలోని అన్ని సుగుణాల మూర్తిమత్వమే శ్రీరామకృష్ణారావుగారు. శరాఫత్ అంటే సౌజన్యానికి మారుపేరే వారు. మతదురభిమానాన్ని పెంపొందిస్తూ రాజ్యమేలుతున్న నాటి నిజాంకు బద్ధవ్యతిరేకి అయినప్పటికినీ రాష్ట్రంలోని ముసల్మానులందరికీ వారు పరమమిత్రులు, ఆప్తులూను! అతి నిరాడంబరముగా వారు మతాతీతస్థితిని పాటించేవారు. వారి డ్రాయింగు రూం ఒక సంస్కృతీ ప్రదర్శనశాలలా ఉండేది. నాటి హైదరాబాద్ ప్రభుత్వపెద్దలు, కుచ్చుటోపీల మౌల్వీలు, గడ్డాలముల్లాలు, తలపాగాల పండితులు, మహామహోపాధ్యాయులు, గాంధీటోపీలవారు, ఖద్దరుధారులు, అధునాతన టెరిలిన్ యువకులు - ఒకరేమిటి, అన్ని రకాలవారు, వారిని ఆహ్వానించడానికి అక్కడ హాజరు అయేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే డా.రామకృష్ణారావుగారు మూడు విభిన్నతరాల చివరి వారధిలా కన్పించేవారు. ఇంతటి విశాలవ్యక్తిత్వంతో వారు ఆనాటి ప్రజాజీవితాన్ని తీర్చిదిద్దారు.

నాటి హైదరాబాద్ రాష్ట్ర శాసనసభలో శాసనసభా నాయకులుగా వారు సునిశితమేధ, పరిమార్జితభాష, వ్యవహార దక్షతలను మేళవించి ఏర్పరచిన ఉన్నతప్రమాణాలను, నేటికి - ముఖ్యంగా యీ రోజులలో - ఎంతో గౌరవంతో చాలామంది స్మరించుకొంటూ ఉంటారు. అవసరమైనపుడు వారు ప్రత్యర్థులను చీల్చి చెండాడేవారు. కాని అలా చేయడంలో ప్రత్యర్థుల నుండి రక్తపుబొట్టుమాట అలా ఉంచి, ఒక్క కన్నీరుబొట్టు పడడంగాని, వారి హృదయాలకు రవ్వంత నొప్పి తగలడంగాని జరిగేదికాదు. పార్లమెంటేరియన్‌గా డా.రామకృష్ణారావుగారి అద్వితీయ కళాకౌశలమట్టిది.

### బహుభాషావేత్త :

వారు చాలా ప్రతిభావంతులైన భాషావేత్తలనే విషయం అందరికీ తెలిసినదే. వారు చదువుకున్న చాలా భాషలు వాటియందలి అభిరుచులచే ప్రయివేటుగా చదువుకొన్నవే. ముఖ్యమంత్రిగా ఉంటున్న రోజులలో డా.రామకృష్ణారావుగారు ప్రతిరోజూ అర్ధరాత్రివరకు ఆఫీసుఫైళ్ళు చూచుకొని, ఆ తర్వాత నమ్మశక్యంగాని ఉత్సాహంతో సంస్కృత ప్రాచీన కావ్యాలు చదవడంలో ఎలా మునిగిపోయేవారో నాకిప్పటికీ స్పష్టంగా జ్ఞాపకం ఉంది. బహుముఖ ప్రతిభావంతులైనప్పటికీ, డా.రామకృష్ణారావుగారు ప్రధానంగా సాహితీజగత్తుకు చెందినవారని నా నమ్మకం. ఇది చాల వింతగానే తోచవచ్చు. ఎందుకంటే వారి సాహిత్య వ్యాసంగం జరుగవలసినంత ఎక్కువగా జరుగలేదు.

SCERT TELANGANA

బహుముఖప్రజ్ఞతో వచ్చిన చిక్కే ఇది. డా.రామకృష్ణారావుగారు ముట్టని, పెంపొందించని క్షేత్రం ఏదీ లేదంటే అందులో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు. కాని ఏం లాభం? ఏ సాహిత్య క్షేత్రానికైతే వారి సునిశిత మేధాసంపత్తి ఎక్కువ అనుకూలంగా ఉండేదో, ఆ సాహిత్య క్షేత్రంలో చెప్పుకోదగ్గ రచనలు చేయడానికే వారికి అవకాశం కలుగలేదు. రాజకీయవేత్తగా కూడ వారు తమ కాలంనాటి అంటే దేశచరిత్రలో చాల ప్రధానమైన, ఉత్తేజకరమైన దశాబ్దాలకు సంబంధించిన స్మృతులను గ్రంథస్థం చేసి ఉండవలసింది. నాబోటి హితైషులెంత చెప్పినప్పటికీ వారా పనులు చేయలేకపోయారు. ఆవిధంగా వారు తమ జీవితకాలంలో ఎంతో విలువైన పనులు చేసినప్పటికీ, చేయకుండా వదిలివేసింది కూడా అంతకన్న ఎక్కువ విలువైనదే అని నా అభిప్రాయం. ఎందుకంటే ఆ పనులు చేయడానికి ఇతరులెవరికంటె కూడ వారే మిక్కిలి సమర్థులు. ఇందుకు నేనూ, నాలాగే ఇతరులు చాలామంది కూడా ఎప్పుడూ బాధపడుతూనే ఉన్నాం.

వారి ఔదార్యం, ఉపకారబుద్ధి ఎంతవరకు ఉండేదంటే, ఒక్కొక్కపుడది ఒక దోషంగా పరిణమించేది. అసాధ్యమైన కోరికలు కోరినప్పుడు కూడ వారు నెమ్మదిగా నచ్చచెప్తూ ఓపికగా చాలసేపు కూర్చొనేవారు. అప్పుడు వారి స్థానంలో మరొకరెవరైనా ఉండిఉంటే ఒక్క చీదరింపుతో దానిని వెంటనే పరిష్కరించి ఉండేవారు. కాని డా.రామకృష్ణారావుగారి ఔదార్యం అలా చేయనిచ్చేది కాదు. వారి ఉదార ప్రవృత్తి వల్ల న్యాయముగా ఎక్కువ ధ్యానముంచవలసిన పనులకంటే, శక్తిని, సమయాన్ని వ్యర్థపరిచే పనులకు అప్పుడప్పుడు వారు ప్రాధాన్యమివ్వడం జరుగుతుండేది. ఏమైతేనేమి? వారావిధంగా మలచబడ్డారు. అది అంతే.

## ఉపకారశీలి

డా.రామకృష్ణారావుగారిది పెద్దకుటుంబం. ఆ కుటుంబానికి వారొక ఆత్మీయులైన తండ్రి. ఆ కుటుంబానికే కాదు, ప్రతిచోటా ఆత్మీయుడైన తండ్రిగానే ఉంటూ ఉండేవారు. వారు ఎక్కడైనా బయలుదేరితే దారిలో వారిని ఎవరైనా ఎక్కడైనా ఆపి కష్టసుఖాలు చెప్పుకోవచ్చు. అందుచేత వారు ప్రతిదానికి ఆలస్యంగా రావడానికి పేరుబడ్డారు. అయినప్పటికీ మిత్రులు, సహచరులు, ప్రజలుకూడ ఎంతో ప్రేమతోను, ఓర్మితోను, గంటల తరబడి వేచిఉంటూ ఉండడం, వారు రాగానే "సోదర సోదరీమణులారా; నేను అలవాటు ప్రకారం నేడు కూడ ఆలస్యంగానే వచ్చాను" అంటూ ఉండడం పరిపాటి అయిపోయింది.

### ఆలోచించండి - చెప్పండి

- *గొప్పవారు తమ జీవితానుభవాలను గ్రంథస్థంఎందుకు చేయాలి?*
- *మీరు వెచ్చించే సమయం దేనికి ఎక్కువగా ఉంటోంది? మీకుపయోగపడేవాటికా? లేక ఇతరపనులకా?*
- *రామకృష్ణారావుగారిని పి.వి.గారు ప్రాతఃస్మరణీయులు అని పేర్కొన్నారు'కదా! నేటి రాజకీయ నాయకులు కూడా రామకృష్ణారావుగారిలా గొప్పపేరు సంపాదించుకోవాలంటే ఎలా ఉండాలి? ఏమేం చేయాలి?*

వారి సామాజికయాత్ర ఎప్పుడూ సాఫీగా జరుగలేదు. రకరకాలైన ఒడిదుడుకులను వారు ఎదుర్కొనవలసివచ్చేది. చాలా సందర్భాలలో విపత్కర పరిస్థితులు సేనావాహినిలా వచ్చి చుట్టుముట్టేవి. అయినప్పటికీ వారు చలించేవారు కాదు. మనస్థైర్యాన్ని సమచిత్తతను వారు ఎన్నడూ విడనాడేవారు కాదు. విజయాలు లభించినప్పుడు సంతోషంతో ఉప్పొంగనూ లేదు, కష్టాలు సంభవించినప్పుడు అధైర్యంతో క్రుంగిపోనూ లేదు. స్నేహితులు ద్రోహం తలపెట్టినప్పుడు కాని, ప్రత్యర్థులు దూషించినప్పుడుగాని వారనేదల్లా ఒకటే - "సరే - అవన్నీ ఆటలో ఉండేవేగా" అని.

డా.రామకృష్ణారావుగారిని గురించి ఎంతైనా వ్రాయవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే వారు పూర్ణపురుషులు.

SCERT TELANGANA



# ఇవి చేయండి



## I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది అంశం గురించి మాట్లాడండి.**

ఇతరుల కంటే తాను అధికుడననిపించుకోవాలనే ఉబలాటం, పెనుగులాట ప్రతినిత్యం ఉంటూనే ఉంటుంది. దీని గురించి మీ అభిప్రాయాలను తెలపండి.

**2. కింది విషయాలు పాఠంలో ఏయే పేరాల్లో ఉన్నాయి.**

**వాటికి సంబంధించిన అంశాలను పట్టికలో రాయండి.**

| వ్యక్తిత్వం | పేరా సంఖ్య | సంబంధించిన అంశాలు |
|---|---|---|
| మహోన్నత వ్యక్తిత్వం | | |
| విశిష్ట వ్యక్తిత్వం | | |
| విశాల వ్యక్తిత్వం | | |

**3. పాఠం మొత్తాన్ని చదువండి. పాఠంలో ఉన్న జాతీయాలను గుర్తించి రాయండి.**

**4. కింది గద్యాన్ని చదువండి.**

క్లిష్టపరిస్థితుల్లో రాజ్యాధికారం చేపట్టిన రుద్రమ నిరంతరం యుద్ధాల్లో నిమగ్నమైనా, పరిపాలనా నిర్వహణలో మంచి సమర్థురాలుగా పేరొందింది. స్త్రీలు రాజ్యాధికారం చేపట్టడం అరుదైన ఆ కాలంలో రుద్రమాంబ తన తండ్రి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయక వీరనారిగా చరిత్రలో నిలిచింది. స్త్రీ అయినప్పటికి పురుషవేషం, పురుషనామం ధరించి సమకాలీన రాజులందరికంటే మిన్నగా రాజ్యాన్ని పరిపాలించి సాహసవంతమైన జీవితాన్ని గడిపింది. గ్రామాలను దానంచేసి వాటిమీద ఆదాయంతో విద్యార్థులకు పాఠశాలలు, ఉచిత వసతిగృహాలు నెలకొల్పింది. ఆరోగ్యశాలలు, ప్రసూతిశాలలు ఏర్పాటు చేసింది. ఒక విద్యాపీఠం స్థాపించి అందులో వేదాలను, సాహిత్యాన్ని, ఆగమవ్యాఖ్యానాలను బోధింపచేసేది. పాఠశాలల్లో ఉపాధ్యాయులను, గ్రామాల్లో కరణాలను నియమించి వారికి వస్తువాహనాలను, ధాన్యాన్ని సమకూర్చేది. మార్కోపోలో అనే విదేశీ యాత్రికుడు ఈమె పరిపాలనా దక్షత, సాహిత్యసేవ, శిల్పకళలు, మహదైశ్వర్యం గురించి ప్రశంసిస్తూ తన డైరీలో రాసుకున్నాడు. అదీ రుద్రమదేవి ఘనత.

**♦. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) రుద్రమాంబపై ఆమె తండ్రి ఉంచిన నమ్మకమేమిటి?

ఆ) రుద్రమాంబ చేసిన సత్కార్యాలేవి?

ఇ) మార్కోపోలో ఏయే అంశాల్లో రుద్రమదేవిని పొగిడాడు?

ఈ) రుద్రమదేవి సమర్థత యేమిటి?

ఉ) ఈ గద్యం ద్వారా రుద్రమదేవి వ్యక్తిత్వాన్ని ఒక వాక్యంలో రాయండి.

SCERT TELANGANA

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) బూర్గుల - పి.వి.గార్ల సంబంధం గురుశిష్య సంబంధం లాంటిది. దీన్ని సమర్థిస్తూ రాయండి.

ఆ) 'సరే-అవన్నీ ఆటలో ఉండేవేగా' అని బూర్గులవారు అనేవారు కదా! ఏ సందర్భంలో ఎందుకనేవారో దానికిగల కారణాలను రాయండి.

ఇ) బూర్గులవారిని ప్రాతఃస్మరణీయులని పి.వి.నరసింహారావుగారు పేర్కొనడాన్ని సమర్థిస్తూ రాయండి.

**2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) బూర్గుల వ్యక్తిత్వంలోని మహోన్నతలక్షణాల గురించి సొంతమాటల్లో రాయండి. ( లేదా )

ఆ) ఈ పాఠం ఆధారంగా "గొప్పవారి సాంగత్యంవల్ల కలిగేస్ఫూర్తి గొప్పగా ఉంటుంది" అనే అంశం గురించి సమర్థిస్తూ రాయండి.

**3. సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.**

అ) పాఠంలోని పదజాలం, విశిష్టలక్షణాల ఆధారంగా ఒక కవిత రాయండి. ( లేదా )

ఆ) ఈ పాఠం ఓ అభినందనపత్రంగా ఉంది కదూ! దీని ఆధారంగా మీకు నచ్చిన గొప్ప వ్యక్తిని గురించి అభినందన వ్యాసం రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింద గీతగీసిన పదాలకు అర్థాలను రాయండి.**

అ) చిన్నప్పటి జ్ఞాపకాలు నాకు <u>ముప్పిరిగొ</u>ంటున్నాయి.

ఆ) <u>వీసం ఎత్తు</u> అహంకారం లేకుండా ముందుకెళ్ళాలి.

ఇ) దశరథుని <u>కడగొట్టు</u> బిడ్డడు శత్రుఘ్నుడు.

ఈ) భారతదేశ <u>ప్రాభవాన్ని</u> మనమంతా పెంచాలి.

ఉ) మనదేశ ప్రజలకు వివేకానందుడు <u>ప్రాతఃస్మరణీయుడు</u>.

ఊ) <u>హితైషి</u> చెప్పిన మాటలను పెడచెవిన పెట్టవద్దు.



SCERT TELANGANA

2. **కింది జాతీయాలను మీ సొంత వాక్యాలలో ప్రయోగించండి.**

అ) శ్రీరామరక్ష ఆ) గీటురాయి ఇ) రూపుమాపడం

ఈ) కారాలుమిరియాలు నూరడం ఉ) స్వస్తివాచకం

3. **కింది వాక్యాలలోని పర్యాయపదాలు గుర్తించండి.**

అ) రైతులు ప్రతివర్షం పంటలను పండిస్తూ సాలుకొకసారి వచ్చిన ధనంతో సంవత్సరమంతా గడుపుతారు.

ఆ) భూమిపై కాలుష్యం పెరుగుటవల్ల ధరిత్రిమీద ఉండే జనం విలవిలలాడుతూ అవనిపై మేము జీవించలేమని అంటున్నారు.

ఇ) ఒక వ్యక్తి దక్షతతో పనిచేస్తే ఆ సామర్థ్యం అందరికీ తెలుస్తుంది.

4. **కింది 'వికృతి' పదాలకు పాఠంలో ఉన్న 'ప్రకృతి' పదాలను వెతికి రాయండి.**

అ) దవ్వు ఆ) గారవం ఇ) పగ్గె / పగ్గియ

ఈ) దోసం ఉ) రాతిరి ఊ) బాస

5. **ప్రతి వృత్తికి కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయని పాఠం ద్వారా తెలుసుకున్నారు కదా! మీకు తెలిసిన కొన్ని వృత్తులు, వాటికున్న ప్రత్యేక లక్షణాలకు సంబంధించిన పదాలను పట్టిక రూపంలో రాయండి.**

| వృత్తి | ప్రత్యేక లక్షణం |
|---|---|
| ఉదా : ఉపాధ్యాయ | నిరంతర అధ్యయనం, బోధన |

## వ్యాకరణాంశాలు

1. **కింది వాక్యాల్లో గీతగీసిన పదాలను విడదీసి సంధులను గుర్తించండి.**

అ) హైదరాబాద్‌లోని విమానాశ్రయం అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఒకటి.

ఆ) చిన్నప్పటి విషయాలు జ్ఞాపకముండడం చాలా అరుదు.

ఇ) ప్రతి జీవికి ఒక్కో శరీరాకృతి ఉంటుంది.

ఈ) అబ్దుల్‌కలాం మహోన్నత వ్యక్తిత్వం కలవాడు.

ఉ) నా జీవితాన్నంతా దేశసేవకే వినియోగించాలనుకుంటున్నాను.

ఊ) మాధవి చెప్పినప్పటికీ రమ వినలేదు.

ఋ) ఒక్కొక్కప్పుడు ముఖ్యమైన విషయాలు జ్ఞప్తికి రావు.



SCERT TELANGANA

**2. కింది సమాస పదాల్లోని తత్పురుషభేదాలను గుర్తించి, విగ్రహవాక్యాలు రాయండి. సమాస నిర్ణయం చేయండి.**

ఉదా॥ సత్యదూరము – సత్యమునకు దూరము – షష్ఠీతత్పురుష సమాసం

అ) అమెరికా రాయబారి – ______

ఆ) వాదనాపటిమ – ______

ఇ) అసాధ్యం – ______

ఈ) నెలతాల్పు – ______

ఉ) గురుదక్షిణ – ______

ఊ) వయోవృద్ధుడు – ______

ఋ) దొంగభయము – ______

ౠ) రెండురాష్ట్రాలు – ______

ఎ) శక్తిసామర్థ్యాలు – ______

ఏ) అమూల్యసమయం – ______

ఐ) పూర్వపురుషులు – ______

ఒ) ప్రాచీనకావ్యాలు – ______

ఓ) పెద్దకుటుంబం – ______

**3. కింది సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చండి.**

అ) పూనాలోని ఫెర్గూసన్ కాలేజీలో చేరాడు.
పర్షియన్ భాషను చదివాడు.
ఆ కళాశాల నుంచి పట్టభద్రుడయ్యాడు.

ఆ) బూర్గుల హైద్రాబాద్ రాష్ట్రంలో దున్నేవానికి భూమి హక్కునిచ్చే కౌలుదారి చట్టాన్ని తయారుచేశాడు.
బూర్గుల సామ్యవాద వ్యవస్థకు పునాది వేశాడు.
బూర్గుల అజరామర కీర్తిని పొందాడు.

## ప్రాజెక్టు పని

- **మహోన్నత వ్యక్తిత్వంతో పరిపాలనాదక్షతతో సేవచేసిన వారి వివరాలు సేకరించండి. నివేదిక రూపొందించండి. తరగతిలో ప్రదర్శించండి.**

## సూక్తి

**ప్రజాకార్యం తు తత్కార్యం, ప్రజాసౌఖ్యం తు తత్సుఖం,
ప్రజాప్రియః ప్రియస్తస్య, స్వహితం తు ప్రజాహితమ్.**

**– మహాభారతం**

**ప్రజాకార్యమే పాలకుని కార్యం. ప్రజల సుఖమే పాలకుని సుఖం. ప్రజల ప్రియమే పాలకుని ప్రియం. ప్రజల హితమే పాలకుని హితం.**



SCERT TELANGANA

# 3

# వలసకూలీ!

– డా॥ ముకురాల రామారెడ్డి

### చదువండి – ఆలోచించి చెప్పండి.

ఊరిలో నీకిల్లు లేదు –ఊరి వెలుపల పొలము లేదు
కూలి నిర్ణయ మింతని లేదు – కూలి పని స్థిరమైనది కాదు
ఆలుపిల్లల నేలేదెట్లా – అనే చింత నిన్నిడదోయి వ్యవసాయకూలి.
బతుకు దెరువు లేక నీవు – భార్యపిల్లల నొదిలి పెట్టి
బస్తి చేరి రిక్షలాగి – బలముగ జ్వరమొచ్చి పంటే
కాస్త నీకు గంజినీళ్ళు – కాసి పోసే దిక్కెవరోయి వ్యవసాయ కూలి.

– సుద్దాల హనుమంతు

### ప్రశ్నలు:

1. ఈ పంక్తులు ఎవరి గురించి తెలుపుతున్నాయి? రాసింది ఎవరు?
2. కూలిపని స్థిరమైనది కాదు అనడంలో అంతరార్థమేమిటి?
3. కుటుంబ పోషణ ఎట్లా జరుగుతుంది?
4. ఊళ్ళు వదిలి పోయేటందుకు కారణమయ్యే పరిస్థితులేవి?

### పాఠం నేపథ్యం

తెలంగాణ రాష్ట్రంలో నీటివసతికి నోచుకోక, పంటలు పండక, నిరంతరం కరువురక్కసి కోరల్లో చిక్కుకున్న ప్రాంతం పాలమూరు. నాటి పాలమూరు జిల్లానే నేటి మహబూబ్‌నగర్ జిల్లా. బతుకుభారాన్ని మోస్తూ కాలాన్ని వెళ్ళదీయలేక బతుకటానికి వలసపోవడం అక్కడి కూలీలకు పరిపాటి.

1977లో తూర్పుతీరప్రాంతానికి వలస వెళ్ళిన కొందరు పాలమూరు కూలీలు అక్కడ వచ్చిన తుఫాన్‌కు గుర్రై తిరిగిరాలేదని, వాళ్ళెక్కడున్నరో జాడతెలియనప్పుడు కవి హృదయంలో కలిగిన ఆవేదన ఇది.

### పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'గేయం' ప్రక్రియకు చెందినది. లయాత్మకంగా ఉండి ఆలపించేటందుకు వీలుగా ఉండేది గేయం. ఇది పల్లవి, చరణాలతో కూడి ఉంటుంది. పల్లవి మాత్రం పునరావృతమవుతుంది. సంగీత సాహిత్యాల మేళవింపే గేయం. ప్రస్తుత పాఠ్యాంశం డా॥ ముకురాల రామారెడ్డి 'హృదయశైలి' గేయ సంకలనం లోనిది.

SCERT TELANGANA

## కవి పరిచయం



**01-01-1929**

**24-02-2003**

డా॥ముకురాల రామారెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో జన్మించాడు. ఈయన సమకాలీన అంశాలను ప్రతిబింబించే కవితలు, పద్యాలు, పాటలు, కథలు, వ్యాసాలు రాశాడు.

ఈయన మేఘదూత(అనువాద కవిత్వం), దేవరకొండదుర్గం, నవ్వేకత్తులు(దీర్ఘకవిత), హృదయశైలి(గేయ సంపుటి), రాక్షసజాతర (దీర్ఘకవిత), ఉపరిశోధన (పరిశోధనా పత్రాల సంకలనం), తెలుగు సాహిత్యనిఘంటువు మొదలగు రచనలు చేశాడు. 'ప్రాచీన తెలుగుకవిత్వంలో కవితాత్మక భావపరిణామం' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించి డాక్టరేట్ పొందాడు.

సామాజికస్పృహ, సమస్యలపట్ల స్పందించేగుణం కల్గి, సాహిత్య, సాంస్కృతిక రంగాలతోపాటు ఎన్నో ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకున్న కవి డా॥ ముకురాల రామారెడ్డి.

ఇతని 'విడిజోడు' కథకు కృష్ణాపత్రిక వాళ్ళు ద్వితీయబహుమతిని ఇవ్వగా, ఆకాశవాణి ఢిల్లీ వారు ఆంధ్రప్రదేశ్ నుండి 1976లో జాతీయకవిగా గుర్తింపునిచ్చి సన్మానం చేశారు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

## ప్రవేశిక

**మానవ జన్మ ఎంతో ఉదాత్తమైనది. ఇది లభించడం ఒక వరం. లభించిన జీవితం సార్థకం చేసుకోవాలన్నది ప్రతి ఒక్కరి తపన. ఆశ. కానీ.....**

**కాలం కలిసి రాని అభాగ్యజీవులు, తమజీవితాన్ని నెట్టుకురావడమే ఒక 'కల'గా భావించవలసి వస్తే.....**

**అందంగా ఉండవలసిన 'కల' కూడా 'పీడకల'గా పరిణమిస్తే.....**

**బతుకు బండి నడిపేటందుకు తన కలలన్నీ, కల్లలు కాగా పొట్టచేత పట్టుకొని ఒంటరిగా పరాయి దేశం పోయి.....**

**మనసును పంచుకొనేటందుకు మనుషులు లేక,**

**బాధను పంచుకొనేటందుకు బంధువులు లేక,**

**సమాజం నుండి దూరమౌతున్న వ్యథార్థజీవితాలను గురించి,**

**ముకురాలవారు రాసిన గేయం చదువుదాం.**

SCERT TELANGANA

I

కూలి మస్తుగ దొరుకుతాదని !
కోస్తదేశం పోతివా !
ఎన్నడొస్తవు లేబరీ,
పాలమూరి జాలరీ !

గోకులాష్టమి దాటిపోయినా, గొల్లడొక్కలు గుంజినా,
వాగులల్లో, వంకలల్లో వానపాములు ఎండినా,
చినుకురాలే ఆశలేదని, చెర్లుకుంటలు పర్రెవడెనని
కూలి మస్తుగ దొరుకుతాదని కోస్తదేశం పోతివా !

ఎన్నడొస్తవు లేబరీ,
పాలమూరి జాలరీ !

చాలు వానే పడదు సరళాసాగరం నిండేది కాదని,
చౌట మడుగులె యెండె, కోయిలసాగరం నిండేది కాదని,
పైరు లన్నీ వరుగులయ్యే పల్లెలో బతికేది ఎట్లని,
కూలి మస్తుగ దొరుకుతాదని కోస్తదేశం పోతివా

ఎన్నడొస్తవు లేబరీ,
పాలమూరి జాలరీ !



## ఆలోచించండి - చెప్పండి

- 'గొల్ల డొక్కలు గుంజడం' అంటే మీకు ఏమి అర్థమైంది?
- కోస్తా ప్రాంతానికి ఎవరు, ఎందుకు వెళ్ళారు?
- పల్లెబతుకుల కష్టానికి కారణం ఏమిటి?

## II

కొడిమెలూ, గాలాల గడెలూ గుడిసెకు విసిరిపోతివా !
నజాకతు నైలాను వలనే నడుం చుట్టుక పోతివా,
తిరిగి మన్నెంకొండ దేవుని దిక్కు మొక్కుతు పోతివా,
కూలి మస్తుగ దొరుకుతాదని కోస్తదేశం పోతివా
ఎన్నడొస్తవు లేబరీ,
పాలమూరి జాలరీ !

మెరిగె చాపకు బొచ్చె చాపకు మరిగి రాకనె పోతివా,
చందమామల, పరక పిల్లల చారు మరిచే పోతివా,
ఎన్నడొస్తవు లేబరీ,
పాలమూరి జాలరీ !

కోస్తబెస్తల పడవలల్లో కూలివయ్యిన కర్మమెందుకు?
ఎగువ కృష్ణా ఆనకట్టను ఇంత వరకూ వేయనందుకు
ఏడ ఉంటివా లేబరీ,
ఎన్నడొస్తవు జాలరీ !

ఇంటికొస్తానన్న గడువుకు ఇప్పటికి వారాలు దాటె,
చీకు మబ్బుల ముసురులో కార్తీకపున్నం వెళ్ళిపాయె,
ఇటే పోయిన జనం – అంతా అటే చచ్చే కాలమంటు,
జలపిడుగు పొర్లాడి భద్రాచలం మెట్లకు తాకెనంటా
ఎక్కడుంటివి లేబరీ,
ఎన్నడొస్తవు జాలరీ !



SCERT TELANGANA

### ఆలోచించండి – చెప్పండి

- కృష్ణా ఆనకట్టను కట్టకపోవటానికి, పాలమూరు జనం కూలీలుగా మారడానికి గల సంబంధం ఏమై ఉంటుంది.
- 'చీకు మబ్బుల ముసురులో కార్తీకపున్నం వెళ్ళిపోయిందని' కవి ఎందుకు ఆవేదన చెందాడు?

## సారాంశం

'వలసకూలీ'కి పర్యాయపదంగా మారిన పాలమూరు కష్టజీవుల శ్రమజీవనానికి అద్దంపట్టే ఈ గేయంలో డా॥ ముకురాల రామారెడ్డి ఒక జాలరి జీవితాన్ని కన్నులకు గట్టినట్లు చిత్రించాడు.

పని ఎక్కువ దొరుకుతుందని, పైసలు ఎక్కువ వస్తాయని ఇక్కడి అనుభూతులను, ఊరితో అనుబంధాన్ని, కుటుంబం నుంచి లభించే మమతానురాగాలను వదులుకొని కోస్తాప్రాంతంలో చేపలు పట్టే పనికోసం పోయిన ఆ జాలరిని గురించి భార్యాపిల్లలు యాదిజేసుకోవడం ఎంత ఆర్ద్రంగా ఉంటుందో తెలుస్తున్నది.

వానలు లేక పంటలెండిపొయ్యాయి. పశువులకు మేతలు కరువయ్యాయి. నేల నెర్రెలు వారింది. చెరువులల్లకు సరిపడే నీళ్ళు రాలేదు. కొడిమెలు, గాలాలు విడిచిపెట్టి, ఎక్కువకూలికి ఆశపడి నైలానువల మాత్రం దీసుకొని కోస్తదేశం పోయిన ఆ జాలరి కోసం అంతా ఎదురుచూస్తున్నారు.

వస్తానన్న ముద్దతు ఎప్పుడో దాటిపోయింది. అక్కడి చేపల రుచి మరిగి రాకుండా ఉండిపోయాడా? గోదావరి వరదల్లో చాలామంది చనిపోయారన్న వార్త అపశకునాన్ని కలుగజేస్తుంటే, బుగులు బుగులుగా, దిగులు దిగులుగా అతనికోసం ఎదురుచూస్తున్నారు అందరూ.

SCERT TELANGANA



## ఇవి చేయండి



### I. అవగాహన - ప్రతిస్పందన

1. **ఒక ప్రాంతంలోని జనం ఇతర ప్రాంతాలకు ఎందుకు వలసలు వెళతారు? దీనిని అరికట్టడానికి ఏం చేస్తే బాగుంటుంది? చర్చించండి.**

2. **పాఠం చదువండి - అంత్యానుప్రాస పదాలు రాయండి.**

3. **కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

తెలంగాణ ప్రాంతంలో చెరువుల నిర్మాణం శాతవాహనుల కాలం కంటే ముందునుంచే ఉన్నప్పటికీ కాకతీయుల కాలంలో ఉన్నతదశకు చేరుకుంది. ఆ తర్వాత తెలంగాణను పాలించిన కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీలు, సంస్థానాధీశులు, తెలంగాణలో చెరువుల నిర్మాణాన్ని అభివృద్ధిపరిచి, వ్యవసాయాభివృద్ధికి తోడ్పడ్డారు. తర్వాత కాలంలో ఈ చెరువుల వ్యవస్థ సరైన నిర్మాణానికి నోచుకోక విధ్వంసానికి గురి అయ్యింది. దీనివలన స్వయంపోషక

గ్రామాలుగా ఉన్న తెలంగాణ గ్రామాలు కరువుపీడిత గ్రామాలుగా మారాయి. ఈ పరిణామం కూడా వలసలకు కారణమైంది. లక్షలాది మంది తెలంగాణ ప్రజలు పొట్టచేత పట్టుకొని ఇతర రాష్ట్రాలకు, గల్ఫ్‌దేశాలకు వలస పోయారు. తెలంగాణలో చెరువుల పునర్నిర్మాణం ద్వారా వ్యవసాయాభివృద్ధి సాధిస్తే, ప్రజలకు ఉపాధి దొరికి, వలసలు ఆగిపోతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం చెరువులను పునరుద్ధరించడానికి 'మిషన్ కాకతీయ' అనే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది.

**ప్రశ్నలు :**

అ) పై పేరా దేని గురించి చెప్తున్నది?

ఆ) 'మిషన్ కాకతీయ' అంటే ఏమిటి?

ఇ) తెలంగాణ ప్రజలు ఎందుకు వలసలు వెళ్ళుతున్నారు?

ఈ) వలసలు ఆగిపోవడానికి చేపట్టవలసిన చర్యలేవి?

ఉ) చెరువుల అభివృద్ధి కోసం కృషిచేసిన వారెవరు?

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) ముకురాల రామారెడ్డి పాట విన్నారు కదా! దీని ఆధారంగా పాలమూరు కూలీ జీవితం ఎట్లా ఉండేదో ఊహించి రాయండి.

ఆ) ఒకప్పుడు గ్రామాలు స్వయం సమృద్ధిగా ఉండేవి. అలాంటి గ్రామాలనుండి ప్రజలు ఎందుకు వలసలు పోతున్నారు.

ఇ) "ఎప్పుడొస్తవు లేబరీ, పాలమూరి జాలరీ" అని అనడంలో కవి ఉద్దేశాన్ని రాయండి.

ఈ) గ్రామాల్లోనే ప్రజలకు ఉపాధి ఎప్పుడు దొరుకుతుంది?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) 'వలసకూలీ' గురించి కవి ఆవేదనను మీ సొంతమాటల్లో రాయండి.

(లేదా)

ఆ) వలసకూలీల బతుకుల్లో వెలుగులు నింపడానికి ఎట్లాంటి చర్యలు అవసరమో వివరించండి

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.**

అ) శ్రమజీవులైన కూలీలు పనిదొరకక పొట్టచేత పట్టుకొని వలసపోతున్నారు. వారి జీవనాన్ని ఊహిస్తూ ఒక కవిత / గేయం రాయండి.

(లేదా)

ఆ) వలసలను నిరోధించడానికి ప్రజలకు గ్రామాల్లోనే ఉపాధి లభించేటట్లు ప్రభుత్వం చేపట్టవలసిన చర్యలను గురించి పత్రికలకు లేఖ రాయండి.

SCERT TELANGANA

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాల్లోని గీతగీసిన పదాలనుపయోగించి సొంత వాక్యాలు రాయండి.**

అ) పుస్తకాల నిండ <u>మస్తుగ</u> బొమ్మలు ఉన్నవి.

ఆ) పరీక్ష రుసుం చెల్లించడానికి నేటితో <u>గడువు</u> ముగిసింది.

ఇ) పల్లెదారి పంట <u>పైరులతో</u> అందంగా ఉన్నది.

**2. కింది పదాలు / వాక్యాలు వివరించి రాయండి.**

అ) గొడ్ల డొక్కలు గుంజినా ...

ఆ) చెర్లుకుంటలు పర్రెవడెనని ...

ఇ) పైరులన్నీ వరుగులయ్యె ...

ఈ. జల పిడుగు ...

**3. కింది వాక్యాలలోని ప్రకృతి, వికృతులను గుర్తించండి.**

అ) మానవుడు ఆశాజీవి. అతని ప్రయత్నాన్ని బట్టి ఆసలు నెరవేరుతాయి.

ఆ) సింహాలు కొండ గుహల్లో ఉన్నాయి. జడివానకు కుహరాలలోని సింగాల గుండెలు పగిలాయి.

### వ్యాకరణాంశాలు

**1. కింది పదాలను పరిశీలించండి. వాటిని విడదీసి సంధిని గుర్తించి, సూత్రం రాయండి.**

అ) ఎట్లని = ____________ + ____________ = ______________________________

ఆ) కాలమంటూ = ____________ + ____________ = ______________________________

ఇ) వరుగులయ్యె = ____________ + ____________ = ______________________________

**శబ్దాలంకారాలు**

**అంత్యానుప్రాస**

**✷ కింది వాక్యాలు పరిశీలించండి, ప్రత్యేకతను గుర్తించండి.**

.....గొడ్ల డొక్కలు గుంజినా

.....వాన పాములు ఎండినా

.....గుడిసెకు విసిరి పోతివా

.....నడుం చుట్టుక పోతివా

SCERT TELANGANA

.....ఎన్నడొస్తవు లేబరీ;

.....పాలమూరి జాలరీ !

పై పాదాల చివర అక్షరాలు పునరుక్తమైనాయని గమనించారు గదా! అక్షరాలు పునరుక్తమవడాన్ని 'అంత్యాను ప్రాస' అంటారు.

పదాల, పాదాల, వాక్యాల చరణాల చివరలో అక్షరాలు పునరుక్తమైతే అది అంత్యానుప్రాసాలంకారం.

**2. పాఠంలోని అంత్యానుప్రాసాలంకార పంక్తులను గుర్తించి రాయండి.**

## సంభావన పూర్వపద కర్మధారయ సమాసం

**✷ ఈ కింది వాక్యాలలో గీతగీసిన సమాస పదాలను పరిశీలించండి.**

భద్రాచలం ఒక పుణ్యక్షేత్రం.

[పై సమాసపదంలో భద్ర, అచలం అనే రెండు పదాలున్నాయి కదా!

అచలం అంటే కొండ (నామవాచకం)

భద్ర అనేది పేరు (సంజ్ఞ)]

- సంజ్ఞనే సంభావన అని అంటారు.

ఈ విధంగా పూర్వపదం(మొదటి పదం)లో సంభావన ఉన్నట్లయితే ఆ సమాసపదాన్ని 'సంభావన పూర్వపద కర్మధారయ' సమాసమని అంటారు.

**3. ఈ పాఠంలో ఉన్న సంభావన పూర్వపద కర్మధారయ సమాసపదాలను గుర్తించి, విశ్లేషించండి.**

## రూపక సమాసం

**✷ కింద గీతగీసిన సమాస పదాన్ని పరిశీలించండి.**

ధనాలన్నింటిలో శ్రేష్ఠమైనది విద్యాధనం.

పై గీతగీసిన పదములో విద్యకు ధనానికి భేదం చెప్పలేదు.

విద్య అనెడు ధనం అని దీని అర్థం.

ధనం (ఉపమానం)

విద్య (ఉపమేయం)

- **కింద గీతగీసిన సమాసపదాల్లోని ఉపమాన, ఉపమేయాలను గుర్తించండి.**

దయాభరణము ను ధరించినవాడు భగవంతుడు.

పేదలపై కృపారసము కల్గియుండాలి.

- ఈ విధంగా ఉపమానం యొక్క ధర్మాన్ని ఉపమేయంపై ఆరోపించడాన్ని **రూపక సమాసం** అని లేదా **అవధారణ పూర్వపద కర్మధారయ సమాసమ**ని అంటారు.



SCERT TELANGANA

4. కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి ఏ సమాసాలో గుర్తించండి.

అ) పాలమూరుజిల్లా = ____________________, ____________________

ఆ) సరళాసాగరం = ____________________, ____________________

ఇ) మన్నెంకొండ = ____________________, ____________________

ఈ) కీర్తికన్యక = ____________________, ____________________

ఉ) జ్ఞానజ్యోతి = ____________________, ____________________

## ప్రాజెక్టు పని

- **మీ గ్రామంలో లేదా వాడలో వలసకూలీల వద్దకు / వాళ్ళ బంధువుల వద్దకు వెళ్ళి, వలస ఎందుకు వచ్చారో తెలుసుకొని, వాళ్ళ కష్టసుఖాల గురించి ఇంటర్వ్యూ చేసి నివేదిక రూపొందించండి.**

**(లేదా)**

- **కార్మికుల, కూలీల బతుకు జీవనం గురించి వచ్చిన కథ/కవిత/గేయం/ పాటలను సేకరించి, నివేదిక రాయండి. చదివి వినిపించండి.**

## మీకు తెలుసా?

i) కోయిల సాగరం : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో ఉన్న డ్యాం. కొండల మధ్య అత్యంత రమణీయంగా నిర్మించబడ్డ ఈ డ్యాం వేల ఎకరాల సాగుకు నీటిని అందిస్తుంది.

ii) సరళా సాగరం : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో 'సైఫన్ సిస్టమ్'లో నిర్మించబడ్డ డ్యాం. ఈ డ్యాం నిండినప్పుడు డ్యాంగేట్లు వాటంతట అవే తెరుచుకోవడం దీని ప్రత్యేకత. వనపర్తి రాణి సరళాదేవి పేరు మీదుగా నిర్మించబడింది.

iii) మన్నెంకొండ దేవుడు : మహబూబ్‌నగర్ జిల్లాలోని సుప్రసిద్ధ క్షేత్రం. మన్నెంకొండలో వెలసిన వేంకటేశ్వరస్వామి.

iv) ఎగువకృష్ణా ఆనకట్ట : కృష్ణానది తెలంగాణలోకి ప్రవేశించేది మహబూబ్‌నగర్ జిల్లా నుండే. ఈ ప్రాంతాన్నే 'ఎగువకృష్ణ'గా కవి భావించాడు. ప్రస్తుతం గద్వాల సమీపంలో కృష్ణానదిపై జూరాల ప్రాజెక్టు నిర్మించబడింది. ప్రస్తుత గేయం రచింపబడిననాటికి ఈ ఆనకట్ట నిర్మించబడలేదు.

## సూక్తి

**"ఈ లోకంలో శ్రమలేకుండా ఏ సంపద వృద్ధి చెందదు. శ్రమద్వారా లభించిన సంపదకంటే మధురమైన సంతృప్తి ఏదీ లేదు. శ్రమించకుండా దేన్నీ సాధించలేము."**

SCERT TELANGANA

# 4 రంగాచార్యతో ముఖాముఖి

## చదువండి - ఆలోచించి చెప్పండి.

తెలంగాణకు చెందిన ప్రముఖ భాషాశాస్త్రవేత్త డా॥ చేకూరి రామారావుతో పత్రికా విలేఖరి ముఖాముఖి.

పత్రికా విలేఖరి : మీ వ్యక్తిగత వివరాలు చెప్పండి.

చేకూరి రామారావు : మాది ఇల్లిందలపాడు గ్రామం, ఖమ్మం జిల్లా. తల్లి భారతమ్మ, తండ్రి లింగయ్య. భాషాశాస్త్రంలో ఉపన్యాసకుడిగా ఉద్యోగం ప్రారంభించి, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో డీన్‌గా పదవీ విరమణ చేశాను.

పత్రికా విలేఖరి : మీకు కేంద్ర సాహిత్యఅకాడమీఅవార్డు ఎప్పుడు, ఏ రచనకు వచ్చింది?

చేకూరి రామారావు: : నేను రాసిన 'స్మృతి కిణాంకం' అనే వ్యాస సంకలనానికి 2002 సం॥లో ఉత్తమమైన విమర్శ గ్రంథంగా కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు వచ్చింది.

పత్రికా విలేఖరి : వాడుకభాష గురించి చెప్పండి.

చేకూరి రామారావు : వ్యావహారిక భాషావాదమంటే మాట్లాడినట్లు రాయడం కాదు. మాట్లాడే భాషకు, రాసే భాషకు పరిమితులు వేరు. ప్రయోజనం వేరు. రచనా వ్యవస్థకు కొన్ని నియమాలు అవసరం.

పత్రికా విలేఖరి : తెలుగు కనుమరుగు అవుతుందేమోనన్న ఆందోళన గురించి మీ అభిప్రాయం.

చేకూరి రామారావు : ఇన్ని కోట్లమంది మాట్లాడే భాష కనుమరుగుకాదు. కాకపోతే మన తెలుగులో ఇతర భాషల మిశ్రమం ఎక్కువగా కనిపిస్తున్నది.

**ప్రశ్నలు:**

1. పై పేరాలో ఎవరు ఎవరిని ప్రశ్నలడుగుతున్నారు?
2. పై సమాధానాల ద్వారా మీకు తెలిసిన సాహితీ విశేషాలేమిటి?
3. ఈ విధంగా ప్రశ్నలడిగే విధానాన్ని ఏమంటారు?

## పాఠం ఉద్దేశం

తెలంగాణకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. నాటినుండి నేటి వరకు ఈ గడ్డపై పోరాడిన వీరులు, కవులు, రచయితలు, కళాకారులు ఎంతో మంది ఉన్నారు. నాటి తెలంగాణ పోరాటాన్ని కళ్ళార చూసిన సాహితీయోధుడు డా॥ దాశరథి రంగాచార్య. తెలంగాణ ప్రజల జీవనాన్ని, అస్తిత్వాన్ని, పోరాటాలను తన రచనల ద్వారా ప్రతిఫలింప చేశాడు. అలాంటి ప్రముఖ రచయిత వ్యక్తిత్వస్ఫూర్తిని, రచనల గొప్పదనాన్ని ఇంటర్వ్యూ ప్రక్రియ ద్వారా విద్యార్థులకు తెలియజేయటమే పాఠ్యాంశ ముఖ్య ఉద్దేశం.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యభాగం ఇంటర్వ్యూ (పరిపృచ్ఛ) ప్రక్రియకు చెందినది. ఇంటర్వ్యూనే 'ముఖాముఖి' అని కూడా అంటారు. ఇది ప్రధానంగా రెండు రకాలు. ఉద్యోగాల ఎంపికలో అభ్యర్థి ప్రతిభను పరీక్షించడంకోసం చేసేది మొదటిదైతే, నిర్దిష్ట రంగంలో విశేషసేవలందించిన వారి అనుభవాలను తెలుసుకోవటానికి చేసేది రెండోది.

డా॥ దాశరథి రంగాచార్య వేరు వేరు సందర్భాల్లో వివిధ పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలోని ప్రధానాంశాలే ఈ పాఠ్యాంశం.

## డా॥ దాశరథి రంగాచార్య పరిచయం



24-08-1928
07-06-2015

డా॥ దాశరథి రంగాచార్య మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరులో జన్మించాడు. ప్రముఖ కవి డా॥ దాశరథి కృష్ణమాచార్య ఈయన సోదరుడు. రంగాచార్య తెలంగాణ సాయుధపోరాటంలో పాల్గొన్నాడు. ఉపాధ్యాయునిగా, గ్రంథాలయ నిర్వాహకునిగా, సికింద్రాబాద్ పురపాలకశాఖలో పనిచేశాడు. ఈయన విశిష్టమైన నవలలు రచించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాడు. నాలుగు వేదాలను, పది ఉపనిషత్తులను తెలుగులోకి అనువదించాడు. రామాయణ, భారత, భాగవతాలను సరళ వచనంలో రాశాడు. తెలంగాణ జనజీవనం, రైతాంగపోరాటం వంటి అంశాల నేపథ్యంగా ఈయన రచనలు ఉన్నాయి. తెలుగు నవలలో 'పాత్రోచితయాస'ను మొదటగా ప్రవేశపెట్టాడు. వీరి రచనలు ఇతర భారతీయ భాషలలోకి అనువదింపబడ్డాయి, చలన చిత్రాలుగా వచ్చాయి. ఈయన రాసిన 'చిల్లర దేవుళ్ళు' నవలకు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఈయన రచనాశైలి పాఠకుడిని ఆకట్టుకొంటుంది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

## ప్రవేశిక

*తెలుగు సాహిత్యంలో దాశరథి రంగాచార్యులది విశిష్టస్థానం. తెలంగాణ పోరాట నేపథ్యాన్ని తన జీవశక్తిగా మలచుకొని, తెలుగువారి సాంస్కృతిక జీవనాన్ని అద్భుతంగా చిత్రించిన రచయిత రంగాచార్య. అటువంటి మహారచయిత అంతరంగాన్ని మరింత దగ్గరగా తెలుసుకోవాలనే ఆసక్తి, ఉత్సాహం పాఠకులకు ఉండడం సహజం. అందుకు దోహదపడే ప్రక్రియ ముఖాముఖి (ఇంటర్వ్యూ). రచయితతో ముఖాముఖి ద్వారా ఆయన రచనల్లో, జీవితంలో తెలియని కొత్త కోణాలు సాహిత్యలోకానికి పరిచయం అవుతాయి. అందుకోసం డా॥ దాశరథి రంగాచార్యతో ముఖాముఖిని అవలోకిద్దాం.*



### I

**1. మీ సాహితీరంగ ప్రవేశం ఎట్లా జరిగింది?**

నేను తెలంగాణలో జరిగిన ఆంధ్రమహాసభ మహోద్యమంతో ప్రభావితుణ్ణయి రచనకు పూనుకున్నాను. నిజాం రాజ్యంలోని పరిస్థితులను గురించి పత్రికలకు లేఖలు, వ్యాసాలూ వ్రాశాను. ఆ రోజుల్లో వాటిని రచనలు అనుకోలేదు. ఉద్యమంలో భాగం అనుకున్నాను.

**2. తెలంగాణ ప్రజాజీవితం నేపథ్యంగా నవలలు రాయడానికి బలమైన కారణాలు ఏమిటి?**

కారణాలు అనేకం. ప్రభుత్వం తెలంగాణ మహాచరిత్రను వక్రీకరించింది. తెలంగాణ సాయుధ పోరాటం అంటే జడుసుకుంది. మాట ఎత్తితే మీద మీద పడుతుందని బుగులు పడింది. దాన్ని చరిత్ర నుంచి చెరిపివేయడానికి ప్రయత్నించింది. పూర్వం తెలంగాణం ఉండేది, నిజాం ఉండేవాడని కూడా విద్యార్థులకు తెలియకుండా చేసింది. రైతులు, కూలీలు, కార్మికులు, స్త్రీలు, పిల్లలు జరిపిన చారిత్రాత్మక పోరాటం, ప్రజల ప్రతిన – ఇంకా ఎన్నో, ఎన్నెన్నో రక్తారుణ సమరాలు రానున్న తరాలవారికి తెలియకుండా పోవలసిందేనా? మన మహోజ్జ్వల వారసత్వం రానున్న తరాలవారికి అందకుండా పోవలసిందేనా? ఈ వ్యథ, బాధ, ఆవేదన ఈ తపస్సులోంచి ఆవిర్భవించినవే నా నవలలు. ఇవి ప్రజా జీవితాలు. ప్రజల ఆశలు – పోరాటాలు. ప్రపంచంలోనే ఎంతో ఉత్కృష్టమైన తెలంగాణ సాయుధ పోరాటగాథను వట్టికోట ఆళ్వారుస్వామివారి

SCERT TELANGANA

తర్వాత, ఆయన మిగిల్చిన విషయాలను ఎవరూ రాయడం లేదే అన్న ఆందోళనలోంచి నేనే ఆ బృహత్కార్యానికి ఉపక్రమించినాను. ఆ చారిత్రాత్మక జీవన చిత్రాలను ఈ తరాలకు అందించ గలిగాను.

### ఆలోచించండి - చెప్పండి

- 'తెలంగాణ సాయుధపోరాటం' గురించి విన్నారా? మీకు తెలిసింది చెప్పండి.
- 'వారసత్వం' అనే మాటను ఏ విధంగా గ్రహించాలి?

## II

**3. మహాకవి దాశరథిగారు మీ అగ్రజులైనా మీరు నవలారచయితగా స్థిరపడడానికి కారణం?**

నేను తొలుత కవిత్వమే వ్రాశాను. ఉభయులూ ఒకే ప్రక్రియలో ఉండడం మంచిది కాదని నేను వచన రచనకు పూనుకున్నాను. వరదన్న మా అన్నయ్యను 'పద్యదాశరథి' అని, నన్ను 'గద్యదాశరథి' అనేవారని మీకు తెలుసుననుకుంటా.




**4. మీ నవలల గురించి వివరిస్తారా?**

నేను ముందుగా 'చిల్లరదేవుళ్ళు' రాయటం మొదలుపెట్టాను. 'చిల్లరదేవుళ్ళు' చాలా ప్రభావాత్మకమయిన నవల. ఒక కొత్త దృక్పథాన్ని ఏర్పాటుచేసింది. అది విజయవంతమయింది. ఇక 'జనపదం' చాలా విశాలమయిన విస్తృతమయిన నవల. మొత్తం సమాజాన్ని ఒక మైక్రోస్కోపిక్‌గా చూపిన నవల. ఒక వైపు పోలీసు యాక్షన్ అయిపోయి ఏకం చేసిన భూములన్నింటిని దొరలు కాజేయడంతో మొదలవుతుంది నవల. ఎన్ని ఉద్యమాలొచ్చినయి, ఉద్యమాల పేర ఎంత మోసం జరిగింది. రాజకీయాలు ఎంత భ్రష్టు పడుతున్నాయి అనే విషయాలను చాలా వివరంగా చెప్పే నవల. ఒక్క తెలంగాణ కాదు, మొత్తం భారతదేశానికి చెందిన నవల అది. చరిత్రలోని నిజం చెప్పడమే నా నవల ఉద్దేశం. సత్యాన్ని చెప్పడం జరిగింది. జరిగింది చెప్పడం తప్ప వ్యాఖ్య చెయ్యడం కాదు.




**5. 'మోదుగుపూలు', 'మాయజలతారు', 'జనపదం' వంటి ప్రసిద్ధ నవలలు రాసినా 'చిల్లరదేవుళ్లు' రంగాచార్యులుగానే పాఠకులు మిమ్ముల్ని గుర్తుపెట్టుకోవడానికి కారణం?**

కాళిదాసు అనగానే శకుంతల, టాగూర్ అనగానే గీతాంజలి, ప్రేమచంద్ అనగానే గోదాన్ గుర్తుకువస్తాయి. సాహిత్యం లెక్కలు కాదు కాబట్టి కారణం చెప్పడం కష్టం. అయితే, ఒక రచనతో రచయితను గుర్తించడం రచయితకు గర్వకారణం.




SCERT TELANGANA

6. **మీ రచనల్లో ప్రియమయిన పుస్తకం.**

'మోదుగుపూలు' సుమారు నా ఆత్మకథ లాంటిది. నేను జీవనయానం రాద్దామని అనుకోలేదు. ఆత్మకథ రాసుకునేంత గొప్పవాడినని ఇవాళ్టికీ అనుకోవటం లేదు. కాబట్టి ఒక నవలారూపంలో రాశాను. ఇంకోటేమిటంటే మీరు ఏ నవలలో అయినా లోపాలు చూపించగలరు. కానీ 'మోదుగుపూలు'లో చూపించలేరు. ఒక పర్‌ఫెక్షన్‌తో సాగుతుంది.. ఆ నవలలో ఒక మాట అన్నాను. 'సిద్ధాంతంకన్నా కర్తవ్యం గొప్పది. విశ్వాసం కంటే కర్తవ్యం గొప్పది' అని చెప్పాను - ఈ మాట గాంధీజీ చేసి చూపించారు. 1942లో 'డూ ఆర్ డై' అన్నాడు ఆయన. అది ఆయన సిద్ధాంతం కాదు, కర్తవ్యం.




**ఆలోచించండి - చెప్పండి**

- 'జనపదం' నవల ఇతివృత్త మేమిటి?
- రంగాచార్య నవలల్లో ప్రధాన విషయం ఏమిటి?
- తన ఆత్మకథగా వర్ణించిన పుస్తకమేది?

## III

7. **సంస్కృతాంధ్ర భాషల్లో మీరు ఇంతటి పట్టు సాధించడానికి కారణం?**

అందుకు కృషి ఒక్కటే చాలదు. భగవదనుగ్రహం కూడా ఉండడం వల్లనే ఇది సాధ్యమైందని నా విశ్వాసం. లేకుంటే ఇన్ని భాషల పరిచయం, ఆ భాషలలో అనువాదం అసాధ్యమైన పని. నాకు సంప్రదాయ సిద్ధమైన గురువులు కాని, శిష్యులు కాని లేరు. మా అమ్మ చదువులరాణి. ఆమెను ఏమని కీర్తించను! ఎట్లని శ్లాఘించను!

8. **మాండలికంలో రాసే రచనలు అనువదించడం కష్టం కదా! ఇతర భాషల్లోకి వెళ్ళడానికి ఇవి అవరోధం కాదా?**

నేను వ్రాసింది ప్రజల భాషలో. నాకు తెలంగాణం అంటే అభిమానం. అట్లాగని తెలంగాణేతరం అంటే దురభిమానం లేదు. నా యాస సొగసులు ఇతర ఆంధ్రులకు తెలియపరచాలనుకున్నాను. నివేదనకు సాధారణ భాషనే ఉంచాను. నేను ప్రజా జీవితాన్ని చిత్రించడానికి వ్రాశాను. నా ప్రజల కోసం వ్రాశాను.

9. **మీకు నచ్చిన రచనల గురించి సంక్షిప్తంగా తెలియజేస్తారా?**

నాకు వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, గోర్కీ, చెఖోవ్, డికెన్స్, ప్రేంచంద్, ఉన్నవ, విశ్వనాథ నుంచి అల్లం రాజయ్య దాకా పరిచయం. సాహిత్యం విషయంలో నాకు దేశకాలాల పరిధుల్లేవు. నాది వసుధైక కుటుంబం.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

**10. మిమ్మల్ని ప్రభావితం చేసిన రచయిత ఎవరు?**

నన్ను వ్యక్తులుగా ప్రభావితం చేసిన దానికంటే ఉద్యమాలు ఎక్కువగా ప్రభావితం చేశాయి. నేను ఉద్యమ జీవిని. ముఖ్యంగా కమ్యూనిస్టు ఉద్యమం జీవితాన్ని నేర్పింది. మనిషిని చేసింది. సమాజం ఒకటున్నది. నీ బతుకు సమాజంతో ఉన్నది అని చూపింది. కాబట్టి సమాజం కోసం ఏదన్నా చేయాలి అని నేర్పింది.

**ఆలోచించండి-చెప్పండి**

- 'మాండలికమే ప్రజల భాష!' నిజమేనా?
- 'వసుధైక కుటుంబం' అంటే మీరు ఏమనుకుంటున్నారు?

## IV

**11. తెలంగాణ ఏర్పాటు ఎలాంటి సంతోషానిచ్చింది?**

తెలంగాణలో పుట్టిన వాడిగా తెలంగాణ ఏర్పాటు నాకు సంతోషాన్నిచ్చే విషయమే. అయితే ప్రతి దానికి తెలంగాణ వచ్చింది కదా! అనుకుంటే లాభం లేదు. వచ్చిన తెలంగాణను కాపాడుకోవాలి. అభివృద్ధి చేసుకోవాలి. ఇంకా అధ్యయన దశలోనే వున్నాం మనం. అధ్యయనం అయిన తరువాత కదా ఆచరణ దశ.

**12. తెలంగాణ సాహిత్యంపై మీ అభిప్రాయం ఏమిటి?**

నా తెలంగాణ ఇప్పటికే సాహిత్య, సాంస్కృతిక జీవన వైభవానికి జీవగడ్డ. ఇవాళ్టి సాహిత్యంలో తెలంగాణ తప్ప మరొకటి లేదు. ఇంకో వందనుండి, మరొక వంద సంవత్సరాలపాటు రాసినా తరగని ఘనమైన వారసత్వ సంపద ఇక్కడిది. తెలంగాణ పునరుజ్జీవనానికి ప్రత్యేకమైన ప్రణాళికలు, మేనిఫెస్టోలను రూపొందించుకోవచ్చును.

**13. మీరు చేసిన సాహిత్యకృషికి తగిన గుర్తింపు లభించిందని భావిస్తున్నారా?**

నేను ప్రతిఫలము ఆశించి సాహిత్యకృషి చేయలేదు. సమాజానికి నామీద ఉన్న బాధ్యతలను మాత్రం నిర్వర్తించాను. గుర్తింపు విషయం అంతగా పట్టించుకోలేదు.

**ఆలోచించండి-చెప్పండి**

- కృషి - గుర్తింపు వీటి మధ్య సంబంధాన్ని చెప్పండి.
- సందేశమిచ్చే అవకాశం ఎవరికి ఉంటుందని మీరు అనుకుంటున్నారు?
- 'సాంస్కృతిక వైభవం' అంటే ఏమని అర్థం చేసుకోవచ్చు?

**14. ఈ సమాజానికి మీరు ఇచ్చే సందేశం ఏమిటి?**

ఒక బాధ్యతగల మనిషిగా, విలువలు తెలిసిన మానవునిగా, మానవత్వాన్ని ప్రేమించిన వ్యక్తిగా నేను నా విధిని నిర్వర్తించాను. నా జీవితం ద్వారా సందేశం "ఆదర్శం, ఆవేశం, అక్షరం" ఈ మూడూ ఉన్నప్పుడే వ్యక్తికైనా, సమాజానికైనా కావల్సినవి సిద్ధిస్తాయి.

**నమస్తే తెలంగాణ (బతుకమ్మ); ప్రజాశక్తి (సోపతి) పత్రికల నుండి, ఆంధ్రభూమి ('జీవన రేఖలు') నుండి ఈ ముఖాముఖి స్వీకరించబడినది.**

SCERT TELANGANA



# ఇవి చేయండి



## I. అవగాహన - ప్రతిస్పందన

1. దాశరథి రంగాచార్యతో ఇంటర్వ్యూ ఎట్లా అనిపించింది? మీ అభిప్రాయం చెప్పండి.
2. ఈ మధ్యకాలంలో టి.వి.లో లేదా ఇంకెక్కడైన మీరు చూసిన ఇంటర్వ్యూ గురించి మాట్లాడండి.
3. పాఠం ఆధారంగా దాశరథి రంగాచార్య నవలలు, వాటిలోని ఇతివృత్తాలను తెలుపుతూ ఒక జాబితా రాయండి.

| క్ర.సం. | రచన పేరు | ఇతివృత్తం |
|---|---|---|
| 1 | | |
| 2 | | |
| 3 | | |
| 4 | | |

4. ఇంటర్వ్యూకు సంబంధించిన కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

పత్రికల్లో, టి.వి.లో రకరకాల ఇంటర్వ్యూలను చూస్తుంటాం. ఇంటర్వ్యూలు రెండు రకాలని తెలుసుకదా! ఉద్యోగాల ఎంపికకై అభ్యర్థి ప్రతిభను పరీక్షించటానికి చేసేది ఒకరకం. ఉద్యోగాన్ని సంపాదించటానికి అభ్యర్థులు పూర్తి సంసిద్ధతతో ఇంటర్వ్యూకు పోతారు. దీనిలో ఇంటర్వ్యూ చేసే వ్యక్తులు ముఖ్యపాత్ర పోషిస్తారు. ఇది మొదటిది. ప్రముఖుల జీవిత విశేషాలను తెలుసుకోవటానికి చేసేది మరోరకం. ప్రముఖుల, గొప్పవాళ్ళ నుండి వారి వివరాలను, విశేషాలను తెలుసుకోవడానికి చేసేది రెండవది. దీనిలో ఇంటర్వ్యూ చేయబడే వ్యక్తే కీలకం.

రెండవ రకం ఇంటర్వ్యూలో ఇంటర్వ్యూ చేసే వ్యక్తులు ముందుగా కొన్ని అంశాలపై ప్రశ్నలు తయారుచేసుకుంటారు. మొదట వారిని పరిచయం చేసుకొని వారి వ్యక్తిగత వివరాలనుండి మొదలై వారి జీవితంలోని ముఖ్య సన్నివేశాలు, ఘట్టాలు, వారందించిన సేవలు, ఆశయాలు, సమాజానికి వారిచ్చే సందేశంతో ముగుస్తుంది. ఇట్లా చేసే ఇంటర్వ్యూల వివరాలను పత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో ప్రజలు చూస్తుంటారు. ఆదర్శవంతులు, సంఘసంస్కర్తలు, కవులు, రచయితలు, ఉద్యమకారులు, శాస్త్రవేత్తలు, రాజకీయనాయకులు మొదలగు వారే కాకుండా మరే ఇతర రంగంలోనైనా 'ఉత్తమ' సేవలందించిన వాళ్ళందరిని ఇంటర్వ్యూ చేయడం మనం చూస్తుంటాం. వీళ్ళ జీవితాలు ఎందరికో స్ఫూర్తిని కలిగిస్తాయి. దారిని చూపుతాయి.

**ప్రశ్నలు :**

అ) ఇంటర్వ్యూ అంటే ఏమిటి?

ఆ) ప్రముఖులను ఇంటర్వ్యూ ఎందుకు చేస్తారు?

ఇ) మొదటిరకం ఇంటర్వ్యూ దేనికి సంబంధించినది?

ఈ) ప్రముఖులను ఇంటర్వ్యూ చేయడానికి ఎట్లా సిద్ధం కావాలి?

ఉ) ప్రముఖుల నుండి ఇంటర్వ్యూలో సాధారణంగా రాబట్టే విషయాలు ఏవి?

SCERT TELANGANA

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) దాశరథి రంగాచార్య తాను రచనలు ఎందుకు చేయాలనుకున్నారో సొంతమాటల్లో రాయండి.

ఆ) 'తెలంగాణ ఏర్పాటు సంతోషాన్నిచ్చిందని' రచయిత అనటంపై మీ అభిప్రాయాన్ని రాయండి.

ఇ) 'ప్రజల భాష' అంటే మీరేమి అర్థం చేసుకున్నారో రాయండి.

ఈ) రంగాచార్య తన రచనలకు 'తెలంగాణ ప్రజల జీవితాన్ని' నేపథ్యంగా ఎందుకు తీసుకున్నాడు?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) డా॥ దాశరథి రంగాచార్య చేసిన సాహిత్యసేవను వివరించండి.

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.**

అ) మీ పాఠశాలకు ఒక క్రీడాకారుడు, కళాకారుడు లేదా నాయకుడు వచ్చాడనుకోండి. వారిని ఇంటర్వ్యూ చేయడానికి కావలసిన ప్రశ్నావళిని తయారు చేయండి.

(లేదా)

ఆ) డా॥ దాశరథి రంగాచార్య వ్యక్తిత్వాన్ని లేదా సాహిత్యసేవను ప్రశంసిస్తూ వార్తా పత్రికకు ఒక లేఖ రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాల్లో గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి.**

ఉదా: విలువలతో కూడిన విద్య మానవ జీవన<u>వికాసానికి</u> దోహదం చేస్తుంది.

వికాసం = వికసించడం, విప్పారడం

అ) రామప్పగుడి శిల్పకళ <u>సొగసును</u> వర్ణించ శక్యమా!

సొగసు =

ఆ) వట్టికోట ఆళ్వారుస్వామి రచనల్లో ప్రజలమనిషి <u>ఉత్కృష్టమైన</u> రచన.

ఉత్కృష్టం =



SCERT TELANGANA

ఇ) భాగవతంలో కృష్ణలీలలు సమగ్రంగా రాశారు.

సమగ్రం =

ఈ) నానాటికి మానవ సంబంధాలు క్షీణించిపోతున్నాయి.

క్షీణించు =

**2. కింది వాక్యాల్లో గల ప్రకృతి వికృతులను గుర్తించి రాయండి.**

అ) కథలంటే నాకిష్టమని మా నాయినమ్మ నాకు రోజూ కతలు చెప్పింది.

ఆ) స్వచ్ఛభారతం కోసం ప్రతిజ్ఞ చేద్దాం. ప్రతిన చేయడమే కాదు పనిచేసి చూపుదాం.

ఇ) ప్రజలకోసం కవిత్వం రాశాడు. ఆ కైత ప్రజలను చైతన్యపరిచింది.

ఈ) ఆశ ఉండవచ్చు. మితిమీరిన ఆస ఉండరాదు.

## వ్యాకరణాంశాలు

**1. కింది పదాలను విడదీయండి. సంధి పేరు రాయండి.**

| సంధి పదం | విడదీసిన రూపం | సంధి పేరు |
|---|---|---|
| ఉదా :- పోయినాడంటే | పోయినాడు + అంటే | ఉత్వసంధి |
| అ) ఏమని | + | |
| ఆ) కాదనుకున్నాడు | + | |
| ఇ) పిల్లలందరూ | + | |

**2. కింది విగ్రహ వాక్యాలను సమాసపదాలుగా మార్చండి. సమాసం పేరు రాయండి.**

ఉదా :- మూడు సంఖ్యగల రోజులు - మూడురోజులు - ద్విగు సమాసం

అ) రెండు సంఖ్యగల రోజులు = ____________________, ____________________

ఆ) వజ్రమూ వైడూర్యమూ = ____________________, ____________________

ఇ) తల్లియూ బిడ్డయూ = ____________________, ____________________


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21
SCERT TELANGANA

- **కర్తరి, కర్మణి వాక్యాలు**

**కింది వాక్యాలు పరిశీలించండి.**

1) ఆళ్వారుస్వామి 'చిన్నప్పుడే' అనే కథ రాశాడు. (కర్తరి)

2) 'చిన్నప్పుడే' అనే కథ ఆళ్వారుస్వామిచే రచింపబడింది. (కర్మణి)

పైరెండింటిలో మొదటివాక్యం కర్తరి వాక్యం. భావం సూటిగా ఉంది కదా! అది కర్త ప్రధానంగా కలిగిన వాక్యం. అంటే క్రియ (రాశాడు) కర్త (ఆళ్వారుస్వామి)ను సూచిస్తున్నది. ఇటువంటి వాక్యాలను కర్తరి వాక్యాలంటారు.

రెండవ వాక్యం కర్మణి వాక్యం. ఇది కర్మను ప్రధానంగా కలిగిన వాక్యం. అంటే క్రియ (రాయబడింది) కర్మ (చిన్నప్పుడే అనే కథ)ను సూచిస్తున్నది. ఈ వాక్యంలో రెండు మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. (1) 'బడు' అనే ధాతువు చేరడం; (2) 'చే' అనే విభక్తి చేరడం.

| | | |
|---|---|---|
| **కర్తరి వాక్యం** | : | కర్త ప్రధానంగా రూపొందుతుంది. |
| **కర్మణి వాక్యం** | : | కర్మ ప్రధానంగా రూపొందుతుంది. క్రియమీద 'బడు' ధాతువు, కర్తమీద 'చే/చేత' విభక్తి చేరుతుంది. |

**3. కింది వాక్యాలను కర్మణి వాక్యాలుగా మార్చి రాయండి.**

అ) లింగయ్య మా నాయకునికి ఉసిరికాయ ఇచ్చాడు.

______________________________

ఆ) బాలు ఇసుకతో ఇల్లు కట్టాడు.

______________________________

ఇ) అక్క ఇంటిముందు ముగ్గు వేసింది.

______________________________

**4. కింది వాక్యాలను కర్తరి వాక్యాలుగా రాయండి.**

అ) గ్రామీణులచే నాయకులు ఎదుర్కొని పోబడ్డారు.

______________________________

ఆ) కాయలన్నీ అతని చేత ముందర పోయబడ్డాయి.

______________________________

ఇ) బాలురచే సెలవు తీసుకోబడింది.

______________________________

SCERT TELANGANA

5. **మీరు తత్పురుష సమాసం గురించి తెలుసుకున్నారు కదా! కింది విగ్రహవాక్యాల్లో గీత గీసిన విభక్తిప్రత్యయాల ఆధారంగా ఆయా తత్పురుష సమాసాల పేర్లు రాయండి.**

అ) విద్యను అర్థించువారు ( )

ఆ) గుణాల చేత హీనుడు ( )

ఇ) సభ కొరకు భవనం ( )

ఈ) దొంగల వల్ల భయం ( )

ఉ) రాముని యొక్క బాణం ( )

ఊ) గురువు నందు భక్తి ( )

## ప్రాజెక్టు పని

- **మీ గ్రామంలోని వేరు వేరు రంగాలకు చెందిన ప్రముఖులను ఇంటర్వ్యూ చేసేందుకు ప్రశ్నావళి రూపొందించుకొని ముఖాముఖి నిర్వహించండి. నివేదిక రాయండి.**

## మీకు తెలుసా?

1. **తెలంగాణ సాయుధ పోరాటం :** తెలంగాణ ప్రాంతంలో భూస్వాములు, దొరలు, నిజాం ప్రభుత్వం నుంచి, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం రైతులు, రైతు కూలీలు కమ్యూనిష్టు పార్టీ ఆధ్వర్యంలో జరిపిన పోరాటం. ఇది 1946 నుండి 1951 వరకు కొనసాగింది.
2. **గోర్కి :** పూర్తిపేరు మాక్సిం గోర్కి. రష్యాదేశ రచయిత. ఈయన రాసిన 'అమ్మ' నవల ప్రసిద్ధి పొందింది.
3. **చెకోవ్ :** రష్యాదేశ కథా రచయిత. అనేక ప్రసిద్ధ కథలు రాశాడు.
4. **ఛార్లెస్ డికెన్స్ :** ఫ్రాన్సు దేశరచయిత. 'ఎ టేల్ ఆఫ్ టూ సిటీస్' (రెండు మహానగరాల కథ) అనే ప్రసిద్ధ నవల రాశాడు.

**సూక్తి**

**సాహిత్యంలో కల్పిత సంఘటనల కంటే వాస్తవ సంఘటనల వర్ణనలు పాఠకులను మైమరిపిస్తాయి. రచయిత వ్యక్తిత్వాన్ని గురించి కూడ ఆలోచింపజేస్తాయి.**

**– చార్లెస్ డికెన్స్**

SCERT TELANGANA

# 5 శతక మధురిమ

– శతక కవులు

## చదువండి – ఆలోచించి చెప్పండి.

బలవంతుఁడ నాకేమని
పలువురతో నిగ్రహించి పలుకుట మేలా
బలవంతమైన సర్పము
చలిచీమల చేతఁజిక్కి చావదె సుమతీ!

### ప్రశ్నలు:

1. బలవంతుడననే అహంకారం ఎందుకు ఉండకూడదు?
2. చలిచీమల నుంచి మీరేమి తెలుసుకున్నారు?
3. పై పద్యం ద్వారా తెలిసే నీతి ఏమిటి?
4. ఇట్లాంటి నీతులు ఉండే పద్యాలు సాధారణంగా ఏ ప్రక్రియలో కనబడుతాయి?

## పాఠం ఉద్దేశం

శతక పద్యాలు నైతికవిలువల్ని పెంపొందింపజేస్తాయి. భావి జీవితాన్ని తీర్చిదిద్దుతాయి. శతక పద్యాల ద్వారా నైతిక విలువలను పెంపొందించడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం శతక ప్రక్రియకు చెందినది. సాధారణంగా శతకపద్యాల్లో ప్రతిపద్యం చివర మకుటం ఉంటుంది. ఇవి ముక్తకాలు. అంటే ఏ పద్యానికదే స్వతంత్రభావంతో ఉంటుంది. ప్రస్తుత పాఠంలో మల్లభూపాలీయం, సర్వేశ్వర, భాస్కర, శ్రీకాళహస్తీశ్వర, ఉత్పలమాల, ఏకప్రాసశతపద్యమాలిక, నింబగిరి నరసింహ, చంద్రమౌళీశ్వర శతకాల పద్యాలున్నాయి.

## కవుల పరిచయం



(ఊహాచిత్రం)
(13వ శతాబ్దం)

1. **సర్వేశ్వర శతకం : యథావాక్కుల అన్నమయ్య :** ఇతని శైలి ధారాళమైనది. సర్వేశ్వర శతకానికి శతక సాహిత్యంలో గొప్ప ప్రాచుర్యమున్నది.



(ఊహాచిత్రం)
(16వ శతాబ్దం)

2. **శ్రీకాళహస్తీశ్వర శతకం : ధూర్జటి :** శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజకవుల్లో ఒకడు. 'రాజుల్మత్తుల్ వారి సేవ నరకప్రాయంబు...' అంటూ రాజులకు చేసే సేవను ధైర్యంగా వ్యతిరేకరించిన కవి. ఈయన కవిత్వాన్ని శ్రీకృష్ణదేవరాయలు అతులితమాధురీమహిమ... గలదిగా కీర్తించాడు. శ్రీకాళహస్తి మాహాత్మ్యం అనే ప్రబంధాన్ని రాశాడు.



(ఊహాచిత్రం)
(17వ శతాబ్దం)

3. **మల్ల భూపాలీయం నీతిశతకం : ఎలకూచి బాల సరస్వతి :** ఈయన నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోలు సంస్థానంలో సురభి మాధవరాయల ఆస్థాన కవి. తెలుగులో తొలి త్ర్యర్థి కావ్యమైన 'రాఘవయాదవ పాండవీయం' తోపాటు దాదాపు పన్నెండు గ్రంథాలు రచించాడు. భర్తృహరి సుభాషిత త్రిశతిని తెలుగులోకి అనువదించిన వారిలో మొదటివాడు.



(ఊహాచిత్రం)
(17వ శతాబ్దం)

4. **భాస్కరశతకం : మారద వెంకయ్య :** ఈయన 'భాస్కరా' అనే మకుటంతో ఎన్నో నీతులను మనసుకు హత్తుకునేటట్లు తన పద్యధారను కొనసాగించాడు.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21



04-07-1928
23-10-2007

5. **ఉత్పలమాల : ఉత్పల సత్యనారాయణాచార్య :** ఈయన ఖమ్మం జిల్లాలోని చింతకాని ప్రాంతంవాడు. రసధ్వని, ఈ జంటనగరాలు హేమంతశిశిరాలు, గజేంద్రమోక్షం, భ్రమరగీతం, శ్రీకృష్ణచంద్రోదయం మొదలైన పుస్తకాలు రాశాడు.



22-04-1929
04-02-2004

6. **ఏకప్రాస శతపద్యమాలిక : గౌరీభట్ల రఘురామ శాస్త్రి :** ఈయన సిద్దిపేట జిల్లా రిమ్మనగూడలో జన్మించాడు. వ్యాసతాత్పర్య నిర్ణయం, గోమాత కళ్యాణ దాసచరిత్రం, శ్రీ వేములవాడ రాజరాజేశ్వర ఏకప్రాస శత పద్యమాలిక, శివపద మణిమాల, భావానందస్వామి చరిత్ర మొదలగు రచనలతో పాటు అనేక భజన కీర్తనలు రాశాడు.



14-10-1933
11-09-2006

7. **నింబగిరి నరసింహశతకం : డా॥అందె వేంకటరాజం :** ఈయన జగిత్యాల జిల్లా కోరుట్లలో జన్మించాడు. నవోదయం, మణిమంజూష, కళాతపస్విని అనే పద్యకావ్యాలు, భారతరాణి నాటికల సంపుటి రాశాడు. నింబగిరిశతకం, ఈశ్వరశతకాలతోపాటు, 'వానమామలై వరదాచార్యుల కృతులు అనుశీలన' అనే సిద్ధాంత గ్రంథాన్ని రాశాడు. 'కవి శిరోమణి', 'అవధాన యువకేసరి', 'అవధాన చతురానన' అను బిరుదులను పొందాడు.



31-3-1934
11-3-2001

8. **చంద్రమౌళీశ్వర శతకం : ఇమ్మడిశెట్టి చంద్రయ్య :** ఈయన నాగర్‌కర్నూల్ జిల్లా తాళ్లపల్లిగ్రామంలో జన్మించాడు. హనుమద్రామ సంగ్రామం, భక్తసిరియాళ, వీరబ్రహ్మేంద్రవిలాసం అనే హరికథలను, రామప్రభుశతకం, మృత్యుంజయ శతకం, పాలెం వేంకటేశ్వరశతకం, శ్రీశిరీషనగగండికా మాహాత్మ్యం, కర్పూరాద్రి మాహాత్మ్యం అనే కావ్యాలను రాశాడు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA



## ప్రవేశిక

పద్య ప్రక్రియలో శతకం ఒక విభాగం. నీతిని, జీవిత అనుభవాలను, భక్తిని, వైరాగ్యాన్ని శతక పద్యాలల్లో కవులు చెప్పారు. ఈ పద్యాలు నైతిక విలువలను పెంపొందిస్తూ, రసానుభూతిని కలిగిస్తాయి. ఇటువంటి పద్యాలను మనం ఇప్పుడు ఆస్వాదిద్దాం!



## I



✿ మ. కులశైలంబులు పాదు పెల్లగిలి దిక్కూలంబునం గూలినన్
జలధుల్ మేరల నాక్రమించి సముదంచద్భంగి నుప్పొంగినన్,
జలజాతప్రియ శీతభానులు యథాసంచారముల్ దప్పినన్!
దలకం దుబ్బఁడు చొప్పుదప్పఁడు భవద్భక్తుండు సర్వేశ్వరా! 1

**– యథావాక్కుల అన్నమయ్య**

✿ శా. జాతుల్ సెప్పుట సేవ చేయుట మృషల్ సంధించు టన్యాయ వి
ఖ్యాతిం బొందుట కొండెకాఁ డవుట హింసారంభకుం డౌట మి
థ్యాతాత్పర్యము లాడు టన్నియుఁ బరద్రవ్యంబు నాశించి యీ
శ్రీ తా నెన్ని యుగంబు లుండఁ గలదో శ్రీకాళహస్తీశ్వరా! 2

**– ధూర్జటి**



### ఆలోచించండి – చెప్పండి

- 'భక్తుడు పద్ధతి తప్పడు' అని కవి అన్నాడు కదా! పద్ధతి తప్పడమంటే మీరేమనుకుంటున్నారు?
- కీర్తి ఎలా కలుగుతుంది?
- మనిషి చేయకూడని పనులేమిటి?



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

SCERT TELANGANA

## II



✿ మ. చెవికిం గుండల మొప్పుగాదు శ్రుతమే చేదమ్మికిన్గంకణం
బు విభూషాఢ్యము గాదు దానమె మహిన్నుణ్యాత్మునెమ్మేనికిన్
బ్రవిలేపంబులు గావు సొమ్ములుపకారప్రౌఢియే నిక్కమౌ
లవితేంద్రాతిగ వైభవా! సురభిమల్లా! నీతివాచస్పతీ! 3

– ఎలకూచి బాలసరస్వతీ

✿ ఉ. భూపతికాత్మబుద్ధి మదిఁబుట్టని చోటఁబ్రధానులెంత ప్ర
జ్ఞా పరిపూర్ణులైనఁ గొనసాగదు కార్యము కార్యదక్షులై
యోపిన ద్రోణ భీష్మకృప యోధులనేకులుఁ గూడి కౌరవ
క్ష్మాపతి కార్యమేమయినఁ జాలిరెచేయఁగ వారు భాస్కరా! 4

– మారద వెంకయ్య

### ఆలోచించండి - చెప్పండి

- 'పరోపకారం శరీరానికి ఆభరణం" అని కవి ఏ ఉద్దేశంతో అన్నాడు?
- రాజు ఏ విధంగా ప్రవర్తిస్తే, పనులు నెరవేరుతాయి?
- దుర్యోధనుడు ఎట్లాంటివాడు?





SCERT TELANGANA

## III

✿ చం. ధనము, ధనాభిమానము, సదాధనతృష్ణయు మూడు దోషముల్
ధనికున కందు తొల్తటిది ద్రవ్యము పేదకు లేదు కావునన్
ధనికుని కంటె పేదకడు ధన్యుడు, యాతని తృష్ణ సజ్జనా
ప్తిని శమియించు వేంకటపతీ! అఖిలాండపతీ! శ్రియఃపతీ! 5

**– ఉత్పల సత్యనారాయణాచార్య**





✿ మ. గరమున్ర్మింగి హరించితిన్ సుజన దుఃఖమ్మంచు నీయాత్మలో
మురియంబోకు మనుష్యదుర్విషమునున్మాలింపుమా ముందు యీ
నరులందుండు విషమ్ము సూది నిడనైనన్సంధి లేదో ప్రభూ
హర శ్రీవేములవాడ రాజఫణి హారా! రాజరాజేశ్వరా! 6

**– గౌరీభట్ల రఘురామశాస్త్రి**

## ఆలోచించండి –చెప్పండి

- సజ్జనాప్తి వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?
- ధనమువల్ల కలిగే దోషాలు ఏవి?
- మనుషులు విషంతో నిండి ఉన్నారని అనడంలో కవి ఉద్దేశం ఏమిటి?

SCERT TELANGANA

## IV



✿ సీ. కూతురు చందాన కోడలిన్ జూచిన
మండునే ఘోరముల్ మందిరమున?
కార్మిక జనుల భాగస్థులుగాఁ గాంచ
గ్రమ్మునే అలజడుల్ కర్మశాల?
దళితుల నిజ సహోదరులుగా మన్నించ
పుట్టునే ఉత్పాతములు జగాన?
పరమతస్థుల తమ వారిగా ప్రేమించ
రేగునే కలహాగ్నులాగడములు?
తే.గీ. అఖిల జీవుల తనవోలె నాదరింప
ఉద్భవించునే యాపదలుర్వియందు?
వరశుభవిలాస! శ్రీనింబగిరి నివాస!
భవ్యగుణధామ! నరసింహ! దివ్యనామ! 7

– అందె వేంకటరాజం



✿ శా. ఆశాపాశ నిబద్ధుడై చెడక నిత్యంబోర్పుతో దేశికా
దేశంబుందలఁదాల్చి యోగ విధులర్థిన్ సల్పుచున్ భవ్యమౌ
నాశీర్వాదము నొజ్జచేఁ బడసితానందంగనౌ నంచితం
బౌ శాంతంబును నచ్యుతార్చిత పదాబ్జా! చంద్రమౌళీశ్వరా! 8

– ఇమ్మడిజెట్టి చంద్రయ్య

### ఆలోచించండి – చెప్పండి

- ఇంట్లో బాధలు కలగడానికి గల కారణాలు ఏమై ఉంటాయి?
- ఇతర మతస్థులతో కూడా ఎందుకు ప్రేమగా ఉండాలి?
- శాంతి అంటే ఏమిటి? ఇది నేడు ఎందుకు కనుమరుగైపోయింది?



## తాత్పర్యాలు

1) సర్వేశ్వరా! కుల పర్వతాలన్నీ చెల్లాచెదురైనా సముద్రాలు హద్దులను దాటి ఉప్పొంగినా సూర్యచంద్రులు గతి తప్పినా నీ భక్తుడు చలించడు, పొంగిపోడు, పద్ధతి తప్పడు, నీతిని వదలడు.

2) శ్రీకాళహస్తీశ్వరా! తప్పుడు జోస్యాలు చెప్పడం, సేవలు చేయటం, అబద్ధాలాడుట, వంకరమార్గములో కీర్తిసంపాదించటానికి ప్రయత్నం చేయడం, చాడీలు చెప్పే వాడగుట, హింసను ఆరంభించేవాడగుట, అనవసర అర్థాలు చెప్పడంలాంటి పనులు ఇతరుల ధనాన్ని ఆశించి చేస్తున్నవే. కాని ఇలా సంపాదించినదేదైనా ఎంతకాలం నిలుస్తుంది? (నిలువదని భావం)

3) వైభవంలో ఇంద్రుని మించిన వాడా! నీతిలో బృహస్పతితో సమానమైన వాడా! ఓ సురభిమల్లా! చెవులకు శాస్త్ర పాండిత్యమే అందం కాని, కుండలాలు కావు. చేతులకు దానమే అందం కాని కంకణాలు కావు. శరీరానికి పరోపకారమే ఆభరణం కాని, సుగంధలేపనాలు కావు.

4) భాస్కరా! రాజుకు సరైన ఆలోచన పుట్టనప్పుడు మంత్రులెంత తెలివిగలవారైనా, కార్యాన్ని నెరవేర్చలేరు. కార్యాలోచన లేని దుర్యోధనుని పనులను కార్యదక్షులైన ద్రోణ, భీష్మకృపాచార్యాది మహావీరులు నెఱవేర్చలేక పోయారు కదా!

5) ఓ వేంకటపతీ! బ్రహ్మాండనాథుడా! లక్ష్మీపతీ! ధనం, ధనంపై అభిమానం, ఎల్లప్పుడు ధనం సంపాదించాలనే కోరిక అనే ఈ మూడు దోషాలు ధనికునికి ఉన్నాయి. కాని పేదవానికి ధనం ఉండదు. ధనంపై ఆశ ఉన్నా మంచి వారికి దగ్గరగా ఉండటం వలన అదికూడా నశిస్తుంది. కావున ధనికుని కంటే పేద ధన్యుడు కదా!

6) నాగరాజును మెడలో ధరించిన శ్రీవేములవాడ రాజరాజేశ్వరా! విషాన్ని మింగి దేవతల దుఃఖాన్ని హరించినానని నీలో నీవు మురిసిపోకు. మనుషుల్లో సూదిమొనకు కూడా తావు లేనంతగా విషం నిండిపోయింది. ఆ మనుషుల్లోని భయంకరమైన విషాన్ని ముందు తొలగించు.

7) నింబగిరిలో విలసిల్లే దేవా! శ్రేష్ఠమైన శుభాలతో అలరారే వాడా! అత్యుత్తమ గుణాలకు నిలయమైనవాడా! నరసింహ దేవా! కోడలిని కూతురు మాదిరిగా చూస్తే ఇంట్లో ఘోరాలు కలుగుతాయా? కార్మికులను భాగస్థులను చేస్తే కర్మాగారంలో అల్లర్లు జరుగుతాయా? దళితులను మన సొంత అన్నదమ్ముల్లాగా భావిస్తే ప్రపంచంలో ఉపద్రవాలు పుడుతాయా? ఇతర మతస్థులను తమ వారిగా ప్రేమతో చూస్తే కొట్లాటలు, ఆగడాలు పెరుగుతాయా? అన్ని జీవులను తన వలె ఆదరంగా చూస్తే, భూమి మీద కష్టాలు పుట్టవు కదా!

8) విష్ణువుచే పూజింపబడిన పాదపద్మాలు కలిగిన ఓ చంద్రమౌళీశ్వరా! ఆశ అనే పాశంచే బంధింపబడి చెడిపోకుండా ఎల్లప్పుడు ఓర్పుతో గురువు ఆదేశాలను తలదాల్చి యోగాభ్యాస విధులను ఆచరిస్తూ వారి దివ్యమైన ఆశీర్వాదాన్ని పొందినపుడే శిష్యుడు శ్రేష్ఠమైన శాంతిని పొందగలుగుతాడు.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

# ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

**1. కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

అ) 'సమాజానికి మార్గనిర్దేశనం చేసేవాళ్లు - శతకకవులు' చర్చించండి.

**2. పాఠంలోని పద్యాలలో కింది భావాలకు తగిన పద్య పాదాలను గుర్తించండి.**

అ) సూర్యచంద్రులు గతిదప్పినా

ఆ) మొదటిదైన ధనం పేదకు ఉండదు

ఇ) అన్ని జీవులను తనలాగా ఆదరిస్తే

**3. కింది పద్యాలను పాదభంగం లేకుండా పూరించండి. వాటి భావం రాయండి.**

అ) కులశైలంబులు .................... సర్వేశ్వరా!

ఆ) ధనము, ధనాభిమానము, .................. శ్రియఃపతీ!

**4. కింది పద్యాన్ని చదువండి.**

సీ॥ కోపంబు చే నరుల్ క్రూరాత్ములగుదురు
కోపంబు మనుషుల కొంప ముంచు
కోపంబు వలననె పాపంబులును హెచ్చు
కోపంబుననె నింద గూడ వచ్చు
కోపంబు తన చావు కొంచెంబు నెరుగదు
కోపంబు మిత్రులన్ కొంచెపరుచు
కోపంబు హెచ్చినన్ శాపంబులున్ వచ్చు
కోపంబు జూడగా కొరివి యగును

తే॥ కోపము నరుని సొంతము కూల్చును భువి
లేదు వెదికిన యిటువంటి చేదు ఫలము
వినుడి మాయప్ప శిద్ధప్ప విహితుడప్ప
కనుడి కరమొప్ప కవికుప్ప కనకమప్ప

- ప్రసిద్ధి రామప్పవరకవి (సిద్ధప్ప), కరీంనగర్ జిల్లా.

SCERT TELANGANA

**పద్యం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులను గుర్తించండి.**

అ) కవి చేదు ఫలమని దేనిని అన్నాడు? ( )

ఎ) వేపపండు బి) కోపం సి) పాపం డి) కాకరపండు

ఆ) కోపం ఎక్కువైతే వచ్చే ఫలితం? ( )

ఎ) శాపం బి) పాపం సి) నింద డి) కొరివి

ఇ) కోపంచేత మనుషులు ఎట్లా మారుతారు? ( )

ఎ) పాపాత్ములు బి) దురాత్ములు సి) నీచాత్ములు డి) క్రూరాత్ములు

ఈ) 'సొంతం' అను పదం అర్థమేమిటి? ( )

ఎ) కొంత బి) మొత్తం సి) సగం డి) శూన్యం

ఉ) కోపం ఎవరి కొంప ముంచుతుంది? ( )

ఎ) మనుషుల బి) మంచివారి సి) దుర్మార్గుల డి) నీచుల

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) ధనతృష్ణ ఎప్పుడు నశిస్తుందో తెలుపండి.

ఆ) మనిషికి నిజమైన అందాన్ని ఇచ్చేవి ఏవి?

ఇ) ఆపదలు రాకుండా ఉండాలంటే ఎక్కడ ఎట్లా ప్రవర్తించాలి?

ఈ) "ధనవంతునికంటే కూడా పేదవాడు గొప్పవాడు." దీని గురించి మీ అభిప్రాయం తెలుపండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) 'శతక పద్యాలు సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తాయి – విమర్శిస్తాయి' వివరించండి.

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.**

అ) పాఠంలోని మీకు నచ్చిన పద్య భావాల్ని ఆధారంగా చేసుకొని ఒక కథను రాయండి.

(లేదా)

ఆ) పాఠంలోని పద్యభావాల ఆధారంగా విద్యార్థులలో నీతి, విలువల పట్ల అవగాహన పెంచటానికై ఒక కరపత్రాన్ని తయారు చేయండి.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

## III. భాషాంశాలు

### పదజాలం

1. **కింది పదాలకు అర్థాలు రాస్తూ, సొంత వాక్యాలు రాయండి.**

ఉదా :- ఆపద = కష్టం

ఆపదలు వచ్చినప్పుడు ఓర్పుతో, ఉపాయంతో వ్యవహరించాలి.

అ) నిక్కం =

______________________________

ఆ) ఒజ్జ =

______________________________

ఇ) తృష్ణ =

______________________________

ఈ) విభూషణం =

______________________________

2. **కింది పదాలకు పర్యాయపదాలు రాసి, వాటితో వాక్యాలు రాయండి.**

ఉదా :- కూతురు - పుత్రిక, కుమార్తె

జనకుని పుత్రిక సీతాదేవి. ఈ కుమార్తె వలన జనకుడు పరమానందాన్ని పొందాడు.

అ) తృష్ణ

______________________________

ఆ) సజ్జనుడు

______________________________

ఇ) మహి

______________________________

ఈ) శైలము

______________________________

3. **కింది వాక్యాలను గమనించండి. ఆయా వాక్యాల్లోని ప్రకృతి వికృతుల్ని గుర్తించండి. వాటి కింద గీతగీయండి.**

అ) ప్రతి మనిషి తెలియకుండా దోషం చేయడం తప్పుకాదేమో కాని తెలిసి దోసం చేయడం తప్పు.

ఆ) సింహం వేట ద్వారా ఆహారాన్ని పొందుతుంది. కానీ ఆకలి వేసినప్పుడే సింగం వేటాడుతుంది.

ఇ) ఏ కార్యమైనా శ్రమిస్తేనే పూర్తి చేయగలం. కాని కర్జం నిర్వహించే తీరు తెలియాలి.

ఈ) కలహం ఏర్పడినప్పుడు శాంతం వహిస్తే, కయ్యం నెయ్యంగా మారుతుంది.

SCERT TELANGANA

## వ్యాకరణాంశాలు

**1. కింది పదాలను విడదీయండి. సంధుల పేర్లు గుర్తించి రాయండి.**

అ) కలహోగ్నులు ఆ) వేంకటేశ్వరా

ఇ) కుండలమొప్పు ఈ) యోధులనేకులు

**2. కింది సమాసపదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేర్లు రాయండి.**

అ) కార్యదక్షుడు ఆ) మూడుదోషాలు

ఇ) కర్మశాల ఈ) ఆశాపాశం

**3. కింది పద్యపాదాలు పరిశీలించి, గణవిభజనచేసి, గణాలు గుర్తించి, ఏ పద్యపాదమో రాయండి.**

అ) ధనము, ధనాభిమానము, సదా ధనతృష్ణయు మూడు దోషముల్

ఆ) భూపతికాత్మబుద్ధి మదిఁబుట్టనిచోటఁ బ్రధానులెంత ప్ర

జ్ఞా ...

### సరళాదేశ సంధి :

**✷ కింది పదాలు చదువండి. పదంలోని చివరి అక్షరం కింద గీతలు గీయండి.**

పూచెను, చూసెను, వచ్చెను, తినెను, చేసెన్, నడిచెన్, వెళ్ళెన్.................

పై పదాలను గమనిస్తే, ఆ పదాల చివర ను, న్ లు కనిపిస్తాయి. అంటే పదాల చివర 'న' కారం ఉన్నది.

ఈ 'న' కారాన్ని ద్రుతం అంటారు. ద్రుతం (న) చివరగల పదాలను 'ద్రుత ప్రకృతికాలు' అంటారు. కావున చూచెను, పూచెను, తినెను, చేసెన్, నడిచెన్ మొదలైన పదాలు ద్రుతప్రకృతికాలే.

(మీరు కూడా మరి కొన్ని ద్రుతప్రకృతిక పదాలు రాయండి.)

ఈ కింది వాటిని పరిశీలించండి.

అ) పూచెన్ + కలువలు = పూచెన్ + గలువలు

ఆ) దెసన్ + చూచి = దెసన్ + జూచి

ఇ) చేసెన్ + టక్కు = చేసెన్ + డక్కు

ఈ) పాటిన్ + తప్పు = పాటిన్ + దప్పు

ఉ) వడిన్ + పట్టి = వడిన్ + బట్టి

పై ఉదా॥లు పరిశీలిస్తే,

'న్' కు 'క' పరమైతే 'క', 'గ' గా మారుతుంది.

'న్' కు 'చూ' పరమైతే 'చూ', 'జూ' గా మారుతుంది.

'న్' కు 'ట' పరమైతే 'ట', 'డ' గా మారుతుంది.

'న్' కు 'త' పరమైతే 'త', 'ద' గా మారుతుంది.

'న్' కు 'ప' పరమైతే 'ప', 'బ' గా మారుతుంది.

అంటే
క → గ
చ → జ
ట → డ
త → ద
ప → బ లుగా మారాయి.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

SCERT TELANGANA

క,చ,ట,త,ప లకు వ్యాకరణ పరిభాషలో పరుషాలని పేరు.

గ,జ,డ,ద,బ లకు వ్యాకరణ పరిభాషలో సరళాలని పేరు.

పై ఉదాహరణలలోని భావాన్ని బట్టి సూత్రీకరిస్తే,

ద్రుత ప్రకృతికాలకు పరుషాలు పరమైతే ఆ పరుషాలు సరళాలుగా మారుతాయి.

ఇప్పుడు కింది ఉదాహరణలను పరిశీలించండి.

పూచెన్ + కలువలు = పూచెన్ + గలువలు

⬇

పూచెన్ + గలువలు =
- పూచెఁగలువలు (ద్రుతం అరసున్న(ఁ) గా మారింది)
- పూచెంగలువలు (ద్రుతం సున్న(ం) గా మారింది)
- పూచెన్గలువలు (ద్రుతం మీద హల్లుతో కూడింది)
- పూచెను గలువలు (ద్రుతం మార్పు చెందకుండా వచ్చింది)

పై ఉదాహరణ ఆధారంగా సంధి జరిగిన విధానాన్ని సూత్రీకరిస్తే

**ఆదేశ సరళానికి ముందున్న ద్రుతానికి బిందు సంశ్లేషలు విభాషగా వస్తాయి.**

**4. కింది సంధి పదాలు విడదీసి సరళాదేశ సంధి లక్షణాలను పరిశీలించండి.**

అ) గురువులఁగాంచి

ఆ) ఎక్కువగఁజొప్పడ

ఇ) తలఁదాల్చి

ఈ) చెవికింగుండలంబు

**శార్దూలం**

**✷ కింది రెండు పద్యపాదాలను గణవిభజన చేసి పరిశీలిద్దాం!**

అ)

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| నాశీర్వా | దమునొ | జ్జచేబ | డసితా | నందంగ | నొనంచి | తం |
| మ | స | జ | స | త | త | గ |

ఈ పాఠంలోని "ఆశాపాశ.......చంద్రమౌళీశ్వరా" పద్యాన్ని పరిశీలిస్తే

దీనిలో వరుసగా 'మ,స,జ,స,త,త,గ' గణాలు వచ్చాయి.

పద్యానికి నాలుగు పాదాలున్నాయి.

ప్రతిపాదంలో 'శ' రెండవ అక్షరంగా ఉన్నది. అంటే ప్రాస నియమం కలిగి ఉన్నది.

13వ అక్షరంతో యతి మైత్రి **(ఆ-అం)** చెల్లుతది.

ప్రతి పాదంలో 19 అక్షరాలున్నాయి.

ఈ లక్షణాలుగల పద్యం శార్దూలం.

## మత్తేభం

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| చెవికిం | గుండల | మొప్పుగా | దుశ్రుత | మేచేద | మ్మికిన్గం | కణం |
| స | భ | ర | న | మ | య | వ |

ఈ పాఠంలోని "చెవికింగుండల....నీతివాచస్పతీ"లోని పై పద్యపాదాన్ని పరిశీలిస్తే

దీనిలో వరుసగా 'స,భ,ర,న,మ,య,వ' గణాలు వచ్చాయి.

పద్యానికి నాలుగు పాదాలున్నాయి. ప్రతిపాదంలో 'వ' రెండవ అక్షరంగా ఉండి ప్రాసనియమం కలిగి ఉన్నది.

14వ అక్షరం యతి మైత్రి **(చె - చే)** చెల్లుతుంది.

ప్రతిపాదంలో 20 అక్షరాలున్నాయి.

ఈ లక్షణాలుగల పద్యం మత్తేభం.

అ) ఈ పాఠ్యాంశంలోని ఐదు, ఏడు పద్యాలకు గణవిభజన చేసి అవి ఏ పద్యపాదాలో తెలుపండి.

## ప్రాజెక్టు పని

- **మీ పాఠశాలలోని గ్రంథాలయాన్ని సందర్శించి శతకపద్యాల పుస్తకాలను పరిశీలించి, మీకు నచ్చిన ఏవేని, ఐదు పద్యాలు సేకరించి, వాటికి భావాలు రాయండి. నివేదిక రాసి ప్రదర్శించండి.**

**సూక్తి**

ఒక్కసారి కూడా నువ్వు కార్యాచరణకు పూనుకోకుండా
లక్షలసార్లు ఆలోచించడం వలన ప్రయోజనం ఉండదు.
- గురునానక్

SCERT TELANGANA

## చదువండి – తెలుసుకొండి

### పొడుపు పద్యాలు

పొడుపుకథలంటే అందరం చెవికోసుకుంటాం. అవి మెదడుకు పదునుపెడుతాయి. ప్రశ్నవిన్నప్పుడు ఆలోచనలో పడుతాం. జవాబు తెలిసినప్పుడు ఆనందపడుతాం. 'వేయికళ్ళపులి ఏట్లో వేటాడబోయింది' అన్నప్పుడు ఇదెక్కడి పులి? అనుకుంటాం. కాని, అది పులికాదు 'వల' అని తెలుసుకుంటే ఎంత సంతోషం! 'నాన్నకందవు, అమ్మకందుతాయి' అన్నప్పుడు అవేమిటబ్బా? అనిపిస్తుంది. అవి వస్తువులు కావు 'పెదవులు' అని తెలిస్తే 'అబ్బా!' అనిపిస్తుంది. 'నాన్న' అన్నప్పుడు పెదవులు ఒకదానికొకటి అందవు (తాకవు), 'అమ్మ' అన్నప్పుడు అందుతాయి (తాకుతాయి). ఇట్లా పొడుపుకథలు మెదడుకు మేత. ఇవి పాటల రూపంలో, పద్యాలుగా కూడ ఉంటాయి. ఇటువంటి పద్యాలను చూద్దాం.

**ఆ.వె. కనులు మూడుగలవు – కాదు త్రినేత్రుండు**
**పక్షిగాదు చెట్టుపైన నుండు**
**జలము దాల్చి యుండు నలమేఘుడును గాడు**
**దీని భావమేమి? తిరుమలేశ.**

మూడుకళ్ళుంటాయంట అనగానే 'శివుడు' అనుకుంటాం. కాని కాదంటాడు. చెట్టుపైన ఉంటుంది అనగానే పక్షేమో అనుకుంటాం.కాని కాదట. దాంట్లో నీళ్ళుంటాయి అనగానే 'మేఘమా' అనిపిస్తుంది. కాని అదికాదు అంటున్నాడు. ఈ మూడు లక్షణాలున్నదేమిటి? అని బాగా ఆలోచిస్తే జవాబుగా 'టెంకాయ' దొరికింది. ఇప్పుడు చూడండి అన్ని లక్షణాలు సరిపోతాయి. ఇంకొక పద్యం చూద్దాం.

**సీ. కొమ్ములు కలవని కోపించి పొడువదు**
**కట్టిబంధించిన కదలకుండు**
**ఈనదు పొర్లదు ఎన్నాళ్ళకైనను**
**బంధంబువేసిన పాలొసంగు**
**మేత కాసించదు మేఘంబులోనీళ్ళు**
**కావలెననుచుండు కడుపునిండ**
**దానికడుపునిండ దారిద్ర్యములు బాపు**
**బహుజీవరాసులు బ్రతుకవచ్చు**

**తే.గీ. దీనియర్థంబు తెలియగ దివిరినరులు**
**మది విచారించి పదునైదు మాసములను**
**సమ్మతిగజెప్పు భావజ్ఞ చక్రవర్తి**
**చెప్పలేకున్న నగుదునే చిన్నినవ్వు**

ఈ పద్యం చదువుతుంటే ఇది ఆవో, బర్రెనో అనిపిస్తుంది. కాని కాదు. అది 'చెరువు'. ఇప్పుడు చెప్పినవన్నీ సరిజూసుకోండి. చెరువుకు కొమ్ములు (ర, వ లకు కొమ్ములుంటే రు, వు లు అవుతాయి) ఉంటాయి. కాని పొడువదుకదా! కట్టకట్టిన తర్వాత కదలకుండా ఉంటుంది. అక్కడిక్కడ పొర్లదు. ఈనదు. బంధమేస్తే (మడికట్లు కడితే), దానికి కావలసిన పాలు (వంతు) నీటిని ఇస్తుంది. దానికి ప్రత్యేకంగా మేతవెయ్యాల్సిన పనిలేదు. మేఘం కురిస్తేచాలు నిండుతుంది. అది నిండిందా? ప్రజల దరిద్రంబోతుంది. పంటలు పండడంవల్ల, ప్రజలకేకాదు ప్రాణులన్నిటికీ మేలు జరుగుతుంది. ఈ పద్యంలో చమత్కారమేకాదు, చెరువుల అవసరాన్ని నొక్కిచెప్పే సందేశం కూడా ఉన్నది.

పొడుపుకథలవల్ల ఆలోచనపెరుగుతుంది. భాషపెరుగుతుంది. మనం కూడ కొత్త పొడుపుకథలను తయారుచేసుకోవచ్చు, రుచిచూడవచ్చు.

SCERT TELANGANA

# 6 దీక్షకు సిద్ధంకండి

## చదువండి - ఆలోచించి చెప్పండి.

స్వచ్ఛతకై శ్రమిద్దాం ! స్వచ్ఛతలో చరిద్దాం !!

**స్వచ్ఛ భారత్‌కు సన్నద్ధం కండి !**

ప్రియమైన విద్యార్థులూ..!

దేశవ్యాప్తంగా ఇటీవల మనం స్వచ్ఛభారత్ పేరుతో ఒక అద్భుతమైన కార్యక్రమం చేపట్టిన విషయం మీకు తెల్సిందే!

ప్రజల బాధ్యతారాహిత్యం వల్ల దేశవ్యాప్తంగా పేరుకుపోతున్న అపరిశుభ్రతను అనతికాలంలోనే తొలగించాలన్నది ఒక దీక్షలాగ చేపట్టాం. నిరంతరం కొనసాగవలసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు కూడ భాగస్వాములే! మీ మీ పరిసరాల్లో పోగుపడ్డ చెత్తాచెదారాన్ని తొలగించుకొంటూ, వ్యక్తిగత శుభ్రతతో సామాజిక పరిశుభ్రతను గురించి పదిమందికి అవగాహన కల్పిస్తూ స్వచ్ఛభారత్ సాకారమయ్యేదిశగా అడుగులు వేస్తారని ఆశిస్తున్నాం!

రానున్న రోజులలో భారతావని పరిశుభ్ర భారతంగా పరిఢవిల్లాలని కోరుకుందాం.

వైద్య, ఆరోగ్యశాఖ,
తెలంగాణ రాష్ట్రం.

**ప్రశ్నలు:**

1. ఇటువంటి పత్రాలు ఎక్కడైనా చూశారా?
2. ఇట్లా పంచిపెట్టే పత్రాలను ఏమంటారు?
3. వీటిని ఎందుకు పంచిపెడుతారు?

## పాఠం నేపథ్యం, ఉద్దేశం

తెలంగాణ ఉద్యమం ఈనాటిది కాదు. ఎంతోమంది అమరుల త్యాగాలకు చిహ్నంగా సాధించుకున్నదే ఈ తెలంగాణ రాష్ట్రం. ఇది ఉద్యమాల ఫలితంగానే సాకారమైంది. నిన్నటి ఉద్యమానికి ముందే 1969లో 'తెలంగాణ ప్రజాసమితి' పేరుతోటి ప్రత్యేకరాష్ట్ర సాధన పోరాటం మొదలైంది.

ఆనాటి ఉద్యమ తీరుతెన్నులను తెలుపడం, కరపత్రం యొక్క స్వరూప స్వభావాలను పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

## పాఠ్యభాగ వివరాలు

*ఈ పాఠం కరపత్రం అనే ప్రక్రియకు చెందినది. ఒకవ్యక్తి గాని, సంస్థగాని ప్రజలకు అందించాలనుకునే సమాచారాన్ని వీలైనంత సంక్షిప్తంగా ముద్రితరూపంలో అందించేందుకు వినియోగించే పత్రం కరపత్రం. దీన్ని ఆంగ్లంలో Pamphlet అంటారు.*

*'తెలంగాణ హిస్టరీ సొసైటీ' తరఫున 2009లో వెలువడ్డ పుస్తకం "1969 ఉద్యమం-చారిత్రక పత్రాలు". 1969 నాటి తెలంగాణ ఉద్యమస్థితిగతులను వెలుగులోకి తెచ్చే కరపత్రాలు ఇందులో ముద్రితమయినాయి. ఆ పుస్తకం నుండి తీసుకున్న ఒక కరపత్రమే ఈ పాఠం.*

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులలో చూసి తెలుసుకోండి.

## ప్రవేశిక

**దీర్ఘకాలంగా శాంతియుత ఉద్యమాలు నిర్వహిస్తున్నప్పుడు ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించినా అణచివేతకు దిగినా ఉద్యమాలు హింసాయుతంగా మారే అవకాశం ఉన్నది. ముందుగానే అటువంటి పరిణామాన్ని ఊహించిన ఉద్యమనాయకత్వం పాలకులను ఎండగడుతూ గాంధీ సిద్ధాంతాల కనుగుణంగా ఉద్యమించాలని పిలుపునిచ్చింది. ఇందుకనుగుణంగా రూపొందించిన 1969 నాటి కరపత్రంలో వివరాలు ఏమున్నాయో తెలుసుకుందాం.**

SCERT TELANGANA

## I

## దీక్షకు సిద్ధంకండి!

అక్టోబర్ 2న సామూహిక ఉపవాస దీక్షలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ధ్యేయాన్ని చాటి చెప్పడానికి, మహాత్ముని ఆశయాలపట్ల మన ప్రగాఢ విశ్వాసాన్ని తెలుపడానికి తెలంగాణ ప్రజాసమితి ఆదేశాలను అందజేసింది. గత 9 నెలల నుండి శాంతియుత పద్ధతిలో బ్రహ్మాండమయిన ప్రజా ఉద్యమము కొనసాగుతున్నా అర్థం చేసుకోలేని సుబేదారుల రాజ్యంలో ఇంకా ఈ నిరసన పత్రాలకు అర్థం ఏమిటని కొన్ని యువశక్తులు ఆలోచించడంలో అర్థం లేకపోలేదు.

బాపూజీ పేరున బ్రతుకుతున్న ఈ బడామనుషులంతా భక్తిని వదిలేసి భుక్తి మార్గం వెతుకుతున్నారు. తెల్లరంగు ఛాయలో తమ మలిన హృదయాలను మరుగు పరుస్తున్నారు. జాతిపిత ప్రబోధాలకు తిలోదకాలిస్తున్నారు. ఆయన అహర్నిశల ఆరాటము తీరని ఆవేదనగానే మిగిలిపోయినది. ఒకచోట మతకల్లోలము, వేరొకచోట హత్యలు, మరొకచోట కాల్పులు ఇదీ మన బ్రతుకు. దేశంలోని ప్రతి అంగుళం రక్తంతోనో లేక కన్నీటితోనో తడిసిపోయింది. ఇందుకు మంచి ఉదాహరణ మన తెలంగాణ. ఆంధ్రపాలకుల హయాంలో తెలంగాణ వెనుకబడింది. ఆంధ్రప్రభుత్వ ఉక్కుపాదాల కింద తెలంగాణ ప్రజలు నలిగిపోయినారు. స్వేచ్ఛ కరువైంది. తమ బానిస బంధాలను త్రెంచుకొని ఆత్మగౌరవం కాపాడుకోవడానికి తెలంగాణ జనత ధర్మయుద్ధం సాగిస్తున్నది. ఈ ప్రజాపోరాటంలో వందలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయినారు. వేలాది యువకులు అంగవిహీనులయినారు. లక్షలాది ప్రజలు సత్యాగ్రహసమరంలో పోరాడి కారాగారంలో బంధింపబడినారు. అయినా బ్రహ్మరాక్షసుల పాలనలో సత్యాగ్రహాలకు, పికెటింగులకు, ధర్నాలకు విలువలేకుండా పోతున్నది. తన ఉపవాసదీక్షతో ఉత్కృష్ట లక్ష్యాన్ని సాధించిన గాంధీ కలల దేశంలో రాబందుల రాచరికం నడుస్తున్నది.

మన యీ శాంతియుత విప్లవాన్ని అంచనావేయడంలో పొరబాటు జరుగుతున్నది. ప్రశాంత గంభీర జలధిలోని ప్రళయాల పరిశీలన జరగడం లేదు. ప్రజాభిప్రాయానికి మన్నన జరగడంలేదు.



రోజురోజుకు దారుణ హింసాకాండ, రక్తపాతం తెలంగాణ ప్రజలను కోపోద్రిక్తులను చేస్తున్నది. యువతరం ఆవేశం కట్టలు తెంచుకొంటున్నది. అహింసా సిద్ధాంతం పట్ల ఆత్మవిశ్వాసం సడలిపోయే ప్రమాదం వున్నది. ఏ ఎండకాగొడుగు

SCERT TELANGANA

పట్టే శాసన సభ్యులపైన కోపం పేరుకుంటున్నది. యువత, విద్యార్థుల గుండెల్లో ఆరని అగ్నిజ్వాలలు మండుతున్న సంగతిని గురించి పదేపదే హెచ్చరిస్తున్నా ముఠారాజకీయాల కుళ్లులో కేరింతలాడుతున్న యీ స్వార్థపరులకు అర్థం కావడం లేదు.

అందుకే యీ అహింసా విధానం పట్ల యువశక్తులు అంత ఉత్సాహం ప్రదర్శించడం లేదు. నీతికి, న్యాయానికి, ధ్యేయానికి ప్రాణాలర్పించడానికి సిద్ధమయిన సమయంలో శాంతి సందేశాలు, నీతివాక్యాలు వారి హృదయాలను కలచివేస్తున్నమాట వాస్తవమే. కాని గాంధీ శతజయంతి సంవత్సరంలో వారి విధానాలు ఆచరణలో చూపించి నిజమయిన భారతీయులమని రుజువు చేయాలి. సత్యాహింసల ద్వారా పరప్రభుత్వాన్ని పారద్రోలిన మనం ప్రజాస్వామిక పద్ధతుల ద్వారా కాసు రాకాసి ప్రభుత్వాన్ని కూలద్రోసి ప్రత్యేక తెలంగాణ సాధించుకోవాలి. అప్పుడే గాంధీజీ కన్న కలలు ఫలించి తీరుతాయి.

ఇంత కాలం నుండి జరుగుతున్న తెలంగాణ ప్రజా ఉద్యమాన్ని ఇకనైనా అర్థం చేసుకొని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి ఒప్పుకొనకుంటే అక్టోబర్ 10 నుండి నిరాహారదీక్ష ప్రారంభించనున్నట్లు విద్యార్థి నాయకుడు ప్రకటించినాడు. ఈ తీవ్ర పరిస్థితిని కేంద్రం వెంటనే గుర్తించాలి. ప్రత్యేక తెలంగాణా సమ్మతిని గాంధీజీ శతజయంతి పేరున చూపించాలి. అదే వారి జన్మదినానికి తగిన కానుక. అందువల్లనే గాంధీజీ నమ్మిన సత్యాగ్రహాలు, నిరాహారదీక్షల కార్యక్రమం ప్రజాసమితి చేపట్టడం జరిగింది. అక్టోబర్ 2న మూకుమ్మడి ఉపవాస దీక్షల ద్వారా వారు నమ్మిన సిద్ధాంతానికి పుష్టిని చేకూర్చండి. జాతిపితకు తెలంగాణా ప్రజలు భక్తి ప్రపత్తులతో సమర్పించే కానుకే మన సామూహిక ఉపవాసదీక్ష.

అక్టోబర్ 2న ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు, ఇదివరకు జరిపిన కేంద్రాలలో ప్రజలంతా చేరి ఉపవాసదీక్షల కార్యక్రమాన్ని దిగ్విజయం చేయండి. మన ఆకలి మంటల జ్వాలలో గాంధీ సిద్ధాంతాలు వెలుగులు విరజిమ్మాలి. న్యాయం చేకూరాలి. ధర్మం వర్ధిల్లాలి. సత్యమేవ జయతే.

తెలంగాణ ప్రజాసమితి,
విద్యార్థి కార్యాచరణ సమితి.

వరంగల్,
30.09.1969.



SCERT TELANGANA



# ఇవి చేయండి



## I. అవగాహన - ప్రతిస్పందన

1. **కరపత్రాలను ఎందుకు రూపొందిస్తారు? మీరు చదివిన కరపత్రం గురించి మాట్లాడండి.**

2. **ప్రజా ఉద్యమాలను శాంతియుతంగానే నిర్వహించవలసిన అవసరం ఏమిటి? చర్చించండి.**

3. **పాఠం చదువండి. అప్పటి ప్రభుత్వ పాలనను గురించి విమర్శిస్తూ వాడిన కీలక పదాలు వెతికి రాయండి. వాటిని వివరించండి.**

| కీలకపదాలు | వివరణ |
|---|---|
| | |
| | |
| | |
| | |
| | |

4. **కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఆంగ్లేయుల రాకకు ముందు మన భారతదేశంలో కరపత్రాలు లేవు. ఆధునిక కాలంలో ప్రతిరోజు మనం కనీసం ఒక కరపత్రమైనా చూస్తున్నాం.

ఒక సమాచారాన్ని లేదా ప్రత్యేక అంశాలను అందరికీ తెల్పడమే కరపత్రం ప్రధాన ఉద్దేశం. కరపత్రంలో సాధారణంగా వాడుకభాష ఉంటుంది. కరపత్రాలు వేసినవాళ్ళు, రాసినవాళ్ళ పేర్లుగాని, ముద్రణాలయం పేరుగాని కరపత్రాల్లో ఉండాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక ప్రయోజనాలున్న అంశాలను సామాన్య ప్రజానీకానికి చేరవేయడానికి కరపత్రం ఒక ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడుతుంది. కరపత్రం మనిషి భావస్వేచ్ఛకు సంకేతం.

**ప్రశ్నలు :**

అ) పై పేరాకు శీర్షిక నిర్ణయించండి.

ఆ) కరపత్రాలు మన దేశంలో ఎప్పటినుండి ఉన్నాయి?

ఇ) కరపత్రాలు ఎందుకు?

SCERT TELANGANA

ఈ) కరపత్రాలు ఎట్లా ఉండాలి?

ఉ) పై గద్యం ప్రకారం ఎక్కువగా వేటికి చెందిన కరపత్రాలు చూస్తున్నాం?

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) 1969 తెలంగాణా ఉద్యమకాలం నాటి పాలన ఎట్లా ఉందని భావిస్తున్నారు?

ఆ) అప్పటి తెలంగాణ పోరాటంలో ప్రజలు కోపోద్రిక్తులు కావడానికి కారణాలు రాయండి.

ఇ) గాంధీజీ సిద్ధాంతాలకు అనుగుణంగా తెలంగాణ సాధించాలనడంలో ఆంతర్యం ఏమిటి?

ఈ) ప్రజాఉద్యమాలు హింసాత్మకంగా మారకుండా ఉండడానికి ఉద్యమనాయకత్వం ఏం చేయాలి?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) 1969 నాటి తెలంగాణ ఉద్యమం ద్వారా రాష్ట్రం సాధించకపోవడానికి, నేటి ఉద్యమం విజయవంతం కావడానికి కారణాలు విశ్లేషించండి.

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.**

అ) తెలంగాణ ప్రజల జీవనానికి, గ్రామాల అభివృద్ధికి తోడ్పడేవి "చెరువులు". ఈ చెరువుల ప్రాధాన్యత వివరిస్తూ, వీటిని కాపాడడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చే కరపత్రం తయారు చేయండి. చదివి వినిపించండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాల్లోని గీత గీసిన పదాలకు అర్థాలు రాస్తూ, సొంతవాక్యాల్లో ప్రయోగించండి.**

అ) ఆయన <u>అహర్నిశల</u> ఆరాటము తీరని ఆవేదనగానే మిగిలిపోయినది.

________________________________________

ఆ) గాంధీ అహింసా మార్గంలో <u>లక్ష్యాన్ని</u> సాధించాడు.

________________________________________

ఇ) తెలంగాణ <u>జనత</u> ధర్మయుద్ధం సాగిస్తున్నది.

________________________________________

SCERT TELANGANA

**2. ఇచ్చిన వివరణలకు సరిపడే జాతీయాలను బ్రాకెట్లో ఇవ్వబడిన వాటినుండి ఏరి వాటి కెదురుగా ఉన్న గళ్ళలో రాయండి.**

| | |
|---|---|
| అ. ఆశలు వదులు కొనటం | |
| ఆ. బలవంతంగా అణచివేయటం | |
| ఇ. మితిమీరిపోవటం | |
| ఈ. అవకాశవాదం | |

(కట్టలు తెంచుకోవడం, ఏ ఎండకాగొడుగు, ఉక్కుపాదంమోపడం, తిలోదకాలు ఇవ్వడం)

## వ్యాకరణాంశాలు

**1. కింది వాక్యాల్లో సంధి పదాలను గుర్తించి, ఆ పదాలను విడదీసి సంధిపేర్లు పేర్కొనండి.**

అ) కోపోద్రిక్తులైన కార్యకర్తలను హింసకు తెగబడకుండా కట్టడిచేశారు.

______________ + ______________ = ______________

ఆ) నమ్మిన సిద్ధాంతం కోసం గొప్పవారు ప్రాణాలర్పించడం చూస్తనే ఉన్నాం.

______________ + ______________ = ______________

ఇ) సత్యాహింసలు పాటించడం ద్వారా సమాజ శాంతికి బాటలు వేయవచ్చు.

______________ + ______________ = ______________

**2. సమాస పదాలకు చెందిన కింది పట్టికను పూరించండి.**

| సమాసం పదం | విగ్రహవాక్యం | సమాసం పేరు |
|---|---|---|
| | భక్తియు, ప్రపత్తియు | |
| ధర్మయుద్ధం | | |
| | రక్తం యొక్క పాతం | |
| శాంతి సందేశం | | |
| నాలుగెకరాలు | | ద్విగు సమాసం |

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

**3. కింది సామాన్య వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చి రాయండి.**

అ) వేలాది యువకులు ఉద్యమంలో పాల్గొన్నారు.

వేలాది యువకులు కారాగారాలకు వెళ్లారు.

---

ఆ) గాంధీ విధానాలను ఆచరించాలి.

గాంధీ విధానాల ద్వారా మంచిని సాధించాలి.

---

## ప్రాజెక్టు పని

- మీ ప్రాంతంలో వివిధ రకాల కరపత్రాలు సేకరించి వాటి వివరాలు కింది పట్టిక రూపంలో నమోదు చేయండి. నివేదిక రాయండి.

| క్ర.సం | కరపత్రం శీర్షిక | ప్రచురణ తేది | ప్రచురణ కర్తలు/ ప్రచురణ సంస్థ | కరపత్రంలో విషయం - (సంక్షిప్తంగా) |
|---|---|---|---|---|
| | | | | |

**సూక్తి**

ఉద్యమాల ప్రస్థానంలో ఉద్రేకాలు, ఉద్వేగాలకన్నా శాంతి, సహనాలే సరైన ఆయుధాలు.

SCERT TELANGANA

# 7 చెలిమి

– పొన్నికంటి తెలగన

## చదువండి - ఆలోచించి చెప్పండి.

పాలకులు, పండితులు, శిష్టులు నిత్యజీవితంలో విరివిగా సంస్కృతం ఉపయోగించడం చేత తెలుగు కావ్యభాషలో మూడువంతులు సంస్కృత పదాల ఆధిక్యత కనిపిస్తుంది. శ్రీనాథుని కాలం నాటికి సుదీర్ఘ సంస్కృత సమాసాలే పద్యాలన్నిటిలో నిండిపోయాయి. తెలుగు మాటలు కనిపించకుండాపోయే స్థితి ఏర్పడ్డది. సంస్కృతాన్ని ఉపయోగించి ఎంతగొప్పగా పద్యరచన చేసినా కవులు తమ కావ్యాల్లో ఒక్కటైనా అచ్చతెనుగు పద్యాన్ని రాసేవాళ్ళు. ఆ ఒక్క పద్యానికే లోకులు ఆనందంతో పొంగిపోయేవాళ్ళు. ఒక కావ్యాన్ని అంతా, అచ్చంగా తెనుగు పద్యాలతో రచించిన విశిష్ట కవి పొన్నికంటి తెలగన.

## ప్రశ్నలు:

1. సంస్కృత పదాలు కావ్యభాషలో ఎక్కువగా ఎందుకు ఉండేవి?
2. తెనుగు పద్యాన్ని ప్రజలెందుకు మెచ్చుకునేవాళ్ళు?
3. పద్యాల్లో సుదీర్ఘ సంస్కృత సమాసాలు ఉండటం వలన లాభమా? నష్టమా? ఎందుకు?
4. అచ్చతెనుగు పద్యాలతో కావ్యం రచించిన తెలంగాణా కవి ఎవరని మీరనుకుంటున్నారు?

## పాఠం నేపథ్యం

ప్రతిష్ఠానపురానికి రాజు యయాతి. అతడు ఒకసారి వేటకు వెళ్ళినపుడు దారితప్పి, జాబాలి అనే ఋషి ఆశ్రమం చేరుకుంటాడు. జాబాలి అతనికి రామాయణ కథ సంక్షిప్తంగా చెప్పి, ఒంటరిగా అడవిలో తిరుగరాదని ఉపదేశించి పంపిస్తాడు. తిరిగి వెళ్తున్న యయాతి దప్పికగొని ఒక నూతి దగ్గరకు పోయాడు. ఆ నూతిలోనున్న ఒక స్త్రీ తనను రక్షించుమని ఏడుస్తుంటే అతడు కాపాడుతాడు. అప్పుడు అక్కడికి చేరిన ఆమె చెలికత్తె రాజుతో వివరించిన సంగతులే ఈ పాఠం.

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం కావ్య ప్రక్రియకు చెందినది. సంస్కృత పదాలను ఉపయోగించకుండా అచ్చమైన తెలుగు మాటలతో రాసిన కావ్యం. ఇది అచ్చతెనుగు కావ్యం. తెలుగు సాహిత్యచరిత్రలో తొలి అచ్చతెనుగు కావ్యం 'యయాతి చరిత్ర', దీన్ని రచించిన కవి పొన్నికంటి తెలగన.

ఈ పాఠం 'యయాతి చరిత్ర'లోని తృతీయాశ్వాసం లోనిది.

## కవి పరిచయం


(ఊహాచిత్రం)
16వ శతాబ్దం

అచ్చతెనుగులో నియమబద్ధమైన కావ్యరచనకు పూనుకున్న పొన్నికంటి తెలగనామాత్యుడు అచ్చతెనుగు ఆదికవిగా సుప్రసిద్ధుడు. గోలకొండ పరిసరాలలో పొట్ల చెరువు (సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరువు) తెలగన నివాస గ్రామం. తండ్రి పేరు భావనామాత్యుడు. అచ్చతెనుగు కావ్యరచనకు స్వయంగా తానే నియమాలనేర్పరచి తదనంతర కవులకు మార్గదర్శకుడయ్యాడు. 'యయాతి చరిత్ర' కావ్యం అచ్చతెనుగు కావ్యాల్లో మొదటిదేగాక, అత్యుత్తమమైంది. దీన్ని ఒక మహ్మదీయ సరదారుకు అంకితమీయడం కూడా ఒక ప్రత్యేకమైన అంశమే.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA



## ప్రవేశిక

సృష్టిలో తీయనిది స్నేహం. తల్లిదండ్రులకు చెప్పుకోలేనివి, తోబుట్టువుతో పంచుకోలేనివి కూడా స్నేహితులతో చెప్పుకుంటారు. 'మన తప్పులను ఎత్తిచూపడం, మంచిని ప్రశంసించడం, అవసరమైనప్పుడు సహాయం చేయడం, ఆపదల్లో విడువకుండా ఉండడం, రహస్యాలను దాచుకోవడం' అనేవి మిత్రుని లక్షణాలు. ఎంతో కలిసిమెలిసి ఉండే స్నేహితులు ఒక్కొక్కసారి హఠాత్తుగా శత్రువులుగా మారిపోతుంటారు. అట్లా మారటానికి కారణాలేవి? అవి విశ్లేషించుకునేందుకు ఈ పాఠం చదువుదాం.........



## I

చ. కనుఁగొని నెమ్మది న్నెగులు గ్రమ్మఁగ రక్కసియొజ్జయంచుఁ బే
ర్కొనఁ దగునట్టి శుక్రునకుఁ గూరిమి కూఁతురు దేవయాని నాఁ
దనరిన యిన్నెలంత నొక తప్పునకై వృషపర్వుపట్టి నూ
తను బడఁద్రోచి పోయెనని దాని తెఱం గది విన్నవించినన్. 1

తే. 'అతివ, వృషపర్వుఁడన నెవ్వఁ? డతని యనుఁగుఁ
గూఁతుపేరేమి? తనుఁబట్టినూతఁద్రోయు
నంతపని యేమి చేసె నీయలరుఁబోఁడి?'
యనుడు నవ్వాలుగంటి యయాతిఁ జూచి 2

క. విను వృషపర్వుఁ డనంగాఁ
దనరున్ రక్కసులఱేఁడు తన కనిలోనం
బెనఁగఁదగు మార్తు నెందుం
గని యెఱుఁగక జగము లేలుఁగడ లేని సిరిన్ 3

తే. అతని కూఁతురు శర్మిష్ఠ యనఁగ నొప్పుఁ
గూర్మి సకియలు వేగురు గొల్వనెపుడు
నా చెలియఁగూడి యీ కొమ్మయాడుకొనుచు
నరమరలు లేని చెలుముల ననఁగి పెనఁగి. 4

### ఆలోచించండి-చెప్పండి

- వృషపర్వుడు గర్వంతో ఉండడానికి కారణాలు చెప్పండి.
- అరమరికలు లేని స్నేహం అంటే, ఎట్లా ఉంటుందో చెప్పండి.

SCERT TELANGANA

## II

వ. తిరుగుచు నొక్కనాడు నీరాట సల్పునట్టియెడ. 5

క. సురకరువలి చనుదెంచిన
దరిఁబెట్టినకోక లెల్లఁదడఁబడి పోఁగా
నరిగి యవి దెచ్చి చెలు ల
బ్బుర మగు తమ చీర లెల్లఁ బూనిన, నందున్ 6

క. లలి నీ నెలఁతయుఁ దానును
వలువలు వీడ్వడఁగ దాల్చి, వైళమె చెలువల్
దలఁపింప నెఱిఁగి కినుకం
గులుకుచు రక్కసుల ఱేని కూఁతురు తెగువన్. 7

✿ ఉ. 'నెట్టన రేయినిం బగలు నేరమి వెట్టునటంచు వేలుపు
ల్వెట్టియుఁ గొల్చుముల్చులుప వ్రీలని చేబలు వొప్పు సోఁకుడుం
బట్టము గట్టుకొన్న వృషపర్వుని కూఁతుర, నట్టి నేను నీ
కట్టిన మైలఁ గట్టుదునె కావరమేటికి వచ్చెనీ' కనన్. 8

**ఆలోచించండి -చెప్పండి**

- సురకరువలి (సుడిగాలి) మీరెప్పుడైనా చూశారా? అది వచ్చినప్పుడు ఏం జరుగుతుంది?
- శర్మిష్ఠ గర్వంతో మాట్లాడడానికి గల కారణాలు ఏమై ఉంటాయి?



SCERT TELANGANA

## III

వ. విని యయ్యెలనాఁగకు దేవయాని యిట్లనియె. 9

క. 'ఉసు రొక్కటియై బొందులు
వెస రెండుగ నుండి, వల్వవీడ్వడుటకుఁ గాఁ
గస రెద, విది తగ వగునా?
పసిబిడ్డవె? వాయి తెఱచి పల్కెదవు చెలీ! 10

**ఆలోచించండి -చెప్పండి**

- "ఉసురొక్కటియై బొందులు వెసరెండుగనుండు" అంటే అర్థమేమి? ఈ మాటలు దేవయాని ఎందుకన్నది?

క. అనవుడు నుడుగకఁ మిక్కిలి
కినుకం గేరడము లాడ గేలిగఁ గొనుచు
న్విని విని వేసరి యోర్వక
యెనసిన వగతోడఁ గూడ నీ పడుచనియెన్ 11

మత్తకోకిల. 'ఓలి రక్కసి వంగడంబున కొజ్జకూరిమి కూఁతుర
న్నేలవేలుపుఁగన్నియం దగనీవు గట్టినపుట్టముం
దాలుపందగునమ్మ నా' కని దాని కర్మిలిఁ బల్కఁ దా
నాలకింపక నూతఁద్రోచి గయాళి యై చనియెన్వడిన్. 12

వ. అని యక్కలికి తెఱం గెఱింగించిన విని కటకటంబడుచు మగిడి పొగడందగు తేజినెక్కి మక్కువతో యయాతి తన
ప్రోలికిం జనియె. 13

**తాత్పర్యాలు**

1) రాజును (యయాతి) చూసి మనసునిండా బాధ అలముకొనగా "రాక్షసులకు గురువైన శుక్రుని కూతురైన దేవయాని ఈమె. ఒక పొరపాటు కారణంగా వృషపర్వుని కూతురు ఈమెను ఈ బావిలో త్రోసి పోయింది". అని (దేవయాని చెలికత్తె అయిన ఘూర్ణిక) విన్నవించింది.

2) అప్పుడు ఆ స్త్రీ (ఘూర్ణిక)తో "వృషపర్వుడు అంటే ఎవరు? అతని కూతురు పేరేమి? బావిలో తోసేటంత తప్పు పని ఈమె ఏమి చేసింది" అని యయాతి అడుగగా దానికి ఆ ఘూర్ణిక అతణ్ణి చూసి

3) వృషపర్వుడనే రాక్షసరాజు యుద్ధంలో తనకు ఎదురునిల్వగల శత్రువులు లేరని గర్వంతో రాజ్యమేలుతున్నాడు.

4) అతని కూతురే శర్మిష్ఠ; ఆమెకు వేయిమంది చెలికత్తెలు ఎప్పుడూ సేవలు చేస్తూంటారు. ఆమె స్నేహితురాలే ఈ దేవయాని. వాళ్ళిద్దరు అరమరికలు లేని స్నేహంతో మెలుగుతుండేవాళ్లు.

5) వీళ్ళు ఒకరోజు నీళ్ళలో ఆటాడుకుంటుండగా

6) సుడిగాలి వచ్చి గట్టుమీద ఉన్న వీళ్ళ చీరలను చెల్లాచెదరు చేసింది. దాంతో వీళ్ళు ఆశ్చర్యపడి వారి బట్టలు తెచ్చుకొని ధరించారు.

7) ఆ క్రమంలో వీళ్ళిద్దరు ఒకరి వస్త్రాలను మరొకరు ధరించారు. అది గమనించిన శర్మిష్ఠ కోపంతో ఇట్లా అన్నది.

8) "దేవతలందరు ఎక్కడ తమను తప్పుబడతారోనని పగలు రేయి (ఎల్లప్పుడు) తప్పకుండా వెట్టిని, ఊడిగాన్ని చేస్తూండగా, తిరుగులేని భుజబలంతో ఒప్పెడి రాక్షస పీఠాన్ని ఎక్కిన (రాక్షసరాజైన) వృషపర్వుని కుమార్తెనైన నేను, నీవు కట్టిన మైల వస్త్రాన్ని కట్టుకుంటానా? నీకు ఇంత పొగరా?" అని శర్మిష్ఠ అనగా

9) అది విని శర్మిష్ఠతో దేవయాని ఇట్లా అన్నది.

10) "ఓ సఖీ! మన శరీరాలు వేరైనా ప్రాణం ఒక్కటిగా కలిసిమెలిసి ఉన్నాము. వస్త్రాలు మారినంత మాత్రాన కసురుకుంటావా? ఇది నీకు తగినదా? పసిదానవా? నోరు చేసుకుంటావా?" (అన్నది)

11) అన్నప్పుడు ఊరుకొనక మిక్కిలి కోపంతో వంకర మాటలాడుతూ వెక్కిరిస్తున్న శర్మిష్ఠ మాటలు విని, విని విసుగెత్తి, భరించలేక అధికమైన బాధతో దేవయాని ఇట్లా అన్నది.

12) "రాక్షస జాతికి గురువైన శుక్రాచార్యుని కూతురును. బ్రాహ్మణుని పుత్రికను కాబట్టి, నీవు కట్టిన వస్త్రాలు నేను ధరించడం తప్పుకాదు" అని ప్రేమతో పలుకగా శర్మిష్ఠ దాన్ని వినిపించుకోక గయ్యాళియై ఈ నూతిలో తోసి వేగంగా వెళ్ళింది.

13) అని దేవయాని చెలికత్తె అయిన ఘూర్ణిక ఆ సంగతినంతా చెప్పగా విని, జాలిపడుతూ, వెనుకకు తిరిగి శ్రేష్ఠమైన గుర్రాన్ని ఎక్కి యయాతి తన పట్టణానికి పోయాడు.



## ఇవి చేయండి



### I. అవగాహన - ప్రతిస్పందన

1. ఒకరివస్తువులు మరొకరు వాడుకుంటే కీడు తలపెట్టడం సరైనదేనా? చర్చించండి.
2. స్నేహితులంటే ఎట్లా ఉండాలో మీ అభిప్రాయం చెప్పండి.
3. పాఠం ఆధారంగా శర్మిష్ఠ, దేవయానిల స్వభావాలు ఎట్లా ఉన్నాయో కింది పట్టికలో రాయండి.

| శర్మిష్ఠ | దేవయాని |
|---|---|
| | |

SCERT TELANGANA

**4. కింది పేరా చదువండి - జవాబులివ్వండి.**

2014 జూన్ 8న హిమాచల్‌ప్రదేశ్‌లోని మండిజిల్లాలోని బియాస్ నది అందాలు వీక్షించడంలో లీనమైపోయారు 48 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు. ముగ్గురు అధ్యాపకులతో కలిసి తెలంగాణ రాష్ట్రం నుండి విజ్ఞానయాత్రకు బయలుదేరారు. ఆ విద్యార్థులు, సన్నసన్నగా ప్రవహిస్తున్న బియాస్ నదిలో మధ్య బండరాళ్ళ మీద, మోకాలిలోతుదాకా వెళ్ళి, ఆ నది అందాలను ఆనాటి సాయంత్రం సుమారు ఆరుగంటల ముప్పై నిమిషాలవేళ తమ కెమెరాల్లో బంధిస్తున్నారు. పైనున్న రిజర్వాయరు గేట్లు ఎత్తిన సంగతి గురించి పరిసరాల్లో ఉన్న హెచ్చరికలను వీళ్ళు గమనించలేదు. నదిలో హఠాత్తుగా నీటిమట్టం పెరగడం గమనించిన కొందరు ప్రమాదాన్ని శంకించి బయట పడటానికి ప్రయత్నం చేసారు. కొంతమంది ప్రాణాలు కాపాడుకోగలిగారు. మరికొందరు ఇతరులను కాపాడటానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో కొందరు విజయం సాధిస్తే ఒకరిద్దరు ప్రాణాలనే పణంగా అర్పించారు. మొత్తంమీద సగం మంది విద్యార్థుల నిండుప్రాణాలు అందరూ చూస్తూండగానే ఆ నీటి ఉద్ధృతికి గాల్లో కలిసిపోయాయి. ప్రపంచ మానవాళి హృదయాలను కలచివేసిన సంఘటన ఇది.

ఇటువంటి సంఘటనలు తరచూ మనం వింటున్నాం, చూస్తున్నాం. ఆకతాయితనంతో ఈత రానివాళ్ళను నీళ్ళల్లోకి తోసివేయడం, ఈత రాకున్నా మిత్రులను చూసి ఉత్సాహంతో నీళ్ళలో దూకి ప్రమాదాలు కొని తెచ్చుకోవడం, నీటిలోతును తప్పుగా అంచనావేసి, ప్రాణాలు పోగొట్టుకోవడం.... తీర్థయాత్రల్లో, పికినిక్‌లలో, విహారయాత్రల్లో, ఈతకొలనుల్లో చెరువుల్లో దిగుడుబావుల్లో ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయి.

ఆరోగ్యం కోసం, శరీర దారుఢ్యం కోసం జిమ్‌లకు వెళ్ళడానికి, కరాటే, కుంగ్‌ఫూ లాంటి రక్షణ విద్యలు నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లే - 'ఈతనేర్చుకోవడం' అనేది కూడా చాలా ముఖ్యమైన అంశం. ఇది ఆత్మరక్షణకే గాక, నీటి ప్రమాదాల నివారణకూ దోహదపడుతుంది.

**ప్రశ్నలు :**

అ) సాధారణంగా నీటి ప్రమాదాలు ఎట్లాంటి సందర్భాల్లో జరుగుతాయి?

ఆ) నీళ్ళవద్ద ఆకతాయితనం ప్రదర్శించడం మంచిదేనా? ఎందుకో తెలుపండి.

ఇ) ఈత నేర్చుకోవడం వల్ల ఏయే ప్రయోజనాలుంటాయి?

ఈ) బియాస్ నది ప్రమాదానికి కారణమేమిటి?

**5. కింది గద్యాన్ని చదువండి.**

భీమకవి జన్మస్థలము రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ. కానీ ఆతడెన్నడునూ ఒక్కచోటనున్న వాడు కాదు. మహేశ్వర వరప్రసాద కవితాఖడ్గమును ధరించి, తన్నెదిరించిన వారినెల్ల ఆ ఖడ్గప్రహారముతో భయపెడుతూ, ఆగ్రహానంతర మనుగ్రహవృష్టిని కురిపిస్తూ నిరంతరం సంచరించే అనంత శక్తిమంతుడా మహాకవి. సుమారు వేయిఏండ్ల కిందటి వాడైనా, అతని కావ్యసంపద లభించకపోయినా, ఆయన పద్యప్రసూనాలు


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

వాడిపోక, ఇప్పటికీ నవ్య సుగంధాలను వెదజల్లుతూనే ఉన్నాయి. బహుభాషాకోవిదుడు, మహోగ్రుడుగా పేరుగన్న భీమన్న శాపం, అనుగ్రహం వేగంగా పనిచేసేవి. ఈయన 11వ శతాబ్దానికి చెందిన కవి అని కొందరి అభిప్రాయం.

♦ **కింది వాక్యాల్లోని తప్పొప్పులను గుర్తించండి.**

అ) భీమకవి ఖడ్గం ధరించి తిరిగేవాడు. ( )

ఆ) వేములవాడ భీమకవి బహుభాషాకోవిదుడు. ( )

ఇ) భీమకవి 11వ శతాబ్దికి చెందినవాడని కొందరంటారు. ( )

ఈ) భీమకవి ఎన్నడూ ఒక్కచోట ఉండలేదు. ( )

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) స్నేహితుల మధ్య వివాదాలు ఎందుకువస్తాయో వివరించండి?

ఆ) "కుల, మత, వర్గ, పేద, ధనిక తేడా లేనిది స్నేహం ఒక్కటే" దీనిని సమర్థిస్తూ రాయండి.

ఇ) అచ్చతెలుగు భాషలో రాయబడిన ఈ పాఠం చదివారు కదా! దీనిపై మీ అభిప్రాయాన్ని క్లుప్తంగా రాయండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) "ఆపదలో ఆదుకునేవాడే నిజమైన స్నేహితుడు" ఎందుకు వివరించండి.

(లేదా)

ఆ) మంచి స్నేహితులను ఎలా సంపాదించుకోవాలి? ఆ స్నేహం కలకాలం ఉండడానికి ఏం చేయాలి?

**3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.**

శర్మిష్ఠ తన స్నేహితురాలైన దేవయానిని తిట్టి, బావిలో తోసింది కదా! తర్వాత తన తప్పు తెలుసుకొని చింతిస్తే, ఎట్లా ఉంటుందో ఊహించి, 'ఏక పాత్రాభినయా'నికి అనువుగా మాటలు రాయండి.

SCERT TELANGANA

## III. భాషాంశాలు

### పదజాలం

1. కింది వాక్యాల్లోని గీతగీసిన పదాలతో సొంత వాక్యాలు రాయండి.

అ) మన ఇరుగు పొరుగు వాళ్లతో అనగిపెనగి ఉండాలి.

______________________________

ఆ) చెలువలు బంగారు ఆభరణాలను చాలా ఇష్టపడతారు.

______________________________

ఇ) మా పాఠశాలలో తరగతికి వందమంది చొప్పున పది తరగతుల్లో వేవురు విద్యార్థులు చదువుతున్నారు.

______________________________

ఈ) అమ్మానాన్నలు మనమంచికై కఠినంగా మాట్లాడినా నెగులు పడకూడదు.

______________________________

2. కింది ప్రకృతి వికృతులను జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| అ) | ఆళి | (   ) | ఎ) సకి |
| ఆ) | గర్వం | (   ) | బి) అబ్బురం |
| ఇ) | అద్భుతం | (   ) | సి) ఓలి |
| ఈ) | సఖి | (   ) | డి) గరువము |

### వ్యాకరణాంశాలు

1. కింది పదాలు విడదీసి సంధి పేరు రాయండి

అ) జగములేలు = ________ + ________ = ________

ఆ) అలరుఁబోఁడి = ________ + ________ = ________

ఇ) నీరాట = ________ + ________ = ________

2. కింది సమాస పదాలకు విగ్రహ వాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.

అ) రక్కసి ఱేడు ________________, ________

ఆ) నీరాట ________________, ________

ఇ) పసిబిడ్డ ________________, ________



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

SCERT TELANGANA

## గసడదవాదేశ సంధి

✷ **కింది పదాలను కలిపినప్పుడు, ఏర్పడిన రూపాలను గమనించండి.**

అ) వాడు + కొట్టె = వాడుగొట్టె

ఆ) మీరు + చనుడు = మీరుసనుడు

ఇ) నీవు + టక్కరి = నీవుడక్కరి

ఈ) నిజము + తెలిసి = నిజముదెలిసి

ఉ) పాలు + పోక = పాలువోక

పై ఉదాహరణలు గమనించారు కదా! పూర్వపదం చివర ప్రథమా విభక్తి ప్రత్యయాలున్నాయి. పరపదం మొదట క,చ,ట,త,ప లున్నాయి. ఈ విధంగా ప్రథమా విభక్తి మీది ప్రత్యయాలకు కచటతపలు పరమైతే వాటి స్థానంలో గసడదవలు ఆదేశంగా వస్తాయి. అంటే.......

క → 'గ' గా మారుతుంది.

చ → 'స' గా మారుతుంది.

ట → 'డ' గా మారుతుంది.

త → 'ద' గా మారుతుంది.

ప → 'వ' గా మారుతుంది.

> ప్రథమ మీది పరుషాలకు గ, స, డ, ద, వ లు బహుళముగానగు.

(క చ ట త ప లకు గ స డ ద వ లు ఆదేశంగా వస్తాయి)

**3. కింది పదాలను విడదీసి రాయండి. వివరించండి.**

అ) రావణుడు గొనిపోయె ఆ) రాముడు సనుదెంచు ఇ) వారు దనిసిరి

ఈ) వాడు వోయె

✷ **కింది పదాలను గమనించండి.**

అ) కూరగాయలు - కూర + కాయ

ఆ) కాలుసేతులు - కాలు + చేయి

ఇ) టక్కుడెక్కులు - టక్కు + టెక్కు

ఈ) తల్లిదండ్రులు - తల్లి + తండ్రి

ఉ) ఊరువల్లెలు - ఊరు + పల్లె

పై పదాలు ద్వంద్వ సమాసానికి ఉదాహరణలే.



SCERT TELANGANA

ద్వంద్వ సమాసంలో 'కూర + కాయ' అన్నప్పుడు 'క' స్థానంలో 'గ' వచ్చింది. ఈ విధంగా క చ ట త ప లకు గ స డ ద వ లు రావడాన్ని 'గసడదవాదేశం' అంటారు. అనగా "ద్వంద్వ సమాసంలో" మొదటి పదం మీద ఉన్న క చ ట త ప లకు గ స డ ద వ లు క్రమంగా వస్తాయి.

ద్వంద్వంబు పై
పరుషములు
గ, స, డ, ద, వ లగు

**4. కింది పదాలను కలుపండి. సంధి కార్యం తెలుపండి.**

అ) అక్క + చెల్లె = ____________________

ఆ) అన్న + తమ్ముడు = ____________________

## తేటగీతి

✶ **తేటగీతి పద్యం సూర్య, ఇంద్రగణాలతో ఏర్పడుతుంది. ఈ పద్యలక్షణాలు తెలుసుకోబోయే ముందు సూర్యగణాలు, ఇంద్రగణాలు అంటే ఏవేవో చూద్దాం.**

సూర్య గణాలు (2) : 1) న గణం - I I I

2) హ గణం - U I

ఇంద్ర గణాలు (6) : 1) భ గణం - U I I

2) ర గణం - U I U

3) త గణం - U U I

4) న గము - I I I U

5) న లము - I I I I

6) స లము - I I U I

✶ **ఇప్పుడు కింది ఉదాహరణను పరిశీలించండి.**

ఉదా :

| అతని | కూఁతురు | శర్మిష్ఠ | యనఁగ | నొప్పుఁ |
|---|---|---|---|---|
| I I I | U I I | U U I | I I I | U I |
| న | భ | త | న | హ |
| సూర్యగణం | ఇంద్రగణం | ఇంద్రగణం | సూర్యగణం | సూర్యగణం |

SCERT TELANGANA

పై ఉదాహరణ ఆధారంగా తేటగీతి లక్షణాలను కింది విధంగా చెప్పవచ్చు.

**'తేటగీతి' పద్యలక్షణాలు :**

- ఈ పద్యంలో నాలుగు పాదాలుంటాయి.
- ప్రతి పాదానికి వరుసగా ఒక సూర్యగణం, రెండు ఇంద్రగణాలు, రెండు సూర్యగణాలు ఉంటాయి.
- నాలుగో గణం మొదటి అక్షరం యతిమైత్రి స్థానం. ప్రాసయతి చెల్లుతుంది.
- ప్రాస నియమం లేదు.

**ప్రాసయతి**

ప్రాసస్థాన అక్షరానికి యతిని పాటించడం. పద్యపాదంలో రెండవ అక్షరానికి సాధారణ యతిమైత్రి స్థానంలోని తరువాతి అక్షరానికి యతిని పాటించడం.

**5. పై పద్యానికి సంబంధించి మిగతా పాదాలకు గణవిభజన చేసి లక్షణాలను సరిపోల్చండి.**

## ప్రాజెక్టు పని

- **స్నేహం గొప్పతనాన్ని తెలిపే కథలను / పాటలను సేకరించి, నివేదిక రాసి ప్రదర్శించండి.**

## మీకు తెలుసా?

### గాథాసప్తశతి – ఒక కథ

మొదటి శతాబ్దంలో కోటిలింగాల (పూర్వపు కరీంనగర్ జిల్లా నేటి జగిత్యాల జిల్లా)ను రాజధానిగా చేసుకుని తెలుగునేలను ఏలిన హాలుడు సేకరించిన ప్రాకృతగాథల సంకలనం 'గాథాసప్తశతి'. అందులోని ఒక కథ –

జోరుగా కురుస్తున్న వానలో ఒక స్త్రీ ఒక ఇంటి చూరు కింద నిలబడ్డది. ఆ చూరునుండి కారుతున్న నీళ్ళతో కొడుకుతల తడిసిపోతే వానికి జ్వరం వస్తుందేమోనని తన చీరకొంగును అడ్డంగాపట్టింది. అయినా వాని తల తడిసిపోతూనే ఉన్నది – ఆమె కంటి నుండి ధారాపాతంగా కారుతున్న నీళ్ళతో, గుండెను పిండేసే ఆ కథను రచయితలు రకరకాలుగా ఊహించారు. మీరూ ఊహించండి!

## సూక్తి

శ్లో॥ దదాతి ప్రతిగృహ్ణాతి – గుహ్యమాఖ్యాతి పృచ్ఛతి।
భుంక్తే భోజయతేచైవ – షడ్విధం ప్రీతి లక్షణమ్॥

భావం: ఇవ్వడం, తీసుకోవడం, దాపరికం లేకుండా రహస్యాలు చెప్పడం, అడుగడం, తినడం, తినిపించడం అనే ఆరు లక్షణాలు స్నేహమున్నచోటనే ఉంటాయి.

– హితోపదేశం

SCERT TELANGANA

# చదువండి - తెలుసుకొండి

## స్నేహసంపద

స్నేహానికి ఎల్లలు లేవు. పరిమితులు లేవు. అది ఒక మహా ప్రవాహం. లోతుకు వెళుతున్న కొద్దీ అనిర్వచనీయమైన అనుభూతిని, చిరస్మరణీయమైన మధుర జ్ఞాపకాలను స్నేహితులు పొందుతారు. స్నేహం త్యాగాన్ని కోరుతుంది. ప్రేమను కురిపిస్తుంది. హర్షాన్ని వర్షింపజేస్తుంది. సంతృప్తిని కలిగిస్తుంది, స్వార్థాన్ని సమూలంగా నశింపజేస్తుంది. కపటాన్ని, కాఠిన్యాన్ని దరిచేరనీయదు. హద్దులను చెరిపివేస్తుంది.. సద్బుద్ధిని ప్రవేశపెడుతుంది. ఆశలను చిగురింపజేస్తుంది. ఆశయాలను తలపింపజేస్తుంది. అభివృద్ధిని చేకూర్చుతుంది. సన్మార్గంలో పయనింపజేస్తుంది. అందుకే స్నేహమేరా జీవితం, 'స్నేహమేరా శాశ్వతం', 'స్నేహానికన్న మిన్న లోకాన లేదు' అనే మాటలు పాటలుగా ప్రసిద్ధికెక్కినాయి.

మంచి మిత్రులు ఎట్లా ఉంటారో భర్తృహరి నీతిశతకంలో నిర్వచించాడు.

**"పాపాన్నివారయతి యోజయతే హితాయ**
**గుహ్యం నిగూహతి గుణాన్ ప్రకటీ కరోతి।**
**అపద్గతంచ న జహాతి దదాతి కాలే**
**సన్మిత్రలక్షణమిదం ప్రవదన్తి సన్తః॥"**

పాపకార్యాల నుంచి నివారింపజేస్తూ హితాన్ని కలిగించే సత్కార్యాలలో ప్రవర్తింపజేస్తూ, రహస్యాలను రహస్యంగా ఉంచుతూ, మంచిగుణాలను ప్రశంసిస్తూ తగినట్లుగా సహాయం చేసే వ్యక్తులే సన్మిత్రులుగా పేర్కొనదగినవారని భర్తృహరి సన్మిత్రుల గురించి చెప్పాడు.

స్నేహంలో ఎక్కువ తక్కువలుండవు. అంతరంగ స్నేహితుడుగా రూపుదిద్దుకున్న వ్యక్తి ధనికుడా? పేదవాడా? కష్టాల్లో ఉన్నాడా? లేక సుఖపడుతున్నాడా? అనే ఆలోచన కలుగదు. భోగభాగ్యాలతో సుఖసంపదలతో, అన్నివిధాల ఉన్నతుడైన వ్యక్తితో మాత్రమే స్నేహం చేయాలి అనే స్వార్థభావన కూడ ఏర్పడదు. పైగా యథార్థ స్నేహితులు ఒకరి శ్రేయస్సుకై మరొకరు తమ సుఖాలను, ధనాన్ని, సమయాన్ని, చివరకు తమ దేహాలను కూడా త్యాగం చేయడానికి సిద్ధపడుతారు. సుఖదుఃఖాలను కూడ సమంగా పంచుకుంటారు అని వాల్మీకిమహర్షి శ్రీమద్రామాయణం కిష్కింధకాండలో తెలిపాడు. ఇట్టి స్నేహసంపదను సంపాదిద్దాం!

SCERT TELANGANA

# 8 ఉద్యమ స్ఫూర్తి

- సంగెం లక్ష్మీబాయి

## చదువండి - ఆలోచించి చెప్పండి.

*గాంధీజీ భారతదేశంలో అన్ని వర్గాలకు ఏకైక మార్గదర్శకుడైనాడు. బ్రిటిషువాళ్ళు ఈ విషయాన్ని గుర్తించి కలవరపడ్డారు. దేశమంతా వారి ఆధీనంలోనే ఉన్నది. కానీ ప్రజలు మాత్రం మనసులో గాంధీని ఆరాధిస్తున్నారు. భారతీయులు మూఢులు, అజ్ఞానులు అని వలస సామ్రాజ్యవాదులకు ఒక అపోహ. భారతజాతి ప్రజల మేధాసంపత్తిని వారు అనుమానించారు. ప్రపంచాన్ని పాలించటం, అందుకోసం విద్రోహాలకు పూనుకోవటం చాలా గొప్ప సంగతి అని వారు అనుకున్నారు. కాని గాంధీ అహింసామార్గంలో ముందుకు సాగుతున్నారు.*

*సబర్మతి ఆశ్రమం నుండి దండియాత్ర ప్రారంభమైంది. ఈ బృందంలో 79 మంది త్యాగధనులైన దేశభక్తులున్నారు. ఉప్పు మీద పన్ను తొలగిస్తే కాని మళ్ళీ సబర్మతి ఆశ్రమంలో అడుగు పెట్టనని ప్రతిజ్ఞ చేశాడు గాంధి. దండియాత్ర 24 రోజులు సాగింది. దారి పొడువున నేల ఈనినట్లు గాంధీ అభిమానులు తండోపతండాలై స్వాగతసుమాలను వెదజల్లారు. దేశవ్యాప్తంగా ఈ యాత్ర పెద్ద అలజడి రేపింది. సముద్రతీరాల్లో కార్యకర్తలు కెరటాల్లా లేచారు. గాంధీజీ ఇట్లా ప్రజలందరిని ఏకం చేసి, స్వాతంత్ర్యోద్యమాన్ని వాహినిలా నడిపి బ్రిటిష్ వారిని ఎదిరించాడు.*

### ప్రశ్నలు:

1. *ప్రజలు గాంధీజీని ఎందుకు ఆరాధించారు?*
2. *నాయకులు గాంధీజీని ఎందుకు అనుసరించారు?*
3. *గాంధీజీ అహింసా మార్గాన్ని ఎందుకు అనుసరించాడు?*

## పాఠం ఉద్దేశం

*నేనొక్కడిని బాగుంటే చాలు ఎవరు ఏమైతే నాకెందుకు? అనే స్వార్థం సమాజంలో రోజు రోజుకు పెరిగిపోతున్నది. సామాజిక అభివృద్ధిని కోరుకునే సహృదయత చాలా వరకు కరువైంది. త్యాగాల పోరాటాల ఫలితంగా లభించిన స్వాతంత్ర్య లక్ష్యం నెరవేరడం లేదు. సామాజిక బాధ్యతతో నైతికతతో మనమందరం జీవించినప్పుడే స్వాతంత్ర్యానికి సార్థకత లభిస్తుందని చెప్పటమే ఈ పాఠం ఉద్దేశం.*

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'ఆత్మకథ' అనే ప్రక్రియకు చెందినది. ఒక వ్యక్తి తన జీవిత విశేషాలను, ఒక గ్రంథంగా రాస్తే, అది ఆత్మకథ అవుతుంది. దీనిని స్వీయచరిత్ర అనికూడా అంటారు. ఇందులో రచయిత అనుభవాలే కాకుండా సమకాలీన విశేషాలు, ఆనాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులు ప్రతిబింబిస్తాయి. చదివిన వారికి ప్రేరణను కలిగిస్తాయి. ఇది ఉత్తమపురుష కథనంలో సాగుతుంది.

ప్రస్తుత పాఠ్యాంశం సంగెం లక్ష్మీబాయి రాసిన 'నా జైలు జ్ఞాపకాలు - అనుభవాలు' అనే ఆత్మకథలోనిది.

## రచయిత్రి పరిచయం



**27-7-1911**

**1979**

స్వాతంత్ర్య సమరయోధురాలిగా సంఘసేవా పరాయణురాలిగా జీవితాన్ని సమాజానికి అంకితం చేసిన త్యాగమూర్తి సంగెం లక్ష్మీబాయి. ఈమె మేడ్చల్ జిల్లాలోని ఘటకేశ్వరం అనే గ్రామంలో జన్మించింది.

ఈమె హైదరాబాదులో నారాయణగూడ బాలికల ఉన్నత పాఠశాల వార్డెనుగా, తెలుగు పండితురాలుగా పనిచేసింది. గాంధీజీ పిలుపుతో ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్ళిన ప్రథమ తెలంగాణ మహిళగా 1951 సం॥లో తెలంగాణా ప్రాంతంలో వినోబాభావే చేసిన భూదానోద్యమ పాదయాత్రలో పాల్గొనిన ప్రథమ మహిళగా పేరు పొందింది.

బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో విద్యాశాఖ ఉపమంత్రిగా పనిచేసింది. 1957 సం॥లో కాంగ్రెసు పార్టీ తరపున లోక సభకు ఎన్నికై 1971వ సం॥ వరకు అంటే 15 సం॥లు లోకసభ సభ్యురాలుగా దేశోన్నతికై శ్రమించింది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA

## ప్రవేశిక

*చిన్నతనంలో తల్లిని, వివాహమైన కొంత కాలానికే భర్తను కోల్పోయినా లక్ష్మీబాయి నిరాశ పడలేదు. తండ్రికి ఇష్టం లేకపోయినా ఎన్నో కష్టాలకు ఓర్చి చదువుకొన్నది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనటం, స్త్రీల అభ్యున్నతికి కృషిచేయడం కోసమే తాను జీవించాలని భావించిన మహనీయురాలు సంగెం లక్ష్మీబాయి. తన జీవిత విశేషాలు, తాను చూసిన స్వాతంత్ర్యోద్యమాన్ని కండ్లకు కట్టినట్లు, మనకు స్ఫూర్తిని కలిగించేటట్లు రాసింది. ఆనాటి స్వాతంత్ర్యోద్యమ సంఘటనలు కొన్ని ఈ పాఠం చదివి తెలుసుకుందాం.*

### I

ఈనాడు దేశంలో ఎక్కడ ఏ మూల ఏమి జరిగినా "మనకెందుకీ గొడవలు?" అనే నిర్లిప్తతా, "ఏమి మాట్లాడితే ఏమొస్తుందో?" అనే భయమూ, "ఎప్పుడూ చచ్చేవాడికి ఏడ్చేదెవరు?" అనే కాఠిన్యమూ పేరుకు పోయి ప్రజలు తాము, తమ బ్రతుకు వరకు పరిధుల్ని పరిమితం చేసుకోవటం చూస్తూ ఉంటే – ఒకనాడు ఈ గడ్డపై స్వాతంత్ర్య సిద్ధికోసం సంతోషంగా ఉరికంబాలకెక్కిన వ్యక్తుల గాథలు నిజమా? కలా? అనే విభ్రాంతి కలుగుతూ ఉంటుంది. అది కలకాదు. అక్షరాలా నిజమే. ఆ తరంలో, ఆనాటి స్వతంత్ర సమర సంరంభంలో నేనూ కలిసి నడిచాను. తోటి సోదరుల జీవితాహుతులకు కడలినై ఘోషించాను. మాతృదేశ శృంఖలాలను పడగొట్టాలని ఆ వీరవాహినిలో అలగా కలిసిపోయాను. ఈ నా స్వానుభవం. ఆ గాథలు కలలు కావని స్పష్టం చేస్తున్నా – ఈనాటి సాంఘిక నిర్లిప్తత, నిర్వీర్యత చూస్తూ ఉంటే మాత్రం – కలగని లేచానా అని భ్రాంతి కలుగుతూ ఉంటుంది. అంతే!

అప్పట్లో బాపూజీ ప్రబోధించిన సహాయ నిరాకరణం తప్ప, మాకు స్వతంత్ర్య పోరాటానికి ఇంకేవిధమైన ఆయుధాలూ లేవు. కాని మానవుడికి ప్రతీకారవాంఛ సహజ మనుకుంటాను. మేమెంత అహింసావాదులమైనా సహాయ నిరాకరణం శాంతియుతంగా కొనసాగించినా, విప్లవసంఘం వారి చర్యలు కొన్ని మాకు అద్భుతంగా ఆశ్చర్యకరంగా తోచేవి. విప్లవకారులూ దేశభక్తులే. వారి ఉద్యమమూ స్వాతంత్ర్య సిద్ధికోసమే కానీ విధానాలు మాత్రం వేరు. విధానాలు వేరైనంత మాత్రం చేత వారిని మేము గౌరవించకుండా ఉండలేక పోయేవాళ్ళము. అట్లాగని మా అహింసా శాంతియుత విధానాల మీద మాకు చిన్నచూపు లేదు. కాని ఆ రోజుల్లో సుఖదేవ్, భగత్‌సింగులకు ఉరిశిక్ష పడుతుందేమోనని దేశంలో ప్రతి ఒక్కరూ తల్లడిల్లిపోయేవారు. వైస్రాయి మీద బాంబు పేల్చిన విప్లవ సంఘం వ్యక్తి ఇంద్రపాల్ అప్రూవర్‌గా బ్రిటీషు వారికి విప్లవ సంఘం సమాచారమంతా చెప్పాడు. భగవత్ చందర్, భగత్‌సింగ్, ఇంద్రపాల్ కలిసి చిత్ర విచిత్రమైన బాంబులు తయారు చేసేవారు. భగవత్‌చందర్ ప్రోద్బలం మీద ఇంద్రపాల్ సన్యాసి వేషంలో వెళ్ళి వైస్రాయి మీద బాంబు పేల్చాడు. దురదృష్టవశాత్తు అది తప్పిపోయింది. భగత్ సింగ్, సుఖదేవులు జైల్లో ఉండగా వాళ్ళని తప్పించాలని భగవత్‌చందర్, ఇంద్రపాల్ ఇద్దరూ శతవిధాల ప్రయత్నించారు. కాని విఫలులైనారు. ఈ సంఘంలో తయారైన బాంబులు సరిగా పేలుతాయో లేదో పరీక్ష చేయాలని బాంబు నొక దానిని తీసుకొని, నిర్జన ప్రదేశానికి వెళ్ళే సమయంలో, దారిలోనే ఆ బాంబు పేలి భగవత్‌చందర్ మరణించాడు. సుఖదేవ్, భగత్‌సింగులు అరెస్టయ్యారు. ఇంద్రపాల్ అప్రూవర్‌గా మారాడు. భగవత్‌చందర్ భార్య దుర్గాదేవి,

SCERT TELANGANA

## ఆలోచించండి - చెప్పండి

- తమ బ్రతుకు వరకు పరిధుల్ని పరిమితం చేసుకోవటం అంటే ఏమిటి?
- విప్లవసంఘంవారి చర్యలు కొన్ని ఎందుకు అద్భుతంగా ఆశ్చర్యకరంగా తోచినాయి?
- సుఖదేవ్, భగత్‌సింగులకు ఉరిశిక్ష పడుతుందని తెలిసి దేశంలోని ప్రతి ఒక్కరు ఎందుకు తల్లడిల్లిపోయారు?

మరి కొందరు స్త్రీలు కూడా ఈ విప్లవ సంఘ సభ్యులుగా నమోదయ్యారు. అప్రూవర్‌గా ఇంద్రపాల్ బయటపెట్టిన విషయాలు మాలో ఉడుకునెత్తురు ప్రవహించేలా చేసిందంటే నమ్మండి. ఆ రోజులలో ఆవేశం అటువంటిది.

ఇటువంటి వార్తలు విన్నప్పుడు, చదివినప్పుడూ దుర్గాబాయి జైలు నుంచి విడుదల అయ్యాక స్వాతంత్ర్య సిద్ధికి మేమంతా ఏం చేయాలో పథకాలు వేస్తూ ఉండేది. ఆ ఆవేశం పట్టలేక జైలులో అప్పటికప్పుడు ఏదో ఒక అల్లరి ఉప్పెనలా సాగించే వాళ్ళం.

## II

విప్లవ సంఘంవారి చర్యలు ఈ విధంగా విషాదాంతం కావటం మాట అటుంచి. ఇంత కంటే ఘోరమైన దారుణాలు ఎన్నో ప్రతి నిత్యం వార్తా పత్రికలలో వచ్చేవి.

బొంబాయిలో విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమం సాగుతూ ఉన్న రోజుల్లో ఒక వ్యాపారి "ఎవరు నాకు అడ్డం వస్తారో రండి చూద్దాం." అని సవాలు చేస్తూ విదేశీ వస్త్రాలను ఒక కారులో వేసుకొని అమ్మకానికి బయలుదేరాడు. కాంగ్రెసు సత్యాగ్రహులు అతనిని ఆ ప్రయత్నం విరమించుకోమని ప్రాధేయపడ్డారు. అతను వినలేదు. వెంటనే ఒక యువకుడు "నీవా బట్టలు అమ్మదలచుకుంటే నామీదుగా వెళ్లి అమ్ముకొమ్మ"ని కారుకి అడ్డంగా పడుకున్నాడు. ఆ వ్యాపారి బెదరలేదు. నిజంగానే ఆ యువకుడి మీదుగా కారు పోనిచ్చాడు. ఆ యువకుణ్ణి హాస్పిటల్‌లో చేర్పించారు. నాలుగు గంటలపాటు గిజగిజ తన్నుకుని అతను ప్రాణం విడిచాడు. అందరూ ఆ వ్యాపారి చర్యకు స్తంభించి పోయారు. యువకుడి మరణానికి పరితపించిపోయారు. "కారు నా మీదుగా పోనివ్వ"మంటే అంత పనీ చేసిన ఆ వ్యాపారికి ప్రభుత్వపు అండదండలు బాగా ఉన్నాయనీ, అందుకే అతడంత విచ్చలవిడిగా దారుణానికి పాల్పడ్డాడనీ ఆ తరువాత తెలియవచ్చింది.

ఈ కథ ఇంతటితో ఆగలేదు. ఆ మర్నాడు ఆ యువకుడిపై కారు నడిచిన చోట గంధపుష్పాక్షతలు చల్లి ప్రజలు వీరావేశంతో జేజేలు కొడుతూ ఉంటే కనీసం తమ సాటి సోదరుడి దుర్మరణానికి సానుభూతి చూపే అవకాశమైనా ప్రజలకివ్వకుండా పోలీసులు గుంపుల్ని చెల్లా చెదరు చేసి, లాఠీచార్జీ చేసారు. కొందరిని అరెస్టు చేసారు. స్త్రీలు కూడా పికెటింగ్ చేస్తూ ఉంటే వారిని కూడా పోలీసులు చెదరగొట్టారు. కాని వారు ఒకరి చేతులొకరు పట్టుకుని ఒక వరుసగా నిలబడి మొండిగా పోలీసువారి కెదురు తిరిగి నిలబడ్డారు. ఆ శ్రేణిని విడదీయటం మాత్రం ఆ రోజు పోలీసుల తరం కాలేదు.

మూర్షాబాద్ జైలులో మణిలాల్‌సేన్ అనే 17 సంవత్సరాల బాలుడు 60 రోజులు నిరశన వ్రతం చేసి అసువులు కోల్పోయాడు. జైలులో రాజకీయ ఖైదీలకు కల్తీసరుకు ఇచ్చినంతకాలం తాను భుజింపనని జతీంద్రనాథ్ మతమవలంబించి నిరసనవ్రతం సాగించిన మణిలాల్ విషయం పట్టించుకున్న పాలకుడే లేకపోయాడు. పార్లమెంటులో ఈతని మరణ వార్త బాంబు పేలినట్లు పేలి పాలకుల్ని గడగడలాడించింది. కాని ఎంతసేపు? ఎందరో వీరులమరణాలు కదిలించలేని బ్రిటిష్ వారి కర్కశ హృదయాల్ని ఒక 17 సంవత్సరాల బాలకుడి మరణం కదిలించగలదా? అది అతని తల్లికీ స్వదేశీయులకూ మాత్రమే రంపపు కోత అయింది.

SCERT TELANGANA


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

జైళ్ళలో రాజకీయ ఖైదీలను కొరడాలతో కొట్టినందుకు నెహ్రూ, సయ్యద్ అహ్మద్ నిరశన వ్రతం పూనారు. దేశంలో ఎక్కడ చూసినా అరెస్టులు, లాఠీచార్జీలు, అత్యాచారాలు ప్రబలిపోయాయి. ప్రభుత్వం శిక్షించిన కొద్దీ, పికెటింగ్‌లు, నిరశన వ్రతాలు, ఊరేగింపులు అధికతరమై దేశం అట్టుడికినట్లుడికిపోతూ ఉండేది.

ఈ వార్తలు చదువుతున్న మాకు బ్రిటీషు వారు పచ్చినెత్తురు తాగే కిరాతకులుగా తోచేవారు. ఈనాడు మనలో కొందరు స్వాతంత్ర్యం వచ్చాక దేశం అధోగతి పాలవుతోంది, బ్రిటిష్ రాజ్యమే బాగుండేది అని నిట్టూర్చడం వింటూ ఉంటాం కాని అంతఃకలహాలతో ఒక వర్తక సంఘానికి మన స్వదేశ రాజులు రాజ్యాన్ని ధారాదత్తం చేసినప్పుడు దేశ సంపదలన్నీ వారు కొల్లగొట్టి, దేశీయులను బానిసల్లా అనాగరికుల్లా పరిగణిస్తూ మన సంపదలో మనకింత భిక్షం పెట్టినట్లుగా అడపాదడపా ఏవో వసతులు నూటికి కోటికి ఒకటిగా కల్పిస్తూ ఉంటే – మన గ్రామాలు, గ్రామీణులు ప్రపంచం మారినా ఇంకా అజ్ఞానంలో మగ్గుతూ ఉంటే – కరువు కాటకాలు మారెమ్మల్లా ఊళ్ళ మీద పడి ఊడ్చేస్తూ ఉంటే దారిద్ర్యానికీ ఛాందసాచారాలకు భారతదేశం పెట్టింది పేరని ప్రపంచదేశాలు ప్రవచిస్తూ ఉంటే నేను – నా దేశం అని భావించే ఏ దేశభక్తుడి గుండెలు మండవు? స్వతంత్రం వచ్చాక మన సమాజం వ్యాధిగ్రస్తమై పోయిందంటే దానికి వ్యక్తులు బాధ్యులుకాని, స్వాతంత్ర్యసిద్ధి కారణం కాదు కదా!




## ఆలోచించండి–చెప్పండి

- బొంబాయిలో విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమం జరిగిన పరిస్థితులను మీరు ఎట్లా అర్థం చేసుకొన్నారు?
- బ్రిటిషు వారి హృదయాలు కర్కశమైనవని సంగెం లక్ష్మీబాయి ఎందుకన్నది?
- సమాజం వ్యాధిగ్రస్తమై పోయిందంటే అర్థమేమిటి?

## III

రాజ్యం సుభిక్షంగా, చల్లని పాలనలో ఉంటే మనిషి తన కుటుంబం, తాను, తన జీవితం గురించి స్థిమితంగా ఆలోచించగలడు. కృషి చేయగలడు. కాని దేశం సుభిక్షంగాలేక, రాజ్యంలో స్వదేశీయులే హింసాకాండకు, అవమానాలకు గురి అవుతుంటే అప్పుడు ప్రతి వ్యక్తి గుండెల్లోనూ అగ్ని రగులుతుంది. అట్లా రగలకపోతే ఆ వ్యక్తి మనిషే కాదు.

ఆ రోజుల్లో మన భారతీయులు పాముల్నీ, వృక్షాలనూ పూజించటం "హారిబుల్" అని విదేశీయులు తమ గ్రంథాలలో వ్రాస్తూ ఉంటే గోచీలు పెట్టుకొని భూములు దున్నుతారని, కట్టుగుడ్డలేని నిరుపేదలంటూ పరిహసిస్తూ ఉంటే, భారతీయులు కూడా లజ్జాకరంగా భావించేవాళ్ళు. కాని పాము కాలగమ్యాలకు సంకేతమనీ, అశ్వత్థ వృక్షం సృష్టి, స్థితి, లయలకు సూచకమనీ, ఉష్ణదేశం కనుక బట్టలెంత తక్కువగా కడితే అంత ఆరోగ్యమనీ విప్పి చెప్పగల గుండెలెవరికున్నాయి భారతీయులకి అప్పుడు? అవుతే, పిల్లలకు బట్టలెంత తక్కువగా తొడిగితే అంత మంచిదనీ, మట్టి తినకుండా ఒక కంట కనిపెడుతూ పిల్లల్ని పెద్దలు మట్టిలో ఎంత ఆడనిస్తే అంత నరాలపుష్టి అనీ నిపుణులైన వైద్యులీనాడు చెబుతూ ఉంటే మనం ఆశ్చర్యంగా వింటాం. కాని ప్రకృతికి, ప్రాణికీ నడుమగల ఈ అనుబంధం ఏనాడో మన పెద్దలు విప్పి చెప్పి ఆరోగ్య సూత్రాలను, ఆధ్యాత్మిక భావనలను మానవుని దైనందిన జీవితంలో కుప్పించి ఒదిలేసి, వాటికోసం ప్రత్యేకమైన శిక్షణలతో కాలహరణ లేకుండా, తెలియజెప్పిన చాకచక్యం ఎంత మందికి తెలుసు?

అవుతే పాశ్చాత్యమంతా నాగరికతేననీ ప్రాచ్యమంతా అప్రాచ్యమేననీ ప్రాచ్యులే పరాన్న భుక్కులవుతే ఇక పరిపాలనలో, ఛాందసాచారాల్లో పడి దిక్కుకానక ఉన్నవారికి దిక్కేమిటి? అందుకే ఈ స్వాతంత్ర్య సమరం ప్రారంభమైంది.

కాని, దురదృష్టమో లేక దూరదృష్టి లోపమోకాని, ఈ స్వాతంత్ర్య సిద్ధి మనకీనాడు అంత సంతోషాస్పదం కావటంలేదు. స్వాతంత్ర్యం కేవలం హక్కుల సంరక్షణార్థమే కాని, బాధ్యతాయుత ప్రవర్తనకూ, కర్తవ్యపాలనకు మనకు స్వతంత్రం లభించిందన్న స్ఫురణ కొరవడటమే ఈ నాటి ఈ దుస్థితికి హేతువు. రాజకీయంగా పురికొల్పగలిగినంతగా ఏ నాయకుడూ సాంఘిక నైతిక బాధ్యతలను ప్రజలలో ప్రేరేపించలేక పోతున్నాడు. ఎందువల్లనంటే ఆ నాయకులకూ సాంఘిక నైతిక విలువలు లేకపోవటం మాట అటుంచి, ప్రజలు కూడా స్వార్థపరులై, దేశక్షేమం అంటే కేవలం తమ ఒక్కరి బాగే బాగుగా భావించటం, వారిలో సాంఘిక బాధ్యత లోపించటం శోచనీయమైన అంశంగా తయారైంది.

### ఆలోచించండి - చెప్పండి

- *ప్రకృతికి, ప్రాణికీ నడుమగల అనుబంధం ఏమిటి?*
- *మన పెద్దల చాకచక్యం ఏమిటి?*
- *'బాధ్యతాయుత ప్రవర్తనకూ, కర్తవ్యపాలనకు కూడా మనకు స్వతంత్రం లభించింది' దీనిపై మీ అభిప్రాయం చెప్పండి.*



## ఇవి చేయండి



## I. అవగాహన - ప్రతిస్పందన

**1. ఆనాటి కాలంలో కూడా సంగెం లక్ష్మీబాయి వంటివారు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని సమాజసేవకు అంకితమైనారు కదా! ఇందుకు దారితీసిన పరిస్థితులేమిటి? ఇలాంటి ఆదర్శ మూర్తుల అవసరం ఉందా? ఎందుకు? మాట్లాడండి.**

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

2. పాఠం చదివి కింది పేరాలకు శీర్షిక పెట్టండి. ఆ పేరాలోని కీలక పదాలు రాయండి.

| పేరా సంఖ్య | శీర్షిక పేరు | ముఖ్యమైన పదాలు |
|---|---|---|
| 1 | | |
| 5 | | |
| 9 | | |

3. మాసుమాబేగం గురించిన కింది పేరా చదువండి. సందర్భాన్నిబట్టి, ఖాళీలను సరైన పదాలతో పూరించండి.

మాసుమాబేగం హైదరాబాదులో ________________. ఆమె ప్రముఖ సంఘ ________________. నైజాం రాజ్యంలో గ్రాడ్యుయేట్ అయిన మొదటి ముస్లిం మహిళ. అంజుమన్-ఎ-ఖవాతీన్‌ను స్థాపించి బీద పిల్లల కోసం హైదరాబాదు నగరంలో ఏడు పాఠశాలలు ________________. హైదరాబాదు నుంచి మంత్రి పదవి పొందిన మొదటి మహిళ మాసుమాబేగం. ఈమె చేసే పనుల్లో, సేవాకార్యక్రమాలలో ఆమె భర్త ప్రొఫెసర్ హుసేన్ అలీఖాన్ కూడా ఎంతో ________________. ఈమె చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం ఈమెను పద్మశ్రీ బిరుదుతో ________________.

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఆలోచించి, ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

అ) స్వాతంత్ర్యం లభించినప్పటికీ, అది సంతోషం కలిగించటంలేదని సంగెం లక్ష్మీబాయి ఎందుకు భావించింది?

ఆ) గాంధీజీ అనుసరించిన అహింసా మార్గం దేశ స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిందని ఎట్లా చెప్పగలరు?

ఇ) బ్రిటిషువారి చేతుల్లోకి మనదేశ పాలన పోవుటకు గల కారణాలు వివరించండి.

ఈ) సంగెం లక్ష్మీబాయి రచనావిధానం ఎట్లా ఉన్నది?

2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.

అ) స్వాతంత్ర్య సమరయోధులు కన్నకలలు నిజం కావాలంటే మనకు లభించిన స్వాతంత్ర్యాన్ని ఎట్లా సద్వినియోగించుకోవాలో విశ్లేషిస్తూ రాయండి.

3. కింది అంశం గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) నేటి కాలంలో కూడా సంగెం లక్ష్మీబాయి వంటి వారు ఎందుకు అవసరమో వివరిస్తూ వ్యాసం రాయండి.

SCERT TELANGANA

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాల్లో గీతగీసిన పదాలను ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.**

అ) మనం మంచి చేస్తే, మనకూ మంచి జరుగుతుందని స్వానుభవం వల్ల తెలుసుకున్నాను.

ఆ) తమ పిల్లలు ఉన్నతంగా ఎదగాలని తల్లిదండ్రులు పరితపిస్తూ ఉంటారు.

ఇ) బ్రిటీష్‌వారు మన దేశ సంపదను కొల్లగొట్టి తీసుకొని పోయారు.

**2. కింది వికృతి పదాలకు ప్రకృతులను పాఠంలో వెతికి రాయండి.**

అ) గారవం : ____________

ఆ) కత : ____________

ఇ) జీతం : ____________

ఈ) కఱుకు : ____________

### వ్యాకరణాంశాలు

**1. కింది పదాలను పరిశీలించి, అవి ఏ ఏ సంధులో గుర్తించి, పదాలను విడదీసి, సంధి సూత్రం రాయండి.**

అ) మనకెందుకు = ________ + ________ = ____________

ఆ) విషాదాంతం = ________ + ________ = ____________

ఇ) మేమెంత = ________ + ________ = ____________

ఈ) ఎవరికున్నాయి = ________ + ________ = ____________

ఉ) విచిత్రమైన = ________ + ________ = ____________

**2. కింది సమాస పదాలను పరిశీలించి, వాటికి విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.**

అ) మాతృదేశం = ____________, ________

ఆ) కర్కశహృదయం = ____________, ________

ఇ) సహాయనిరాకరణ = ____________, ________

ఈ) విప్లవసంఘం = ____________, ________

ఉ) అశ్వత్థవృక్షం = ____________, ________

ఊ) శాస్త్రదృష్టి = ____________, ________

SCERT TELANGANA

## యణాదేశ సంధి

✷ **కింది పదాలను విడదీయండి. విడదీసిన పదాలను కలిపి, కలిగిన మార్పులు గమనించండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా: అ) | ❖ అత్యవసరం | = | అతి + అవసరం | → | అత్ + ఇ + అవసరం |
| | | → | అత్ + య్ + అవసరం | → | అత్యవసరం |
| | ❖ ప్రత్యుత్తరం | = | ప్రతి + ఉత్తరం | → | ప్రత్ + ఇ + ఉత్తరం |
| | | → | ప్రత్ + య్ + ఉత్తరం | → | ప్రత్యుత్తరం |
| | ❖ ప్రత్యేకం | = | ప్రతి + ఏకం | → | ప్రత్ + ఇ + ఏకం |
| | | → | ప్రత్ + య్ + ఏకం | → | ప్రత్యేకం |
| ఆ) | ❖ అణ్వస్త్రం | = | అణు + అస్త్రం | → | అణ్ + ఉ + అస్త్రం |
| | | → | అణ్ + వ్ + అస్త్రం | → | అణ్వస్త్రం |
| | ❖ గుర్వౌన్నత్యం | = | గురు + ఔన్నత్యం | → | గుర్ + ఉ + ఔన్నత్యం |
| | | → | గుర్ + వ్ + ఔన్నత్యం | → | గుర్వౌన్నత్యం |
| ఇ) | ❖ పిత్రార్జితం | = | పితృ + ఆర్జితం | → | పిత్ + ఋ + ఆర్జితం |
| | | → | పిత్ + ర్ + ఆర్జితం | → | పిత్రార్జితం |
| | ❖ మాత్రుపదేశం | = | మాతృ + ఉపదేశం | → | మాత్ + ఋ + ఉపదేశం |
| | | → | మాత్ + ర్ + ఉపదేశం | → | మాత్రుపదేశం |

పై మూడు రకాల ఉదా॥ ద్వారా కింది అంశాలను గమనించవచ్చు. ఇ, ఉ, ఋ లకు అసవర్ణములు కలిస్తే, ఇ, ఉ, ఋ లకు ఆదేశంగా య్, వ్, ర్ లు అంటే య, వ, ర లు వస్తాయి. య, వ, ర లను 'యణ్ణులు' అని పిలుస్తారు. కావున ఇట్లా ఏర్పడిన సంధిని యణాదేశ సంధి అంటారు.

> ఇ, ఉ, ఋ లకు అసవర్ణములైన అచ్చులు పరమైనప్పుడు యణ్ణులు ఆదేశంగా వస్తాయి.

> అసవర్ణములు : సవర్ణములు కాని అచ్చులు.
>
> ఉదా : 'ఇ'కి, ఇ, ఈ లు కాకుండా మిగిలిన (అ ఆ; ఉ ఊ; ఋ ౠ; ఎ ఏ ఐ; ఒ ఓ ఔ) అచ్చులు.

✷ **కింద ఇచ్చిన పదాలను విడదీసి, యణాదేశ సంధి అవునో కాదో పరిశీలించండి.**

అ) అభ్యుదయం

ఆ) గుర్వాజ్ఞ

SCERT TELANGANA

ఇ) మాత్రంశ

ఈ) మధ్వరి

ఉ) స్వాగతం

ఊ) మీ పాఠ్యపుస్తకంలో యణాదేశ సంధికి సంబంధించిన పది పదాలు వెతికి రాయండి.

## ప్రాజెక్టు పని

- **స్వాతంత్ర్య పోరాటంలో (లేదా) తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఇద్దరు, ముగ్గురు మహిళల వివరాలు సేకరించి, నివేదిక రాయండి.**

## మీకు తెలుసా?

ఒక కుటుంబం ఒకే వృత్తిలో కొనసాగటం చూస్తూ వస్తున్నాం. వృత్తులు మారితే జీవితాలు మారినవారిని కూడ చూస్తున్నాం. ఏ పనిచేసినా, ఏ వృత్తి చేపట్టినా సామాజికచింతనను ఆదర్శంగా పెట్టుకొని జీవించేవాళ్లు కూడ ఇదే సమాజంలో ఉన్నారు. సామాజిక స్పృహ ఉన్నవాళ్ళు కాలాలు మారినా, సమాజాలు మారినా ప్రజలపక్షం వహించి నిలబడుతారు. ఇటువంటి వారు మన తెలంగాణలో ఎంతోమంది ఉన్నారు. అందుకు సజీవ తార్కాణంగా వరంగల్ జిల్లా చినపెండ్యాలలోని పెండ్యాలవారి కుటుంబం కనిపిస్తుంది. ఒకే కుటుంబంలోని అన్నదమ్ములు తమ జీవితాంతం సామాజిక మార్పుకోసం నిలబడ్డారు. అదే దారిలో కలంపట్టి రాశారు. వారు : పెండ్యాల రామానుజరావు, పెండ్యాల శేషగిరిరావు, పెండ్యాల చినరాఘవరావు, పెండ్యాల దామోదరరావు.

పెండ్యాల రామానుజరావు వరంగల్లు జిల్లాలో నిజాం వ్యతిరేక ప్రజాఉద్యమంలో క్రియాశీల పాత్ర వహించాడు. పెండ్యాల శేషగిరిరావు గ్రంథాలయ నిర్వహణలో, కాంగ్రెస్ కార్యకర్తగా, ఉపాధ్యాయుడుగా, పత్రికా విలేఖకుడుగా, రచయితగా సమాజం కోసం పనిచేశాడు. పెండ్యాల చినరాఘవరావు ప్రముఖ రచయితగా పేరు తెచ్చుకున్నాడు. వట్టికోట ఆళ్వారుస్వామి వారి సంపాదకత్వంలోని 'పరిసరాల'తో సహా ఎన్నో కథాసంకలనాలలో, పత్రికలలో రచనలు చేశాడు. పెండ్యాల దామోదరరావు ఉపాధ్యాయుడుగా వృత్తిని ప్రారంభించి పాఠశాల అభివృద్ధి కోసం తన శక్తి సామర్థ్యాలను వెచ్చించాడు. విద్యార్థుల బోధన కోసం ఎన్నో ప్రయోగాలు చేశాడు. పిల్లల కోసం పాటలు, కథలు, కవితలు రాశాడు. పదవీవిరమణ చేసినా కూడ జీవితాంతం టీచరుగానే కొనసాగాడు. పిల్లలకు పాఠాలు బోధించాడు.

## సూక్తి

పని చేయకుండానే చేసినాననేవాడు అధముడు.
కొద్దిగా చేసి కొండంత చేసినానని చెప్పేవాడు గర్వపోతు.
ఎంతో చేసి కొంచెమే చేసినానని చెప్పేవాడు సజ్జనుడు.

– ఆదిశంకరాచార్యులు

SCERT TELANGANA

9

# కోరస్

– సలంద్ర లక్ష్మీనారాయణ

## చదువండి – ఆలోచించి చెప్పండి.

"అన్నపురాసులు ఒకచోట
ఆకలిమంటలు ఒకచోట
హంసతూలికలొక చోట
అలసినదేహాలొక చోట
సంపదలన్నీ ఒకచోట
గంపెడు బలగాలొకచోట
వాసన నూనియలొక చోట
మాసిన తలలింకొక చోట
కమ్మని చకిలాలొక చోట
గట్టిదౌడలింకొక చోట"

– కాళోజీ

## ప్రశ్నలు:

1. ఈ కవితాపంక్తులు ఏ విషయం గురించి చెప్తున్నాయి?
2. అలసిన దేహాలకు ఏం కావాలి?
3. 'అన్నపురాసులు ఒకచోట – ఆకలి మంటలు ఒకచోట' అంటే మీకేం అర్థమైంది?
4. 'కమ్మని చకిలాలొకచోట – గట్టి దౌడలింకొక చోట' అనడంలో కవి ఉద్దేశం ఏమిటి?

## పాఠం ఉద్దేశం

తన చుట్టూ సమాజంలో జరుగుతున్న సంఘటనల మీద విద్యార్థికి ఒక అవగాహన కలిగి, ఏది మంచో, ఏది చెడో తెలుసుకొనేటట్లు చేయడం ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

**ప్రక్రియ – వచనకవిత**

ఈ పాఠం వచనకవిత ప్రక్రియకు చెందినది. ఛందో నియమంలేని స్వేచ్ఛాకవిత్వం వచనకవిత. చెప్పేది వచనం అయినా అందులో 'కవిత్వం' పాలు ఉంటేనే అది వచనకవితగా రాణిస్తుంది. ఇది భావం ప్రధానంగా కవితాత్మక పంక్తులతో సాగుతుంది. వచనకవితలు 'వస్తువు–అభివ్యక్తి– శిల్పం' ఆధారంగా ప్రతిభావంతమైనవిగా గుర్తించబడతాయి.

ఈ పాఠం సలంద్ర లక్ష్మీనారాయణ రాసిన 'చావుగీతం' కవితా సంకలనం లోనిది.

SCERT TELANGANA

## కవి పరిచయం



12-01-1956

17-09-1986

సలంద్ర లక్ష్మీనారాయణ నిజామాబాద్ పట్టణంలో జన్మించాడు. చిన్నతనం నుండే హేతువాద దృష్టిని ఏర్పర్చుకున్నాడు. 'వేడిగాలి' కవితా సంకలనం ద్వారా తన తొలి కవితా సంపుటిని అందించాడు సలంద్ర.

*1979*లో ఇతడు రచించిన 'చావుగీతం' కవితా సంపుటి సంచలనం సృష్టించింది. దళిత సాహిత్యోద్యమానికి పునాది అని చెప్పుకునే కవితలలో సలంద్ర రచించిన 'దళిత మానిఫెస్టో' అనే కవిత ప్రధానమైంది.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.



## ప్రవేశిక

వాస్తవాలు కఠినంగా ఉంటాయి. సమాజం కొత్త పోకడలను తొందరగా స్వాగతించదు. అయినా వాటిని గురించి పదే పదే చెబుతూ, ఆచరిస్తూ ఉంటే ఎన్నో ప్రయత్నాల తర్వాత గుర్తించి, ఆ తర్వాత అనుసరిస్తుంది కూడా. ఈ నిజం తెలిసిన కవి తన పాటకు సమాజం కోరస్ అవుతదని ఎంతో ఆత్మ విశ్వాసంతో ప్రకటిస్తున్నాడు. ఆ వైనాన్ని చదివి తెలుసుకుందామా?



SCERT TELANGANA

## I

నేను –
భూమికీ – ఆకాశానికీ ఉన్న
సంబంధాన్ని చెప్తే వీళ్ళు నవ్వుతారు,
నేను –
పువ్వుకీ – ముళ్ళకీ భేదం చెప్తే
వీళ్ళు కోప్పడుతారు,
నేను –
ప్రవాహానికీ నిశ్చలతకీ రూపం కల్పిస్తే
వీళ్ళు ససేమిరా ఒప్పుకోరు,
నేను –
ఆలోచనకీ – ఆచరణకీ అర్థం చెప్తే
వీళ్ళే అపార్థం చేసుకుంటారు,
నేను –
మేధస్సుకీ – మూర్ఖత్వానికీ
సామ్యం చూపితే వీళ్ళు
నా మీద రాళ్ళు విసురుతారు.
నాకు తెలుసు
నేను మీ ముఖాలు చూసుకొండంటూ
ప్రతిబింబం చూపిస్తే వీళ్ళు ఆ అద్దాన్ని
ముక్కలు చెక్కలుగా పగుల గొట్టేస్తారు.

## II

నేను –
గొంతెత్తి ఒంటరిగానే
పాట పాడినా మాటాడినా
నా గొంతు నొక్కేయ ప్రయత్నిస్తారు,
నేను –
ఒంటరిగా ఆలోచనలలో
ఊరికే ఊసుపోక పరుగులు తీస్తే
నన్ను పిరికి వెధవననీ

### ఆలోచించండి –చెప్పండి

- 'భూమికి – ఆకాశానికి ఉన్న సంబంధం చెప్తే కొందరు నవ్వుతారు' – అని కవి అనడానికి కారణం ఏమిటి?
- 'ప్రవాహం – నిశ్చలత'కు తేడాను మీరెట్లా అర్థం చేసుకుంటారు?



SCERT TELANGANA

మూర్ఖున్ననీ
చూపుడు వేళ్ళతో చంపేస్తారు
అయినా నాకు తెలుసు
రేపు వీళ్ళే
నా పాటకి కోరస్ అందుకుంటారు –
నాకు భయం లేదు
నేను నేడు
ఈ పాట
ఒంటరిగానే పాడుకుంటాను!

### ఆలోచించండి –చెప్పండి

- 'గొంతు నొక్కేయడం' అనే పదంలో విశేషార్థంపై మాట్లాడండి.
- 'ఒంటరి' అంటే మీకేం అర్థమయ్యింది?
- "చూపుడు వేళ్ళు' – అన్న కవి మాటలో కవి భావనను ఎట్లా అర్థం చేసుకున్నారు?

## సారాంశం

సమాజం కొత్త ధోరణులను, వాస్తవాలను అంత తొందరగా అంగీకరించదు. ఆ విషయాన్ని గురించే కవి ఆవేదన వ్యక్తం చేస్తూ పలు విధాలుగా తన ప్రశ్నలను, సందేహాలను 'కోరస్' కవితలో లేవనెత్తుతాడు.

భూమికి ఆకాశానికి మధ్య ఎంత దూరం ఉన్నా వాటికున్న సహజ సంబంధాన్ని గుర్తించాలి. పూలకున్న సౌకుమార్యాన్ని, ముళ్ళకున్న కాఠిన్యాన్ని గ్రహించాలి. నీటి ప్రవాహంలోని చైతన్యానికి, నీటి స్తబ్దతకు గల తేడాను అర్థం చేసుకోవాలి. ఏవేవో చేయాలనుకునే ఆలోచనలకు, ఏమీ చేయలేనితనానికి మధ్యగల స్థితిని తెలుసుకోవాలి. ఇవేమి అంగీకరించకుండా తెలుసుకోకుండా కోపంతో అపార్థం చేసుకోవద్దని కోరుతున్నాడు కవి. మార్పులను గుర్తించలేని మేధావులను పునరాలోచన చేయమంటే తననే నిందిస్తారని వాపోతాడు కవి. ప్రజలకు ఏది ఉపయోగకరమో గ్రహించలేనివాళ్ళు, ప్రజల పక్షం నిలబడని వాళ్ళు నిజమైన మేధావులు కాదనే సత్యాన్ని గ్రహించమంటున్నాడు కవి.

కవి ఎవరికోసం చూడకుండా ఒంటరిగానే తన ప్రగతిశీల భావాలను గొంతెత్తి పాడుతానంటాడు. తన పాటను అడ్డుకోవాలని, తన మాటను అణచివేయాలని చూసేవాళ్ళకు భయపడనంటాడు. పిరికివాడిగా మూర్ఖుడిగా ముద్రవేసినా లెక్కజేయనంటున్నాడు కవి. నిజానికి తన పోరాటం, వాదన వ్యక్తులమీద కాదని, పనికిరాని వ్యవస్థల మీదనే అని తెలుపుతాడు. భవిష్యత్తులో తనను వ్యతిరేకించినవాళ్ళే వాస్తవాన్ని గ్రహించి తన మాటతో ఏకీభవిస్తారని, తన పాటతో గొంతు కలుపుతారని (కోరస్ అందిస్తారని) ఆశావహదృక్పథాన్ని వెల్లడిస్తాడు. అప్పటివరకు తను ఒంటరిగానే భయం లేకుండా తన భావనలను ప్రకటిస్తానని ఆత్మవిశ్వాసంతో పలుకుతాడు కవి.

SCERT TELANGANA

# ఇవి చేయండి

## I. అవగాహన - ప్రతిస్పందన

1. 'కోరస్' అనే పేరు వినగానే మీకేమనిపించింది? 'కోరస్' అనే పేరు ఈ కవితకు సరిపోతుందా? ఎందుకు? మీ అభిప్రాయం చెప్పండి.
2. 'కోరస్' కవిత ద్వారా కవికి సమాజం పట్ల ఉన్న భావన ఎటువంటిదని భావిస్తున్నారు? చర్చించండి.
3. కింది కవితా పంక్తులు చదువండి. భావం రాయండి.

ఆకులు లేకుంటే
చెట్టునెలా గుర్తిస్తావు?
పచ్చదనమే చెట్టుకు చిరునామా!
చెరువులో బంగళాలు మొలిచాయి
నీటి తల్లికి ఇన్ని సమాధులా!
చెట్టుతనం కట్టెతనమయ్యింది
చిగురుకలలేవి? చిటపటలుతప్ప?

4. 'కోరస్' కవిత నుండి - కింది భావాలకు తగిన కవితా పంక్తులు గుర్తించండి.

అ) నాకు భయమన్నదే లేదు - నేను ఒక్కడినే నా పాట పాడుకుంటా.
ఆ) నేను స్తబ్దంగా వుంటే పిరికివాడంటారు.
ఇ) వీళ్ళ అసలు రూపాలు చూపిస్తే, తట్టుకోలేక నన్నే విమర్శిస్తారు.
ఈ) ఆలోచనలకు వాటి అమలుకు మధ్య రూపమిస్తే వీళ్ళు అంగీకరించరు.

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

అ) తన మీద రాళ్ళు విసురుతారని కవి భావించడంలో అంతరార్థం ఏమిటి? వివరించండి.
ఆ) మేధస్సు, మూర్ఖత్వం మధ్య తేడా ఏమిటి?
ఇ) కవి దృష్టిలో మేధావులంటే ఎవరు?
ఈ) 'గొంతునొక్కేయడం' అంటే మీకేమి అర్థమయింది? ఒక ఉదాహరణ తెలుపండి.

SCERT TELANGANA

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) 'కోరస్' పాఠ్యభాగ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

**3. కింది అంశం గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.**

అ) కవి సలంద్ర ఆలోచనలను, ఈ కవిత అంతరార్థాన్ని ప్రశంసిస్తూ ఏదైన ఒక సాహిత్య పత్రికకు లేఖ రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది పదాలకు అర్థాలు రాయండి. ఆ పదాలతో సొంతవాక్యాలు రాయండి.**

మేధస్సు = తెలివి

ఉదా: వికసించిన మానవుని మేదస్సు ప్రపంచ ప్రగతికి కారణమైంది.

అ) ఆచరణ =

ఆ) ప్రతిబింబం =

ఇ) నిశ్చలత =

ఈ) కోరస్ =

**2. కింది జాతీయాలను వివరించండి.**

అ) రాళ్ళువిసరడం =

ఆ) గొంతునొక్కేయడం =

### వ్యాకరణాంశాలు

**1. కింది పదాలను విడదీసి సంధుల పేర్లను రాయండి.**

అ) చూసుకొంటూ = ____________ + ____________ = ______________________

ఆ) గొంతెత్తి = ____________ + ____________ = ______________________

**2. కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసాల పేర్లు రాయండి.**

అ) ముక్కలుచెక్కలు = ______________________, ______________

ఆ) గొంతునొక్కేయటం = ______________________, ______________

ఇ) నా పాట = ______________________, ______________

SCERT TELANGANA

3. **కింది పంక్తులను గమనించి వాటిలో వున్న అలంకారాలను గుర్తించి రాయండి.**

- పువ్వుకీ - ముళ్ళకీ భేదం చెప్తే
  ప్రవాహానికీ నిశ్చలతకీ రూపం కల్పిస్తే
  ఆలోచనకీ - ఆచరణకీ అర్థం చెప్తే
- కిశోర్ లేడిపిల్లలా పరుగెత్తుతున్నాడు.
- మీ ఇంటి వాతావరణం పండుగ వాతావరణమా అన్నట్లున్నది.

4. **కింది వాక్యాలను కర్మణి వాక్యాలుగా రాయండి.**

అ) ఆయన ప్రశ్నలను, సందేహాలను 'కోరస్' కవిత ద్వారా లేవనెత్తాడు.

ఆ) నా మీద రాళ్ళు విసురుతారు.

## ప్రాజెక్టు పని

- **తెలుగు కవిత్వంలో అభ్యుదయ కవులుగా పేరు పొందిన ఎవరిదైన ఒకరి కవితలను సేకరించి నివేదిక రాసి చదివి వినిపించండి.**

## మీకు తెలుసా?

### తెలంగాణ సాయుధపోరాటం

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి రద్దు కోసం, జమిందారి మరియు భూస్వామ్య విధానాల రద్దు మరియు నైజాం రాజరిక వ్యవస్థకు వ్యతిరేకంగా 1946 నుండి 1951 వరకు ప్రజలు చేసిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం. ఆనాటి రోజుల్లో ప్రజలకు పౌరసత్వ హక్కులు లేవు. సమావేశం జరుపుకునే వీలు లేదు. సభలు, సంఘాలు పెట్టుకొనే అవకాశం లేదు. దుర్మార్గపు అధికారులను కోర్టులలో సవాలు చేసే అధికారం లేదు. దోపిడీ పెత్తందార్లు ఏది శాసిస్తే అది అమలు జరిగేది. వారు కొట్టిన, తిట్టిన, ఇళ్ళమీదపడి దోపిడి చేసిన, పంటపొలాల్లోపడి లూటీచేసిన, చంపివేసిన నోరు మూసుకొని భరించవలసిందే. ఆడపడచులకు మాన రక్షణ లేదు. సదరు దోపిడి పెత్తందార్లు, జమిందార్లు సాగించే దుశ్చర్యలను, దోపిడి వ్యవస్థను కూకటివేళ్ళతో కూల్చివేయాలని ప్రజలు నిర్ణయానికి వచ్చారు. ఇందుకోసం ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ పోరాటంలో సుమారు 4000 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనివల్ల భూస్వామ్య విధానం, జమిందార్ల విధానం రద్దుచేయబడింది. సుమారు 3000 గ్రామాలు విముక్తి అయినాయి.

- మూలం : తెలంగాణ సాయుధపోరాటం, వెలపాటి రామరెడ్డి, తెలుగు అకాడమి ప్రచురణ.

## సూక్తి

మొలక లక్ష్యం - అడవి
చినుకు లక్ష్యం - సంద్రం
మనిషి లక్ష్యం - మనీషి

SCERT TELANGANA

# 10 వాగ్భూషణం

– డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి

## చదువండి – ఆలోచించి చెప్పండి.

మాటల కోటలు గట్టి
మహారాజుగా మసలుతాడొకడు
మాట చేటలతో
మనసు చెరిగి పోతాడొకడు
మాటలు బాటలు వేస్తాయి
మాటలు పాటలు రాస్తాయి
మాటలు లేకపోతే
కవిత లేదు
గానం లేదు
నాగరికత లేదు
నవ్యత లేదు
జాగృతి లేదు
చైతన్యాకృతి లేదు
వెలుగును చూపించేది
విశ్వాన్ని నడిపించేది
వాక్శక్తి వాగ్రక్తి

– వేముగంటి నరసింహాచార్యులు

## ప్రశ్నలు:

1. ఈ కవితను ఎవరు రాశారు? ఇది దేని గురించి చెప్పుతుంది?
2. మాటల గొప్పతనం ఏమిటి?
3. మంచిగా మాట్లాడడం అంటే ఏమిటి?
4. వాక్శక్తి, వాగ్రక్తి అంటే ఏమి అర్థమైంది?

## పాఠం ఉద్దేశం

'ఉపన్యసించడం' గొప్పకళ. మంచి వక్త కావాలంటే ఎట్లాంటి సూచనలు పాటించాలి? ఉపన్యాసం కోసం ఎట్లా తయారు కావాలి? ఎట్లా మాట్లాడాలో తెలియజేస్తూ విద్యార్థులను మంచి వక్తలుగా తయారుచేయాలన్నదే ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'వ్యాస'మనే ప్రక్రియకు చెందినది.
డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి రాసిన 'వాగ్భూషణం భూషణం' అనే పుస్తకంలోనిది.

SCERT TELANGANA

## రచయిత పరిచయం



12-07-1930

26-04-1989

డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి గారు 1930లో మహబూబ్‌నగర్‌లో జన్మించారు. సంస్కృతాంధ్రాంగ్ల ఉర్దూ హిందీ భాషలలో చక్కని ప్రవేశం కలవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేశారు.

'యువభారతి' సాహిత్య సాంస్కృతిక సంస్థకు అధ్యక్షులుగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సంస్థల కార్యదర్శిగా, తెలంగాణా రచయితల సంఘ కార్యదర్శిగా పనిచేశారు. మహబూబ్‌నగర్‌లోని శ్రీ సీతారామాంజనేయ గ్రంథాలయం ద్వారా హైదరాబాదు రాష్ట్రవిమోచనోద్యమంలో పాల్గొని జైలు శిక్షననుభవించారు.

తెలుగు - ఉత్తర భారత సాహిత్యాలు, చాటువులు, వాగ్భూషణమ్, వేగుచుక్కలు, వెలుగుబాటలు, అడుగుజాడలు, వెలుగు చూపే తెలుగు పద్యాలు, దేశమును ప్రేమించుమన్నా మొ॥వి వీరి రచనలు. 'కవి సమయములు' వీరి సిద్ధాంత గ్రంథం. ఎన్నో కథానికలను, వచన కవితలను రాశారు. పఠనీయం శీర్షికతో 39 ఉత్తమగ్రంథాల పరిచయాలను రాశారు. 1989లో పరమపదించారు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.

## ప్రవేశిక

మాట్లాడడం మనిషికి మాత్రమే లభించిన మంచి వరం. మాటలను అందంగా, ఒక పద్ధతి ప్రకారం, అనుకున్న అంశం మీద అల్లుకుని మాట్లాడితే అది ఉపన్యాసం అవుతుంది. ఉపన్యాసం ఒక కళ. మాట్లాడే నైపుణ్యం ఉపన్యాసకళను పెంపొందించడమే గాక 'ఉపాధి' అవకాశాలనూ కల్పిస్తుంది. మరి మాట్లాడేకళపై ఎట్లా పట్టుసాధించాలనే ప్రశ్నకు సమాధానమే ఈ వ్యాసం.

SCERT TELANGANA

## I

వక్తృత్వం ఒక కళ. ఒక విద్య. శ్రద్ధతో, సాధనతో అలవడే కళల్లో ఇది ఒకటి. ప్రతి మనిషిలో అంతర్లీనంగా ఈ శక్తి ఉంటుంది. అది ఉద్దీప్తం అయినప్పుడు అతడు వక్త అవుతాడు. అన్ని శక్తి సామర్థ్యాలకు కేంద్రం మనస్సు. ఎన్నో శక్తులు అందులో నిక్షిప్తమై నిద్రాణమై ఉంటాయి. వాటిని ఉత్తేజ పరచడంవల్ల, మేల్కొల్పడంవల్ల అవి బయల్వెడలి తమ ప్రభావాన్ని, మహిమలను ప్రదర్శిస్తాయి. జీవితంలో ఏదైనా సాధించాలనుకుంటే, ముందుకు సాగిపోవాలనుకుంటే, ఇతరులను ఆసరాగా తీసుకునే అలవాటును మానుకోవలసి ఉంటుంది. తనలోని ప్రత్యేకతను ప్రదర్శించే ప్రయత్నం చేయడమే పౌరుషం. తనకు కలిగిన భావాలను శక్తివంతంగా ప్రసారం చేయదల్చుకున్నప్పుడు వక్తృత్వం విశేషంగా ఉపయోగపడుతుంది. సంఘంలోని ఎన్నో అపోహలనూ, దురూహలను పోగొట్టగలుగుతుంది. దేశాన్నీ, సంఘాన్ని కలవరపెడుతున్న సమస్యలకు తాను పరిష్కారం చూపాలనుకున్నప్పుడు మౌనం కంటె, భాషణం మంచి సాధనం. జీవితంలో వాక్‌శక్తి నిర్వహించే పాత్ర అమేయమైనది. కొంత సాహసించి, కొంత ప్రయత్నించి తనలోని పఠనశక్తిని వెలికితీసి ప్రయోగించవలె. ఏ మాత్రం సాహసం చేయకపోతే మనిషి పరభాగ్యోపజీవిగా దుఃఖాన్నే అనుభవిస్తాడు. దాస్యానికి తల ఒగ్గుతాడు. బాహిరంగా మనిషిపైన ఎవడైనా ఒత్తిడి చేయగలడేమో కాని మనస్సును ఏమీ చేయలేడు. అభ్యుదయపథంలో మనిషి తాను సాగుతున్నప్పుడు తనకు ఎదురౌతున్న కష్టాలనూ, తనను వరిస్తున్న విజయాలను ఇతరులకు సమంజసమైన పద్ధతిలో చెప్పడంవల్ల సమాజానికి ఎంతో మేలు చేకూరుతుంది. కనుక వక్తృత్వశక్తి వైయక్తిక ప్రయోజనాలకే కాదు, సామాజిక ప్రయోజనాలకు కూడా తోడ్పడుతుంది.

వాక్‌శక్తి మనిషికి వరప్రసాదం. మనిషికీ పశువుకీ భేదం ప్రధానంగా వాక్కు వల్లనే కలుగుతున్నది. ఇది తప్ప మనుషులకూ, పశువులకూ అన్ని లక్షణాలు ఒకటే. ఆహారం కోసం నోటినీ, శ్వాసకోసం ముక్కును సృష్టికర్త ఏర్పాటు చేసినాడు. అయితే మనిషి తన తెలివితేటలవల్ల భాషను సృష్టించుకొన్నాడు. భాష సహజం కాదు కృత్రిమం. అలవాటు. మనిషి మారుతున్న కొద్దీ అదీ మారుతూ ఉంటుంది. ఆ భాషలో నైపుణ్యాన్ని సంపాదించుకోవడం మనిషి చేతుల్లోనే ఉంది.

భాషా ప్రయోగం ఎన్నో రకాలుగా ఉంటుంది. మాట్లాడగలగడం అందులో ఒకటి. మాట ఎంత క్లుప్తంగా, ఎంత అర్థవంతంగా, ఎంత అందంగా, ఎంత వినసొంపుగా ఉంటే అంత శక్తివంతమవుతుంది. శక్తిని బట్టి సాక్షాత్కారం. మాటకున్న శక్తి అనంతం, అప్రతిహతం. అది జాతికి ఊపిరిపోస్తుంది. దేశాన్ని జాగరితం చేస్తుంది. ధర్మాభిరతిని కలిగిస్తుంది. మండుతున్న ద్వేషానలాన్ని ఆర్పివేస్తుంది. మంచివాక్కు కల్పతరువు. వక్తృత్వశక్తి ఆత్మశక్తికి మరోపేరు. ఆ శక్తిని గుర్తించడంలోనే వుంది మానవుని జీవిత సాఫల్యం. వివేకానందస్వామి ఒక ప్రసంగంలో దైవంపైన విశ్వాసంలేని వాళ్ళతో తనకు ఆసక్తి లేదని, ఆత్మవిశ్వాసంలేని వాళ్ళను చూస్తే తనకెంతో బాధకలుగుతుందన్నారు. నిజంగా ఆత్మవిశ్వాసమే వుంటే దీనుడై పడి ఉండడు. తన మనశ్శక్తులను నమ్మి వాటిని మేల్కొల్పగలిగితే అతణ్ణి అదృష్టం వెదుక్కుంటూ వస్తుంది. మనిషి మనస్సు, వాక్కు, శరీరం ఏ విధంగా నడుచుకుంటాయో అదే విధంగా అతని అదృష్టం కూడా రూపుదిద్దుకుంటుంది. కనుక ప్రయత్నమే తపస్సు.

వక్తృత్వకళలో ఎవరైనా మంచి నేర్పు సంపాదించుకోవచ్చు. గణకులు, వ్యాపారులు, వైద్యులు, న్యాయవాదులు, కమీషన్ ఏజెంట్లు, హోటలువాళ్ళు, సాంఘిక కార్యకర్తలు, రైల్వే పనివారు, ప్రచురణకర్తలు, ఇంకా ఎన్నో వృత్తుల్లో వున్నవాళ్ళు, ఈ కళను నేర్చుకోవచ్చు. తమ భవిష్యత్తును బంగారుబాటపై నడిపించుకొనవచ్చు. అందరికి ఈ కళను నేర్చుకునే అధికారం



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

SCERT TELANGANA

ఉన్నది. అందరి వాక్కులో అద్భుతశక్తి ఇమిడి వున్నది. ప్రతి వ్యక్తి నిరంతర ప్రయత్నం వల్ల ఈ కళలో కౌశలాన్ని సంపాదించుకోగలుగుతాడు.

## ఆలోచించండి-చెప్పండి

- 'సమాజ సమస్యల పరిష్కారానికి మౌనం కంటె భాషణం మంచి సాధనం' - దీనిపై చర్చించండి.
- "మనిషికీ, పశువుకీ ప్రధాన భేదం వాక్కు" అన్నాడు రచయిత - అటువంటి వాక్శక్తిని ఎట్లా పెంపొందించుకుంటారు?
- 'వక్తృత్వశక్తి ఆత్మశక్తికి మరోపేరు' ఎట్లాగో చెప్పండి.
- వాక్శక్తిని అర్థం చేసుకుంటే ఏ ఏ రంగాల్లో రాణించవచ్చు? చర్చించండి.

## II

ఇక ఈ కళను అలవరచుకునే పద్ధతులను వివరించే ప్రయత్నం చేస్తాను. ఈ కళను నేర్చుకోవడానికి ఎంతవరకు చదువుకోవాలె? అన్న ప్రశ్నకు సరియైన సమాధానం చెప్పడం కష్టం. గొప్ప విద్వాంసులు కూడా ఏమీ మాట్లాడలేని పరిస్థితిని మనం చూస్తున్నాం. కానీ కొద్దిపాటి అక్షరజ్ఞానం ఉన్నవారు స్పష్టంగా అందమైన భాషలో మాట్లాడడం మన అనుభవంలో ఉన్న సంగతే. నిరక్షరాస్యులైన గ్రామీణులు ఎందరో ఈ కళలో ఆరితేరినవాళ్ళుగా మనకు కన్పిస్తారు. శ్రోతలను వాళ్ళు ఆకట్టుకుంటారు. వాళ్ళ మాటలను ఎంతో శ్రద్ధతో, ఉత్సాహంతో వింటున్న శ్రోతలను చూస్తుంటే మన ఆశ్చర్యానికి అంతుండదు.

వక్తృత్వకళ ప్రయోజనాత్మకమైనది. శ్రోతలకు నమ్మకం కల్గించడం దీని లక్ష్యం. విద్యార్థులు అన్ని కళలకంటె ఉన్నతమైన ఈ కళపట్ల ఉదాసీనంగా ఉండడం దిగ్భ్రాంతిని కలిగిస్తున్నది. చదువుతో నిమిత్తం లేకుండా వక్తృత్వకళ అలవడుతుందనే మాట వాస్తవమే. అయినా విద్వత్తులేని వక్తృత్వం ఎంతో కాలం అంతటా రాణించదు. సమున్నత ప్రమాణాలను అందుకోలేదు. విషయ గాంభీర్యానికి, సముదాత్త భావప్రసరణానికీ ఉపయోగపడలేదు. మంచి వక్త కావడానికి విద్యావిజ్ఞానాల అవసరం అంతగా లేకపోయినా కొంత మాత్రమైనా విద్య వుండడం అవసరం. చదువులేకుంటే తన దృక్పథాన్ని తర్కబద్ధంగా వక్త ప్రకటించలేడు. చదువెంత వస్తే అంత యోగ్యత ఉంటుంది. చెప్పిన మాటల్లో గాంభీర్యం వుంటుంది. సంస్కారం వుంటుంది. కళలు, సాహిత్యం, ఇతిహాసం, దర్శన శాస్త్రాలు రాజకీయాది సాంఘిక శాస్త్రాల పరిచయం, పరిశోధనాపటిమ - ఇవన్నీ వక్త ఉపన్యాసాన్ని సజీవంగానూ, ప్రభావోపేతంగానూ చేస్తాయి.



మీకు అబ్బిన చదువు. మీకున్న కొద్దిపాటి అనుభవంతో మీరు ఈ కళను నేర్చుకోవచ్చు. ఎప్పుడైనా మనకు పనికివచ్చే సామర్థ్యం వేరు. మాట్లాడవలసి వచ్చినప్పుడు పనికివచ్చే సామర్థ్యం వేరు. మాటలాడేటప్పుడు మనం ఎన్నో మరచిపోతాము. మనకు బాగా జ్ఞాపకం వున్నాయన్న నమ్మకం కూడా ఒక్కొక్కసారి ఉడిగిపోయి సరిగ్గా మాట్లాడే సమయానికి మరుపుతట్టుతుంది. ఈ సందర్భంలోనే చాలామంది జ్ఞాపకశక్తి

SCERT TELANGANA

పనిచేయదు. శ్రోతలలో ఒక్కొక్కసారి మీకంటె ఎక్కువ తెలిసినవారుంటారు. మీరు మాట్లాడుతున్న అంశాలలో దోషాలున్నాయనే సంగతి తెలిసికూడా మౌనం వహిస్తారు. కారణం? మాట్లాడే సాహసం లేకపోవడమే.

ఎక్కువ చదువుకోలేదని మీరు సభలో ఒకమూల నక్కి కూర్చోకండి. ఇది ఆలోచనలనూ, వ్యక్తిత్వాన్ని చంపుకోవడం అవుతుంది. మీకూ ఒక వచశ్శైలీ ఉందనీ, మీకూ ఒక ఆలోచనా పద్ధతి ఉందనీ మీరనుకోండి. మీ దృక్పథాన్ని అందరి ముందూ పెట్టే అధికారం మీకుందని తెలుసుకోండి. సరళమైన భాషలోనే మీ భావాలను ప్రకటించడానికి ప్రయత్నించండి.

భయాన్నీ, అనుమానాన్నీ వదులుకున్నవాడు వక్తగా రూపొందడంలో ఏమీ సందేహం లేదు. శ్రోతల ఎదుట ఉపన్యాసం చేయడం నవ్వులాట కాదు. ఇది సాహసం. సభలో మాట్లాడకపోవడానికి కారణం భయం. మనిషి అన్ని వేళల్లోనూ భయపడడు. అతడు భయపడే సందర్భాలు కొన్నే వుంటాయి. భయం మనశ్చైతన్య లక్షణం కాదు. మనస్సు అజ్ఞాతంగా వున్నప్పుడే భయం చొరబడుతుంది. ఈ భయాన్ని వదలిపెట్టండి. సంకుచిత మనస్తత్వాన్ని, స్వార్థాన్ని, ఆత్మవంచనను, క్షుద్రత్వాన్ని, సుఖాలకు లొంగిపోయే బలహీనతలను దూరం చేసుకోండి. సభలో నిల్చి మీ మనస్సులో ఉన్న భావాన్ని జడుసుకోకుండా, బిడియపడకుండా అనండి. ధారాప్రవాహంగా అనండి. మీరేం మాట్లాడుతున్నారు? ఎలా మాట్లాడుతున్నారు? అనే చింతను వదిలిపెట్టండి. అన్నిటికంటే ముందు అనవసరమైన భయాన్ని మనసులో నుంచి తీసివేయండి. నిర్భయుడు అజేయుడు కదా! భయాన్ని వదులుకుంటేచాలు. భాషలో స్పష్టత వస్తుంది. నాలుగైదుసార్లు సభలో ప్రసంగించడానికి భయాన్ని వదిలి ప్రయత్నించండి. ఆ తరువాత మాట్లాడే అవకాశం కోసం మీరే ప్రయత్నాలు చేస్తారు. ప్రజల మనః ప్రవృత్తులను అర్థం చేసుకొని సహృదయంతో చేసిన ఉపన్యాసం శ్రోతలకు రసానందాన్ని పంచిపెడుతుంది. సహృదయులైన వక్తలు సాహిత్య ప్రచారానికి ఎక్కువగా ఉపయోగపడతారు. శ్రోతల హృదయాలలో ఆర్ద్రతను, రసికతను కలిగిస్తారు. సహృదయుని ఉపన్యాసంలో ఆవేశం కట్టలు తెంచుకొని పారుతుంది.



కొన్ని కొన్ని సందర్భాలలో ఉపన్యాసాలవల్ల ప్రజా హృదయాలలో ఆవేశం పొంగులెత్తుతుంది. అగ్ని పర్వతాలు ప్రజ్వలిస్తాయి. కన్నీటిమున్నీటిలో తలమునకలౌతారు. కార్యోన్ముఖులౌతారు. నవరసభరితాంతరంగులౌతారు.

### ఆలోచించండి - చెప్పండి

- 'అన్ని కళలకెల్లా ఉత్తమమైనది వక్తృత్వకళ' దీని ప్రయోజనాన్ని సమర్థిస్తూ మాట్లాడండి.
- 'మాట్లాడటం సాహసమే' అని రచయిత ఎందుకు అన్నాడు?
- 'భయాన్ని, అనుమానాన్ని వదులుకున్నవాడు వక్తకాగలడు' – దీనిపై మీ అభిప్రాయం చెప్పండి.

## III

ఒక వాగ్మి ఉపన్యాసం మహత్తర ఐతిహాసిక ఘట్టంగా ప్రజాహృదయాలలో నిలిచిపోతుంది. ధృతరాష్ట్రుని కొలువులో శ్రీకృష్ణుడు చేసిన ఉపన్యాసం, విశ్వమత మహాసభలో వివేకానందస్వామి చేసిన ఉపన్యాసం, పెటిన్‌బర్గ్‌లో అబ్రహాంలింకన్ చేసిన ఉపన్యాసం, మన స్వాతంత్ర్య సమరం ముమ్మరంగా జరుగుతున్న దినాలలో బిపిన్ చంద్రపాల్, మౌలానా ఆజాద్, సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ వంటి ధీరోదాత్తుల ఉపన్యాసాలు ఈ కోవకు చెందినవే. మహోత్సాహంతో మాట్లాడుతున్నప్పుడు ఉత్తేజకరమైన భావాలను ప్రకటిస్తున్నప్పుడు మనస్వి అయిన వక్త కన్నులలో, కనుబొమ్మలలో, చేతులలో, ముఖంలో కొన్ని విశేషమైన కదలికలు కనిపిస్తూంటాయి. అయితే ఏ ప్రభావాన్ని ప్రకటించడానికి ఏ కదలిక అవసరం? అన్న ప్రశ్నకు సమాధానం దొరకడం కష్టం. సమాధానం నృత్యశాస్త్రంలో దొరకవచ్చు. కాని ఈ అంగసంచాలనం వైయక్తికం. ఇందులో ఒక పద్ధతి హృదయోద్భూత భావ ప్రకటనం, వక్త తన భావాలను ప్రకటిస్తున్నప్పుడు అంగాంగ విన్యాసం చెయ్యాలనే నియమం ఏదీ లేదు. అవి సహజంగానే జరిగిపోతూ ఉంటాయి. ఏ మాత్రం కదలకుండా పరిమితమైన అంగవిన్యాసం చేస్తూ స్తంభంలా నిలబడి ప్రసంగించిన వక్తలు లేకపోలేదు.

ఏ విషయాన్ని గురించి ప్రసంగించాలి? ఉపన్యాస సందర్భంలో ఏ అంశాన్ని వదిలిపెట్టాలి? ఏ అంశానికి ప్రాధాన్యం యివ్వాలి? ప్రభావం ప్రకటించడానికి ఏ శబ్దాలను ప్రయోగించాలి? ఎలాంటి శబ్దాలంకారాలను ఉపయోగించుకోవాలి? ఏ ఏ అంశాలను పునశ్చరణ చేయాలి? ఈ విషయాల నన్నిటిని వక్త వివేకంతో పరిశీలనం చేసుకొని తగిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి.

కన్నులకు కట్టినట్టు ఒక అంశాన్ని అభివర్ణించి చెప్పడంలో వక్త చాలా మెలకువతో ప్రవర్తించవలసి వుంటుంది. తన మనఃస్థితిని నిగ్రహించుకుంటూ శ్రోతల సంస్కారాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రసంగించవలసి వుంటుంది. మీరు మాట్లాడ్డానికి నిలిచి ఉన్నప్పుడు మిమ్మల్ని మీరు మరచి వక్తవ్యాంశం మీదనే మనస్సును కేంద్రీకరించండి. మీ వేషాన్నీ, మీ స్థితినీ మరచి భావప్రకటనకు పూనుకోండి. వక్తవ్యాంశం పట్ల తన్మయత్వం ఎంత గంభీరంగా ఉంటుందో శ్రోతలు అంత శ్రద్ధాసక్తులతో వినే ప్రయత్నం చేస్తారు.

వక్తకు పదజాలంతో చక్కని పరిచయం ఉండాలె. వాచ్య, లక్ష్య, వ్యంగ్యార్థాలతో పరిచయం ఉండాలె. అప్పుడే తన మనోభావాలను అతడు చక్కగా అభివ్యక్తం చేయగలడు. వ్యంగ్యార్థమే ధ్వని. ఇదే కావ్యసర్వస్వం. వాచ్యార్థం వల్ల కలిగే ఆనందం కంటే వ్యంగ్యార్థం వల్ల కలిగే ఆనందం విశిష్టమైనది. వ్యంగ్యార్థం ప్రతిపాదనం లేని భావసముదాయం చాలా సందర్భాలలో వక్తకు గౌరవం తెచ్చిపెట్టదు. తన మనోభావాలను వ్యక్తంచేసే శబ్దజాలం ఉన్న వ్యక్తి తన ఉపన్యాసాన్ని తన యిష్టప్రకారంగా చమత్కార స్ఫోరకంగా మలచి అందిస్తాడు. కావ్యం వలెనే ఉపన్యాసం కూడా వ్యంగ్యార్థాన్ని ఆశ్రయించినప్పుడే ఉత్తమ ఉపన్యాసం అవుతుంది.

SCERT TELANGANA

వక్తకు సమానార్థకాలతోనూ, పర్యాయవాచకాలతోనూ, చక్కని పరిచయం ఉండాలె. అప్పుడే అతను యథోచితంగా వాటిని ప్రయోగించుకోగలుగుతాడు. నిర్దుష్టమైన సుపరిష్కృతమైన వాక్యం బహుధా ప్రశంసాపాత్ర మవుతుంది.

ఏదైనా అంశాన్ని గురించి ప్రసంగం చేయాలనుకున్నప్పుడు మొట్టమొదలు ఆ విషయానికి సంబంధించిన సమాచారాన్ని అధ్యయన సామగ్రిని, సాధ్యమైనంత ఎక్కువగా సమకూర్చుకోండి. పుస్తకాలు చదివి, పత్రికలు చూసి, అనుభవజ్ఞులతో సంప్రదించి ఆ వక్తవ్యాంశాన్ని గురించిన పరిజ్ఞానాన్ని బాగా సంపాదించుకోండి. మీ దగ్గర ఎంత సామగ్రి సమకూరుతుందో, మీకు ఎంత జ్ఞానం జీర్ణమవుతుందో అంత మీరు నిర్భయంగా, నిస్సంకోచంగా ప్రసంగించడానికి వీలవుతుంది. లేకపోతే మాట్లాడేటప్పుడు తడబాటు తప్పదు. ఓటమి తప్పదు. తమలో ఒక న్యూనతాభావం వాళ్ల మనస్సుల్లో మౌనంగా నక్కి కూర్చుంటుంది. అనుక్షణం అనుమానాల దాడికి గురి అవుతారు. అప్పుడప్పుడు తమ విషయాన్ని వదిలి వ్యర్థంగా ఇతరాంశాలను గూర్చి మాట్లాడుతూ ఉంటారు. అతని వాగ్ధార ఎక్కడైనా ఆగిపోవచ్చు. చెప్తూతూ చెప్తూతూ ఎక్కడో ఆగిపోతారు. అనుమానం నీళ్ళు నమిలిస్తుంది. అందుకోసం ప్రసంగించడానికి పూర్వం సాధ్యమైనంతవరకు అధ్యయనం అవసరం. నలుగురినీ కలుసుకోండి. వాళ్ళతో చర్చించి విజ్ఞానం పంచుకోండి. విజ్ఞాన భాండాగారాన్ని సంపాదించి భద్రపరచుకోండి. జ్ఞానంతో సమానమైన వైభవంగాని, సంపదగాని లోకంలో ఏదీలేదు. సత్కావ్యపఠనం వల్లనూ, సజ్జన సాంగత్యం వల్లనూ జీవితం ధన్యమవుతుందనే సందేశాన్ని భారతీయ సంప్రదాయాభిజ్ఞులు తరతరాలకు అందిస్తూనే ఉన్నారు. వక్తృత్వం ఒక కళ మాత్రమే కాదు, జీవిత సాఫల్యానికి అనువైన మార్గం కూడా.

### ఆలోచించండి - చెప్పండి

- 'విశ్వమత మహాసభలో వివేకానంద స్వామి చేసిన ఉపన్యాసం ఒక ఇతిహాసఘట్టం' దీనిపై మీ అభిప్రాయం చెప్పండి.
- ఉపన్యాసానికి ముందు ప్రణాళిక అవసరం. ఎందుకు?
- వక్తకు ఎక్కువ పదజాల పరిచయం అవసరం. ఎందుకో చెప్పండి?

## IV

సామగ్రిని సేకరించుకోవడానికి ఎన్ని పుస్తకాలు చదివినా, ఎంత సమాచారం సేకరించినా మన మననశీలత, మన అనుభవం, మన సంస్కారం ఆ సామగ్రికి ఒక విలక్షణతను తెచ్చిపెట్టుతుంది. మన అందరి దృష్టి ఒకటికాదు. మన అనుభవాన్ని బట్టి, ఎవరి దృక్పథం వారికి ఏర్పడుతుంది. ఇది వ్యక్తిగతమైన విషయం. ఉపన్యాసంలో ఈ విషయమే ప్రధానంగా ఉబికి వస్తుంది.

వక్తకు జ్ఞాపకశక్తి చాలా అవసరం. వ్రాతవల్ల జ్ఞాపకశక్తి పెరిగే అవకాశం ఎక్కువవుతుంది. తాను ప్రతిపాదించదలచుకున్న విషయాన్ని ముందుగా వ్రాసుకుంటే మాట్లాడేటప్పుడు తడబాటు వుండదు. ధారాశుద్ధితో ప్రసంగం సాగుతుంది. శబ్దార్థాలంకారాలతోనూ, మంచి తూగుతో వాక్యరచన ఉన్న కొన్ని భాగాలను మౌనంగా కాక అప్పుడప్పుడు మౌఖికంగా చదివే ప్రయత్నం చేయాలె. మన తెలుగులో పోతన భాగవతంలోని కొన్ని వచనాలు యింకాకొన్ని ప్రాచీన కావ్యాలలోని లయబద్ధంగా ఉన్న వచనాలను, పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి 'సాక్షి' ఉపన్యాసాలను గొంతెత్తి తరచుగా చదువుకుంటే మంచి వచోవైఖరి అలవడుతుంది. కొన్ని భాగాలు కంఠస్థం కావడం కూడా మంచిది. ఒక పద్యాన్ని తీసుకొని దాని భావాన్ని తెలుపుతూ వ్యాఖ్యానించడం వల్లనూ, ఎవరెవరికో అర్థం చెబుతున్నాననే భావంతో మాట్లాడడానికి ప్రయత్నిస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. వక్తృత్వ శక్తి పెరుగుతుంది.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

మొదట్లో వక్తవ్యాంశానికి సంబంధించిన కొన్ని ముఖ్య వాక్యాలను ఒక చీటీపైన వ్రాసుకుని, ఏ అంశం మరచిపోకుండా క్రమబద్ధంగా వక్తవ్యాంశాన్నంతా చెప్పడం వల్ల కూడా స్మరణశక్తి పెరుగుతుంది. పెద్ద సభలో మాటలాడడానికి ముందే ప్రయత్నం చేయకూడదు. కొద్దిమంది పిల్లల ముందు తన మిత్రులముందు తనకు వచ్చిన భాషలో తనకు తోచిన భావాలను ప్రకటించడానికీ ప్రయత్నం చేయాలె. ఏదో ప్రత్యేకశబ్దాన్ని ఉపయోగించాలని కాని, ప్రత్యేకమైన శైలిని అవలంబించాలని కాని ప్రయత్నం చేయకూడదు. అద్దం ముందు నిల్చుని ఉపన్యసించడానికి ప్రయత్నం చేయడం కూడా ఒక పద్ధతి.

కొండమీద నిలబడి, నదీ తీరంలో నిలబడి ఏకాంతంగా కొండను, నదిని ప్రకృతిని ఉద్దేశించి మాట్లాడితే సభాకంపనం వల్ల కలిగే ఆటంకం దూరమవుతుంది. సభలో నిలిచి మాట్లాడితేనే వక్తృత్వం అనిపించుకుంటుంది. చాలామందికి ఎదుట ఉన్న శ్రోతలను చూడగానే భయం పుట్టుకొస్తుంది. అందుకే కొందరు ఏవైపో చూస్తూ ఏదో మాట్లాడినాను అనుకొని తృప్తిపడతారు. నిజానికి శ్రోతలు తన మాటలను ఎలా స్వీకరిస్తున్నారు అన్న జిజ్ఞాస వాళ్ళ ముఖాలను చూస్తేనే వక్తకు కలుగుతుంది. కొత్తగా మాట్లాడడానికి వక్తపూనుకున్నప్పుడు "శ్రోతలను చూడడంవల్ల రకరకాల విషయాలు తెలుస్తాయి. శ్రోతలలో ఎవరైనా ఒకరు తల ఆడిస్తూ తన వైపు చూస్తుంటే అతణ్ణి ఉద్దేశించి మాట్లాడుతున్నట్లు వక్త భావించాలె. దానితో కొంత భయంపోతుంది. క్రమక్రమంగా అందరి ముఖాలు చూసి ఏ మాత్రం జంకకుండా తన భావాలను ప్రకటించుకోవచ్చు.



ఒక ప్రసిద్ధ వక్త తన శ్రోతలను శిలామూర్తులనుకుని ప్రసంగం చేయడానికి ముందు పూనుకుంటే రాను రాను మంచి వక్తృత్వ శక్తి అలవడుతుంది అని సూచించాడు. శ్రోతలను ప్రభావితులను చెయ్యడానికి వక్తకున్న అనేక సాధనాల్లో ధ్వని ఒకటి. ఇక్కడ ధ్వని అంటే కంఠధ్వని. ఇది ఉపన్యాసానికి ఆత్మ. శ్రోతల సంఖ్యను బట్టి తన ధ్వనిని వక్త పరిమితులను కల్పించుకోవాలె. ఇప్పుడు లౌడ్‌స్పీకర్ యంత్రాలు వచ్చినవి కనుక ఎంత మెల్లగా మాట్లాడినా ధ్వనివిస్తరిస్తుంది. అయితే కొన్ని వాక్యాలను ఊనికతో పలకడం, కొన్ని

వాక్యాలను మందంగా పలకడం మంచి వక్తలు చేయవలసిన పని. వక్తృత్వంలో భావానుగుణమైన ధ్వని ప్రసారం వల్ల ఎక్కువ లాభం వుంటుంది. ఏ మాటను మృదులంగా ఉచ్చరించాలో, ఏ మాటను గట్టిగా ఉచ్చరించాలో, ఏమాటను నిదానంగా ఉచ్చరించడం వల్ల మంచిఅవగాహన కల్గేందుకు వీలుంటుందో, వక్త నిర్ణయించుకొని ప్రయోగించాలె. కొందరు వక్తలు 'ప్రేమ', అహింస, కరుణ వంటి పదాలను కూడా సింహంలా గర్జిస్తూ పలుకుతారు. మరి కొందరు రౌద్రరస భావాలను ప్రకటిస్తున్నారో లేక గొణుగుతున్నారో తెలియకుండా ఉచ్చరిస్తూ ఉంటారు. వాక్యాలు సాధ్యమైనంత చిన్నవిగా ఉండటం అవసరం. దీర్ఘమైన వాక్యాలు రచనల్లో ఉన్నప్పుడు అంత క్లేశాన్ని కలిగించవు. మళ్ళీ చదువుకోవచ్చు. సమన్వయం చేసుకోవచ్చు. కానీ ప్రసంగంలో దీర్ఘ వాక్యాలు శ్రోతలకు చీకాకుని కలిగిస్తాయి. వడివడిగా మాట్లాడటం భావ్యం కాదు. శ్రోతలు పట్టుకోలేరు. పైగా లౌడ్‌స్పీకర్ యంత్రంలో గడబిడ కలుగుతుంది.

వక్తృత్వంలో సమయ నియమం అతిముఖ్యమైన విషయం. తక్కువసేపు మాట్లాడినంత మాత్రాన శక్తిహీనుడు కాడు. నిజానికి గంటలకొద్దీ మాట్లాడేవాడు మంచివక్తకాడు. అయిదునిముషాలు మాట్లాడినా వక్తవ్యాంశం శ్రోతలకు అవగతమైతేచాలు. మరింతసేపు మాట్లాడితే బాగుండు అని ఉత్సుకత కలిగించే ఉపన్యాసాలే ఉత్తమమైనవి. సమయాతిక్రమణం వల్ల వక్తకు కీర్తిరాదు. అపోహల పాలవుతాడు. విషయం కూడా శ్రోతలకు తగినంతమేరకు అర్థం కాదు. ఎక్కువసేపు మాట్లాడాలనే ఉత్సాహం అనవసరమైన అంశాలకు దారితీస్తుంది. దీర్ఘోపన్యాసాలు చేసే కోరికను నిగ్రహించుకోవడం వల్ల వక్తకు మేలు కలుగుతుంది. శ్లథనం తప్పుతుంది. సుదీర్ఘ తర్కబద్ధమైన, సువ్యవస్థితమైన, క్లుప్తమైన ఉపన్యాసం గొప్పది. నిజానికి బాగా ఆలోచించేవాడు తక్కువ మాటలాడుతాడు. అందుకే అన్నాడు వేమన్న –

**ఆలోచించండి -చెప్పండి**

- వక్తకు జ్ఞాపకశక్తి ఎట్లా ఉపయోగపడుతుంది?
- మంచివక్త కావడానికి ఏం చేయాలి?
- 'బాగా ఆలోచించేవాడు తక్కువ మాట్లాడుతాడు' దీని గురించి మీ అభిప్రాయం తెలుపండి.

- కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా"
- గంగి గోవు పాలు గరిటెడైనను చాలు
  కడువెడైన నేమి ఖరము పాలు" అని

## V

ఒకసారి అబ్రహాంలింకన్‌ను ఎవరో గంటసేపు ప్రసంగించమన్నారట. గొప్ప వక్తగా ప్రసిద్ధిపొందిన ఆ మహనీయుడు సరేపదండి! అలాగే మాట్లాడుతాను" అని ఒప్పుకున్నారట. అప్పుడు "ఏమీ ఆలోచించనక్కర లేదా?" అని ప్రశ్నించినారట. లింకన్ "అయిదు నిమిషాలు మాట్లాడడానికి ఒక గంటసేపు ఆలోచించవలసి ఉంటుంది. గంటసేపు మాట్లాడడానికి ఆలోచన అనవసరం" అన్నాడట.

పరిమితకాలంలో అభిలషితార్థాన్ని అందివ్వగలగడం సామాన్య విషయం కాదు. ఎంతో తపస్సు వుంటేనే సాధ్యమవుతుంది. శబ్దప్రయోగంలో నిగ్రహం ఉంటేనే అది సాధ్యమవుతుంది. పాల్కురికి సోమనాథుడు–

"అల్పాక్షరములందు అనల్పార్థ రచన
కల్పించుటయ కాదె కవి వివేకంబు" అన్నాడు.

SCERT TELANGANA

ఈ సూక్తి కేవలం కవిత్వానికే వర్తిస్తుందనుకోవడం పొరపాటు. ఆ మనీషి చాలా విస్తృతమైన అర్థాన్ని అందించాడు ఈ ద్విపదలో.

'Brievity is the soul of wit' అన్న ఆంగ్లాభాణకం పాల్కురికి సోమనాథుని ఆలోచనకు ప్రతిధ్వని. వక్త ఈ సత్యాన్ని అవగాహన చేసుకుని సమయాన్ని, వక్తవ్యాంశాన్ని యోజించుకోవాలె. చెప్పదలచుకున్న అన్ని అంశాలను చెప్పి తన వక్తృత్వ కౌశలాన్ని బహిర్గతం చేయాలె. వక్త తనకూ, శ్రోతలకూ సమయం అమూల్యమైనదనే యథార్థాన్ని నమ్మి ప్రవర్తించాలె.

ప్రసంగాన్ని ప్రారంభించేటప్పుడు ఎంతో పదిలంగా. హృదయంగమంగా, తర్కబద్ధమైన వాక్యాలతో ప్రారంభించాలె. శ్రోతల్లో ఒక విధమైన ప్రభావాన్ని ప్రసరించగలిగే శక్తి ప్రసంగ ప్రారంభవాక్యాల్లోనే ఉండాలె. వక్త తొలి పలుకులు వినగానే శ్రోతలు యిది తమకు తెలుసుననీ, ఇందులో కొత్త ఏమీ లేదనీ, మాట స్పష్టంగా లేదనీ ఏవేవో వ్యాఖ్యానాలు చేసుకునే పరిస్థితి కల్పించకూడదు. వక్తవ్యాంశ హృదయం ప్రసంగం మధ్యలో వ్యక్తం కావాలె. ప్రసంగాంతంలో చాలా స్పష్టంగా, ఉత్సాహంగా, సంక్షిప్తంగా తన నిశ్చితాభిప్రాయాలను ప్రకటించాలె. సందిగ్ధంగా, భయం భయంగా, తొందర తొందరగా ప్రసంగం ముగిస్తే శ్రోతల్లో సదభిప్రాయం ఏర్పడడానికి అవకాశం వుండదు. వక్తవ్యాంశం స్పష్టంగా శ్రోతలకు బోధపడదు. పలువురు వక్తలు ప్రసంగాంతంలో తమ ఉపన్యాస సారాన్నంతా నాలుగువాక్యాల్లో చెప్పి ముగిస్తారు. ఉపన్యాసం కల్పించిన మనఃస్థితిని ఈ పద్ధతి గట్టిపరుస్తుంది.

మంచివక్తలుగా తయారుకావడానికి ముందు మంచివక్తలతో స్నేహం చెయ్యాలె. మనకు కలిగిన ఆలోచనలు, అనుభూతులు ఎంత వరకు యథార్థాలు? అన్న ప్రశ్నకు సమాధానాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తూ, నమ్మకంగా మనకేదైనా విషయం పరమ సత్యమని తెలిసినప్పుడే, దృఢంగా దాన్ని ప్రకటించడానికి యత్నం చేస్తూ ఉండాలె. పుస్తకాలలోని ప్రసిద్ధ ఉపన్యాసాలను అధ్యయనం చేస్తూ ఉండాలె. పిల్లల మధ్య నిలిచి మాట్లాడుతూ ఉండాలె. మన భాషను చక్కగా ఉచ్చరించే వాళ్ళను చూసి ఆయా అక్షరాల ధ్వనులను అనుకరించి స్ఫుటమైన ఉచ్చారణను అలవరచుకోవాలె.

భారతీయులు వాక్కును దేవతగా ఆరాధిస్తారు. వాక్కును పరిశుద్ధంగా ప్రయోగించడం పుణ్యమన్నారు. శాస్త్ర మర్యాదలకు లోబడిన వాక్కును పవిత్రమైన వాణిగా గుర్తించినారు. వాక్కు మనిషికి అలంకారం. ఎన్నడూ ఉడిగిపోని అలంకారం. చక్కనిభాష లేనివాడు మంచి వేషం వేసుకున్నా వ్యర్థమే. వాగ్ధార కృపాణధారకంటె పదునైనది. వాక్కు విశాలమైనది.

వక్తృత్వ కళారాధనం అక్షరాస్యులకు లక్ష్యం కావలె. సంస్కృతి పరిరక్షణకు పునాది కావలె. నిద్రాణమైన మనశ్శక్తి జాగృతం కావాలంటే వక్తృత్వ కళోపాసనం ఒక సాధనం. చక్కగా సంభాషించడం, మనోజ్ఞంగా సంభాషించడం, ఇతర మనస్సులకు హాయిని కలిగేటట్టు సంభాషించడం చీకటిలో దివ్వెవెలిగినట్టు సంభాషించడం, బర్బరత్వం, అజ్ఞానం, దారిద్ర్యం రూపు మాసిపోయేటట్టు సంభాషించడం బుద్ధిమంతుని లక్షణం.

### ఆలోచించండి - చెప్పండి

- 'అయిదు నిమిషాలు మాట్లాడడానికి ఒక గంటసేపు ఆలోచించవలసి ఉంటుంది. గంట సేపు మాట్లాడడానికి ఆలోచన అనవసరం' దీనిపై మీ అభిప్రాయాలు చెప్పండి.
- 'వాక్కు మనిషికి అలంకారం' దీన్ని సమర్థిస్తూ మాట్లాడండి.

SCERT TELANGANA



# ఇవి చేయండి



## I. అవగాహన - ప్రతిస్పందన

1. **"నోరు మంచిదైతే - ఊరు మంచిదౌతుంది" - దీన్ని సమర్థిస్తూ మాట్లాడండి.**
2. **కింది పదాలు ఈ పాఠంలో ఏ ఏ పేరాల్లో ఎన్నో పంక్తిలో ఉన్నాయో గుర్తించి, వాటి ప్రాధాన్యాన్ని చర్చించండి.**

అ) ధారాశుద్ధి    ఆ) వక్తృత్వకళోపాసనం    ఇ) ఊనిక

ఈ) వచశ్శైలి    ఉ) వ్యంగ్యార్థం    ఊ) తపస్సు

3. **కింది అంశాన్ని చదివి తప్పొప్పులను గుర్తించండి.**

మహాత్ములు ఒక విషయాన్ని సంకల్పించుకొని దానిని మాటల ద్వారా చెప్పి, చెప్పిన దానిని చేసి చూపిస్తారు. తలచింది చెప్పడం, చెప్పింది చేయడం అనేది చాలా కష్టమైన విషయం. అది యెంతటి మహాత్ములకో గాని సాధ్యపడదు.

**"మనసు, మాట, నడత మనిషికి ఒకటైన**
**మనిషి కాదు వాడు మహితుడౌను.**

మనసులోని ఆలోచన, మాట్లాడేమాట, నడిచే నడత ఈ మూడు ఒకటిగా వున్నవాడే మహాత్ముడు. మన మాటలకు మన చేతలకు మూలం మన ఆలోచనలు. కాబట్టి మన ఆలోచనలు సదాలోచనలు కావాలి. మనసులోని యోచన, మాటలోని సూచన, క్రియలోని ఆలోచన ఈ మూడు ఏకం కావాలి.

అ) మాటల ద్వారా చెప్పి, చెప్పిందాన్ని చేసేవారు మహాత్ములు. ( )

ఆ) చెప్పింది చేయడం చాలా సులభం. ( )

ఇ) ఆలోచనలు సదాలోచనలు కావాలి. ( )

ఈ) మనసు-మాట-నడత ఒకటైనవాడు మహితుడు కాదు. ( )

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. **కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) 'జీవితంలో ఏదైనా సాధించాలనుకుంటే మాటే ప్రధానం' దీనిపై మీ అభిప్రాయం రాయండి.

ఆ) 'శాస్త్రమర్యాదలకు లోబడిన వాక్కు 'పవిత్రమైనది' ఇట్లా అనడంలో కవి ఉద్దేశం ఏమిటి?

SCERT TELANGANA

ఇ) వక్తృత్వంలో శరీర కదలికల (అంగవిన్యాసం) పాత్ర ఎట్లాంటిది?

ఈ) ఇరివెంటి కృష్ణమూర్తి రాసిన వాగ్భూషణం పాఠం నేటి విద్యార్థులకు ఎట్లా ఉపయోగపడుతుంది?

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) 'ఉపన్యాసం – ఒక గొప్ప కళ' దీన్ని వివరిస్తూ రాయండి.

**3. కింది అంశం గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.**

అ) ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మీరు మాట్లాడవలసిన అంశమయిన 'మాటగొప్పదనం' మీద ఒక ప్రసంగ వ్యాసం రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. కింది వాక్యాల్లో గీతగీసిన మాటల అర్థాన్ని గ్రహించి పదాలను సొంత వాక్యాల్లో ప్రయోగించండి.**

అ) భారతక్రికెట్ జట్టు విజయాలు అప్రతిహతంగా సాగుతున్నాయి.

ఆ) అమేయమైన ప్రతిభావంతుడు అబ్దుల్‌కలాం.

ఇ) జ్ఞాని ఉదాసీనత దేశానికి నష్టం.

ఈ) ఆచరణ అన్నింటి కన్నా గొప్పది.

**2. కింది పర్యాయపదాలను పదవిజ్ఞానం ఆధారంగా జతపర్చండి.**

| | |
|---|---|
| అ) కృపాణం | మది, హృదయం, ఎద |
| ఆ) వాక్కు | చప్పుడు, శబ్దం |
| ఇ) స్నేహం | కత్తి, ఖడ్గము, అసి |
| ఈ) మనసు | మాట, పలుకు, నుడుగు |
| ఉ) విశ్వాసం | చెలిమి, మైత్రి, నెయ్యము |
| ఊ) ధ్వని | నమ్మకం, నమ్మిక |

**3. 'వాగ్మి, ధ్వని' అనేపదాలకు కింది వాక్యాలలో నానార్థాలున్నాయి వాటిని గుర్తించండి.**

అ) యుక్తియుక్తంగా మాట్లాడే ఉపన్యాసకుడు ఉదాత్త విషయాలే కానీ చిలుక పలుకులు వల్లించడు.

ఆ) ఆయన మాటల్లోని వ్యంగ్యార్థాన్ని గ్రహించి అభినందన పూర్వకంగా బల్లలు చరుస్తూ శబ్దం చేశారు.

SCERT TELANGANA

4. కింది పట్టిక నుండి ప్రకృతి - వికృతులు గుర్తించి రాయండి.

| | | | |
|---|---|---|---|
| స్నేహం | భాష | ప్రాణం | శక్తి |
| హృదయం | సద్దు | నెయ్యం | దివ్వె |
| సత్తి | పానం | శబ్దం | ఎడద |
| దీపం | శాస్త్రం | బాస | చట్టం |

## వ్యాకరణాంశాలు

1. కింది పదాలను విడదీసి, సంధి పేర్లు రాయండి.

అ) కళోపాసనం = ____________ + ____________ = ________________________

ఆ) అభ్యుదయం = ____________ + ____________ = ________________________

ఇ) తనకెంతో = ____________ + ____________ = ________________________

ఈ) ఉన్నతమైన = ____________ + ____________ = ________________________

ఉ) రసానందం = ____________ + ____________ = ________________________

2. కింది సమాస పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేర్లు రాయండి.

అ) శక్తిసామర్థ్యాలు = ______________________________, ________________

ఆ) పఠనశక్తి = ______________________________, ________________

ఇ) అభ్యుదయపథం = ______________________________, ________________

ఈ) ఆత్మశక్తి = ______________________________, ________________

ఉ) అద్భుతశక్తి = ______________________________, ________________

## ప్రాజెక్టు పని

♦ 'వాక్కు' గొప్పదనాన్ని తెలిపే ఐదు పద్యాలు సేకరించి, భావాలు రాయండి. నివేదికను రాసి ప్రదర్శించండి.

(లేదా)

'ఉపన్యాసం ఇవ్వడంకోసం మీకు నచ్చిన ఒక అంశాన్ని ఎన్నుకొని దానికి సంబంధించిన వివరాలు తెలుసుకొని రాయండి. నివేదిక రాసి ప్రదర్శించండి.

SCERT TELANGANA

## మీకు తెలుసా?

### పలుకే బంగారం

మాట అనేది మనిషికి దేవుడిచ్చిన వరం. మనిషిని మిగతా జీవులనుండి వేరుచేసి మహోన్నతుడిగా నిలబెట్టింది మాట మాత్రమే. ఎప్పటికేది ప్రస్తుతమో అప్పటికి ఆమాటలాడగలవారు కార్యసాధకులై మనగలుగుతారు.

మనిషి స్థాయి అతని మాటలవల్ల వ్యక్తమౌతుంది. అతిగా మాట్లాడితే వాగుడుకాయ, వసపిట్ట అంటారు. మాట్లాడకపోతే ముంగిముషాణం అంటారు. జ్ఞానులు మితభాషులు. మూర్ఖులు అమిత ప్రసంగాలు చేస్తారు.

మనసు మంచిదైనా మాట కఠినమైనప్పుడు మనుష్యుల మధ్య సంబంధాలు బెడిసికొడ్తాయి. జీవితం దుర్భరంగా మారుతుంది. అందుకే మాటల్లో కాఠిన్యం పనికిరాదు. శరీరానికి అయ్యే గాయాలు మానిపోతాయి గాని మాటల బాణాల వల్ల కలిగిన గుండెగాయాలు ఎప్పటికీ మానిపోవు.

మాధుర్యం గల మాటలు ఎన్నో కార్యాలను సాధిస్తాయి. స్నేహాన్ని పెంచుతాయి, ఉత్సాహాన్ని అందిస్తాయి, ప్రేరణను కల్గిస్తాయి, ఆనందాన్ని ఇస్తాయి, సానుభూతి మాటలు బాధను ఉపశమింపజేస్తాయి. అందుకే ఎప్పుడూ శుభవచనాలే పలకాలి.

## సూక్తి

"కేయూరాణి న భూషయన్తి పురుషం హారా న చంద్రోజ్జ్వలా
న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతా మూర్ధజా
వాణ్యేకా సమలంకరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే
క్షీయన్తే ఖలు భూషణాని సతతం వాగ్భూషణం భూషణమ్."

భావం: బంగారు హారాలు ధరించడం, సిగలో పూలు పెట్టుకోవడం, సుగంధద్రవ్యాలు వాడటం, పన్నీటితో స్నానం చేయడం మొదలైనవి మానవునికి అలంకారాలు కావు. సంస్కారవంతమైన మాట మాత్రమే నిజమైన అలంకారం. మిగిలిన అలంకారాలన్నీ నశించి పోయేవే.

SCERT TELANGANA

# చదువండి - తెలుసుకొండి

## పద్యచమత్కారం

తెలుగుపద్యంలో ఎన్నో అందచందాలున్నాయి. కొందరు కవులు పద్యంలో విచిత్రమైన విన్యాసాలను చూపించారు. అర్థంమాట పక్కకుపెడితే శబ్దపరమైన చమత్కారమెంతో చూపించారు. వీటిలో కొన్నింటిని చూద్దాం.

'టమాట', 'వికటకవి' వంటి పదాలను ఎటువైపునుండి చదివినా ఒకే విధంగా ఉంటాయని మనకు తెలుసు. అయితే పద్యంలోని ఒక్కొక్క పాదాన్ని ఎటునుండి ఎటువైపుకు చదివినా ఒకేవిధంగా వచ్చేటట్లు రాశారు. దీనికి 'పాదభ్రమకము' అని పేరు. ఈ పద్యం (3వ పాదం వరకు) చూడండి.

దీరా నానా రాదీ
ధారా కరతా తర రత తారక రాధా
ధారా సతత సరాధా
ధారిత తరిధావనాబద భ్రమకమగున్

**- కాకునూరి అప్పకవి**

పద్యం చదువుతుంటే పెదవికి పెదవి తాకదు. ఇలా చెపితే 'నిరోష్ఠ్యము' అంటారు. ఓష్ఠము అంటే పెదవి. 'ప ఫ బ భ మ'లు ఓష్ఠ్యములు. అంటే పెదవుల సహాయంతో పలుకేవి. ఓష్ఠ్యము లేకుండా పద్యం చెపితే నిరోష్ఠ్యము. చదివి చూడండీపద్యం.

కరియై, కిరియై, గిరియై
హరియై యల చెడ్డ గాలియై కార్చిచ్చై
శరనిధియై కనరాక
త్తరి నానాకార ధృతిని ధనినేచె దగన్

**- నంబెరుమాళ్ళ పురుషకారికేశవయ్య**

అంకెల గారడితో పద్యం సాగిన సందర్భాలున్నాయి. ఈ పద్యం చూడండి. ఒకటి నుండి పది వరకు వరుసగా అంకెలు వస్తాయి.

జనలోకైక మహారథుండు, ద్విజరక్షాదక్షుడాజింద్రిలో
చనుడుద్యచ్చతురంగ సైన్యుడును, భాస్వద్రూప పంచాస్త్రుడ
న్యనృపక్రౌంచ షడాననుండు, ఘన సప్తాశ్వాన్వయుం డష్ట మం
త్రి, నవద్రవ్యనిధీశుడై దశరథాధీశుండు పెంపొందుచున్

**- భాస్కర రామాయణం**

కేవలం రెండక్షరాలతోనే పద్యాన్ని నడిపిన వారున్నారు. ఈ పద్యంలో 'న, మ' అక్షరాలే అగుపిస్తాయి. 'నమః' అంటే నమస్కారం. ఆ ధ్వనితో చెప్పిన పద్యం ఇది.

మనమున ననుమానము నూ
నను నీనామ మనుమను మననమును నేమ
మ్మున మాన నన్ను మన్నన
మనుమను నానామునీనమానానూనా!

**- ముక్కుతిమ్మన**




SCERT TELANGANA

# 11 వాయసం

– మామిండ్ల రామగౌడ

## చదువండి. ఆలోచించి చెప్పండి.

నటనలో ఆమె నాట్యమయూరి.

ఆ పడతి నడక హంస నడక.

ఆ ఇంట చిన్నారి చిలుకపలుకులు పలుకుతుంది.

మధుర గాయని సుశీలమ్మది కోకిల స్వరం.

కావాలనుకున్న దానికోసం పిల్లలు ఉడుంపట్టు పడతారు.

ఉడతాభక్తిగా భగవంతునికి దక్షిణ సమర్పించాలి.

కొందరు యజమానుల పట్ల కుక్క విశ్వాసం ప్రదర్శిస్తారు.

అతడు అవినీతిపరులకు సింహస్వప్నం.

## ప్రశ్నలు:

1. పై పంక్తుల్లో జనవ్యవహారంలో ఉన్న పదబంధాలేవి?
2. ఇట్లాంటి పదబంధాలు ఏ సందర్భంలో వాడుతారు?
3. వీటిని వాడడంలో పశుపక్ష్యాదుల పట్ల ఏ భావం కనిపిస్తుంది?
4. పశువులను, పక్షులను చిన్నచూపుతో పోల్చే సందర్భాలు కూడా ఉంటాయా?
5. అటువంటి కొన్ని పోలికలు చెప్పండి. ఇట్లా పోల్చడం సరైందేనా?

## పాఠం ఉద్దేశం

ప్రకృతిలో ప్రాణులన్నీ స్వేచ్ఛగా జీవించాలి. ప్రతి ప్రాణికీ తనదైన ప్రత్యేకత ఉంటుంది. ఆయా ప్రత్యేకతలననుసరించి వాటిని ఆదరించాలి. కాకి కూడా ఒక ప్రాణి. దీని విశిష్టతను చెప్తూ కాకిపట్ల చులకన భావం ఉండరాదని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యభాగం పద్య ప్రక్రియకు చెందినది. ఆధునిక కవి మామిండ్ల రామగౌడు రాసిన 'రస తరంగిణి' ఖండకావ్య సంపుటిలోనిది.

## కవి పరిచయం



**14-01-1943**
**06-06-2003**

తెలంగాణ ఆధునికకవుల్లో మామిండ్ల రామగౌడు ఒకరు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఈయన వర్ని మండలం రుద్రూరులో బాలమ్మ, మల్లాగౌడు దంపతులకు జన్మించాడు.

ప్రాథమికవిద్యతో చదువు ఆగిపోయినా, తర్వాత కాలంలో బి.ఓ.ఎల్. పూర్తిచేసి తెలుగు పండితునిగా ఉద్యోగం చేశాడు. తెలుగుభాషపై మక్కువతో ఇరవై ఏండ్ల వయసునుండే రచనలు చేయడం ఆరంభించాడు. శబరిమాత శతకం, నరసింహ శతకం, కవిగౌడప్ప శతకం వంటి భక్తి, నీతి శతకాలతో పాటు రసతరంగిణి, కవితాసుధాలహరి, గౌడప్రబోధం మున్నగు రచనలు వెలువరించాడు.

తనదైనశైలిలో, వస్తువైవిధ్యత కలిగిన రచనలు చేసిన రామగౌడు సుకవిసుధాకర, మధురకవి, కవికోకిల వంటి బిరుదులు, పలు సత్కారాలు అందుకున్నాడు.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

SCERT TELANGANA

## ప్రవేశిక

*సకల జీవులను మనిషి సమాదరించాలి. సర్వప్రాణుల పట్ల దయకలిగి ఉండాలి కాని మనిషి స్వార్థ చింతనతో తన స్వలాభాన్నే చూసుకొంటున్నాడు. ప్రకృతిలో కాకి పక్షి ఐనప్పటికీ అందుకు విరుద్ధంగా ఐక్యతను, కలుపుగోలుతనాన్ని ప్రదర్శిస్తూ జనావాసాల్లో తిరుగుతుంది. దాని గురించి ఈ పాఠంలో చదువుకుందాం.*

# I

సీ॥ ధ్వాంక్షమా! మాంసమా కాంక్షించుచున్నావు?
మానవుల్‌మెక్కుట మానినారె?
బలిపుష్టమా! నరుల్ బలినిచ్చుకూటిని
దిని బ్రతుకు గడపు దినములెన్ని?
వాయసమా! తీపి పాయసమొల్లక
నెంగిలి మెతుకులు మ్రింగుటేల?
మౌకలీ! ఏలకో యీ కలి నాకలి
బొబ్బల నీకెట్లు బోనమబ్బు? 1

తే॥ ఆత్మఘోషమా! చిరజీవివై వెలుంగు
మేకదృష్టి గలట్టి వివేకమునకుఁ
బలువిధమ్ముల బ్రక్కచూపులను జూచు
కపట చిత్తులు మెచ్చరు కరటరాజ!

### ఆలోచించండి - చెప్పండి

- *'మానవుల్ మెక్కుటమానినారె?' అంటే మీకు ఏమర్థమైంది?*
- *బలికూడు తిని బతుకుతుందని కాకిని ఎందుకన్నారు?*
- *కాకిని 'పేదరికపు పక్షి' అనడంలో అర్థమేమిటి?*
- *కాకిలో ఉన్న కలుపుగోలుతనం ఎట్లాంటిది?*




సీ॥ అందచందమ్ము లేదంచల నడగాదు
చిలుకల వలె గుల్కి పలుకఁ బోదు
పేదరికపుఁబుల్గు భేదభావము లేక
గడబిడతో భలే గంతులిడును
కొమ్మల మాటునఁ గులుకుచుఁ గమ్మని
రాగాలు దీయ స్వరాలు లేవు
లోకాన దీనులలోఁ గల శోకాలు
కన్నీటి గాథ లేకరువు పెట్టు

ఆ॥ నన్న కొడుకుఁ బిలుచునట్టులఁ బెరిమతో
"కాక - కాక" యంచుఁగేక వేయు,
కలుపుగోలు తనము తెలియనట్టి మనము
చీదరించుకొనినఁ జిన్నబోదు. 2

SCERT TELANGANA

**II**

సీ॥ కసిఁబూని మోసాన మసిఁబూసి మారేడు
కాయ చేతికినిచ్చు ఖలునకంటె
పగఁబట్టి తొడఁగొట్టి పరులకొంపలు నిట్ట
నిలువున ముంచెడి నీచుకంటె
చారుసంసార సంచారుల మధ్య వి
షాగ్ని రగుల్చు పాషండు కంటె
లిబ్బులబ్బగఁబిచ్చి బెబ్బులియై పచ్చి
నెత్తురు జుఱ్ఱెడి తొత్తుకంటె

తే॥ నెం(డ్రకాయ నడత గం(డ్రగొడ్డలి కోఁత
మందినోళ్లు మూఁత పంది మేఁత
రోఁత బ్రతుకు గడుపు పాతకు నెదనల్పు
కంటెఁ గాకి నలుపు కలుషితమ్మె ? 3




సీ॥ నల్లమొగమ్మున నెల్ల లోకాలలో
వెన్నుఁడు పూజ్యుఁడై వెలయలేదె?
విసపు మేతరి గొంతు విద్దూరమగు నలు
పున్నను శివుఁడంచుఁ బొగడఁబడఁడె?
చుక్కల దొరలోన ముక్కున నలుపున్న
చల్లని వెన్నెల జల్లులిడఁడె?
నరుల తలలు నల్పు యిరుల దారులు నల్పు
నింగి నీరును రేయి నీడ నలుపు

ఆ॥ కాకి నలుపటంచు గావుకేకలు బెట్టి
మాయనంటి పొరలు మాయి నలుపు,
అంధకారమైన అజ్ఞానమేనల్పు
వాయసముల నలుపు రోయనేల? 4



## ఆలోచించండి – చెప్పండి

- 'మసిబూసి మారేడు కాయజేయడం' అనే జాతీయం ఏ సందర్భంలో వాడుతారు?
- 'లిబ్బులబ్బగ పిచ్చి బెబ్బులియై ప్రవర్తించ'డమంటే ఏమర్థమైంది?
- 'పాపాత్ముని మనసు నలుపు' అనడం సరైందేనా? ఎందుకు?

SCERT TELANGANA

## III

సీ॥ కాకిబలఁగమంచు గాబరా పడిదెల్పు
తనబంధుజనుల యాదరణబొందు
'కాకిపిల్లలు కాకికే కడుముద్ద'ని
తనబిడ్డలను గూర్చి తగవులాడు
వదరుఁబోతును గాంచి వాదమ్ములో మించి
లొట్టిమీఁదం గాకి లొల్లియనును
పిల్లలందఱుఁజేరి యల్లరి బెట్టఁగఁ
గాకి గోలయని చీఁకాకు పఱచు

ఆ॥ "కావు–కావు" మనుచు దేవుని వేడెడి
పలుకులు చెవులందు ములుకులగును
గీము మీఁద వ్రాలి సేమములడుగును
ప్రాణసఖుని భంగి రాక విడదు. 5







తే॥ ఇల్లు వెడలింప దొంతుల నెల్ల వెదకు
విధము, పొమ్మని కొట్టిన విసుఁగులేక
నోరునొవ్వంగనే రాయబారమేమొ
తెచ్చు వార్తలో చుట్టాలు వచ్చు కబురొ. 6

తే॥ కొమ్మకోనలోఁ గూర్చుండి కోకిలమ్మ
కూయఁగా బళాయని గంతువేయుచుంద్రు
ప్రతి దినము వచ్చి మనలను బలుకరించ
నాదరించరు చులకనగాదె కాకి. 7

### ఆలోచించండి – చెప్పండి

- 'కాకి పిల్ల కాకికి ముద్దు' అనే సామెత ఎందుకొచ్చి ఉంటుందో చర్చించండి?
- 'లొట్టి మీద కాకి లొల్లి' అనే జాతీయాన్ని ఏ సందర్భంలో ఉపయోగిస్తారు?
- కాకిని ప్రాణసఖుడు అనవచ్చా? మీ అభిప్రాయం చెప్పండి.
- కాకిని చులకన చేసి, కోకిలను ఆదరించడం సరైందేనా? ఎందుకు?

SCERT TELANGANA

## తాత్పర్యాలు

1) ఓ కాకమా! మాంసం ఎందుకు కోరుతున్నావు? మనుషులు తినడం మానేశారా ఏమి? (నీకు దొరికేటందుకు?) నరులు పెట్టే బలికూడును తిని ఎన్నాళ్లు బతుకీడుస్తావు. తీపి పాయసం ఇష్టపడక ఎంగిలి మెతుకులు మింగడం ఎందుకు? జనం ఆకలి కేకలతో అలమటించే ఈ కలియుగంలో నీకు మాత్రం భోజనమెట్లా దొరుకుతుంది? కావు! కావు! మని ఆత్మబుద్ధిని ప్రకటించే నీవు చిరకాలం జీవించు. ఒంటిచూపు కలిగిన నీ బుద్ధిని పలురకాల పక్క – చూపులు చూసే మోసగాళ్లు మెచ్చరు.

2) కాకి గొప్ప అందచందాలు కలది కాదు. దాని నడక హంసనడక వలె అందంగా ఉండదు. చిలుకల మాదిరిగా పలుక లేదు. చిన్నచూపు చూడబడే పక్షి అయినా ఎట్లాంటి భేదభావాలు చూపకుండా అందరి ఇండ్ల మీద గంతులు వేస్తుంది. కొమ్మల చాటునుండి తీయనైన పాటలుపాడే స్వరం లేదు. లోకంలోని దీనుల దుఃఖాలను, బాధలను ఏకరువు పెడుతున్నట్లుగా అరుస్తుంది కాకి. పినతండ్రిని "కాక! కాక!' అని ప్రేమతో పిలిచినట్లుగా అది అరిచినా, కలుపుకుపోయే తత్త్వంలేని మనం కాకిని చీదరించుకొంటాం. అయినా అది నొచ్చుకోదు.

3) కసితో, మోసంతో మసిపూసి మారేడుకాయ జేసే మూర్ఖుని కంటే, పగతో పోరుకు పిలిచి, ఇతరుల జీవితాలను నిలువునా కూల్చే నీచుని కంటే, ఇంపుగా సంసారజీవితం గడిపే వాళ్లమధ్య విషాగ్నిని రగిలింపజేసే దుర్మార్గుని కంటే అమితమైన ధనం కూడగానే పిచ్చెత్తిన పెద్దపులితీరుగ విరుచుకుపడి సామాన్యుల నెత్తురు తాగే దుర్మార్గపు తొత్తుల కంటే, ఎంద్రికాయ తీరుగ అడ్డంగా సంచరిస్తూ, గొడ్డలి కోతతో, బెదిరింపులతో పరులనోళ్లు మూయిస్తూ, పందిలాగ మెక్కుతూ, అతిహీనమైన బతుకు బతికే పాపాత్ముని మనసులో పేరుకుపోయిన నలుపుకంటే కాకి నలుపు కలుషితమైనదా! (కాదు అని భావం)

4) నల్లనైన వర్ణంతో శ్రీకృష్ణుడు సకలలోకాల్లో పూజనీయుడై వెలగలేదా? విషాన్ని తాగి నల్లబడిన గొంతుతో వింతగా కనిపించినా పరమశివుడు శుభకరుడుగా స్తుతించబడడంలేదా? అందమైన చంద్రుని ముఖంలో నల్లని మచ్చ ఉన్నా చల్లని వెన్నెలలు కురిపించడంలేదా? మనుషుల తలలు నలుపు! చీకటి దారులు నలుపు! ఆకాశం, నీరు, రాత్రి, నీడ నలుపే! కాకి నల్లనిదని ఛీత్కరిస్తూ మాయలో పడిపోయి పొర్లాడే మాయావి అయిన వ్యక్తి నలుపు. చీకటి మయమైన మనిషి అజ్ఞానం కూడా నలుపు. అట్లాంటిది కాకుల నలుపును అసహ్యించుకోవడం ఎందుకు?

5) చుట్టాల బలగం బాగా ఉన్నప్పుడు 'కాకి బలగమ'ని హేళనగా పలుకుతాం. బంధుజనం ఉంటే మాత్రం వారి ఆదరణ పొందుతాం. 'కాకిపిల్ల కాకికి ముద్దు' అని వ్యంగ్యంగా పలుకుతాం. కాని మన పిల్లల విషయంలో అది విస్మరించి పోట్లాటకు సిద్ధమవుతాం. బాగా వాగేవాడిని మించిపోయేలా వాదిస్తాం. తిరిగి ఎదుటివాడినే 'లొట్టి మీది కాకిలాగ వాగుతున్నవు' అంటాం. పిల్లలు లొల్లి చేస్తే 'కాకిగోల' అని చిరాకు పడుతాం. కావు, కావు మంటూ దేవుని వేడుకునే కాకి అరుపులు మన చెవులకు ములుకులవలె తాకుతాయి. కాకి మాత్రం మన ఇంటిమీద వాలి క్షేమసమాచారం అడుగుతూ ప్రాణస్నేహితునివలె వచ్చిపోవడం మానదు.

6) ఇంట్లో నుండి వెళ్లిపొమ్మంటే కుండల వరుసలు వెతుకుతూ కాలయాపన చేసినట్లు, పొమ్మని చీదరిస్తూ కొట్టినా ఏ మాత్రం విసుక్కోకుండా రాయబారివలె, చుట్టాలు వస్తున్న వార్తను తెస్తున్నట్లుగా గొంతంతా చించుకొని అరుస్తుంది కాకి.

7) చిటారుకొమ్మనెక్కడనో కూచొని కోయిల కూస్తే "బళా" అని జనం హర్షం వెలిబుచ్చుతారు. రోజూవచ్చి పలుకరించే కాకిని మాత్రం ఆదరించక చీదరిస్తారు.

SCERT TELANGANA



# ఇవి చేయండి



## I. అవగాహన – ప్రతిస్పందన

**1. కింది అంశం గురించి చర్చించండి.**

పక్షిజాతిలో కాకిని చిన్నచూపు చూడడం సరైందేనా? చర్చించండి.

**2. పాఠం చదువండి. పాఠం ఆధారంగా కింది పట్టికను పూరించండి.**

| కాకిని సంబోధించిన పదాలు | పాఠంలో వచ్చిన సామెతలు, జాతీయాలు | కాకి నలుపు రంగుకు ప్రతీకగా వాడబడిన పేర్లు |
|---|---|---|
| | | |

**3. కింది పేరా చదువండి. పట్టికలో వివరాలు రాయండి.**

రాకెల్‌కార్సన్ అనే పర్యావరణవేత్త 1963లో "సైలెంట్ స్ప్రింగ్" అనే పుస్తకాన్ని రాశాడు. క్రిమిసంహారక మందుల వాడకంవల్ల పక్షులు ఎట్లా కనుమరుగవుతున్నాయో రాశాడు. పక్షులు నశిస్తే మానవజాతికి కూడా నష్టం వాటిల్లుతుంది. రాబందులు, గద్దలు, కాకులు, పిచ్చుకలు అని మనం చిన్నచూపు చూడవచ్చు. ఎందుకంటే వాటి ప్రాధాన్యం మనకు తెలియదు కాబట్టి. జనావాసాల నుండి చెత్తా చెదారం, మలిన పదార్థాలను కాకులు దూరంగా తీసుకొనిపోతాయి. రాబందులు మృతజంతుకళేబరాలను తిని రోగాలు, అంటురోగాలు రాకుండా జనాన్ని కాపాడుతాయి. పిచ్చుకలు పంటలను నాశనం చేసే కీటకాలను, కీటకాలుగా మారే గొంగళి పురుగులను తిని పంట దిగుబడికి తోడ్పడుతున్నాయి.

| కారణం | ఫలితం |
|---|---|
| క్రిమి సంహారకమందుల వాడకం పెరగడం | |
| పక్షులు కనుమరుగైతే | |
| రాబందులు ఉండడంవల్ల | |
| కాకులు ఉండడం వల్ల | |
| పిచ్చుకల వల్ల | |

SCERT TELANGANA

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) కాకులను చులకనగా చూడడాన్ని బట్టి మానవ స్వభావం ఎట్లాంటిదని భావిస్తున్నారు?

ఆ) రామగౌడు కవితాశైలిని వివరించండి.

ఇ) కాకి, కోకిల రెండూ నల్లనివే! అయితే ఒకదానిని ఆదరించి, ఇంకొకదాన్ని చులకనగా చూడడం గురించి మీ అభిప్రాయం తెలుపండి.

ఈ) కాకులు సమైక్యంగా ఉంటాయి. దీనిపై మీ అభిప్రాయం సకారణంగా రాయండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) కాకి విశిష్టతను సొంతమాటల్లో రాయండి.

**3. కింది ప్రశ్నకు సృజనాత్మకంగా/ ప్రశంసాత్మకంగా రాయండి.**

అ) మనుషులు తన గురించి ఏమనుకుంటున్నారో తెలుసుకున్న కాకి మనుషుల గురించి తాను ఏమనుకుంటుందో ఊహించి కాకి స్వగతం రాయండి.

(లేదా)

ఆ) తన గురించి చులకనగా మాట్లాడడం తగదని కాకి మనుషులతో మాట్లాడింది. దీన్ని ఊహించి సంభాషణ రూపంలో రాయండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**1. పాఠం ఆధారంగా కింది పదాలకు పర్యాయపదాలు రాయండి.**

అ) కాకి

ఆ) గృహం

ఇ) సంతోషం

ఈ) ముల్లు

SCERT TELANGANA

2. **కింది వ్యుత్పత్తులకు సరైన పదాలు పాఠం ఆధారంగా గుర్తించండి.**

అ) బలిగా ఇవ్వబడిన ఆహారంతో పోషింపబడేది. ______

ఆ) మాంసాన్ని కాంక్షించేది. ______

3. **కింది వాక్యాల్లో ప్రకృతి, వికృతి పదాలు వేరువేరుగా ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి.**

అ) సిరిగలవారు దాన్ని సద్వినియోగం చేయడం తెలుసుకుంటే అదే సంతసం.

ఆ) విజయం సాధించిన ఆనందం ఆ పక్కి మొగంలో కనిపించింది.

ఇ) పక్షి కూడా గీము నిర్మించడంలో నైపుణ్యం కనబరుస్తుంది.

ఈ) శ్రీ విలసిల్లిన గృహంలో అందరి ముఖాల్లో సంతోషం వెల్లివిరుస్తుంది.

4. **కింద ఇచ్చిన జాతీయాలు, సామెతలను గుర్తించి వాటిని వినియోగించే సందర్భాన్ని రాయండి.**

కాకి బలగం, కాకిపిల్ల కాకికి ముద్దు, కాకిగోల, లొట్టిమీద కాకి లొల్లి, మసిపూసిమారేడుకాయ చేయడం

## వ్యాకరణాంశాలు

1. **కింది సంధులకు సంబంధించిన పదాలు ఈ పాఠంలో గుర్తించి, వాటిని విడదీసి సూత్రాలు రాయండి.**

అ) సవర్ణదీర్ఘ సంధి

ఆ) ఉకార సంధి

2. **కింది పదాలు విడదీసి, సంధులను గుర్తించి సూత్రాలు రాయండి.**

అ) దినములెన్ని = ______ + ______ = ______

ఆ) తొడఁగొట్టి = ______ + ______ = ______

ఇ) లొల్లియనుచు = ______ + ______ = ______

3. **కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, అవి ఏ సమాసాలో గుర్తించండి.**

అ) ఎంగిలిమెతుకులు = ______, ______

ఆ) కాకిబలగం = ______, ______

ఇ) విషాగ్ని = ______, ______

SCERT TELANGANA

## యమకాలంకారం

✷ **కింది పద్య పాదాలలో ఒకే రకంగా ఉన్న మాటలు (పదాలు) గుర్తించి రాయండి.**

అ) లేమా! దనుజుల గెలువగ
లేమా! నీవేల కడగి లేచితివిటురా.

1. ________ 2. ________

ఆ) పాఱజూచిన పరసేన పాఱంజూచు.

1. ________ 2. ________

పై ఉదాహరణల్లో మీరు రాసిన సమాధానాల ద్వారా, మీరు ఒక విషయాన్ని గుర్తించి ఉంటారు. ఒకే శబ్దంతో కూడిన పదాలు రెండుసార్లు వచ్చాయి కదా!

ఇటువంటి పదాలు ఒకే శబ్దంతో ఉన్నా అర్థంలో తేడా ఉంటుంది. ఒక పదం వచ్చిన తరువాత మరలా అదేపదం రావడం గమనించారుకదా! పై ఉదాహరణలో 'లేమా' అనే పదం రెండుసార్లు వచ్చింది. మొదటిపాదంలో 'లేమా'ను 'స్త్రీ' అనే అర్థంలో, రెండవ 'లేమా' ను చాలమా (గెలువజాలమా) అనే అర్థంలో ప్రయోగించడం జరిగింది.

అదే విధంగా 'పాఱజూచు' పదం కూడా రెండుఅర్థాల్లో ప్రయోగించబడింది. మొదటిదానికి అర్థం 'తేరిపారచూడటం' అని, రెండవ అర్థం 'పారిపోవ చూస్తుంది' అని. ఇటువంటి పదప్రయోగం జరిగినట్లయితే అది 'యమకం'.

యమకం లక్షణం గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

పదాలు తిరిగి తిరిగివస్తూ అర్థభేదం కలిగి ఉంటే అది యమకాలంకారం. పదాల విరుపువల్ల అర్థభేదం సృష్టించడం దీని ప్రత్యేకత.

ఇ) మీ పాఠ్యభాగం 'ధర్మపాలన' లో 'యమకాలంకార' పాదాలను గుర్తించి రాయండి. సమన్వయించండి.

**4. కింది పద్యపాదానికి గురులఘువులు గుర్తించి లక్షణాలతో సమన్వయం చేయండి.**

ఆ పురమేలు 'మేలుబళి'! యంచు బ్రజల్ జయవెట్టుచుండ నా'

## ప్రాజెక్టు పని

♦ **పక్షులకు సంబంధించిన కథ / గేయం / కవిత సేకరించి రాయండి. నివేదిక రాసి తరగతిలో ప్రదర్శించండి.**

**(లేదా)**

**పక్షుల గూళ్ళను పరిశీలించి వాటి గొప్పతనాన్ని గురించి నివేదిక రాయండి.**

**సూక్తి**

**మనకు జీవనాధారం ప్రకృతి. ప్రకృతిలోని ప్రతి జీవి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మనకు తోడ్పడుతున్నది. అటువంటి ప్రకృతి ప్రకోపిస్తే వినాశనం జరుగుతుంది. కాబట్టి ఆ ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యత.**

SCERT TELANGANA

# 12 తీయని పలకరింపు

– ఇల్లిందల సరస్వతీదేవి

## చదువండి – ఆలోచించి చెప్పండి.

*"అరే రాజన్నా! ఈ బతుకుమీద విరక్తి గలుగుతుందిరా! రెక్కలు ముక్కలు జేసుకోని పిల్లలను బెంచిన. విదేశాల్లో జదువుకుంటే గొప్ప ప్రయోజకులైతరు, మాకు మంచి పేరొస్తదనుకున్న. పెండ్లిల్లు జేసిన. రెక్కలొచ్చిన పక్షులు గూడువదలిపోయినట్లు, మల్ల సూడకుండా ఎల్లిపొయ్యిన్రురా. అప్పుల సంగతి సరే. ఆయాసమొచ్చినప్పుడు నరాలు దెగిపొయ్యేటట్లు ఏడిచినా వాళ్ళకు యినవడదు. ఇనవడ్డా, 'నేనొచ్చి ఏం జేస్త నాయినా, డాక్టరుకు జూపిచ్చుకో, కావాల్నంటె పైసలు పంపిస్తం' అని ఫోన్ పెట్టేస్తరు. ఈ బంగ్లలు, కార్లు, సౌకర్యాలు మనసు విప్పి మాట్లాడ్తయా? మనసులోని బాధను పంచుకుంటయా? మనుమండ్లు, మనుమరాండ్ల స్పర్శను గలిగిస్తయా? తియ్యగ ఒక్కసారి పలుకరిస్తయా?"*

### ప్రశ్నలు:

1. ఈ మాటలు ఎవ్వరంటుండవచ్చు?
2. పిల్లలను దూరం చేసుకున్న వృద్ధుల పరిస్థితి ఎట్లా ఉంటుంది?
3. మీరు ఇటువంటి వాళ్ళను ఎవరినైనా చూశారా?
4. వాళ్ళ పట్ల మన ప్రవర్తన ఎట్లా ఉండాలి?

## పాఠం ఉద్దేశం

ఆధునిక జీవితంలో కుటుంబ విలువలు, మానవ సంబంధాలు అడుగంటుతున్నాయి. వృద్ధులు నిర్లక్ష్యానికి గురి అవుతున్నారు. వాళ్ళ అవసరాలు నెరవేర్చడాన్ని, ఆత్మీయతను పంచడాన్ని పిల్లలు మరిచిపోతున్నారు. వృద్ధులు తమ ఆవేదనను ఎవరికీ చెప్పుకోలేక సతమతమైపోతున్నారు. వృద్ధులపట్ల అనుసరించాల్సిన వైఖరి గురించి ఆలోచింపజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

SCERT TELANGANA

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'కథానిక' ప్రక్రియకు చెందినది. జీవితపు ముఖ్య సన్నివేశాలను క్లుప్తంగా తెలియజేస్తూ సంఘటనల మధ్య సంబంధాన్ని కళాత్మకంగా చిత్రించే వచన రచననే 'కథానిక' అంటారు. కథనం, సంభాషణ, శిల్పం – ఇవి కథానికలోని ప్రధానాంశాలు.

ప్రస్తుత పాఠ్యభాగం ఇల్లిందల సరస్వతీదేవి రచించిన 'తులసిదళాలు' కథానికల సంపుటి నుండి తీసుకోబడింది.

## రచయిత్రి పరిచయం



15-06-1918
31-07-1998

ఇల్లిందల సరస్వతీదేవి స్వాతంత్ర్యానికి పూర్వమే సృజనాత్మక రంగంలోకి అడుగుపెట్టిన ప్రసిద్ధ రచయిత్రి. ఈమె వందలాది కథలు, కొన్ని నవలలు, రేడియో నాటికలు, అనేక వ్యాసాలను రచించిన బహుముఖ ప్రజ్ఞావంతురాలు. 1982లో ఈమె రచించిన 'స్వర్ణకమలాలు' కథాసంపుటికి కేంద్రసాహిత్య అకాడమి అవార్డ్ వచ్చింది. రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం, సుశీలా నారాయణరెడ్డి పురస్కారాన్ని కూడా పొందింది. తులసిదళాలు, రాజహంస ఈమె కథాసంపుటాలు. 1958లో ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా, జైలు విజిటర్‌గా పనిచేసింది. 1934లో స్థాపించిన ఆంధ్ర యువతీ మండలి వ్యవస్థాపకుల్లో ఒకరు. మానవ మనస్తత్వ ధోరణులను, విభిన్నకాలాలలో సందర్భాల్లో జీవన పరిణామాలను విశ్లేషించి, విశ్వజనీన భావాలను దృష్టిలో పెట్టుకుని రచనలు చేసింది. సరళమైన, నిరాడంబరమైన, వాస్తవిక అభివ్యక్తితో ఈమె రచనలు ఉంటాయి.

## విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని ప్రవేశిక చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదవిజ్ఞానం' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకొండి.

SCERT TELANGANA



**ప్రవేశిక**

*మానవుడు సంఘజీవి. పదిమందితో కలిసి జీవించాలనుకుంటున్నాడు. దేశవిదేశాలతో సంబంధాలు నెలకొల్పుకొంటున్నాడు. కాని తన కుటుంబసభ్యులతో ఆత్మీయంగా ఉంటున్నాడా? ఇంటికి పెద్దదిక్కుగా ఉండే వృద్ధులను గౌరవంగా చూసుకుంటున్నాడా?*

*నిర్లక్ష్యానికి గురి అయిన గంగాధరరావు అనే ఒక వృద్ధుడు ఇల్లువదిలి, తన వాళ్ళందరికీ దూరంగా జీవించసాగాడు. గంగాధరరావు అట్లా వెళ్ళిపోవడానికి దారితీసిన పరిస్థితులేమిటి? వెళ్ళినతర్వాత జరిగిన పరిణామాలేమిటి? తెలుసుకునేందుకు ఈ కథ చదువుదాం...*



## I

ఆ రోజు టీ.వీ.లో "కనబడుటలేదు. గంగాధరరావు అనే అరవైఏళ్ళ వ్యక్తి కనబడుటలేదు. పక్షవాతంవచ్చి ఒక కాలూ, చెయ్యీ స్వాధీనంలోలేవు. కర్ర పట్టుకుని నడుస్తాడు. ఆజానుబాహువు. తెల్లగా ఉంటాడు. మతిస్థిరం లేదు. ఎవరికైనా కనబడితే ఈ క్రింది అడ్రసుకు తెలుపవలెను.

పి.ఎన్.రావు

కళాసిగూడ

ఇంటి నెం. 3-4-7.

హైదరాబాదు" అని చెప్పారు.

ఫోటో కూడా టీ.వీ.లో చూపించారు.

రాత్రి టీ.వీ. చూస్తున్న గంగాధరరావు ఉలిక్కిపడ్డాడు.

తను ఇంట్లోనుంచివచ్చి ఎన్ని రోజులైంది? వీళ్ళు ఎప్పుడు తెలుసుకున్నారు? ఎప్పుడు ప్రకటన చేశారు? దేనికి?

పెన్షనుకోసమా? డిపాజిట్లకోసమా?

అతని పెదవులమీద ఒక తాత్వికమైన నవ్వు చాలాసేపు నిలిచింది. ఆ తరువాత వచ్చిన టీ.వీ. కార్యక్రమాలు అన్నీ చూశాడు. కాని మనసు దానిమీద లేదు. ఆ రాత్రి నిద్రకూడా కలతనిద్రే!

"బాబూగారూ. చెట్టుకింద ఒక్కరూ కూర్చున్నారేం?"

"నాకిక్కడ చాలా బాగుంది. ఇక్కడ కూర్చుని పచ్చనిచెట్లను చూస్తుంటే మనసుకు హాయిగాఉంది. నేను మంచి హుషారుగా ఉన్న రోజులు జ్ఞాపకం వస్తున్నాయి. ఆ రోజులు ఎంత ఆనందంగా గడిచాయో? ఇప్పుడేముంది? వాటిని తలచుకుంటూ, మననం చేసుకుంటూ ఉండాల్సిందే."

"అయితే అవి మీరు ఉద్యోగంచేస్తున్న రోజులా?"

"అవునమ్మా ఆ రోజులే."

"ఏం ఉద్యోగం చేసేవారూ?"

SCERT TELANGANA

"నేనా? ఎక్సైజు కమీషనర్‌ను. ఇప్పుడంటే ఏభై ఎనిమిదేళ్ళ సర్వీసుగాని, మా రోజుల్లో ఏభై అయిదేళ్ళకు రిటైరయ్యేవాళ్ళు. సర్వీసులో ఉండగా చాలా జోరుగా ఉండేదిలే అమ్మా!"

"సర్వీసులో ఆ హుషారూ, ఆ కులాసా అదంతా వేరు కదండీ? అయితే ఉద్యోగులు ఎల్లకాలం పదవిలో ఉండలేరుకదా! ఎప్పటికైనా పదవీ విరమణ ఉంటుంది కదండీ?"

"అవును కానీ నేను పదవీవిరమణ చేసిన తరువాత కూడా నా దగ్గరికి ఎప్పుడూ పదిమంది వచ్చేవారు. సలహాకోసమో, సంప్రతింపులకోసమో తిరిగేవారు. కొంతమంది రికమెండేషన్లకోసం వచ్చేవారు. నా చేతికింద పనిచేసేవాళ్ళు కొందరు ఆ డిపార్ట్‌మెంటు నేను ఉన్నప్పుడు ఎలా ఉండేదో, ఇప్పుడెలా ఉన్నదో చెప్పటానికి వచ్చేవారు. నేను కింది వాళ్ళను ఎలా చూసేవాడినో, అలా ఆదరాభిమానాలు ఇప్పుడు కనబడవని వాపోతారు. ఇప్పటివాళ్ళు కింది ఉద్యోగులను నికృష్టంగా చూస్తున్నారట. నా హయాంలో ఒక్కరికైనా అన్యాయం జరగనిచ్చేవాడినికాదు."

ఆయన కొంచెం ఆయాసపడుతున్నట్టు కనబడ్డాడు. కళ్ళలో నీరు ఊరింది కాబోలు కళ్ళు మెరుస్తున్నాయి.

విమలకు తీరిక ఉన్నప్పుడల్లా గంగాధరరావుతో కబుర్లుచెప్పటం అలవాటు. ఆమె ఆ ఆశ్రమంలో సూపరింటెండెంటు. కొత్తగా వచ్చింది. సంసారం బాధ్యతలు లేవు. ఒంటరిమనిషి. ఆశ్రమవాసులందరినీ ఆదరంగా చూస్తుంది. గంగాధరరావు పట్ల గౌరవమే కాకుండా, భయభక్తులూ, అభిమానమూ కనబరుస్తుంది. పని కాగానే ఆయనతో కబుర్లాడుతుంది. క్రమంగా చనువు ఏర్పడ్డది.

"ఆఫీసర్లంతా మీ మాదిరిగా ఉంటారా బాబుగారూ? అధికార దర్పం అనేది న్యాయాన్యాయాలు గమనించనివ్వదు. కళ్ళు పై చూపులు చూస్తాయిగాని కిందికి చూడవు. ఇది లోకం. ఏమంటారు?"

"నీ మాటలోనూ నిజం లేకపోలేదు. నేను ఎంతోమందికి సహాయం చేశాను. ఎంతోమంది ఉద్యోగాలు నిలబెట్టాను. జరగబోయే పెళ్ళి ఆగిపోతున్నదని బావమరిది వస్తే కట్నం ఇచ్చి పంపించాను. అమ్మాయి చదువుకున్నది అందంగా ఉంటుంది. పెళ్ళి చేయలేకపోతున్నానని ఒక స్నేహితుడు చెప్పాడు. నేనా అమ్మాయిని చూసి మా అబ్బాయికిచ్చి పెళ్ళిచేశాను. హోదా ఉండొద్దా అని మా ఆవిడ గోలచేసింది. హోదా ఎక్కువా? మానవత్వం ఎక్కువా? ఆమె మూతి విరిచినా, రెండు ఖర్చులూ పెట్టి పెళ్ళిచేశాను. ఇట్లా ఎంతోమంది బంధువులకూ, స్నేహితులకూ సహాయం చేశాను. నా దగ్గర దేహీ అన్న వాళ్ళకు లేదనకుండా శక్తికొద్దీ చేశాను."

"మంచిపని చేసినవాళ్ళకు జీవితంలో అంతా మంచే జరుగుతుందంటారు కదా బాబుగారూ?"

"మంచి జరుగుతుందా? ఎక్కడైనా పొరపాటున జరుగుతుంది. ఎల్లప్పుడూ కాదు. అందరికి కాదు ఇది నా అనుభవం."

"బాబుగారూ! మీరిలా బాధపడతారేమిటి? మీరు సహాయపడిన స్నేహితులూ, బంధువులూ సరే – వాళ్ళను వదిలెయ్యండి మీరు కావాలని చేసుకున్న కోడలూ, ఒక్కగానొక్క కొడుకూ అంటున్నారు. కన్నకూతురూ, పెద్ద కట్నమిచ్చి కొన్న అల్లుడూ ఉన్నారన్నారు. అందరికంటే మీ కష్టసుఖాలను పంచుకున్న మీ జీవిత భాగస్వామిని – వీళ్ళందరూ ఉన్నారు కదండి మీకు?"

గంగాధరరావు పకపకా నవ్వాడు.

"ఎందుకలా నవ్వుతారు?" కనుబొమలు పైకెత్తి ఆశ్చర్యంగా చూసింది. ఆయన నవ్వులో విషాదమే ఉన్నదో, ఆశ్చర్యమే ఉన్నదో అర్థంగాక.

SCERT TELANGANA

"నీకు పెళ్ళికాలేదు కనుక భార్యలు ఎట్లా ఉంటారో తెలియదు. నేను అందరినీ అనటంలేదు సుమా. కొడుకులూ, కోడళ్ళ మనసులు ఎట్లా ఉంటాయో తెలియదు. ఇక కూతురూ, అల్లుడూ అంటావా – నీవు ఊహించనైనా ఊహించలేవు." ఎక్కడో దూరాన నిలిచిందాయన చూపు.

ఆయన దేనికో బాధపడుతున్నాడని ఆమె గ్రహించింది. మాట మళ్ళించాలని, "బాబుగారూ! చీకటిపడింది మీరు చపాతీ తినే వేళయింది రండి లోపలికి పోదాం."

బరువుగా ఊపిరి పీల్చుకుంటూ "సరే పద" మెల్లిగా లేచాడు.

## ఆలోచించండి -చెప్పండి

- *టి.వి. ప్రకటన చూసి గంగాధరరావు ఎందుకు ఉలిక్కిపడ్డాడు?*
- *ఆఫీసరు అంటే ఎట్లా ఉండాలి?*
- *గంగాధరరావు చేసిన పనులను బట్టి అతని వ్యక్తిత్వాన్ని గురించి చెప్పండి.*



## II

అది భజన్‌లాల్ నిలయం. నా అన్నవారులేని వృద్ధులూ, అనాథలూ, లేవలేనివారూ, పేదవారూ అక్కడ ఉంటారు. భజన్‌లాల్ తన తల్లిదండ్రుల స్మృత్యర్థం ఈ నిలయాన్ని నెలకొల్పాడు. ప్రభుత్వంవారు స్థలాన్ని లీజుకు ఇచ్చారు. నలభైగదులూ, వాటి చుట్టూ, ముందూ, వెనకా వరండాలు కట్టించాడు. ఆవరణలో పెద్ద పెద్ద చెట్లు ఉన్నాయి. పెరటివైపు కూరగాయలూ, అరటి, నిమ్మచెట్లున్నాయి. అక్కడున్నవారిలో పని చేయగలిగినవారు తోటపనీ నిలయంలోపనీ చేస్తారు. వారిలో కొందరు పాత్రలు తోముతారు. ఆ నిలయానికి అవసరమైనంత పాడిఉన్నది. దానికి ఒక నౌకరు, ఒక గుమస్తా, వాళ్ళపైన సూపరింటెండెంటు ఉన్నారు. ఆ నలభై గదుల్లో ఒకటి సూపరింటెండెంటుకూ, ఒకటి ఆఫీసుకూ కేటాయించారు. తను టెలిఫోనులో మాట్లాడడానికి ఒక ఫోను కూడా ఆఫీసులో పెట్టించాడు భజన్‌లాల్.

ఒకనాటి రాత్రి పదిగంటలవేళ భజన్‌లాల్‌కు టెలిఫోను వచ్చింది.

"నేను మీ నిలయంలో ఉండాలనుకుంటున్నాను. నాకు విడిగా ఒక గదీ, ఎటాచ్‌డ్ బాత్‌రూమూ ఉండాలి. ఒక నౌకరు నాకు ప్రత్యేకంగా ఉండాలి. నాకయ్యేఖర్చు నేనిచ్చుకుంటాను."

"ఎక్కడినుంచి? మీ పేరు?" హిందీలో అడిగాడు.

"అవి నేనొచ్చి చెబుతాను."

"మీ భోజనం, కాఫీ, టీ మీరే నౌకరుచేత చేయించుకుంటారా?"

"నాకు ఏ వేళకు ఏం కావాలో నేను వచ్చిచెబుతాను. వీలైతే మీరు చేయించి పంపించండి."

"మీరు వచ్చి రూము, అదీ చూసుకుంటారా?"

"నేను అక్కడ ఉండాలని వస్తున్నాను. ఉన్నవాటిలో నాకు నచ్చినది తీసుకుంటాను. నేను నా సామాన్లతో వస్తాను ఎప్పుడు రమ్మంటారు?"

"మీ ఇష్టం ఎప్పుడు వచ్చినాసరే. నిలయం ఎక్కడున్నదో తెలుసా? తెలిస్తే ఎప్పుడైనాసరే వెళ్ళండి. అక్కడ ఆఫీసులో సూపర్నెంటు ఉంటుంది. మీకేం కావాలో చెప్పండి. అన్ని వసతులూ ఆమె చూస్తుంది. నేను వారానికొకసారి వచ్చి చూస్తూఉంటాను. అవసరమైతే ఆమె టెలిఫోను చేస్తుంది."

"మంచిది నమస్తే."

ఒక టాక్సీలో రెండు సూట్‌కేసులూ, ఒక టీ.వీ. మొదలైన సామాన్లతో సూట్‌వేసుకుని కర్ర సహాయంతో నిలయం ఆవరణంలో దిగాడు గంగాధరరావు.

ఆ క్రిందటిరోజు రాత్రే ఒక టాక్సీ కంపెనీకి ఫోనుచేసి తెల్లవారుఝామున నాలుగు గంటలకు రమ్మన్నాడు. తన గది తలుపు వీథి వరండాలోకే ఉంది. ఆ రాత్రే సామాను సర్దిపెట్టుకున్నాడు. టాక్సీ రాగానే డ్రైవరుచేత సామాను టాక్సీలో పెట్టించుకుని తలుపుదగ్గరగావేసి తనూ కూర్చున్నాడు.

భజన్‌లాల్ నిలయం ఊరికి బయటగా ఉండేది మొదట. ఆ తరువాత ఊరు పెరిగి ఆ నిలయం ఊరి మధ్యకు వచ్చింది. అందుకనే అరగంటలోవచ్చి చేరుకున్నాడు.

నౌకరు గబగబావెళ్ళి సామాన్లు తీసుకువచ్చి హాల్లోపెట్టాడు. ఆయనను లోపలికి తీసుకువచ్చి కుర్చీవేశాడు. టాక్సీ డ్రైవరు లోపలికివచ్చి డబ్బుతీసుకుని సలాంచేసి వెళ్ళాడు.

SCERT TELANGANA

"ఆఫీసు ఎప్పుడు తెరుస్తారు?" అడిగాడు గంగాధరరావు.

"ఆరుగంటలకు అమ్మగారులేస్తారు. ఆరున్నరకు బయటికివస్తారు. ఆమె గదిపక్కనే ఆఫీసు. నేను చెబుతాలెండి."

కుర్చీలో కూర్చుని గంగాధరరావు కళ్ళు మూసుకుని ఆలోచనలోపడ్డాడు. తనకు పనికివచ్చే కాగితాలూ, చెక్‌బుక్కూ రిటైరైన తరువాత వచ్చినడబ్బుతోనూ ఇన్సూరెన్స్‌పాలసీవల్ల వచ్చినడబ్బుతోనూ తీసుకున్న ఫిక్సెడ్‌డిపాజిట్లూ, తనకు నచ్చిన పుస్తకాలూ, లైబ్రరికార్డూ, తన బట్టలూ, బూట్లూ, చెప్పులజత అన్నీ తనకవసరమనుకున్నవి తెచ్చుకున్నాడు.

ఒకప్పుడు తనకేది కావలసివచ్చినా క్షణాలమీద ఆ పని జరిగేది. కానీ ఇప్పుడో! వేళకు కాఫీ లేదు. భోజనం ఇంటివాళ్ళకు తీరికైనప్పుడు పెడతారు. ఒక్కొక్కరోజు స్నానానికి వేడినీళ్ళుండవు. గొంతు ఎండిపోతున్నదని మంచి నీళ్ళడిగినా వెంటనేరావు. అందరూఉన్నారు ఇంట్లో కానీ పిలిస్తే పలికే దిక్కులేదు. జబ్బుచేస్తే డాక్టరుని పిలవటానికి వెనకాడుతున్నారు. ఇక స్వంతిల్లేమిటి? స్వజనమేమిటి?

తనతో ఇంక ఎవరికీ అవసరం లేదనేనా? మనుమల గదిలో టీ.వీ.చూస్తూ, వాళ్ళతో కబుర్లుచెబుతూ, వినోద కాలక్షేపంచేస్తూ తనముఖమైనాచూడని సావిత్రమ్మ, తను ఇంట్లోలేని సంగతి ఎప్పుడు తెలుసుకుంటుంది? తను పదవిలో ఉండగా కారులో క్లబ్బులకు తిరుగుతూ, సభలకు పెద్దఉద్యోగి భార్యగా అధ్యక్షత వహిస్తూ, ప్రైజులుపంచుతూ, తన హోదాను బాగా ఉపయోగించుకుని ఊళ్ళేలిన సావిత్రమ్మ ఆ చీరలూ, ఆ నగలూ ఎంత వైభోగంగా బతికింది? బాగా డబ్బు సంపాదిస్తున్నానని గర్వపడుతూ తనతో కూడా తిరిగిన సావిత్రమ్మ ఇప్పుడు పిలిస్తే పలకనిస్థితికి వచ్చింది.

ఆ ఇల్లు ఇప్పుడే రాయించుకోవాలన్న పట్టుదలతో ఉన్న కోడలూ; 'ఎట్లాగూ నాకు వచ్చే ఇల్లేకదా నా పేర రాయించ'మని తల్లి నడిగేకొడుకూ; 'ఈ జబ్బువస్తేతగ్గదు. డాక్టరు ఎందుకు?' అనే పుత్రరత్నమూ ఇప్పుడు పీడావదిలిందనుకుంటున్నారా?

ఫిక్స్‌డ్ డిపాజిట్ తనకిస్తే పండుగకు వస్తాననే కూతురు అల్లుడితో వస్తుందా?

"విద్యార్థులంతా టూరుకువెళ్తున్నారు. డబ్బియ్యవా తాతయ్యా మంచి బట్టలు కూడా కుట్టించుకోవాలి" అని అడిగే మనుమడు. ఆ గదిలోకివచ్చి తను లేనట్టు తెలుసుకుంటాడా?

కోటు సరిచేసుకుని గుండీలు సర్దుకుని "ఇక్కడికి వచ్చేశానుగా ఇంకా ఆ సంగతులు తలచుకోవటమెందుకు? వేళకుతింటూ, పుస్తకాలు చదువుకుంటూ, సాయంకాలం టీ.వీ. చూస్తూ, పగలు ట్రాన్సిస్టరువింటూ హాయిగా ఉండచ్చు. తను ఉన్నన్నాళ్ళూ తన అవసరాలకు డబ్బు వాడుకుంటాడు. ఎవరైనా లేనివాళ్ళకు సహాయం చేస్తాడు. ఈ జీవితం ఇక్కడ ప్రశాంతంగా గడిచిపోతుంది.

**ఆలోచించండి - చెప్పండి**

- *గంగాధరరావు ఆశ్రమానికి ఎందుకు ఫోన్ చేశాడు?*
- *"ఇక స్వంతిల్లేమిటి? స్వజనమేమిటి?" అని గంగాధరరావు అనడంలో ఉద్దేశమేమిటి?*

## III

సూపరింటెండెంట్ ఆఫీసులో కూర్చున్నదని నౌకరువచ్చి చెప్పాడు. గంగాధరరావు ఆఫీసులోకి వెళ్ళి తనకు కావలసినవన్నీ చెప్పాడు. సూపర్నెంటు ఆయనకు ప్రశాంతంగా ఉండే చివరి గది వరండా కేటాయించింది. ఒక నౌకరును చూపించింది. ఆయనకు టీ.వీ. ప్లగ్, ఏంటెనా ఏర్పాటు చేయించింది.

"మీకు ఇంకా ఏం కావాలో చెప్పండి, నేను ఏర్పాట్లు చేయిస్తా" నంది.

"ఎడ్వాన్స్‌గా చెక్ తీసుకోండి" అన్నాడు గంగాధరరావు.

SCERT TELANGANA

"భజన్‌లాల్ సాయంత్రం వస్తారు. నేనడిగి చెప్తాను" అంది.

"ఎనిమిది గంటలకు ఒక డాక్టర్ని పిలిపించండి. ఈ లోపల స్నానం చేసి సిద్ధంగా ఉంటాను."

ఆ నిలయానికి పిలిచినప్పుడు వచ్చే డాక్టరున్నాడు. ఫోను చెయ్యగానే ఎనిమిది గంటలకు వచ్చాడు.

"మీరు కొన్ని ఇంజక్షన్లు తీసుకోండి. ఫిజియోథెరపీ కూడా తీసుకుంటే కాలూ, చెయ్యీ స్వాధీనమవుతాయి" అన్నాడు డాక్టరు.

"మీరే వచ్చి ఇవ్వండి ఆ ఇంజక్షన్లు. చీటీమీద రాస్తే తెప్పిస్తాను."

నాలుగు నెలలు వైద్యం సాగింది. అక్కడికి దగ్గరగా ఉన్న నర్సింగ్ హోమ్‌లో ఫిజియోథెరపీ మూడు నెలలు తీసుకున్నాడు. ఇప్పుడు గంగాధరరావు ఆవరణమంతా ఉదయం, సాయంత్రం తిరిగి వస్తాడు.

ఆఫీసరుగా తను టూరుకువెళ్ళి గెస్ట్‌హవుస్‌లో ఉన్నట్టుగా ఉంది ఆయనకు. రోజులూ, నెలలూ గడిచిపోతున్నాయి ప్రశాంతంగా.

ఆ సాయంకాలం ఆవరణలో తిరగాలని బయటికి వచ్చాడు గంగాధరరావు. నల్లటి మబ్బు ఆకాశమంతా కప్పేసింది. గాలికి తోటలో చెట్లన్నీ ఊగుతున్నాయి. గంగాధరరావు వరండాలో కుర్చీవేసుకుని కూర్చున్నాడు.

"ఇవాళ తోటలో తిరగటానికి వీలులేదు" మెల్లిగా గొణుక్కున్నాడు.

అంత గాలి మీద ఆ నల్లటి మబ్బులు విచ్చిపోయి తెలతెల్లగా లేత నీలంరంగులో తునాతునకలై పరుగులు తీస్తున్నాయి.

'ఎంత విచిత్రం?' అనుకున్నాడు నవ్వుకుంటూ.

"బాబుగారూ! ఏమిటీ మీలో మీరు నవ్వుకుంటున్నారు?" అంటూ విమల వచ్చింది.

"ఆ మబ్బు తునక చూడమ్మా! ఎంత విచిత్రంగా ఉన్నదో! అంతలో ప్రళయం ముంచుకు వస్తుందా అనిపించింది. మరి కాసేపటిలో తేలిపోయింది. ప్రకృతి వన్నెచిన్నెలు వర్ణించటానికి ఎవరి తరం?"

"బాబుగారూ! మీరు కవిత్వం రాస్తారా?"

"అదేనమ్మా! ఇప్పుడు నేను చేయవలసింది. పదవీ విరమణ తరువాత ఏం చెయ్యాలా అనుకున్నాను. జబ్బు చేసింది, తేలిపోయింది. కొన్నాళ్ళు ఇంట్లో ఉండి ఇంతకాలమూ నాకు తెలియని విషయాలను గ్రహించాను. ఇప్పుడిక్కడికి వచ్చాను. ప్రశాంతంగా కవితలు అల్లుతాను."

"బాబుగారూ, ఇంతవరకు ఏదో గోప్యంగా మీరంటున్న మాటలు వింటున్నాను. కాని పరిస్థితి అర్థం కాలేదు. నన్నింకా సస్పెన్స్‌లో ఉంచక మీ సంగతంతా చెప్పండి."

"ఏముంటాయమ్మా సంగతులూ? కథా, హరికథా? మామూలుగా లోకంలో ఉండే విషయాలే, అంతకు మించి ఏముంటాయి?"

"మరి మీరెందుకలా మీలో మీరు బాధపడతారు? ఏదో ఉండే ఉంటుంది. లేకపోతే ఊళ్ళో ఇల్లు పెట్టుకుని, సంసారం పెట్టుకుని ఇక్కడ ఉండటమేమిటి? భార్యా పిల్లలు గలవాళ్ళు ఇంట్లో ఉండి హాయిగా చేయించుకుని, సంతోషంగా ఉండక ఈ ఒంటరి జీవితమేమిటి?"



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

"అదామ్మా, నీకు కావల్సింది? ఇక్కడ నేను ప్రశాంతంగా ఉన్నాను. ఇల్లు ఎందుకు ప్రశాంతంగా లేదో చెప్పమంటావు. అంతేనా? అయితే విను. ఇంత కాలమూ నా సర్వీసులో లక్షలార్జించాను. అప్పుడు ఇంట్లో అందరూ నవ్వుతూ తుళ్ళుతూ డబ్బు లెక్కపెట్టుకున్నారు. నేను రిటైరు కాగానే అందరికీ నా మీద గౌరవం తగ్గిపోయి నీరసం వచ్చేసింది. ఈ జబ్బు వచ్చిన తరువాత ఈ మనిషి ఎందుకున్నాడా అనిపించడం మొదలు పెట్టింది. నెల కాగానే నా పెన్షను చేతిలో వేయించుకున్న వాళ్ళకు నాకింత తిండి పెట్టడం బరువనిపించింది. అంతకు ముందు కూడా తిరిగిన భార్య, పిలిస్తే పలక్కుండా తప్పించుకు తిరిగేది. కన్న పిల్లలు కదా అని అడిగినదల్లా ఇచ్చి, పెద్ద చదువులు చెప్పిస్తే మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. కాని, ఇంత చేసిన తండ్రికి జబ్బుచేస్తే డాక్టర్ని పిలిపించి మందిప్పించటం అనవసరమనిపించింది. అట్లా బ్రతికినవాడిని ఆ ఇంట్లో ఎవరికీ ఏమీకాని వాడిలా ఎట్లా ఉండను? ఇక్కడ హాయిగా, మహారాజులా బతుకుతున్నాను. పిలిస్తే పలికే నౌకరున్నాడు. వేళకు వండిపెట్టే వసతి ఉన్నది. 'బాబుగారూ!' అంటూ ఆప్యాయంగా పిలిచి మాట్లాడే కన్నతల్లిలాంటి దానివి నువ్వున్నావు. నాకు ఇంకేంకావాలమ్మా, తీయటి పలకరింపు తప్ప!"

"బాబుగారూ! నాకు తెలియక మీరు చనువు ఇచ్చారు కదా అని ఎప్పుడైనా పరాచిక మాడితే క్షమించండి. మీ మనసులో ఉన్న బాధను మీచేతనే చెప్పించినందుకు నన్ను మన్నించండి. నిజంగా మనిషికి కావలసిన దేమిటో ఇవాళ మీ నోట విన్నాను." లేచి గంగాధరరావు రెండు చేతులూ పట్టుకుంది భజన్‌లాల్ నిలయానికి సూపర్నెంటైన విమల.

**ఆలోచించండి - చెప్పండి**

- *"ప్రకృతి వన్నెచిన్నెలు వర్ణించడానికి ఎవరి తరంకా"దని గంగాధరరావు ఎందుకన్నాడు?*
- *"నిజంగా మనిషికి కావలసింది ఏమిటి" ఆలోచించి చెప్పండి.*



## ఇవి చేయండి



### I. అవగాహన – ప్రతిస్పందన

1. **ముసలివారు వృద్ధాశ్రమాలకు వెళ్ళడానికి గల కారణాలను చర్చించండి.**

2. **పాఠం ఆధారంగా కింది మాటలు ఎవరి గురించి చెప్పినవో గుర్తించి, రాయండి.**

అ) చెట్టు కింద ఒక్కరూ కూర్చున్నారేం? (________________)

ఆ) సంసార బాధ్యతలు లేవు. (________________)

ఇ) ఆ చీరలూ, ఆ నగలూ ఎంత వైభోగంగా బతికింది. (________________)

ఈ) ఆ ఇల్లు ఇప్పుడే రాయించుకోవాలన్న పట్టుదల. (________________)

ఉ) ఫిక్సెడ్ డిపాజిట్ తనకిస్తే పండుగకు వస్తా. (________________)

ఊ) మంచి బట్టలు కూడా కుట్టించుకోవాలి. (________________)

ఎ) ఈ జబ్బువస్తే తగ్గదు. డాక్టరు ఎందుకు? (________________)

SCERT TELANGANA

**3. కింది వచనకవిత చదివి ప్రశ్నలకు జవాబు లివ్వండి.**

ఇల్లంటే...
అమ్మఒడి
ఇల్లంటే
మమతలు పల్లవించే యెద సడి
ఇల్లంటే
ఆత్మీయతల సందడి
ఇల్లంటే
మనల్ని మనం పునశ్చరణ చేసుకునే బడి
ఇల్లంటే
ప్రేమాభిమానాల సెలయేళ్ళ అలజడి
ఇల్లంటే
ఊరడింపుల రాబడి
స్వార్థం ఎండమావులవెంట పరుగులు
పెద్తూ
చలిచెలిమె వంటి
ఇల్లును దూరం చేసుకుంటే
తల్లివంటి ఇల్లు
మనసు చిన్నబుచ్చుకుంటుంది
అక్కడ నీళ్ళింకిపోతే–
తరతరాలకు ఆ తడిలేని జీవితం
శాపంగా పరిణమిస్తుంది కొడుకా!

**ప్రశ్నలు :**

అ) పై వచన కవితలోని అంత్యానుప్రాస పదాలను గుర్తించండి.

ఆ) ఇల్లు ఆత్మీయతల సందడి అంటే...

ఇ) ఇల్లు పునశ్చరణ చేసుకునే బడి – ఎందుకంటే?

ఈ) చలిచెలిమెకు ఎండమావికి భేదం...

ఉ) మనసు చిన్నబుచ్చుకునేది ఎప్పుడు?

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) గంగాధరరావు ఉద్యోగం చేస్తున్నప్పుడు కుటుంబ సభ్యులు ఎట్లా ప్రవర్తించి ఉంటారో ఊహించి రాయండి.

ఆ) ఇల్లు వదిలి, ఆశ్రమానికి చేరిన విధాన్ని బట్టి గంగాధరరావు ఎలాంటివాడో రాయండి.

ఇ) 'పెంచి, పెద్దచేసి, బ్రతుకునిచ్చిన తల్లిదండ్రులను ముసలితనంలో పట్టించుకోకపోవటం సమంజసమేనా? మీ అభిప్రాయం రాయండి.

ఈ) పాఠం ఆధారంగా ఇల్లిందల సరస్వతీదేవి రచనా విధానం ఎట్లా ఉన్నదో తెలుపండి.

**2. కింది ప్రశ్నకు పది వాక్యాల్లో జవాబు రాయండి.**

అ) 'వృద్ధాప్యం మనిషికి శాపం కాకూడదు' దీని గురించి మీ అభిప్రాయం రాయండి.

( లేదా )

ఆ) వృద్ధాప్యంలో మనుషులకు ఏమి కావాలి? కుటుంబ సభ్యులు వాళ్ళను ఎట్లా చూసుకోవాలి?

**3. కింది అంశం గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.**

అ) తీయని పలకరింపు కథను పొడిగించి ఒక మంచి ముగింపును రాయండి.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21
SCERT TELANGANA

## III. భాషాంశాలు

### పదజాలం

1. కింది పట్టికను పరిశీలించండి. పట్టిక కింద ఇచ్చిన పదాలకు సరిపోయే పర్యాయ పదాలు వెతికి రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| వృక్షం | నీరు | నిప్పు | నిశ | కాలం | మంచి |
| సమయం | రజని | ఆవాసం | గగనం | మహీజం | స్థానం |
| చంద్రుడు | అంబరం | నిజం | వెలుగు | జలం | కట్టె |
| నిశీథి | సత్యం | తరువు | రేయి | నెలవు | సూర్యుడు |

అ) చెట్టు = ______________________

ఆ) ఆకాశం = ______________________

ఇ) నిలయం = ______________________

ఈ) రాత్రి = ______________________

2. కింది వాక్యాల్లోని గీత గీసిన వికృతి పదాలకు ప్రకృతి పదాలు పాఠంలో వెతికి రాయండి.

అ) ఆకాశంలో హరివిల్లును చూసి పిల్లలు అచ్చెరువొందారు.

ఆ) అడిగినవారికి సాయం చేయడం మా నాన్నకు అలవాటు.

ఇ) మా తాతయ్య బోనం చేయనిదే బయటికి వెళ్ళడు.

### వ్యాకరణాంశాలు

1. కింది పదాలను కలిపి, సంధి పేరు రాయండి.

అ) రోజులు + ఐనా = ______________ ( )

ఆ) ఆదర + అభిమానాలు = ______________ ( )

ఇ) లేదనక + ఉండ = ______________ ( )

ఈ) వీలు + అయితే = ______________ ( )

ఉ) కావలసినవి + అన్నీ = ______________ ( )

ఊ) పగలు + పగలు = ______________ ( )



SCERT TELANGANA

**2. కింది విగ్రహ వాక్యాలను సమాసం చేసి, సమాసం పేరు రాయండి.**

అ) అధికారం చేత దర్పం = ______________ (            )

ఆ) గది యొక్క తలుపులు = ______________ (            )

ఇ) మంచిదైన బట్టలు = ______________ (            )

ఈ) పది సంఖ్య గల గంటలు = ______________ (            )

ఉ) న్యాయమూ అన్యాయమూ = ______________ (            )

**3. కింది వాక్యాల్లో కర్తరి / కర్మణి వాక్యాలను గుర్తించండి. నియమాలతో సరిపోల్చుకోండి.**

- రచయిత్రులు ఎన్నో వివరాలు సేకరించారు.
- ఆమె ఇంటర్వ్యూ రికార్డు చేయబడింది.
- కొంతమంది స్త్రీలతో జరిపిన ఇంటర్వ్యూలు యథాతథంగా ప్రచురించారు.
- వాళ్ళ భాష మార్పు చేయబడలేదు.
- ప్రతివాళ్ళూ భోజనాలు పెట్టి, మళ్ళా రమ్మని పంపించారు.
- దాదాపు నలభై ఇంటర్వ్యూలు చేశాం.
- ఊళ్ళో సమావేశం ఏర్పాటు చేయబడింది.
- గోడలమీద అందమైన చిత్రాలు గీయబడ్డాయి.
- దేహం పంచభూతాలచే నిర్మించబడింది.
- మేం పెద్దలను గౌరవిస్తాం.

## ప్రాజెక్టు పని

♦ మీ ఇంటి చుట్టుపక్కల ఉండే వృద్ధుల వద్దకు వెళ్ళండి. వాళ్ళతో మాట్లాడండి. వాళ్ళకిష్టమైన పనులు ఏవో తెలుసుకొని చెప్పండి. వారేమనుకుంటున్నారో రాయండి. నివేదికను రాసి తరగతిలో ప్రదర్శించండి.

**సూక్తి**

జీవితాంతం తల్లిదండ్రుల సేవచేసినా
సంతానం మాత్రం వారి ఋణం
తీర్చుకోజాలదు.

– మహాత్మాగాంధీ

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

## ఉపవాచకం



# 1. కుంరం భీం

**'జల్, జంగల్, జమీన్ (నీరు అడవి భూమి) మనది'... అనే నినాదంతో గోండులను, కోయలను, చెంచులను సంఘటితపరచి పోరుబాటలో నడిపించిన విప్లవ వీరకిశోరం కుంరం భీం. 'మా గూడెంలో మా రాజ్యం' అనే నినాదంతో గిరిజనులందరిని ఏకంచేసి ప్రభుత్వంపై సమరం సాగించిన పోరాటయోధుడు కుంరంభీం.**

ఆకుపచ్చని పూర్వపు ఆదిలాబాద్ జిల్లా నేటి కుంరం భీం జిల్లా అడవుల్లో ఉదయించిన గొప్ప యుద్ధవీరులు గోండులు. అట్లాంటి వీరుల్లో కుంరం భీం ఒకడు. భీం తండ్రి పేరు చిన్ను. ఈయన గూడెం పెద్ద (పటేలు). ఈయనకు భీంతోపాటు సోము, బొజ్జు అనే కుమారులు మరియు కుర్దు, యేసు అనే ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు. వీళ్ళంతా గోండు తెగకు చెందినవారు. ఆదిలాబాద్ అడవుల్లో నివసించే ఈ గిరిజనుల్లో ఎన్నో తెగలున్నాయి. గోండు, కొలామ్, పరదాన్, కోయ, అందాల్, చెంచు, భిల్లులు మొదలగువారున్నారు. అడవిలో పుట్టి, పెరిగి, అక్కడే చనిపోయే వారికి, అడవే ప్రపంచం. కనుక అడవి తమదని బలంగా నమ్ముతారు. తెల్లదొరలను ఎదిరించిన రాంజీ గోండు వారసులమని గర్వంగా చెప్పుకుంటారు.

కుంరం భీం బాల్యం నుండి తెలివైనవాడు, సాహసవంతుడు, నాయకత్వ లక్షణాలున్నవాడు. భీం చిన్నప్పటి నుంచి ప్రతి విషయానికి స్పందించేవాడు. ఆలోచించేవాడు. దేన్నీ ఊరికే వదిలిపెట్టేవాడుకాదు. ఈ లక్షణాలే తరువాత అతడిని గిరిజన వీరుడిని చేశాయి. అతని ఆలోచనలకు పురుడు పోసింది, అతని భావాలకు బలాన్ని ఇచ్చింది అతని వదినె కుకూబాయి. భీం చిన్నప్పుడు సంకెనపెల్లి గూడెంలో పెరిగాడు. అక్కడి చెట్లూ, చేమా, బోళ్ళు, బండలు, కొండలు, వాగులు ఒకటేమిటి సమస్త ప్రకృతి అతడిని తీర్చిదిద్దింది. ఆ రోజుల్లోనే ఒకరోజు భీం తన మిత్రులైన జంగు, కొంతల్, మాదు, పైకులతో కలిసి అడవికి వచ్చాడు. వారితో మేకపిల్లలు కూడా ఉన్నాయి. పైకు దగ్గర్లో ఉన్న నారేపచెట్టు ఎక్కాడు. ఒక కొమ్మ మీద కూర్చొని పాటలు పాడుకుంటూ సన్నసన్న మండలు నరికి మేకలకు వేస్తున్నాడు. భీం కథ చెపుతున్నాడు.

"తొందరగ దిగు. వాళ్ళు చూసినారంటె చాలా కష్టం" అన్నాడు జంగు. అన్నట్లే ముగ్గురు జంగ్లాత్ జవాన్లు, ఒక సుంకరి ఉరికొచ్చారు. పైకును పట్టుకున్నారు. వారి వెనకే వచ్చిన అమీన్‌సాబ్ "చెట్లు కొడుతున్నారా, ఈ అడవిని మీ అయ్యలు పెంచి పెద్ద చేసినారనుకున్నారా?" అని "అరే! అందరిని పట్టుకొని బంగ్లా దగ్గరికి తీసుక రండిరా!" అని తన మనుషులకు చెప్పాడు.

ఆ తరువాత గూడెం పెద్దయిన కుంరం చిన్నును చూస్తూ "అడవిలో ఆకు కూడా తెంపద్దన్న, చౌకీదార్‌ను, సారెదార్‌ను పంపి నీకు చెప్పుమన్న. ఈ రోజు నేను వచ్చి చూసిన. ఏముంది. నా కళ్ళ ముందే పిల్లలు అడవిని నరికారు. దానికి

SCERT TELANGANA

శిక్షేంటో తెలుసా. కొమ్మ నరికినోని వేళ్ళు నరకడమే తగిన శిక్ష" అన్నాడు. ఎందరు బతిమిలాడినా వినకుండా పైకు వేళ్ళు నరికించాడు అమీన్‌సాబ్. పైకు అరుపులతో అడవంతా ఏడ్చింది. స్పృహ తప్పి పైకు కిందపడిపోయాడు. తర్వాత చౌకీదార్ ఎవరెవరు ఏఏ పట్టీ కట్టినరో చదివాడు. పట్టీల పేరు మీద ఆ పూట గూడెం అంతా జంగ్లాత్ వాళ్ళ లూటీకి గురైంది. ఈ సంఘటన భీంను పట్టి కుదిపింది. ఆవేశంతో వదినె వద్దకు పోయాడు. "వదినే! ఈ గాలి, నీరు, ఇక్కడి ఆకాశం మొత్తం మనవైనప్పుడు, ఈ భూమి, అడవి మనవెందుకు కావు. అడవి, భూమి మాత్రమే వాళ్ళవెట్లా అయినవి?" అని అడిగాడు.

"ఈ ప్రశ్నలు మనోళ్ళందరికి వస్తె బాగుండు. మీ నాయినను అడుగు" అంది. పట్టి అంటే పన్ను. 'మేక, ఆవు, ఎద్దు, భూమి, నాగలి, మంచె, గడ్డి, గుడిసె ఇలా ఉన్న ప్రతీదానిపేరు మీద పన్ను కడితే, చివరకు ఏం తిని బతకాలె. కష్టమంతా పన్నుల రూపంలో జంగ్లాత్ వాళ్ళు గుంజుకుంటే ఆకలితో చచ్చిపోవాల్సిందే కదా' ఇలా పరిపరివిధాలా ఆలోచిస్తూ ఆ రోజు భీం ఆకలితో పడుకున్నాడు.

ఈ సంఘటన భీం మనసుపై చెరగని ముద్ర వేసింది. తమ కష్టాన్ని పరులు అన్యాయంగా తీసుకపోతున్నారని తెలుసుకున్నాడు. దీనికి వ్యతిరేకంగా చిన్ననాడే ఆలోచించడం నేర్చుకున్నాడు. షావుకార్లు గిరిజనుల్ని మోసం చేసే తీరు కొంత అర్థమయ్యేది, కొంత అర్థంకాకపొయ్యేది. జరగకూడని విధంగా జరుగుతున్న విధానాన్ని గురించి ఆలోచించాడు. కాని ఆపడమెట్లానో అతనికి అంతుపట్టలేదు.

దోపిడిలో అన్ని కోల్పోయిన కుంరం చిన్ను ఆరోగ్యాన్ని కూడా కోల్పోయాడు. ఫలితంగా చనిపోయాడు. చిన్ను చనిపోయినాక కుంరం కుర్దు తన తమ్ముడు యేసు కుటుంబం, అన్న పిల్లలతో కలిసి సంకెనపెల్లి వదిలాడు. కొందరు కొలాములు కూడా వీరితో బయల్దేరారు. గూడెం వదిలేస్తుంటే భీం బాధపడ్డాడు. ఇది చూసిన వదినె ఇదంతా మామూలేనని, అడవుల్లో బతికే మనకు ఇవి అలవాటేనని చెప్పింది. వాళ్ళు జనగామ (ఆసిఫాబాద్) ధనోరా దాటి సుర్దాపూర్ చేరుకున్నారు. మైదాన ప్రదేశం చూసి బండ్లు ఆపి, పక్కన ఉన్న పెద్దవాగు ఒడ్డుకు గుడిసెలు వేసుకున్నారు. చెట్లు, తుప్పలు నరికి, రాళ్ళు రప్పలు ఏరిపారేశారు. ముండ్ల కంపలు కాల్చారు. సమష్టిగా పనిచేసి, తర్వాత భూమి సమానంగా పంచుకున్నారు. వారి కష్టఫలితంగా జొన్న చేండ్లు ఏపుగా ఎదిగాయి. చేను చూసి మురిసిపోయారు. కడుపు నిండా ఆరునెలలపాటు తిండి దొరుకుతుందని అనుకున్నారు. ఆవిధంగా అనుకుంటున్న సందర్భంలో వాళ్ళవద్దకు పన్నెండు మంది కొత్తవాళ్ళు వచ్చారు.

వచ్చిన వాళ్ళలో సిద్దిక్ అనేవాడు "ఈ ప్రాంతం అంతా నాది. నన్ను అడగకుండా ఎందుకు దున్నినారు" అని అడిగాడు. వారిద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగింది. ఇట్లా జరిగిన మాటల యుద్ధం, కొద్దిసేపట్లోనే కట్టెలతో కొట్లాట వరకు వచ్చింది. ఆ ప్రాంతం అంతా రక్తసిక్తమయింది. భీం కొట్టిన దెబ్బకు సిద్ధిక్ చనిపోయాడు. చనిపోగానే అతనితో వచ్చిన వాళ్ళు పారిపోయారు. వెంటనే వదినె వచ్చి "భీం ఇక్కడి నుండి వెళ్ళిపో" అని చెప్పింది. అట్లా భీం తన వారి నుండి వేరైపోయాడు.

అట్లా వెళ్ళిన భీం తిరిగి సంకెనపెల్లి చేరుకున్నాడు. తన మిత్రుడైన కొండల్‌ను కలిసి సుర్దాపూర్‌లో జరిగిన గొడవ గురించి, సిద్దిక్ చావు గురించి చెప్పాడు. ఆ సమయంలోనే సిద్దిక్‌కు ఈ భూములు ఎవరిచ్చారు? అవి అతని సొంతమెట్లా అయినాయి? పట్టా అంటే ఏమిటి? గోండోళ్ళకు పట్టాలు ఎందుకివ్వరు? నైజాం అంటే ఏంది? సర్కార్ అంటే ఎవరు? మేం దున్నినప్పుడు రాని సిద్దిక్ తరువాత ఎందుకు వచ్చాడు? సిద్దిక్‌ది తప్పుకానప్పుడు, నాది మాత్రమే తప్పు ఎందుకవుతుంది? తన గోడంతా ప్రశ్నల రూపంలో కొండల్ ముందు పరిచాడు. అట్లా రాత్రి గడిచింది. ఎట్లా తెలిసిందో కాని గొడవంతా తెల్లారేసరికి గూడెం అంతా పాకింది. ఇక అక్కడ ఉండలేక వెళ్ళిపోతానన్న భీంతో తనూ వస్తానని కొండల్ బయల్దేరాడు.

జరిగిన విషయాన్ని తెలిపి, తనకున్న ప్రశ్నలకు జవాబులు పొందాలనే ఆలోచనతో ముఖాసీ వద్దకు బయల్దేరాడు. మనందరికీ పెద్ద ముఖాసీ "భారీలొద్ది" అనేచోట ఉంటాడని తన తండ్రి చెప్పగా విన్నాడు. కనుక అతన్ని కలవడానికి పోయాడు. వీళ్ళు వెళ్ళేసరికి ముఖాసీ ఇంట్లోనే ఉన్నాడు. భీం, కొండల్ వెళ్ళి "రాం... రాం..." చెప్పారు.

"రాం... రాం... రండి, కూర్చోండి" అంటూ పరిచయాలు చేసుకున్నాడు ముఖాసీ. జంతువులకన్నా హీనంగా ఉన్నా తమ బతుకుల గురించి, తమను జంగ్లాత్ వాళ్ళు, షావుకార్లు ఎట్లా హింసిస్తున్నారో తెలిపాడు. "మేం అడవిలో పరాయివాళ్ళ తీరుగ బతుకుతున్నం. మేం భూమి సాగుచేస్తే ఫలితాన్ని ఎవడో వచ్చి పట్టుకపోతాడు. మాతోపాటు పెరిగిన చెట్ల ఆకులు, కొమ్మలు తెంపినా, విరిచినా మా చేతులు నరుకుతున్నారు. మేం ఎట్లా బతుకాల్నో తెలుస్తలేదు. జంగ్లాతోళ్ళకు, షావుకార్లకు బుద్ధి చెప్పడానికి అన్ని గూడాల జనాలను ఒక్కటి చేస్తాం. మీ మద్దతు కావాలి. బ్రిటిష్ వాళ్ళకు రాంజీగోండు బుద్ధి చెప్పినట్టు మనం కూడా వీళ్ళకు బుద్ధి చెప్పాలి" అని ఉద్రేకంగా భీం అన్నాడు.

"భీం ఇప్పటికే నువ్వు సర్కారు దృష్టిల ఉన్నావు. ఇట్లాంటి హింసా పద్ధతులు వద్దు. తొందరపడకు. సర్కార్‌కు జంగల్ మీద లాభాలు కావాలి. కనుక జంగ్లాతోళ్ళు మిమ్మల్ని హింసిస్తున్నారు. రాంజీగోండు తీరుగా కొట్లాడుట మనతో కాదు. నా వల్ల మాత్రం కాదు" మెల్లగా అన్నాడు ముఖాసీ.

ఇక మాట్లాడి లాభం లేదనుకొని ముఖాసీ ఉండే ఊరు వదిలేశారు. భీం కొండల్‌లకు ఎటుపోవాలో తెలియదు. కనిపించిన బాటలో ముందుకుపోతున్నారు. అట్లా వెళ్తున్న వారికి ఓ పెద్ద ఊరు ఎదురైంది. పెద్ద మేడలు, పెద్ద పెద్ద దుకాణాలు, అలంకరించుకున్న స్త్రీ, పురుషులు కనిపించారు. ఈ లోకం వారికి వింతగా ఉన్నది. వారు చేరింది బల్లార్షా రైల్వేస్టేషన్. అందరూ రైలు ఎక్కుతుంటే, "నడవడమెందుకు మనమూ ఎక్కుదాం" అనుకొని వాళ్ళూ ఎక్కారు. అందరు దిగుతుండగా, వాళ్ళూ దిగారు. వీరిని టి.సి. టికెట్ అడిగాడు. అదేంటో మాకు తెలియదు, మా దగ్గర డబ్బులు లేవన్నారు. అపుడు పోలీసులు వీళ్ళు గోండులని తెలుసుకొని నాలుగు తగిలించి పంపారు. అట్లా వాళ్ళు చేరుకున్నది "చాందా" అనే పట్నం.

రైల్వేస్టేషన్ బయట కూర్చున్న భీం, కొండల్‌లకు తనతో తెచ్చుకున్న వస్తువులను మోయలేక అవస్థపడుతున్న ప్రయాణికుడు కనిపించాడు. "నేను ఆ బరువుల్ని మోయాల్నా" అంటూ భీం అడిగాడు. "సరే" అని అంగీకరించిన ఆ ప్రయాణికుడితో వాళ్ళు అతని ఇంటికి వెళ్ళారు. ఆ ఇంట్లో చాలా మంది అచ్చు యంత్రాలు తిప్పుతున్నారు. తనకేమన్నా పని దొరకవచ్చు అని భీం ఆశపడ్డాడు. పని కోసం ప్రయాణికున్ని అడిగాడు. "సరే" అన్నాడు ప్రయాణికుడు. అతను ఆ ప్రింటింగ్ ప్రెస్ యజమాని. పేరు "విటోబా".

నిజాం సర్కారుకు, తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరుచేస్తున్న వాళ్ళతో విటోబాకు సన్నిహిత సంబంధాలున్నాయి. విటోబా రహస్యంగా పత్రిక నడిపేవాడు. రహస్య పార్టీ, రహస్య పత్రికల గురించి తెలుసుకున్న భీం, విటోబాపై మంచి అభిప్రాయం ఏర్పరచుకున్నాడు. కొండల్‌కు మాత్రం ఇదంతా రుచించలేదు. అతను తిరిగి ఇంటికి పోయాడు. విటోబా దగ్గర సంవత్సరం ఉన్నాడు భీం. అక్కడే తెలుగు, హిందీ, ఇంగ్లీషు చదవడం, రాయడం నేర్చుకున్నాడు. భీంకు రాజకీయాల్ని, సమాజ పరిణామాల్ని, విటోబా అర్థం చేయించాడు. మార్పు రావాలంటే త్యాగం చేయాలని తెలిపాడు. ఒక రోజు రాత్రి పోలీసులు వచ్చి విటోబాను అరెస్టుచేసి పట్టుకపోయారు. కుంరం భీంను కొట్టి వదిలేశారు. అట్లా భీం తిరిగి ఒంటరివాడయ్యాడు. తిరిగి రైల్వేస్టేషన్‌కు పోయి కూర్చున్నాడు. అక్కడ మంచిర్యాలకు చెందిన తెలుగువాడు అతనికి కలిశాడు. బతుకుదెరువు కోసం చాయ్‌పత్తా దేశం పోతున్నట్టు చెప్పాడు. ఇంకో ఆలోచన చేయకుండా భీం అతనితో కలిసి చాయ్‌పత్తా దేశం అనబడే అస్సాం పోయాడు.

తేయాకు తోటల్ల అడుగుపెట్టాడు భీం. తనవంటి అనేకమంది కార్మికులను చూశాడు. గోండు గూడెం నుండి తేయాకు తోటలవరకు అతని ప్రయాణం సాగింది. అనేక అనుభవాలతో ప్రపంచాన్ని అర్థం చేసుకున్నాడు. ఎక్కడైనా

SCERT TELANGANA

కష్టజీవులకు బాధలు తప్పవని, కష్టపడేవానికి కడుపునిండటంలేదని తెలుసుకున్నాడు. రోజు కూలీ పద్ధతిన, వంచిన నడుం ఎత్తకుండా పనిచేశాడు. నుదుటి చెమట తుడుచుకోను లేచే కార్మికులను మేస్త్రీలు కొరడాతో కొట్టేవాళ్ళు. చేసిన కష్టం మందులకుపోతే తినడానికి కష్టపడేవారు. యజమానులకు దయాగుణం ఉండేది కాదు. ఇవన్ని చూస్తున్న భీంకు అసంతృప్తి రాజుకుంది. అక్కడ నాలుగు సంవత్సరాలున్నాడు. ఆ సమయంలోనే భీంకు మన్యం ప్రాంతం నుండి వచ్చిన తెలుగువానితో పరిచయం అయింది. అతని ద్వారా మన్యం ప్రాంతం గురించీ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు గురించీ తెలుసుకున్నాడు. బ్రిటిష్ వాళ్ళు అక్కడి ప్రజల్ని పెట్టిన యాతనల గురించి విన్నాడు. మన్య ప్రాంత ప్రజల్ని సీతారామరాజు ఏవిధంగా సమీకరించాడో అవగాహన చేసుకున్నాడు. రామరాజు పోరాట రీతుల్ని ఆకళింపు చేసుకున్నాడు. యువకులకు యుద్ధరీతుల్ని ఎట్లా నేర్పాడో తెలుసుకున్నాడు. అడవిపై మాకు తప్ప ఎవరికీ అధికారంలేదని గిరిజనులతో చెప్పించిన రామరాజు గొప్పతనాన్ని అర్థం చేసుకున్నాడు. యుద్ధ సమయంలో సమాచారాన్ని చేరవేసే విధానాన్ని ఒంటపట్టించు కున్నాడు. యుద్ధ మెళుకువల్ని గ్రహించాడు. ఇప్పుడు భీం ఒక ఎక్కుపెట్టిన బాణం. పోరుబాటలో నడవడానికి సమాయత్తమైన పోరాట వీరుడు.

ఈ సమయంలోనే తేయాకు తోటల్లో అన్యాయంగా ఇద్దరు కార్మికుల్ని కొడుతున్న మేస్త్రీలకు అడ్డుతగిలాడు. మేస్త్రీలు భీం మీదికి కొరడా లేపారు. సహించని భీం వారిని చితక బాదాడు. ఇది తెలుసుకున్న యజమాని పోలీసులతో చెప్పి భీంతో సహా మరికొందరిని జైల్లో వేయించాడు. నాల్గు రోజుల తర్వాత జైల్లోని ఇనుప చువ్వలు వంచి తప్పించుకున్నాడు. నేరుగా వచ్చి కదులుతున్న రైలు ఎక్కాడు. అది అతన్ని బల్లార్షా చేర్చింది. అక్కడే కొన్ని రోజులు మూటలు మోసి బతికాడు. అక్కడ ఉండలేక బల్లార్షా వదిలి రాజోరా మీదుగా అడవిబాట పట్టాడు. దారిలో తన అన్నలు కాకన్‌ఘాట్‌లో ఉంటున్నారని తెలుసుకున్నాడు. సాయంత్రం వరకు తన అన్నల గూడెం చేరుకున్నాడు. తమ గుడిసె ముందుకు పోయేసరికి వదినె కుకూబాయి కూర్చొనుంది. భీంను చూసి కండ్లనీళ్ళు పెట్టుకుంది. కొడుకు వచ్చిండని తెలుసుకున్న తల్లి భీంను పట్టుకొని ఏడ్చింది. ఆమె అనారోగ్యంతో చావుకు దగ్గరగా ఉంది. వదినె తన ఇద్దరు కొడుకులు, పాపకు చిన్నాన్నను పరిచయం చేసింది. వాళ్ళు భీం ఒడిలో దూరారు. రాత్రి అంబలి తాగినంక తమ్ముని వివరాలు అడిగి తెలుసుకొని అన్నలిద్దరూ ఆశ్చర్యపోయారు. కుర్దు, యేసు, కొండల్‌ల గురించి భీం అడిగాడు. మిత్రులందరి గురించి అడిగి తెలుసుకున్నాడు.

దేవడంపెద్ద లచ్చుపటేల్. అతని దగ్గర భీం జీతానికి కుదిరాడు. అతని పంట పొలాల్లో మార్పు తెచ్చాడు. పత్తి, మిరప లాంటి వ్యాపార పంటలను వేశాడు. మొత్తానికి భీం తెలివిపరుడని, వ్యవహారదక్షుడని అందరితో అనిపించుకున్నాడు. లచ్చుపటేల్ భూముల వ్యవహారాలను ముందునుంచి చూసే అంబటిరావుకు సోంబాయి అనే కూతురుంది. ఆమెను భీంకిచ్చి పెండ్లి చేస్తే బాగుంటదని లచ్చుపటేల్ నిశ్చయించాడు. ఆ విధంగా కుంరం భీం సోంబాయిల పెండ్లి దేవడంలో లచ్చుపటేల్ ఆధ్వర్యంలో జరిగింది. ఆరోజుల్లో కుంరం భీం వార్తల్లో వ్యక్తి అయినాడు. అతనిపట్ల ఆకర్షణ పెంచుకున్న పైకూబాయి అనే యువతి కోరి అతన్ని పెళ్ళాడింది. భీం కాకన్‌ఘాట్‌లో కాపురం పెట్టాడు.

కుర్దు తన తమ్ముడు యేసు దగ్గరికి ధనోరాకు వచ్చాడు. అతనికి అడవిని నరికి భూమి సాగుచేసుకోవాలనే ఆలోచన వచ్చింది. అన్ని ప్రదేశాలు తిరిగి చూశాడు. బాబేఝరి లొద్ది అంచున సాగు భూమి ఉంది. తానొక్కడే కాకుండా చాలా మందిని ఏకం చేశాడు. బాబేఝరి గుట్టలు గొడ్డళ్ళ చప్పుళ్ళతో ప్రతిధ్వనించాయి. అడవుల్ని నరికి పంటభూములుగా మార్చారు. బాబేఝరి, చల్‌బండి, గోగిన్ మోవాడం, టొయికన్ మోవాడం, భీమన్ గొంది, కల్లేగామ్, మురికిలొంక, అంకుసాపూర్, నర్సాపూర్, దేమ్డీగూడ, జోడెన్‌ఘాట్, పట్నాపూర్ మొదలగు పన్నెండు గూడాలను పొందించారు. పందిళ్ళు, గుళ్ళు, మంచెలు, జెండాలు అన్నీ సమకూర్చుకున్నారు. కొత్త ఊర్లు వెలశాయి. కొత్త బతుకులు మొదలయినాయి.

వారం రోజుల్లోనే బాబేఝరిలో గోండులు, కొలామ్‌లు పన్నెండు గ్రామాలను పొందించారు అనే వార్త దావానలం తీరున పాకింది. జంగ్లాత్ వాళ్ళు దాడి చేశారు. గూడాలన్నిటిని బూడిదచేశారు. అందరిమీదా కేసులు పెట్టారు. గ్రామస్తులంతా

SCERT TELANGANA

బాధ పడుతుంటే కుర్దు ధైర్యం చెపుతూ మా తమ్ముడు భీముని ఇక్కడకు తెచ్చుకుందం వాడు అన్ని చూసుకుంటడు అని ధైర్యం చెప్పాడు.

విషయాలన్నీ తెలుసుకున్న భీం, బాబేఝరీ వైపు వచ్చి టొయికన్ అనే గూడెంల దిగాడు. పదిరోజుల్లో ప్రతి గూడెం తిరిగాడు. విషయం అర్థమైంది. ఏం చేయాలన్నదే ప్రశ్నగా మిగిలింది. భర్త అవస్థ గమనించిన పైకూబాయి భూమికేసుల గురించి వకీలును పెట్టుకోమని సలహా ఇచ్చింది.

పైకూబాయి చెప్పింది నిజమనిపించింది. కేసుకు సంబంధించి రాతపూతలు చూసుకొనే వ్యక్తి పేరు మహదు. అతనితో కలిసి భీం జనగామలో ఉన్న పైకాజీ రామచంద్రరావు వకీలును కలిశాడు. తన పూర్వీకుల నుండి ఇప్పటి వరకు మేం భూమిని నమ్మి బతుకుతున్నామని, ఇటీవలి కాలంలో బాధ లెక్కువైనయనీ, ఎక్కడికి పోయినా వెళ్ళగొడుతున్నారని, అసలు మా హక్కును ఎందుకు లాక్కుంటున్నారనీ భీం ఆవేదనతో వకీలును అడిగాడు. భీం ప్రశ్నకు పైకాజీ ఈ విధంగా జవాబిచ్చాడు.

"భీం ఈ భూములన్నీ మీవే. ఈ రాజ్యానికి రాజులు మీరే. అదంతా 1918 సంవత్సరానికి ముందుమాట. అప్పుడు సర్కారు అడవివైపు చూడలేదు. అడవిపై హక్కును కోరలేదు. 1918లో తాసీలు ఆఫీసు ఉట్నూరు వచ్చింది. అది తెలిసి మైదాన ప్రాంతాల నాగరికులు కొండ, కోనల్లోకి వచ్చారు. సర్కారుతో ఏదో విధంగా సంబంధం పెట్టుకున్నారు. దానివల్ల పట్టాలు వాళ్ళకు దక్కాయి. భూమి మీద మీకున్న హక్కు పోయింది. ఇప్పుడు చట్టం వాళ్ళను కాపాడుతుంది" అని చెప్పాడు. "ఈ చట్టాలు తయారు చేసిందెవరు? ఎవరికి చెప్పి మా భూముల్ని వాళ్ళ పేరు మీద రాశారు? అసలు ఆ దొంగలకు పట్టాలు ఎందుకు ఇచ్చారు?" అని కోపంగా అడిగాడు భీం. "ఇన్నేండ్ల నుండి ఇసొంటి ప్రశ్నలు అడిగిన వాడిని నిన్ను ఒక్కడినే చూశాను. ఈ రాజ్యం నిజాం రాజుది. రాజుకు ఏది తోస్తే అదే చేస్తడు. అంతా ఆయన ఇష్టం మీద ఆధారపడి ఉంటుంది".

"న్యాయం చూడని రాజెందుకు? మా చావు కోరే సర్కారుతో మాకు పనేముంటుంది?" సూటిగా అన్నాడు భీం. "చూడు భీం. మీ బాధల్ని నైజాంకు చెప్పి చూడండి. మేలు జరిగితే మంచిదే. లేకుంటే సర్కార్‌ను సవాల్ చేయండి. మీ చట్టాలను, కోర్టులను, పోలీస్‌ను, అధికారులను ఒప్పుకోం అనండి. నీ వ్యవహారం చూస్తే అట్లనే అంటావనిపిస్తున్నది. నైజాంతో కొట్లాడి భూముల్ని సాధించగలరా? నాకు మాత్రం నమ్మకం లేదు" అని ముగించాడు వకీలు.

"అవసరముంటే వచ్చి కలుస్తాం. మీరు సహాయం చెయ్యాలి" అంటూ మహదుతో కలిసి గూడెం దిక్కు నడిచిండు భీం.

ఏవైపు నుండి చూసినా లడాయి తప్పదనుకున్నాడు భీం. పన్నెండు గూడాల ప్రజలందరు పట్నాపూర్ రావాల్సిందిగా వార్త పంపాడు. భీం పిలుపు అందుకొని ప్రజలందరు వచ్చారు. పెద్ద చెట్టు కింద కూర్చున్న ప్రజలందర్ని ఉద్దేశించి భీం ఇట్లా అన్నాడు.

"మనందరి కష్టాలు ఒక్కటే. చిన్నప్పటి నుండి నేను ఈ కష్టాలను ఎదుర్కుంటా ఎదిగిన. భూమి కోసం మనం జంగల్ నరికితే, జంగ్లాత్ వాళ్ళు, పట్టేదార్లు కేసులు పెడుతున్నారు. వాళ్ళు మనల్ని కొట్టినా, గుడిసెలు తగులబెట్టినా, చేతులు నరికినా భరిస్తూ ఇన్నేండ్లు గడిపినం. సర్కారు మన మీద కేసులు పెడితే, వకీలు కోర్టుకు రమ్మంటుండు. మనం గంజి తాగి బతకడం వల్లకాదు, కోర్టు కేసులతో చావుకు దగ్గరవుతున్నాం. ఇవన్నీ ఇంతకు ముందు ఉన్నవి. ఇక ముందు కూడా ఉంటాయి. కనుక వాటికి భయపడేది లేదు. మీరు భూములు దున్నండి. వర్షాకాలం వస్తున్నది. పంటలు పండిద్దాం. వాళ్ళు మనమీదికి వస్తారు. అడవి జంతువులను తరిమినట్లు, వాళ్ళను కూడా తరుముదాం. వాళ్ళతో యుద్ధం చేసి హక్కులు సాధించుకోవాలి. భూములు దక్కించుకోవాలి. మీకు ఇట్లా చేయడం ఇష్టమేనా" అడిగాడు భీం.

"ఆకలితో చచ్చే కన్నా పోరాటం చేసి చద్దాం" అన్నారు కొందరు. "సరే" అన్నారు మరికొందరు. "భీం తలుచుకుంటే ఏదైనా సాధించగలడు" అన్నారు ఇంకొందరు.



SCERT TELANGANA

అనుకున్నట్లుగానే గోండులు ఆ సంవత్సరం అడవిని నరికి పంటలు పండించారు. విషయం తెలుసుకున్న జంగ్లాత్ వాళ్ళు బాబేఝరీపై విరుచుకపడ్డారు. "జంగల్ నరికిన చోటుకు పదండి. మేం పంచనామ చెయ్యాలె" అన్నాడు అమీన్‌సాబ్. వద్దంటే అడవిని నరుకుతున్నరని కోపంతో బూతులు తిట్టడం మొదలుపెట్టాడు అమీన్‌సాబ్.

"మా అడవి, మా ఇష్టం. మేం ఏమైన చేసుకుంటాం. మీకు లంచాల కింద కోళ్ళు, గొర్లు ఇకముందు ఇయ్యం. చాటుగా ఎత్తుకొనిపోయి దొంగలు కాకండి" అన్నాడు భీం.

"మమ్మల్ని దొంగలంటవా" అని అమీన్ భీంను కొట్టాడు. అమీన్‌తో వచ్చిన వాళ్ళు గోండుల్ని కట్టెలతో కొట్టడం మొదలుపెట్టారు. రఘు తుడుం మోగించాడు. అది విన్న గోండులు, కోలామ్‌లు ఉరికివచ్చి జంగ్లాత్ వాళ్ళను ఎదుర్కొన్నారు. ఆ స్థలం యుద్ధరంగమైంది. దీన్ని గమనించిన ఒక జాగీర్‌దార్ తుపాకీ పేల్చాడు. అది భీం భుజం నుండి దూసుకపోయింది. గోండులు వచ్చిన వాళ్ళందర్ని విపరీతంగా కొట్టారు. దెబ్బలకు నిలువలేక అమీన్‌తోబాటు అందరూ జనగామ దిక్కు పరుగందుకున్నారు. కొన్ని రోజుల తర్వాత కుర్దు, అతని కొడుకులను పోలీసులు అరెస్టు చేశారు. లచ్చుపటేల్‌కు చెప్పి వాళ్ళను జామీనుమీద విడుదలచేయించాడు కుంరం భీం.

పరిస్థితి చేయిదాటుతుందనుకున్న జంగ్లాత్ అమీన్‌సాబ్, గిర్దావర్ ఇద్దరూ కలిసి వెంటనే తాసీల్‌దార్ అబ్దుల్‌సత్తార్‌ను కలిశారు. బాబేఝరీ సంగతి పూసగుచ్చినట్లు తెలిపారు. ఏకు తీరు ఉన్న గోండులు మేకు తీరుగ అయ్యారనీ, అమాయకులను కున్న వాళ్ళు పోరాటవీరులైనారనీ, ఇంకా చూసుకుంటూపోతే చాల ప్రమాదమనీ తెలిపారు. తహసీల్‌దార్ వెంటనే డి.ఎస్.పి.తో మాట్లాడి గోండులను అరెస్ట్ చేయమన్నాడు. కొండల్లో జరుగుతున్న విషయాల్ని విపులీకరిస్తూ హైద్రాబాద్ హోం సెక్రటరీకి తెలిపాడు. బాబేఝరీలో జంగ్లాత్‌వాళ్ళమీద దాడి చేశారనీ, అడవి నరికారనీ డి.ఎస్.పి. కేసులు పెట్టాడు. కుంరం భీంను మొదటి ముద్దాయిగా పెట్టి మహదు, రఘు, జంగు, కుర్దు, యేసు మొదలగు వారల పేర్లను తర్వాత పెట్టాడు. వీళ్ళను అరెస్ట్ చేయడం ఎట్లా అని డి.ఎస్.పి. ఆలోచించాడు.

డి.ఎస్.పి. ఆలోచనలు ఇట్లా ఉంటే, కుర్దూ ఆలోచనలు మరో రకంగా సాగుతున్నవి. జీవితమంతా కొట్లాటలు, కేసులతో నిండిపోయింది. కేసులైతే రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇట్లా కేసులు పెట్టి హింసించే జంగ్లాత్ వాళ్ళ విషయం సర్కారుకు తెలుసోలేదో, హైదరాబాద్ పోయి తమ కష్టాలను, దుఃఖాన్ని నైజాం నవాబుతో చెప్పుకుంటే దయ తలుస్తాడేమో అని అనుకున్నాడు. ఈ మాటే భీంతో చెప్పాడు. పెద్దమనిషి మాట తీసేయలేక, ఇది కూడా సమస్య పరిష్కారానికి ఒక మార్గమవుతుందేమోనని భీం హైదరాబాద్‌కు బయల్దేరాడు. తమ సమస్యలను ఏకరువు పెడుతూ ఒక లేఖను నిజాంకు ఇయ్యాలని రాసుకున్నాడు. హైదరాబాద్ వెళ్ళిన కుంరం భీంకు నిజాం ప్రభువు దర్శనం లభించలేదు. భీంతోపాటు వచ్చిన మహదు నిజాం దర్శనం కోసం అధికారులను పదే పదే బతిమిలాడాడు. కాని వాళ్ళు వినిపించుకోలేదు. ఇక కలవడం సాధ్యంకాదనిపించి భీం వెనక్కి తిరిగాడు. హైదరాబాద్ పోయి వచ్చేలోపు గూడాల మీద పోలీసులు దాడి చేశారు. పోలీసులకు జోడెన్‌ఘాట్ గ్రామపెద్ద కుర్దుపటేల్ (కుంరంభీం చిన్నాయన కాదు) సహకరించాడు. ఊర్లన్నీ కుక్కలు చింపిన విస్తర్లు అయినాయి. కుంరం కుర్దు, యేసు, సూరులకీ విపరీతంగా దెబ్బలు తాకాయి. వారిని అరెస్ట్ చేశారు. విషయం తెలిసిన భీం వెంటనే జోడెన్‌ఘాట్ పోయాడు. అందరితో కలిసి ఒక సమావేశం ఏర్పాటు చేశాడు.

"మేం హైదరాబాద్ వెళ్ళాం. నిజాం రాజును కలువలేకపోయాం. ఇక్కడేమో పోలీసులు పదే పదే మన మీద దాడులకు తెగబడుతున్నారు. వాళ్ళు మనల్ని బతకనియ్యరు. కానీ మనం బతకాలి. ఈ భూమి, అడవి మనవి. సర్కారు ఈ భూమి మనది కాదంటుంది. అది భూమిని వదిలిపెట్టదు. పోలీసులతో గూడాలను కాలబెడుతుంది. ఆ మంటల్లోపడి చనిపోదామా? ఏం చేద్దాం?" అని అడిగాడు.

"భూమి లేక చచ్చేకంటే కొట్లాడి సద్దాం భీం" అన్నాయి అక్కడున్న కంఠాలన్నీ.

SCERT TELANGANA

అక్కడ పన్నెండు గూడాల పెద్దలున్నారు. ప్రజలున్నారు. వారందరితో కలిసి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించాడు. 'ముందు అరెస్టయిన కుర్దు తదితరులందరిని విడిపించాలి. జోడెన్‌ఘాట్ కేంద్రంగా ఉండాలి. తిండి, ఆయుధాల ఖర్చు అన్ని గూడాలు భరించాలి. తుడుం యుద్ధ సంకేతంగా ఉపయోగించాలి. గొడ్డళ్ళు, ఈటెలు, బాణాలు, వొడిసెలలు, తుపాకులు తయారుచేయాలి. జోడెన్‌ఘాట్‌లో సైన్యం ఉంటుంది. గ్రామాల్లో రక్షకదళాలు ఉంటాయి. కేసులకు హాజరు కామని సర్కార్‌కు వార్త పంపాలి. సర్కారు భూములను మనకు ఇచ్చే వరకు పోరాటం జరుగుతదని ప్రకటించాలి. గోండు రాజ్య స్థాపనే మన ముఖ్యలక్షణం. అందుకు అందరు రహస్యంగా పనిచేయాలి' అని ప్రతినిధులందరు నిర్ణయించుకొన్నారు. మహదు, పైకాజీని కలిశాడు. అతడు తహసీల్‌దార్‌తో మాట్లాడాడు. తహసీల్‌దార్ హైదరాబాద్‌లో ఉన్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ రెవెన్యూ గారికి, కుర్దూ మొదలైన గోండు ముద్దాయిలపై దయ చూపితే సర్కారు గౌరవం పెరుగుతుందని లేఖ రాశాడు. కుంరం భీం మాటలు విని వాళ్ళు మోసపోయారు. మీరు కనికరించాలి అని అందులో పేర్కొన్నాడు. మొత్తానికి వాళ్ళు విడుదలయి జోడెన్‌ఘాట్ చేరుకున్నారు.

బాబేఝరీ ప్రాంతంలో సర్కారు ఆజ్ఞలు పాటించబడటం లేదు. ఎవరూ కోర్టులకు హాజరు కావడం లేదు. అమీన్‌సాబ్ పోలీసుల్ని వెంటబెట్టుకొని అక్కడికి పోయాడు. అక్కడ కుంరం భీం వాళ్ళకు అడ్డుపడ్డాడు. "ఇంక కోర్టులు, కేసులు ఏమి లేవు. ఈ పన్నెండు గ్రామాలు మా సొంతం. ఇది గోండు రాజ్యం. ఇక్కడికి జంగ్లాతోళ్ళు వస్తే ప్రాణాలతో వెళ్ళలేరు. ఈ రాజ్యం మాది. మీకు ఎలాంటి అధికారం ఇక్కడ లేదు. మేం ఎవరి సొమ్ము తినడం లేదు. ఎవరికీ అన్యాయం చేయడం లేదు. ఇది మా అందరి నిర్ణయం. మీరు పోయి మీ దిక్కున్న చోట చెప్పుకోండి" అని ఖరాఖండిగా అన్నాడు.

అమీన్‌కు వెళ్ళబుద్ధికాలేదు. హెచ్చరికలు చేశాడు. గోండులు నవ్వుకున్నారు. తుపాకి తీసి గాలిలోకి కాల్పులు జరిపాడు. గోండులు అతన్ని, అతనితో వచ్చిన వారిని దేహశుద్ధి చేశారు. తుపాకి తీసుకొని వెళ్ళగొట్టారు. అమీన్‌కు సహాయపడ్డ కుర్దుపటేల్ అనే వ్యక్తిని హెచ్చరించి వదిలేశారు. అట్ల సర్కార్‌తో గోండుల యుద్ధం మొదలైంది.

కుంరం భీం నాయకత్వాన్ని ఇష్టపడ్డ ఇతర గ్రామస్థులు, పల్లపు ప్రదేశ ప్రజలు కొందరు వీరితో కలిశారు. గోండు రాజ్య స్థాపనకు మద్దతు తెలిపారు. అందులో కల్లెగాంపాజ్, ధనోరా ముఖ్యమైనవి. జోడెన్‌ఘాట్‌లో కొలిమంటుకున్నది. ఈటెలు, బాణాలు, బరిశెలు, గొడ్డండ్లు, తుపాకులు, బార్మాకులు తయారైనాయి. వాటిని వాడటంలోని మెళుకువల్ని యువకులకు, పిల్లలకు నేర్పారు. స్త్రీలు సహాయం చేస్తున్నారు. పైకూబాయి ముందుండి పనులు చూస్తున్నది. ఒకనాడు ఉదయం జోడెన్‌ఘాట్ మీద తుడుం మోగింది. యుద్ధం మొదలయింది. ప్రతీ ఊరు, ప్రతీ మనిషి కుంరం భీంకు, రగల్ జెండాకు జై జై అని నినదించారు. అదే సమయంల కుంరం సూరు ఉరికొచ్చి నైజాం సైనికులు వస్తున్నరని చెప్పాడు. వెంటనే భీం బందూకు ఎత్తాడు. తుడుం మోగింది. కొమ్ములు ఊదారు. "నైజాం సైన్యంలో ఒక్కన్నీ కొండ ఎక్కనీయవద్దు. బాణాలు ఎక్కుపెట్టండి. ఈటెలు గురిచూసి విసరండి. సైనికుల్ని మూడు దిక్కులా చుట్టి కత్తులతో నరకండి. ఈ భూమి, అడవి మనవి. శత్రువుల అంతు చూడండి" అని భీం సైన్యాన్ని పురిగొల్పాడు.

స్త్రీ పురుష భేదం లేకుండా యుద్ధ రంగం సందడితో నిండింది. పైకూబాయి వీరవనిత తీరుగ వీరవిహారం చేసింది. రెండు వైపుల నుండి తుపాకుల శబ్దం. చావు కేకలు. నిజాం సైనికుడొక్కడు కూడ కొండ ఎక్కే ప్రయత్నం చేయలేకపోయాడు. ఎక్కినవాడు కూలిపోయాడు. అన్ని దిక్కులా నైజాం సైన్యాన్ని ఎదుర్కొన్న భీం బలగం వారిని ఊపిరాడనీయలేదు. తప్పని పరిస్థితిలో వాళ్ళ కెప్టెన్ భాగో, భాగో అని అరిచాడు. నిజాం సైనికులు పారిపోవడంతో భీం వైపు తుడుం మోగింది. తుడుం మోత భీం విజయసూచికగా ప్రపంచానికి చేరింది.

గోండు వీరుల విజయం తెలిసిన తహసీల్దార్ కోపంతో ఊగిపోయాడు. స్వయంగా వరంగల్ పోయి సుబేదార్ అనే ఉన్నత అధికారితో మాట్లాడాడు. అట్లానే జనగామ (ఆసిఫాబాద్)లో ఉన్న డి.ఎస్.పి.తో మాట్లాడి, ఇది భూమి సమస్య

SCERT TELANGANA

గోండులను కలిసి చర్చించి పరిష్కరించాలి" అని చెప్పాడు. కాని నిజాం సైన్యం గోండులతో పోరాడి, కొండ వాళ్ళందర్ని చంపెయ్యాలనే నిర్ణయానికి వచ్చింది. సైన్యం తన ఎత్తుగడలో భాగంగా కొండ కింద ఉన్న ప్రజల మీద దాడి చేసింది. ప్రజల్ని కొట్టడం, చంపడం, తగులబెట్టడం చేశారు. దానితో ప్రజలు పోయి భీం సైన్యంలో చేరారు. ఇట్లా కొన్ని నెలలు గడిచేసరికి కొండమీద గోండువీరులకు తిండికి కరువొచ్చింది. భీంకు చెందిన రహస్యదళాలు గ్రామాల్లోకిపోయి ధాన్యం తెచ్చుకున్నాయి. యుద్ధం ఇట్లా సాగుతున్న దశలో భీం, సర్కారుకు మహదుతో లేఖ రాయించాడు. "పన్నెండు గ్రామాలకు గోండు రాజ్య అధికారమిస్తే నైజాంకు విధేయులమై ఉంటాం" అనేది లేఖలోని విషయం. లేఖ తాసీల్దార్ అబ్దుల్ సత్తార్‌కు అందింది. కానీ నైజాం నుండి జవాబు రాలేదు.

ఒక రోజు ఉదయం రఘు ఒక మనిషిని తీసుకువచ్చి భీం ముందుంచాడు. అతను "నేను నైజాం సర్కార్ సబ్‌కలెక్టర్ దగ్గర నుంచి వచ్చిన. వారు మీతో మాట్లాడుతారట. మీరు ఆజ్ఞ ఇస్తే వచ్చి మాట్లాడుతాడు" అన్నాడు. భీం సమ్మతి మేరకు సబ్‌కలెక్టర్ వచ్చి కలిశాడు.

"భీం మీకు, మీ చిన్నాయనకు ఎంత భూమి కావాలో అడగండి. ఇచ్చి పట్టాలు చేస్తాం. ఈ పోరు ఆపండి" అన్నాడు సబ్‌కలెక్టర్.

"ఈ యుద్ధం మా కోసం కాదు. గోండులు, కొలామ్‌లు మొదలగు ఎన్నో తెగల ప్రజల కోసం"

"మీ పన్నెండు గ్రామాలకు పట్టాలు ఇస్తాం. భూములు మీ సొంతం అవుతాయి. యుద్ధం మానుండి."

"పన్నెండు గ్రామాల పట్టాలు కాదు, పన్నెండు గ్రామాల రాజ్యాధికారం కావాలి. గోండు రాజ్యం స్థాపించుకుంటాం."

"అదెట్ల సాధ్యం."

"అడవి మీ సర్కారుది ఎట్లా అయింది. నిజం చెప్పాలంటే ఉట్నూరు నుండి రాజోరా దాకా మా గోండు పరగణను మాకు పాలించే హక్కు కావాలి. మీ సర్కారుతో ఈ విషయం చెప్పండి. మీరు ఎక్కువ సైన్యం తెచ్చి మమ్మల్ని చంపవచ్చు. మాలో ఏ ఒక్క పిల్లగాడు బతికున్నా గోండు రాజ్యం కొరకు పోరాడుతాడు. మా రాజ్యం గెలుచుకొనే వరకు యుద్ధం సాగుతుంది" అని భీం సూటిగ చెప్పాడు.

యుద్ధం మొదలై ఏడు నెలలు గడిచాయి. కొండ మీద ఆహారం కొరతవల్ల అందరి ముఖాల్లో ఆకలి తాండవించింది. నైజాం సర్కారు సైన్యం మాత్రం పెద్ద ఎత్తున దాడికి సిద్ధమయి వస్తుందని తెలిసింది. ఆ రాత్రి యుద్ధ పద్ధతుల మీద చర్చ జరిగింది. పన్నెండు గ్రామాల ప్రజలు శత్రువును చికాకు చేసే పద్ధతులు గ్రహించారు. శత్రుసైన్యం పదిరోజులు తల మునకలైనా కొండమీదికి చేరలేకపోయింది. అన్ని దారుల్లో భీం సైన్యం పెట్టని గోడలై నిలుచున్నది. భీం సైన్యాన్ని జయించడం కష్టమని తేలింది. కానీ అదే గ్రామం పెద్ద కుర్దూ పటేల్ (కుంరం కుర్దుకాదు) మోసం చేసి సర్కార్‌తో చేతులు కలిపాడు. కొండమీదికి రహస్యంగా దారి చూపాడు. నైజాం సైన్యం దొంగతనంగా, యుద్ధనీతికి విరుద్ధంగా వచ్చింది. రాగానే గోండు వీరుల్ని కాల్చారు. మరెందరినో చీకట్లో చంపారు. గుడిసెల్ని తగులబెట్టారు. "అదిగో కుంరం భీం అక్కడున్నడు దొరా!" అని కుర్దూపటేల్ భీం వెనక నుండి చూపెట్టాడు. ఇంటి గుట్టు బయటపడింది. భీం మీద తూటాలు కురిశాయి. భీం నేల కొరిగాడు.

ఇరవై రెండు అక్టోబర్ పందొమ్మిది వందల ఒకటో సంవత్సరంలో (22-10-1901) పుట్టిన కుంరం భీం, సెప్టెంబర్ ఒకటి, పందొమ్మిది వందల నలభై సంవత్సరం (01-09-1940) వీరమరణం చెందాడు. ఆదివాసి ప్రజల కొరకు భూమికోసం, భుక్తి కోసం, నాటి నైజాం పాలన నుంచి ఆదివాసుల విముక్తికోసం పోరాడి వీరమరణం పొందిన గోండు వీరుడు గోండు రాజ్య అస్తిత్వం కోసం పరితపించిన అమరజీవి. కుంరం భీం తెలంగాణ చరిత్రలో నిలిచిన ఆణిముత్యం.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

## ఉపవాచకం



తెలంగాణ వైతాళికుడు

# 2. సురవరం ప్రతాపరెడ్డి

తెలంగాణలో కవులే లేరనే నిందా వ్యాఖ్యలకు "గోలకొండ కవుల సంచిక' ద్వారా సమాధానమిచ్చినవాడు. తన కృషి సమాజపరంగా సాగించిన ఉద్యమశీలి. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ రంగాల్లో బహుముఖ ప్రతిభ చాటిన ప్రజ్ఞాశాలి. తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. ఆయన జీవితం ఎట్లా స్ఫూర్తి దాయకమో తెలుసుకుందాం.

హైదరాబాదులోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం. ఆ రోజు సాహిత్య సమావేశం జరుగుతున్నది. నాచన సోమన రాసిన 'ఉత్తర హరివంశం'పై ప్రసంగం. మాట్లాడబోయేది కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. ఆధునికాంధ్రకవులలో పేరెన్నికగన్నవాడు. సభ మొదలైంది. సభాధ్యక్షుడు ధీరగంభీరంగా తొలిపలుకులను ప్రారంభించాడు. రాను రాను మాటల చినుకులు మహావర్షంగా పరిణమించాయి. దాదాపు గంటకుపైగా సాగిన ఆ ఉపన్యాసం ఆహూతులను కట్టిపడేసింది. సోమన కవితలోని ఎన్నో కొత్తకోణాలు వారికి పరిచయమవుతున్నాయి. ఇక వక్త వంతు వచ్చింది. విశ్వనాథ లేచి అధ్యక్షుడు మాట్లాడిన తరువాత చెప్పడానికి నా కింకేమీ మిగలలేదు. హరివంశంలోని కొన్ని పద్యాలను మాత్రం చదివి వ్యాఖ్యానిస్తానన్నాడు. విశ్వనాథ వంటి మహాకవి పండిత, విమర్శకుడిని నిశ్చేష్టుడిగా నిలబెట్టిన ఆ సభాధ్యక్షుడు సురవరం ప్రతాపరెడ్డి.

"ప్రతాపరెడ్డి పేరు వినగానే ఒక మహోన్నతమూర్తి మన కనులముందు సాక్షాత్కరిస్తుంది. బహుముఖ ప్రతిభకు ఆయన నిలువెత్తు ఉదాహరణ! శ్రీ సురవరం ప్రతాపరెడ్డి మేధా సంపన్నుడు. వాఙ్మయ రంగములో ఆయన ప్రతిభ, ప్రజ్ఞ కనరాని పొలమేలేదు. విమర్శకులలో ఆయన గొప్ప విమర్శకుడు. కవులలో కవి. పండితులలో పండితుడు. రాజకీయవేత్తలలో రాజకీయవేత్త. పత్రికారచయితలలో పత్రికారచయిత. నాటక కర్తలలో నాటకకర్త. వీటన్నిటినీ మించి పరిశోధకులలో మహాపరిశోధకుడు. దేశాభిమానులలో మహాదేశాభిమాని. సహృదయులలో సహృదయుడు. అటువంటి మిత్రుని, విద్వద్వరుణ్ణి, రసజ్ఞుణ్ణి అరుదుగా చూస్తాం. ఇంతటి ప్రజ్ఞా పాండిత్యములు కల సాహిత్యసేవా ధురంధరుడు." ప్రముఖ చారిత్రక పరిశోధకుడు మల్లంపల్లి సోమశేఖరశర్మ రాసిన ఈ వాక్యాలు చదివిన తరువాత ప్రతాపరెడ్డి గురించి వేరే పరిచయవాక్యాలు అవసరంలేదు.

తెలుగుజాతిపై ఇంతటి ప్రభావం వేయగలిగిన సురవరం వారి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి తెలుగువాడిపై ఉన్నది. వారిలోని ఉత్తమగుణాలను సాధనతో సొంతంచేసుకోవాలి. మహనీయుల జీవితాలు మనకు ఆదర్శం.

**బాల్యం – విద్యాభ్యాసం :**

ప్రతాపరెడ్డి పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లా నేటి జోగులాంబ జిల్లాలోని గద్వాల సంస్థానానికి రాజధానిగా ఉండిన బోరవెల్లి గ్రామంలో 28–05–1896 నాడు జన్మించాడు. వీరి మొదటిపేరు పాపిరెడ్డి. చిన్నప్పటి నుండి గొప్ప ధారణాశక్తి కలవాడు. చండశాసనుడైన గురువు రఘురామయ్య ప్రవర్తనతో విద్యపై విముఖత పెరిగింది. బడి ఎగ్గొట్టి గోటీలాడుకోవడం మొదలుపెట్టాడు. ఇది క్రమంగా వ్యసనంగా మారింది.

ఒకరోజు గోటీలకు పైసలు లేకుండె. తన షేర్వాణిని రెండు అణాలకు (12 పైసలకు) అమ్మేసిండట. విషయం చిన్నాన్న రామకృష్ణారెడ్డికి తెలిసింది. ఇంకేం, శిక్ష భరించక తప్పలేదు పాపిరెడ్డికి. ఇట్లా వదిలేస్తే పిల్లగాడు చేతికందకుండపోతాడనుకున్నాడు రామకృష్ణారెడ్డి. కచ్చితమైన దినచర్యను పెట్టాడు. తు.చ. తప్పకుండా పాటించాడు ప్రతాపరెడ్డి. ఇక్కడే అతని జీవితం ఒక మలుపు తిరిగింది. సరైన తోవలో పోకుంటే లక్ష్యాన్ని చేరుకోలేముగదా!

ప్రతాపరెడ్డి ఐదవ ఫారమ్ (9వ తరగతి) చదివేటప్పుడే 'తెలుగులో కవిని కావలెను. శాశ్వత కీర్తి సంపాదింపవలెను. లేకున్న నా జీవితము వ్యర్థము' అనుకున్నాడట. కేవలం సంకల్పిస్తే సరిపోదు. స్వయంకృషి, సాధన సంకల్పాన్ని సాకారం చేస్తాయి. ఆలోచన కలిగిందే తడవుగా చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు, కందుకూరి వీరేశలింగం పంతులు రచనలు సంపాదించుకున్నాడు. చేమకూర వేంకటకవి విజయవిలాసాన్ని, ఇతర ప్రబంధాలను తెచ్చుకున్నాడు. నిఘంటువుల సాయంతో చదువుకున్నాడు. కర్నూలులోని వెల్లాల శంకరశాస్త్రి వద్ద సంస్కృత సాహిత్యాన్ని చదివాడు. బి.ఎ. కొరకు మద్రాసు ప్రెసెడెన్సీ కాలేజికి వెళ్ళాడు. ద్వితీయ భాషగా సంస్కృతాన్ని తీసుకోవాలనుకున్నాడు. కాని సాంకేతిక కారణాలవల్ల కుదరదన్నారక్కడ. వేదం వేంకటరాయశాస్త్రితో సిఫారసు చేయించాడు. సంస్కృతంలో పరిచయాన్ని పరీక్షించదలచి భారతంలోని శ్లోకాన్ని చెప్పమన్నారు. పదవిభాగంతో సహా చెప్పాడు ప్రతాపరెడ్డి. చాలా సంతోషించి సంస్కృతాంధ్రాధ్యయనానికి అనుమతిని ఇచ్చారు కాలేజీవారు. చదివిన చదువు ఎప్పటికీ వ్యర్థంకాదు. ఎక్కడో, ఎట్లాగో తప్పక ఉపయోగపడుతుంది.

చదువడం ఒక అలవాటుగా... కాదు వ్యసనంగా మారింది ప్రతాపరెడ్డికి. ఆయన కొనే పుస్తకాలకు, చదివే పుస్తకాలకు లెక్కనేలేదు. కొత్త పుస్తకమొచ్చిందంటేచాలు, కొనాల్సిందే... చదువాల్సిందే.. ఆ చదువడం కూడా ఏదో ఆషామాషీగా కాదు. పరిశీలనాత్మకంగా, విమర్శనాత్మకంగా చదివేవాడు. చదివిన పుస్తకంపై విమర్శ రాసి పెట్టుకొనేవాడు. ఈ లక్షణం భవిష్యత్తులో అతనిని మహాపరిశోధకుడిగా నిలిపింది. ఈ చదివే అలవాటే అతనికి తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ, పార్శీ, కన్నడ భాషల్లో పట్టు సాధించేటట్లు చేసింది. సంస్కృతం నేర్చుకోవడానికి వేదం వేంకటరాయశాస్త్రి విధించిన షరతు మేరకు మాంసాహారాన్ని మానివేశాడు. చూడండి, చదువు జీవితానికి మలుపును, గెలుపును ఎట్లా ఇస్తుందో!

చిన్ననాడు పాఠశాలలో పట్టుమని ఐదు నిమిషాలు కూడా ప్రసంగించలేని ప్రతాపరెడ్డి, తరువాతి కాలంలో గంటకుపైబడి గలగలమాట్లాడగలిగే స్థాయికి ఎదిగాడు. పట్టుదల ముందు ఎటువంటి ప్రతిబంధకాలు నిలువవు.

ప్రసంగంలో విషయానికి సంబంధించి ఎవరూ చెప్పని ఏవో కొత్త విషయాలను చెప్పడం సురవరం వారి ప్రత్యేకత. వారి అధ్యయనం, పరిశోధనాతత్పరత ఇందుకు దోహదపడింది. తెలంగాణ మాండలికాన్ని విరివిగా వాడడం వారి ప్రసంగాలకు వన్నెచేకూర్చేది. గ్రాంథికభాషలోను, గ్రామ్యభాషలోను అనర్గళంగా మాట్లాడేనైపుణ్యం వారి వాక్కుకుండేది.

'చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష' అనుకునేవాడు స్వార్థజీవి. పదిమంది మేలుకై పాటుబడేవాడు సార్థకజీవి. తన సంపదను, అక్షరసంపదను తెలంగాణ శ్రేయస్సు కొరకు ధారపోసిన త్యాగి ప్రతాపరెడ్డి. నిజాం ఉక్కుపాదాలకింద ఉలుకుపలుకు లేక పడున్న తెలంగాణలో నవచైతన్యాన్ని నింపడానికి నడుంబిగించాడు ప్రతాపరెడ్డి. 'మూగవడిన తెలంగాణ మూల్గిన తొలినాటి ధ్వని'గా (డా॥ దాశరథిచే) కీర్తింపబడ్డాడు. ఈ ప్రజాచైతన్య మహోద్యమంలో దొరికిన ఏ అవకాశాన్ని

SCERT TELANGANA

జారవిడుచుకోలేదు. ఏకకాలంలో విభిన్నరంగాలలో కృషిచేశాడు. రంగాలు ఏవైనా ఆయన అంతరంగం మాత్రం తెలంగాణ మహాభ్యుదయం.

హైద్రాబాద్‌లోని రెడ్డిహాస్టలు నిర్వహణ ద్వారా సంస్కరణోద్యమానికి శ్రీకారం చుట్టాడు. కోత్వాల్ రాజబహద్దూర్ వెంకట్రామరెడ్డి కోరిక మేరకు ఈ బాధ్యతను చేపట్టాడు. విద్యార్థుల దినచర్యలో విప్లవాత్మక మార్పులను తెచ్చాడు. క్రమశిక్షణకు పెద్దపీట వేశాడు. విద్యార్థి బాగుపడితే సమాజం బాగుపడుతుంది. 'మొక్కైవంగనిది మానై వంగునా?' కనుక విద్యార్థుల వేషంలో, ఆలోచనలో, అధ్యయనంలో మార్పుకు కృషి చేసి విజయుడయ్యాడు.

### గోల్కొండ పత్రిక :

మద్రాసులో చదివేరోజుల్లోనే పత్రికొకటి పెట్టాలనే ఆలోచన కలిగింది ప్రతాపరెడ్డికి. జాతీయోద్యమంతో ప్రభావితుడై తన పత్రికకు 'దేశబంధు' అనే పేరు పెట్టాలనుకున్నాడు కూడా. మంచి ఆలోచనలెప్పుడూ మట్టిగలిసిపోవు. హైద్రాబాద్‌లో ఉన్నప్పుడు ఈ ఆలోచనను ఆచరణలోకి తెచ్చే ప్రయత్నం చేశాడు. 'దేశబంధు' పేరుకు నిజాం ప్రభుత్వం అనుమతినిచ్చే పరిస్థితి లేదు. అందుకే 'గోల్కొండ' పేరును ఖరారు చేసుకున్నాడు. అనుమతి దొరికింది. కార్యసాధనకు సమయస్ఫూర్తి కావాలి. 10 మే 1926న గోల్కొండపత్రిక పురుడు పోసుకుంది. నాటి తెలుగుపత్రికా రంగంలో సంచలనాలకు తెరలేపింది. ప్రతాపరెడ్డి పేరు వినగానే ముందుగా గుర్తొచ్చేది గోల్కొండ పత్రిక. ఇది ప్రతాపరెడ్డి అక్షరాల కోట.

పత్రిక ప్రారంభమైంది కాని నడపడం చాలా కష్టమైంది. ఆర్థిక వనరులు, మానవ వనరులు తక్కువ. అయినా అధైర్యపడలేదు. ఆయన ప్రతాపరెడ్డికదా! తాను రచయితగానే కాక, సంపాదకుడిగా, ప్రూఫ్‌రీడర్‌గా, గుమాస్తాగా అనేక అవతారాలెత్తేవాడు. ఆటంకాలను ధైర్యంతో అధిగమించినవాడే లక్ష్యాన్ని చేరుతాడు. ఈ పత్రిక ప్రధానంగా రెండు లక్ష్యాలతో నడిచింది. ఒకటి ఆంధ్రభాషాసేవ. రెండవది 'జాతి, మత, కులవివక్షతలేక ఆంధ్రులలో సర్వశాఖలవారి సత్వరాభివృద్ధికి పాటుపడుట'. నాటి నిజాం దుష్కృత్యాల గురించి సంపాదకీయాలు సాగేవి. ప్రజల ఆలోచనలను పదునెక్కించే రచనలుండేవి. రచయితలను కవ్వించి వారి ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసేవాడు ప్రతాపరెడ్డి. ఇది ఎంతో గొప్ప సహృదయత.

ఎందరో రచయితలకు ప్రోత్సాహాన్నిచ్చాడు. నిష్పక్షపాతంగా పత్రికను నడిపాడు. నిజాంకు వ్యతిరేకంగా వార్త రాసిన షోయబుల్లాఖాన్‌ను నడివీధిలో నరికి చంపిన క్రూరమైన కాలమది. అటువంటి పరిస్థితుల్లో కూడా నిజాం దుర్మార్గాలను నిరసిస్తూ సంపాదకీయాలు, వ్యాసాలు రాసిన సాహసమూర్తి ప్రతాపరెడ్డి. 23 సంవత్సరాలు గోల్కొండ పత్రిక సంపాదకునిగా ఆయన తెలంగాణకు చేసిన సేవ ప్రాతఃస్మరణీయం. ఈ పత్రిక తరువాత 'ప్రజావాణి' పత్రికను కొంతకాలం నడిపాడు.

### గోల్కొండ కవుల సంచిక :

స్వస్థానాభిమానం లేని జీవితం కాగితం పువ్వువంటిది. 'తెలంగాణలో కవులు లేరు' అన్న వార్తను చూశాడు ప్రతాపరెడ్డి. దీటుగా జవాబు చెప్పాలనుకున్నాడు. ఎంతో శ్రమకోర్చి 'గోల్కొండ కవుల సంచిక (1935)ను ప్రకటించాడు. ఇందులో 183 మంది పూర్వకవులు, 354 మంది ఆధునిక కవుల రచనలు, పరిచయాలున్నవి. రవాణ వ్యవస్థ, తపాల, సాంకేతిక వ్యవస్థలు బలంగాలేని కాలం అది. అటువంటి పరిస్థితుల్లో కూడా మొక్కవోని సంకల్పశక్తితో ఈ సంచికను ప్రకటించడం ప్రతాపరెడ్డి కార్యదక్షతకు ఒక ఉదాహరణ. గోల్కొండ కవుల సంచిక తెలంగాణ కవితా జయకేతనం. ఇంతటి ఘనకార్యం సాధించిన ప్రతాపరెడ్డి తన కవితలను సంకలనంగా వేయలేదు. తన గురించి కాదు, తన సమాజం గురించే ఆలోచిస్తారు ఉత్తములు.



SCERT TELANGANA

## వివిధ సంస్థలతో అనుబంధం :

పరాయిభాషా దౌర్జన్య ప్రభంజనానికి అల్లాడుతున్న తెలుగు దీపాన్ని ఆరిపోకుండా చూసుకోవడానికి ఆవిర్భవించింది ఆంధ్రమహాసభ. 3–3–1930 నాడు మెదకు జిల్లా జోగిపేటలో నిజాం రాష్ట్ర ఆంధ్రమహాసభ తొలిసమావేశం జరిగింది. ఇదొక చారిత్రక సన్నివేశం. దీనికి ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించాడు.

విజ్ఞానవర్ధినీ పరిషత్తు (1941) ఆంధ్రసారస్వత పరిషత్తు (1943) వ్యవస్థాపక సభ్యులైన ప్రతాపరెడ్డి తర్వాత అధ్యక్షుడిగా బాధ్యతలను నిర్వర్తించాడు. కులమతాల పట్టింపులేని ఈయన యాదవ సంఘం, ముదిరాజ్ సంఘం, గౌడ సంఘాలకు కూడా అధ్యక్షులుగా ఉన్నాడు. హైద్రాబాద్ ఆయుర్వేద సంఘం అధ్యక్షుడిగా, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ ఉపాధ్యక్షుడిగా సేవలందించాడు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, లక్ష్మణరాయ పరిశోధక మండలి, బాలసరస్వతీ గ్రంథాలయం, వేమన గ్రంథాలయం మొదలైన సంస్థలతో సన్నిహిత సంబంధముండేది తనకు. ఆనాడు తెలంగాణలో ఉన్న సాహిత్య సాంస్కృతిక సంస్థలతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈయనకు అనుబంధమున్నది. అందుకే 'అతడులేని తెలంగాణ, అలంకరణ లేని జాణ' అన్నాడు దాశరథి.

## సాహిత్యం :

ఎన్నో సాహిత్య ప్రక్రియలను సమర్థంగా నిర్వహించాడు ప్రతాపరెడ్డి. కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం, జీవిత చరిత్ర వంటి ప్రక్రియల్లో రచనలుచేశాడు. గ్రంథ పరిష్కరణలు, జానపద సాహిత్య సేకరణ చేశాడు. పరిశోధనాత్మక గ్రంథాలను ప్రకటించాడు.

పరిశోధకులుగా ప్రతాపరెడ్డికి ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టినవి ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హిందువుల పండుగలు, రామాయణ విశేషములు. రాజుల చరిత్రనే చరిత్రగా చెలామణి అయ్యేకాలంలో ప్రజల సాంఘిక చరిత్రే అసలైన చరిత్రగా ఆవిష్కరింపజేశాడు ప్రతాపరెడ్డి. చరిత్ర రచనకు ఈయన గ్రంథం ఒజ్జబంతి అయింది. అందుకే కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందిన మొదటి గ్రంథంగా చరిత్ర సృష్టించిందీగ్రంథం.

హిందువుల పండుగల వెనుకనున్న నేపథ్యాలు, ఆచార సంప్రదాయాలు తెలిపే ప్రామాణిక గ్రంథం 'హిందువుల పండుగలు'. పండుగల విశేషాలనెన్నింటినో పురాణ, శాస్త్ర ప్రమాణంగా తెలిపాడు. 'శ్రీయుత ప్రతాపరెడ్డిగారిచే విరచితమైన 'హిందువుల పండుగలు' అను గ్రంథమునకు విపులముగా పీఠిక వ్రాయుటకు నాకు వ్యవధి చాలదు. శక్తియు చాలనిదే' అని నాటి భారత ఉపరాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు అభిప్రాయపడినారంటే ఈ గ్రంథ విశిష్టతను మళ్ళీ ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు.

సాహిత్యం ఆనందాన్నే కాదు ఉపదేశాన్నీ ఇవ్వాలి. ప్రతాపరెడ్డి భక్తతుకారాం నాటకంలో పలికించిన ఈ పద్యం ఎంతో స్ఫూర్తిమంతమైనది.

'అనిశము మాతృదేశహిత మాత్మను గోరెడివాడె భక్తుడౌ,
దన తనువున్ ధనంబును ముదంబున నర్పణ సేయునట్టి యా
మనుజుడె త్యాగి, బ్రాహ్మణుల మాలల నొక్కవిధంబు సూచు నా,
జనుడె మనీషి, దుర్మదము శత్రుగజూచు నతండె శూరుడౌ.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

SCERT TELANGANA

**భాష :**

వివిధ భాషలపై పట్టుసాధించిన సురవరం ప్రతాపరెడ్డికి తెలుగంటే ఎంతో ప్రీతి. తెలుగును చిన్నచూపుచూసే వారిని చూస్తే అతనికి అరికాలిమంట నెత్తికెక్కుతుంది.

నిఘంటువులకెక్కని పదాలెన్నింటికో అర్థాలను కూడా రాసిపెట్టాడు. 'పులిజూదము' వంటి పదాలను చిత్రసహాయంతో వివరించి నిఘంటువులెట్లా ఉండాలో చూపించాడు. తెలుగు లిపి సంస్కరణ జరగాలని కోరుకున్నాడు. 28 అక్షరాలతోనే వర్ణమాలను రూపొందించి తమ పరిశోధనా పటిమను ప్రదర్శించాడు. వారి కలానికి రెండువైపులా పదునే. గ్రాంథికం రాయగలడు. వ్యావహారికం వాడగలడు. గద్యరచనలో వ్యావహారిక భాషకే పెద్దపీట వేశాడు.

**వ్యక్తిత్వం :**

నిరాడంబరత, నిర్భీతి, నిజాయతి, నిస్స్వార్థత ప్రతాపరెడ్డి జీవలక్షణాలు. వేషభాషల్లో పరమత ప్రభావం ప్రచండంగా ఉన్న కాలంలో కూడా అచ్చమైన తెలుగు వాడిగా జీవించగలిగాడు. నిండైన తెలుగు వేషం. అక్షరాల్లోనే కాదు అంకెల్లోకూడా తెలుగును వాడేవాడు. 'స్వవేషభాషాదురభిమానిగా' పరిగణింపబడ్డాడు. తను ఎవరినీ స్తుతించడు. తనను ఎవరైనా స్తుతిస్తే భరించడు. వీరిలో ఆవేశంపాలు ఎక్కువ. అది ధర్మావేశం మాత్రమే. ఆత్మీయతకు తప్ప అహంకారానికి చోటులేని హృదయం. మంచి ఎక్కడున్నా గ్రహించే మనస్తత్త్వం అతనిది. జానపద సాహిత్యంలో విశేష కృషిచేసిన ఆచార్య బిరుదురాజు రామరాజుగారిని మొదట పరిశోధనవైపు మరలించింది సురవరంవారే. ఇట్లా ఎందరికో ప్రేరకుడు, ఎన్నో రచనలు రావడానికి కారకుడు.

కులమతాల పట్టింపులు లేని సంస్కరణశీలి. జోగిపేటలో జరిగిన ప్రథమాంధ్రమహాసభలో భాగ్యరెడ్డివర్మకు సభలో పాల్గొనే అవకాశం మొదటగా కల్పించింది ప్రతాపరెడ్డిగారే. అంబేద్కర్‌కన్న ముందే సమాజంలో దళితోద్యమస్ఫూర్తిని రగిల్చింది భాగ్యరెడ్డివర్మ.

ప్రతాపరెడ్డిగారి ఆలోచనా సరళి విభిన్నంగా ఉంటుంది. చారిత్రక పురుషుడు, మహాభారతాన్ని నడిపించిన ధీరుడైన శ్రీకృష్ణునికి మీసాలెందుకుండవు? అని ప్రశ్నించుకున్నాడు. ప్రత్యేకంగా 'మీసాల కృష్ణుని' చిత్రాన్ని మార్చాల రామాచార్యుల వారిచే గీయించి తమ గోల్కొండ పత్రిక కార్యాలయంలో పెట్టుకున్నాడు. ఇదొక ప్రత్యేక ఆకర్షణ.

వనపర్తి, ఆత్మకూరు, గద్వాల, గోపాలపేట, కొల్లాపూరు సంస్థానాధీశులతో తమకున్న పరిచయాన్ని ఎప్పుడూ స్వార్థానికి వాడుకోలేదు. సాహిత్య సమారాధనకే ఉపయోగించాడు.

వనపర్తి శాసనసభ్యుడిగా 1952లో ఎన్నికైన ప్రతాపరెడ్డి మొదటి నుండీ ప్రజల మనిషే. తన మరణానికి (25-8-1953) ఒకరోజు ముందు కూడా ప్రజల స్థితిగతులు తెలుసుకోవడానికి వెళ్ళిన సామాజిక హితచింతనుడు. తెలంగాణ సమాజాన్ని అన్ని కోణాలలో ప్రభావితం చేసిన ప్రతాపరెడ్డి జీవనం పావనం, ఆదర్శవంతం. వారి సమున్నత మూర్తిమత్వాన్ని దర్శించాలంటే ఈ పద్యం చదువాల్సిందే.

'రైతయి, రాజబంధువయి, రచ్చకుపెద్దయి, కావ్యవేద ని
ష్ణాతుడునై, స్వతంత్రుడయి, శాసనకర్తయి, శాస్త్రకర్తయై
తాతలనాటి సంస్కృతికి తావలమై, పురుషార్థ జీవియై
మా తెలగాణ గౌరవము మల్చినవాడు ప్రతాపరెడ్డియే

**- గంగాపురం హనుమచ్ఛర్మ (దుందుభి)**



SCERT TELANGANA

## ఉపవాచకం



# 3. కాళోజి

విపక్ష ఎక్కడున్నా వ్యతిరేకించాడు
మంచి ఎక్కడున్నా స్వాగతించాడు
అన్యాయం, అణచివేతలపై తిరగబడ్డాడు
తన వాదనలతో తెలంగాణేతరుల మనసులను కూడ గెలుచుకున్నాడు
తెలంగాణ వైతాళికుడని పేరుగన్నాడు
ఈనేల సాంస్కృతిక వారసత్వంలోనుండి ఎదిగిన ఆ మహనీయుడే – కాళోజి.

"మొదటి ప్రపంచ యుద్ధంతో పాటు నేను భూమి మీద పడిన. అది 09-09-1914" అని కాళోజి తన ఆత్మకథ 'ఇదీ నా గొడవ'లో తెలిపాడు. కాళోజి 'రట్టహళ్ళి' అనే ఊర్లో పుట్టాడు. ఇది బీజాపూర్ జిల్లాలో ఉన్నది. ఈ ఊరు కర్ణాటక ప్రాంతంలోని పాత బొంబాయి ప్రెసిడెన్సీ కింద ఉండేది. కాళోజి చిన్నతనంలో వీరి కుటుంబం కొన్నేండ్లు మహారాష్ట్రలోని 'సాయరాం' అనే గ్రామంలోనూ, కొంతకాలం తెలంగాణలోని ఇల్లెందు తాలూకా 'కారేపల్లి' గ్రామంలోను నివసించింది. 1917 వరకు కాళోజి కుటుంబం హనుమకొండలో ఉండేది. తరువాత మడికొండకు మారడం జరిగింది. తరువాత కాళోజి అన్న రామేశ్వర రావు న్యాయశాస్త్రం చదవడానికి హైదరాబాద్ పోవాల్సి వచ్చింది. దాంతో కాళోజి పాతబస్తీలోని చౌమహల్లా కాన్గీబడిల సెకండ్ ఫారంలో చేరాడు. తరువాత సుల్తాన్ బజార్‌లోని రెసిడెన్సీ మిడిల్ స్కూల్‌లో చేరాడు. ఉన్నత విద్యకోసం 1934 ఏప్రిల్ నెలలో వరంగల్ కాలేజియేట్ హైస్కూల్‌లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశించాడు. 1939లో 'లా' పూర్తి చేశాడు. 1940లో గవిచెర్ల గ్రామానికి చెందిన రుక్మిణిని వివాహం చేసుకున్నాడు.

"మా ఇంట్ల ఒక బీరువా ఉంటది. దాంట్ల ఒక అరల కాగితాలు, బట్టలు, నా వస్తువులు అనదగ్గవి ఉంటయి. మా ఇంటికి రోజూ వచ్చే వారెవరికైనా తెలుసు. రామశాస్త్రికి చెప్తే పంపిస్తడు" ఈ మాటలను బట్టి కాళోజి వ్యక్తిగత ఆస్తిలేని నిరాడంబరుడు అనేది తెలుస్తుంది. నిజానికి కాళోజి 'సొంత ఆస్తి రద్దు కావాలనే కమ్యూనిస్టు' కాదు. ఎక్కడికి వెళ్ళినా, ఎక్కడికి వచ్చినా, ఎక్కడ తిరిగినా – ఈ పూట ఇక్కడ తింటే రాత్రికెక్కడనో, ఈ రాత్రి ఇక్కడుంటే రేపెక్కడనో ఆయనకే తెలియదు. ఆచరణకు, ఆదర్శానికి ఏ మాత్రం తేడా లేని జీవితం ఆయనది.

కాళోజి నిరంతర ఉద్యమజీవి. తన కాలంలో జరిగిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. ప్రతి విషయాన్ని ప్రశ్నించాడు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నాడు. రజాకార్ల నెదిరించి జైలు జీవితం గడిపాడు. నిజాం రాజును ఎదిరించాడు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కొరకు కూడా పోరు చేశాడు. తనకోసం కాకుండా, ఇతరుల బాగు కోసం పోరాడే తత్త్వం – సామాజిక స్పృహ కాళోజిలో ఉన్నాయి.

SCERT TELANGANA

తెలంగాణ పక్షాన నిలిచి తాడిత, పీడిత ప్రజల గుండెలలో కొలువైన కవి కాళోజి. మాటలలో, చేతలలో, ఆలోచనలలో, ఆవేదనలో, వేషభాషలలో, ప్రవర్తనలో, తెలంగాణ స్వరూపం సంపూర్ణంగా కనిపిస్తది. దాశరథి అన్నట్లు "తెలంగాణ ఆధునిక సాహిత్య ముఖద్వారం కాళోజి. తన కవిత్వాన్ని ప్రజల జీవితాల్లోకి తీసుకెళ్ళి ప్రజాకవిగా పేరుపొందినవాడు కాళోజి.

సమాజ గొడవను తన గొడవగా చేసుకొని "నా గొడవ" పేరుతో అనేక కవితలు రాసి, వాటిని ఎనిమిది సంపుటాలుగా వెలువరించాడు. ప్రాంతీయ దృక్పథం, దేశీయ దృక్పథం, అంతర్జాతీయ దృక్పథం కలిగిన కాళోజి నిజానికి అంతర్జాతీయ కవి. నిరంకుశ రాజ్యాలమీద తన జీవితాంతం కత్తిగట్టి పోరాడినవాడు కాళోజి. అందుకే రాజకీయాలతో, ప్రజా ఉద్యమాలతో మమైకమైన కాళోజి కవిత్వాన్ని తెలుగునాట ప్రజలు ఆదరించారు. రజాకార్లపై ఆయన కోపాన్ని పరాకాష్ఠకు చేర్చిన కవిత. "కాటేసి తీరాలె" ఇందులోని కసి తెలంగాణ ప్రజలందరిది.

**"మన పిల్లలను చంపి మనల బంధించిన**
**మానవాధములను మండలాధీశులను**
**మరచి పోకుండ గురుతుంచుకోవాలె**
**కసి ఆరిపోకుండ బుసకొట్టుచుండాలె**
**కాలంబు రాగానె కాటేసి తీరాలె"**

సాహిత్యంలో భాషనుపయోగించే విషయంలో కాళోజికి కొన్ని కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. ఆయన దృష్టిలో భాష రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి "బడి పలుకుల భాష". రెండవది జనం నిత్యవ్యవహారంల వాడే "పలుకుబడుల భాష". ఒక రకంగా చెప్పాలంటే మొదటిది గ్రాంథిక భాష. రెండవది వ్యావహారిక భాష. ఈ వ్యావహారిక భాషయే జీవభాష. ఏ భాషకైన జీవధాతువు మాండలికమే. కాళోజి ఎప్పుడూ జీవభాషవైపే మొగ్గు చూపాడు.

**"రెండున్నర జిల్లాలదే దండి బాస అయినప్పుడు**
**తక్కినోళ్ళ నోళ్ళయాస**
**తొక్కి నొక్క బడ్డప్పుడు**
**ప్రత్యేకంగా రాజ్యం పాలు**
**కోరడం తప్పదు"**

అంటూ కాళోజి ఆంధ్ర ప్రాంతపు భాషావాదులను హెచ్చరించాడు. కాళోజి కాంగ్రెసు పార్టీలో సభ్యుడు. కాంగ్రెసు పార్టీ తరపున ఎమ్.ఎల్.ఏ గా పోటీచేసి ఓడిపోయాడు. కాంగ్రెస్ పార్టీ నియమనిబంధనలను పాటిస్తున్నప్పటికినీ. 'పాతివ్రత్యం' అన్న మాటకు వ్యంగ్యార్థ సూచకంగా 'పార్టీవ్రత్యం' అన్న పదబంధాన్ని కాళోజియే తయారుచేశాడు. పార్టీయే దేవుడు, సర్వస్వం అని భావించటం, పార్టీ తప్పు చేసినా సమర్థించడం, ఇటువంటివి కాళోజికి ఏ మాత్రం ఇష్టం ఉండేవి కావు. తలలేనితనాన్ని ఒప్పుకోడు. వ్యక్తిత్వం ఉండాలని, ధనానికి లొంగి – నలుగురులో పలచన కావొద్దని,

SCERT TELANGANA

తలెత్తుకొని తిరగగలిగే ధీర గుణం ఉండాలని కాళోజీ భావించాడు. "ప్రాంతేతరులే దోపిడిచేస్తే పొలిమేరదాక తన్ని తరుముతం! ప్రాంతం వాడే దోపిడి చేస్తే ప్రాణంతోనే పాతరవేస్తం!" అని తెలంగాణ మనస్తత్వాన్ని చిత్రించాడు.

**"వీర తెలంగాణ నాది వేరు తెలంగాణ నాది**
**వేరై కూడా తెలంగాణ వీర తెలంగాణ ముమ్మాటికి"**

అని ఎలుగెత్తి చాటాడు. తెలంగాణ మాండలికాన్ని ఆంధ్రావాళ్ళు హేళన చేయడాన్ని ఏ మాత్రం సహించబోమని కాళోజీ ఆ రోజుల్లోనే గట్టిగా చెప్పాడు. రాజకీయ వివక్షతతోపాటు, భాషా వివక్షను చూపే ఆంధ్రులను ప్రశ్నించాడు.

**"తెలంగాణ ప్రజలు సల్పు / తెలంగాణ ఉద్యమాన్ని**
**రౌడీ అలజడి అంటూ బాకాలూదెడి ఆంధ్రుల**
**దెంతపాటి సభ్యతంట / తెలంగాణ "యాస" నెపుడు**
**యీసడించు భాషీయుల / సుహృద్భావన ఎంతని"**

అని ప్రశ్నిస్తూ కవిత్వం రాశాడు.

కవిగా, ఉద్యమకారునిగా పేరొందిన కాళోజీ కథకునిగా కూడా రాణించాడు. ఇతని కథల్లో స్వచ్ఛత, సూటిదనం, నచ్చని విషయాలపై నిరసన స్పష్టంగా కనిపిస్తుంది. కాళోజీ కథలకు ఈనాటికీ ప్రాసంగికత ఉన్నది. మతంపేరిట, కులంపేరిట మనుషుల్ని హీనంగా చూడటం, అవమానించటం ఎంత దారుణమో చెప్పాడు. మనుషుల్లోని ద్వంద్వ ప్రవృత్తి, అన్యాయమైన రీతుల్ని తెలియజెప్పాడు. వ్యంగ్యం, హేళనలతో సాగిన కథ విభూతి లేక ఫేస్‌పౌడర్. ఇందులో అలంకరణల పట్ల గల మోజును నవ్వు తెప్పించే విధంగా చెప్పాడు. రాజకీయాల్లో, పరిపాలనలో అవకతవకల్ని, అక్రమాల్ని ఇప్పుడు కూడా చూస్తున్నాం. తెలంగాణలో 1940 నాటికి ఉన్న రాజకీయ వ్యవస్థ శైశవ దశలో ఉంది. ఒకరిని మించి ఒకరు కుట్రలు, కుతంత్రాలతో, లౌక్యంతో రాజ్యపాలన సాగింది. ఈ పరిస్థితుల్ని రామాయణంలోని సుగ్రీవుడు, విభీషణుని ఉదంతాలకు ముడిపెట్టి రాసిన కథ 'లంకాపునరుద్ధరణ'. దీనిపై విసిరిన వ్యంగ్యాస్త్రమే ఈ కథ. రాతి బొమ్మకు గుడికట్టించే విషయంలో ముందుకు వచ్చిన ప్రజలు, ప్రాణమున్న అనాథ శిశువుపై ఆదరణ చూపించలేకపోవడంపై విసిరిన వ్యంగ్యాస్త్రం 'భూతదయ'. కాళోజీ కథలన్నీ ఒక రకంగా రాజకీయ కథలు. వీటిలో సాహిత్య విలువలు కాపాడడానికి ప్రయత్నించాడు.

ఎనిమిది దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలో ముడిపడ్డ బతుకు ఆయనది. వివక్ష ఎక్కడ ఉన్నా వ్యతిరేకించాడు. మంచి అన్నది ఎక్కడ ఉన్నా స్వాగతించాడు. అన్యాయం, అణచివేతలపై తిరగబడ్డాడు. ఆలోచించగలవారు ఆయన వాదనల్లోని సమర్థనల్ని గుర్తించారు. ఈ విధంగా తెలంగాణేతరుల మనసులను గెలుచుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. తెలంగాణ వైతాళికునిగా కాళోజీని పేర్కొనాలి. ఈ నేల సాంస్కృతిక వారసత్వంలోంచి ఆయన ఎదిగాడు. మనుషులను ఆయన అర్థం చేసుకున్న తీరు చాల విశిష్టంగా ఉంటుంది. ఆయన చాలాసార్లు ప్రహ్లాద చరిత్ర కథ చెప్పేవాడు. ఆ కథ ఆయనకు నచ్చింది. తండ్రి హిరణ్యకశిపుడి నిరంకుశత్వాన్ని అంత చిన్నవయసులోనే ప్రాణాలకు తెగించి ఎదిరించిన ప్రహ్లాదుడి పాత్ర ఆయనకు చాలా నచ్చింది. ప్రహ్లాదుడు అన్యాయాన్ని ఎదిరించాడు. అన్యాయాన్ని


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21
SCERT TELANGANA

ఎదిరించినోడే తనకు ఆరాధ్యుడని లెక్కలేనన్నిసార్లు చెప్పాడు. ప్రజాస్వామ్యంలో ఓటుకు చాలా విలువ ఉంటుందని భావించాడు. ఓటుహక్కు ప్రజాస్వామికమైనదని ప్రకటిస్తూ మెడలో బోర్డు వేసుకొని తిరిగాడు. ఈ స్వేచ్ఛా ప్రవృత్తి ఆయన ప్రవర్తనలో అడుగడునా కనిపిస్తుంది.

వ్యక్తిత్వం, స్వేచ్ఛ అనే రెండు ప్రధాన విషయాలను మనిషి కోల్పోకూడదని చెప్పాడు. నిర్భయంగా మాట్లాడడం ఆయన స్వభావం. దీనికి ఉదాహరణగా 1948లో జరిగిన ఈ సంఘటన నిలుస్తుంది. "వరంగల్ సెంట్రల్ జైలులో కాళోజి తదితరులున్నారు. అప్పుడు బురుజు మీద ఉన్న ఒక పోలీస్ రాత్రి ఎనిమిది గంటల సమయంలో వీళ్ళను ఉద్దేశించి "తుపాకీతో వీళ్ళను కాల్చి చంపినా పాపం లే"దని అక్కసు వెళ్ళగక్కాడు. అది విన్న కాళోజి అతని దగ్గరకు పోయి "ధైర్యముంటే కాల్చవోయ్ అని సవాల్ చేశాడు. ఆ సమయాన మిగతా ఖైదీలందరు భయపడ్డారు." కానీ కాళోజి ఇట్లాంటి సందర్భంలో వెనకా ముందులు చూడడు. ఇదీ అతని నిర్భీతి.

కాళోజి జీవితాంతం ప్రజాస్వామ్యవాదిగా ఉన్నాడు. "నీ అభిప్రాయాల్ని స్వేచ్ఛగా ప్రకటించే నీ హక్కుల కోసం అవసరమైతే నా ప్రాణాలైనా ఇచ్చి పోరాడుతా" అన్న మాటల్ని కాళోజి ఎప్పుడూ గుర్తుచేసేవాడు. ఆ మేరకు బతికాడు. అందుకే మహాకవి శ్రీశ్రీ కాళోజిని ఫ్రెంచికవి "లూయీ ఆరగాన్"తో పోల్చాడు. 1953లో మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపురంలో జరిగిన 'నా గొడవ' పుస్తకావిష్కరణ సభలో ఈ మాట అన్నాడు. యుద్ధంలో ఫ్రాన్స్ కవులంతా పారిపోతే లూయీ అరగాన్ ఒక్కడే దేశంలో నిలబడి మహా విశ్వాసాన్ని వెల్లడించే గీతాలు రాశాడు. కాళోజి కూడా అలాంటి వాడేనని శ్రీశ్రీ ఉద్దేశం. నిజమే! తెలంగాణ ఇటీవలి కాలం వరకు ఒక యుద్ధ భూమి. అందులో నిలబడి కాళోజి ప్రజలవైపుగా కవిత్వం వినిపించాడు. నిజాంను ఎదిరించాడు. నిరంకుశ ప్రభుత్వాల్ని ధిక్కరించాడు. అందుకే ఆయన ఉద్యమకవి.

"మా నాయనది గాంధీ సూఫీతత్వం. అంటే మతసామరస్యం. సాధుసత్పురుషుడని హిందువులొస్తరు, ముస్లింలొస్తరు. మా నాయన ముస్లింల సెయింట్స్‌ని, హిందూ సాధువులని కలిసేవాడు. ఆయనకు కుల పట్టింపుల్లేవు. అట్లాంటి వాతావరణంలో పెరగడంవల్ల మాకూ ఈ రకమైన భావాలు ఏర్పడ్డయి" అని కాళోజి చెప్పుకున్నాడు. అందుకే ఏదో ఒక మతం పక్షాన ఆయన ఎన్నడూ కన్పించలేదు. కాళోజి తన అభిప్రాయాలకు సన్నిహితమైన భావాలు ఇతరభాషల్లో కనపడ్డప్పుడు వాటితో తాదాత్మ్యం చెంది తెలుగు పాఠకలోకం కోసం అనువదించాడు. ఖలీల్ జిబ్రాన్ రాసిన "దిప్రాఫెట్"ను 'జీవనగీత'గా రచించాడు.

తన చావు తర్వాత తన భౌతికదేహం వైద్యవిద్యార్థుల పరిశోధనకు ఉపయోగపడాలని ఆశించాడు. 13-11-2002 నాడు మరణించిన పిదప ఆయన పార్థివదేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అందజేశారు.

బ్రతుకంత దేశంగా, ప్రజలుగా, ఉద్యమాలుగా బ్రతికిన, ప్రజాకవి కాళోజి నారాయణరావు. తన సామాజిక జీవితం ద్వారా ఆయనిచ్చిన స్ఫూర్తి భావప్రసారం ముందుతరాలకు శక్తినిస్తుంది. ఆయన జీవితం, కవిత్వం భావితరాలకు ఆదర్శం.



SCERT TELANGANA

ఉపవాచకం

# 4. ఆచార్య కొత్తపల్లి జయశంకర్



తెలంగాణ చెరువు తీరు
మన జయశంకరు సారూ
అలుగు దుంకి పారూ
పదునైన మాట జోరు

పాలు పోసుకున్న పజ్జొన్న కంకులల్ల
పైకి పైకి ఎగిరే ఆ పాల పిట్టలల్ల
మీ ఆశయాల వ్రాలూ
కనిపించె ఆనవాలూ...

కన్నులలో ఆవేశం కదలాడిన రుద్రుడు
ఆధిపత్య శక్తులపై అతడు వీరభద్రుడు
ఆలోచనల అవసరాన్ని తెలిపిన నిబద్ధుడు
తెలంగాణ కనుగొన్న అతడు మరో బుద్ధుడు

తెలంగాణను స్వప్నించి, శ్వాసించిన మహోపాధ్యాయుడు జయశంకర్. వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో లక్ష్మీకాంతరావు, మహాలక్ష్మి దంపతులకు 1934 ఆగస్ట్ 6న జన్మించాడు. ఉర్దూమీడియం పాఠశాలలు మాత్రమే అందుబాటులో ఉన్న రోజులలో హన్మకొండలోని మర్కజీ పాఠశాలలో ప్రాథమిక విద్య నేర్చాడు. హన్మకొండ న్యూహైస్కూల్‌లో మాధ్యమిక వరకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్.ఎస్.సీ వరకు చదువుకున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఎ. పూర్తి చేశాడు. బెనారస్ విశ్వవిద్యాలయం, అలీగఢ్ విశ్వవిద్యాలయాల నుండి పి.జి. పూర్తిచేశాడు. సమస్యల పట్ల ఏ విధంగా స్పందించాలో, దాన్ని ఏ విధంగా ఉద్యమంగా తీర్చిదిద్దాలో నిరూపించే సంఘటన ఒకటి ఈయన విద్యాభ్యాస కాలంలో జరిగింది.

అప్పట్లో వరంగల్‌లో డిగ్రీ కళాశాల లేదు. డిగ్రీ చదవాలంటె హైదరాబాద్‌కు వెళ్ళాలి. లెక్చరర్స్ ప్రోద్భలంతో డిగ్రీ కాలేజీ కావాలని విద్యార్థులు ఉద్యమించారు. అందులో మొదటి వరుసలో జయశంకర్ ఉన్నాడు. ఊరేగింపులో జయశంకర్ నినాదాలిస్తున్నాడు. 'వరంగల్‌కు డిగ్రీ కాలేజీ కావాలి'. అనాల్సిందిబోయి యూనివర్సిటీ కావాలని నినాదం ఇచ్చాడు. అందరూ నవ్వారు. జయశంకర్‌ను బాగా ఇష్టపడే ఒక లెక్చరర్ "ఏ పొట్టా పాగల్ హోగయా క్యా?" అని అన్నాడు. ఈ సంఘటన తరువాత పదేండ్లకు డిగ్రీ కాలేజి, ముప్పయి ఏండ్లకు యూనివర్సిటీ వచ్చింది. ఆ పిచ్చి పిల్లగాడే తరువాత యూనివర్సిటీకి వైస్‌ఛాన్సలర్ అయ్యాడు.

1960లో ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెట్టడం ద్వారా ఉద్యోగ జీవితం మొదలైంది. హన్మకొండలో ఉపాధ్యాయుడిగా నియామకమై, లెక్చరర్‌గా ఆదిలాబాద్‌కు పోయాడు. 1975-79 వరకు సీకెఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా, బోర్డుమెంబరుగా సేవలందించాడు. 1982-91 వరకు సీఫెల్ రిజిస్ట్రార్‌గా పనిచేశాడు. 1991-94 వరకు కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌గా పనిచేశాడు. ఇవే కాక వివిధ ప్రభుత్వ హోదాల్లో, సంఘాల పదవుల్లో పనిచేసి తనదైన ముద్రవేశాడు. ఇన్ని పదవుల్లో పనిచేసినా "నాకు వైస్ చాన్సలర్‌గా చేసిన తృప్తి కంటె సీ.కె.ఎం. కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేయడం ఎక్కువ

SCERT TELANGANA

తృప్తినిచ్చింది" అని స్వయంగా అన్నాడు. హన్మకొండలో టీచర్‌గా మొదలైన ఉద్యోగ ప్రస్థానం, అదే ఊళ్ళో వైస్‌ఛాన్సలర్‌గా పదవీ విరమణతో ముగిసింది. తెలంగాణ ఉద్యమ భావజాలాన్ని వ్యాప్తి చేస్తూనే అనేక పదవుల్లో పనిచేశాడు.

మూడు దశలుగా సాగిన తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ కీలకపాత్ర పోషించాడు. 1952 వరకు జరిగిన ఉద్యమంతో పాటు 1969, ఆ తర్వాత 1996లో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ పాత్రను ఎవరూ మర్చిపోలేరు. 1952లో ఇంటర్మీడియట్ విద్యార్థిగా తెలంగాణకు జైకొట్టి తరగతులను బహిష్కరించాడు. వరంగల్‌లో మొదలైన ఉద్యమం హైదరాబాద్‌ల కేంద్రీకృతమైంది. నాన్‌ముల్కీ గోబ్యాక్ నినాదంతో ముందుకుపోయింది. హైదరాబాద్‌ల జరిగే మీటింగ్‌కు తోటివాళ్ళతో కలిసి బస్‌లో జయశంకర్ బయలుదేరాడు. బస్సు మధ్యలో ఫెయిల్ కావడం వల్ల హైదరాబాద్‌కు ఆలస్యంగా చేరుకున్నాడు. ఆనాటి మీటింగ్‌లో పోలీస్ కాల్పులు జరిగినాయి. "ఆనాడు సమయానికి నేను అక్కడికి చేరుకుంటే, కాల్పుల్లో పోయేవాణ్ణి. ఇంత వివక్ష, ఇన్ని యాతనల నుండి విముక్తి కలిగేది" అని తెలంగాణ గురించి మాట్లాడినపుడు అనేవాడు. ఫజల్ అలీ కమిషన్‌ను కలిసి హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రం కోరుతూ విజ్ఞప్తి పత్రం ఇచ్చిన విద్యార్థి బృందంలో ఉన్నాడు. "మంచిగ బతుక లేకుంటే, బిచ్చమెత్తుకోనైనా బతుకుతం. కాని ఆంధ్రావాల్లతో కలిసి ఉండం" అని ఫజల్‌అలీతో ఖరాఖండిగా చెప్పిన కార్యవాది. 1969లో ఉవ్వెత్తున ఎగిసిపడ్డ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంలోనే కరుణశ్రీ తెలంగాణ అంతా తౌరక్యాంధ్రం అని అంటే జయశంకర్ స్వయంగా కరుణశ్రీని కలిసి, ఆయన కవిత్వంలో ఉన్న ఉర్దూ పదాల్ని చూపించి, జాషువా, శ్రీశ్రీ వంటి వారి కవిత్వాల్లో కూడ ఉర్దూ పదాలు ఉన్నాయని చూపాడు. ప్రతిరోజు మాట్లాడే మాటల్లో ఎన్ని ఉర్దూ పదాలు ఉన్నాయో చెప్పాడు.

1996లో నాటి ప్రధాని 15 ఆగస్టు నాడు ఎర్రకోట నుండి చేసిన ఉపన్యాసం తెలంగాణా వాదులందరిని తట్టిలేపింది. తెలంగాణ సాధనకు ఎలాంటి వ్యూహాలు రచించాలో జయశంకర్‌కు తెలుసు. మొత్తం తెలంగాణ ఉద్యమానికి మూడు దశలున్నాయి. మొదటిది భావజాల వ్యాప్తి. అది జరిగింది. రెండోది ఆందోళనా కార్యక్రమం. అది కొనసాగుతున్నది. ఇక మిగిలింది రాజకీయ ప్రక్రియ. అది జరగాల్సి ఉంది. దానిని పూర్తి చేయడమే ఉద్యమ కర్తవ్యం కావాలి. దానికి రాజకీయ చిత్తశుద్ధి అవసరం. 'ఇప్పుడున్న రాజకీయ నాయకత్వం ఆ పని పూర్తిచేస్తుందని నేను నమ్ముతున్నాను'. అని అన్నాడు. ఈ మూడు దశల్లో కూడా జయశంకర్ పాత్ర మరువలేనిది. అందుకే అతడు తెలంగాణ సిద్ధాంతకర్త. మొదటిది తెలంగాణ భావజాల వ్యాప్తి. అది ఎంతగా ప్రజల్లోకి చొచ్చుకపోయిందో జయశంకర్ ఒక రోజు ఇట్లా చెప్పిండు. "ఎందుకమ్మా తెలంగాణ అంటే? 'ఏం సార్ తెలంగాణ వస్తె మా పొలాలకు నీళ్లొస్తయ్, మా పోరగానికి కొలువొస్తది' అనే భావన వారికి కలిగిందని" చదువురాని ఆడవాళ్ళు చెప్పిన మాటల్ని జ్ఞాపకం చేసుకొన్నాడు.

ఆయన చెప్పినట్లు రెండవది ఆందోళనా కార్యక్రమం. దీనికి సంబంధించి జయశంకర్ చిన్ననాటి సంఘటన ఒక్కటి చెప్పుకోవాలి. బడిలో చదువుతున్న రోజుల్లో బడి ప్రార్థన అయిన తరువాత వరుస క్రమంలో తిరిగి వెళుతూ పిల్లలందరు ప్రిన్సిపాల్‌కు "సలాం" అని చెప్పివెళ్ళటం ఆచారం. అందుకు బదులు జయశంకర్ ఒకరోజు "వందేమాతరం" అన్నాడు. అందుకు ప్రిన్సిపాల్ దాని అర్థం ఏమిటి? అని అడిగాడు. "తెలియదు" అని జయశంకర్ చెప్పాడు. ఆనాడు ఉర్దూ మాధ్యమం కావడం, "వందేమాతరం" అనడం శిక్షార్హమైన నేరం. ప్రిన్సిపాల్ ముస్లిమే అయినా శిక్షించకుండా, తండ్రిని పిలిపించి, విషయం వివరించి, మెత్తగా మందలించడంతో సమస్య పరిష్కారమైంది. కాకుంటే ఆనాడే జయశంకర్ బాలనేరస్థుని కింద జమై ఉండేవాడు. ఈ సంఘటన అతనిలోని ఆచరణకు, దానివల్ల కలిగే ఆందోళనకు చిత్రిక పడుతుంది. తెలంగాణలో జరిగిన అనేక ఆందోళన కార్యక్రమాలు ఉద్యమాన్ని రెండింతలు చేసినవి. వీటి వెనుక జయశంకర్ వంటి మేధావులు, ఉద్యమ కార్యకర్తల దిశానిర్దేశం ఉంది. ఉద్యమాచరణలో ఉన్న యువకులకు తగిన సమాచారం, సత్యసమ్మతమైన

SCERT TELANGANA

వివరాలతో జ్ఞానాన్ని అందించాడు. తెలంగాణ కోణాన్ని, ఊహించని రీతిలో ప్రతి ఒక్క సమాచారాన్ని, పూర్తి వివరాలు - విశ్లేషణలతో ముందుంచేవాడు. ఆ విధంగా ఆందోళనా కార్యక్రమాలకు తనదైన రీతిలో చేయూత నిచ్చాడు.

జయశంకర్ విద్యార్థి నాయకుడు, సంఘనాయకుడు, గొప్ప పరిపాలనాదక్షుడు. తెలంగాణను స్వప్నించి, అహర్నిశలు శ్రమించిన కార్యశూరుడు. తను చెప్పిన మూడవ దశ రాజకీయ ప్రక్రియ. నేరుగా ఎన్నడూ రాజకీయ ప్రక్రియలలో పాల్గొనకున్నా ఆదిశగా తన వంతు పాత్రను పోషించాడు. తెలంగాణ కోసం పలవరించిన తెలంగాణ రాజకీయ నాయకులు ప్రతి ఒక్కరికి తన సహకారం అందించాడు. చెన్నారెడ్డి నుండి చంద్రశేఖరరావు వరకు ప్రతి ఒక్కరి రాజకీయ పార్టీకి తన మేధోశ్రమను ధారపోశాడు. ఎందుకంటె తెలంగాణ భావన మరింత బలపడుతుందనే ఆశతో చేశాడు. ఆయన ఆశించినట్లే చివరగా రాజకీయ ప్రక్రియతోనే తెలంగాణ వచ్చింది. ఈ క్రమం అంతా ఆయన దార్శనికతను సూచిస్తుంది. తెలంగాణలో జరిగిన ప్రతి ప్రజాఉద్యమంలో పాల్గొన్నాడు. ర్యాలీలు, ధర్నాలు, సభలు, సమావేశాలు, ఐక్యవేదికలు, ఇట్లా అన్ని కార్యక్రమాలు, ఒకటేమిటి సమస్తంలో ఆయన కనపడ్డాడు. శ్రీకృష్ణ కమిటీ వేయంగనే తన ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా నివేదిక తయారుచేశాడు. కమిటీ వాళ్ళ సందేహాలు తీర్చడానికి క్యాన్సర్‌తో బాధపడుతూ కూడా ఢిల్లీకి పోయాడు. తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు.

నీతి, నిజాయతి, నిరాడంబరత, నిబద్ధత, సమయపాలన ఇట్లాంటి లక్షణాలున్న మహా మనిషి. ఆయన సమయపాలన, నిబద్ధతల గురించి తెలిపే సంఘటనలు అనేకం. జయశంకర్ సీఫెల్ రిజిస్ట్రార్‌గా ఉన్న సందర్భంలో సాయంత్రం 5-30 నుండి రాత్రి 10-30 వరకు తన పరిశోధక విద్యార్థికి సమయం కేటాయించేవాడు. భోజనం సమయంలో విద్యార్థిని కూర్చోబెట్టుకొని మెటీరియల్ చూసేవాడు. సార్‌కు దగ్గరి మిత్రుడొకరు ఒకరోజు సాయంత్రం 5 గంటలవరకు గడిపి, తృప్తి చెందక ఇంకా మాట్లాడడానికి ప్రయత్నించాడు. నా పిహెచ్.డి. స్టూడెంట్ వచ్చే సమయం అయిందని, మనం తరువాత కలుద్దామని ముగించాడు. ఈ పరిశోధక విద్యార్థే తరువాత కాలంలో ఖమ్మం పి.జి. కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. జయశంకర్ కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్‌గా ఉన్నప్పుడు, ఈ ప్రిన్సిపాల్ అతని దగ్గర కూర్చుని సమయం తెలియకుండా మాట్లాడుతుంటే, నీకు రైల్ టైం అవుతుంది, స్టేషన్‌కు పోవడం ఆలస్యం అవుతుంది కనుక నీవు వెళ్ళవచ్చు అన్నాడు. ఈ రెండు సంఘటనల్లో ఒకే వ్యక్తి కనబడుతున్నాడు. జయశంకర్ ఆ వ్యక్తికి కాక సమయానికి విలువ ఇచ్చి పాటించడం ఇక్కడ కనపడుతున్నది.

నీళ్ళు, నిధులు, భూమి, ఉద్యోగాలు, బొగ్గు, కరంటు ఇట్లా ఒకటేమిటి సమస్త విషయాలపై లెక్కలతో సహా జరిగిన అన్యాయాలను ప్రజాప్రతినిధుల వద్ద, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి వద్ద చెప్పేవాడు. సాహిత్య సాంస్కృతిక రంగాల పట్ల కూడా ఆయన చక్కని చూపు పెట్టాడు. ఒకసారి అతను మాట్లాడుతూ "వావిలాల గోపాలకృష్ణయ్య, కాళోజీ నారాయణరావులు ఇద్దరూ స్వాతంత్ర్య సమరయోధులు. ఇద్దరు 3 నెలల తేడాతో చనిపోయినారు. వావిలాల చనిపోయిన కొన్ని గంటలలోనే గుంటూరులో ఆయన స్మారక కేంద్రం కోసం 5 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. కాళోజీ కన్నుమూస్తే ఎన్నిసార్లు డిమాండ్ చేసినా వరంగల్‌లో ఆయన పేరున స్మారక కేంద్రం ఏర్పాటు చేయలేదు. ఇది ప్రాంతీయ వివక్షను ప్రతిబింబించటం లేదా?" అని ప్రశ్నించాడు. ఇట్లా ప్రతి ఒక్క రంగంలో ప్రజల్ని చైతన్యపరిచాడు. "తెలంగాణా రాష్ట్రం ఒక్కటే నా కల. నేను జీవితంలో కన్న ఒకేఒక్క కల అది. ఆ కల నెరవేరుతుందని నమ్ముతున్న. తెలంగాణ యువతరం, విద్యావంతుల మీద విశ్వాసంతో ఈ నమ్మకాన్ని స్థిరపరచుకున్న. ఇపుడు లక్షలాది మంది తెలంగాణ వాదాన్ని అనుసరిస్తున్నరు. అంతిమంగా విజయం సాధిస్తరు. అంతదాకా విశ్రమించరు." అని నమ్మకంగా పలికేవాడు. ఆ నమ్మకం నిజమయింది. అమరుల త్యాగాల వల్ల తెలంగాణ సాకారమయింది. ఆయన గొప్ప మానవతావాది. తెలంగాణ ఏర్పాటైన తరువాత కూడా ఆంధ్ర ప్రజలు ఎవరైనా సరే ఇక్కడే ఉండవచ్చని జయశంకర్ ప్రతిపాదించాడు. అయితే ప్రజలను ఆధిపత్య దోపిడీ

SCERT TELANGANA

వర్గాలపట్ల మాత్రం అప్రమత్తంగా ఉండాలన్నాడు. "పొట్టపోసుకోవడానికి వచ్చే వారిని తెలంగాణ ప్రజలు ఆదరించాల్సిందే. పొట్ట కొట్టే వాళ్ళ మీదే మన వ్యతిరేకత అంత" అన్న కాళోజీ సూత్రానికి తెలంగాణ కట్టుబడి ఉండాలన్నాడు.

జీవితాంతం పదవుల్లో ఉద్యమాల్లో తిరిగిన జయశంకర్ పెండ్లి చేసుకోలేదు. ఉద్యోగరీత్యా సంపాదించినదంతా ఉద్యమాల కోసం ఖర్చు బెట్టాడు. ఉమ్మడి కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉన్నాడు. జీవిత కాలం ఎక్కువగా ఇట్లాగే ఖర్చు అయింది. ఉమ్మడి కుటుంబంలోని వాళ్ళందరు పెరిగి, ఎవరి సంసారాలు వాళ్ళకు అయినంక జయశంకర్ ఒంటరిగా మిగిలాడు. జయశంకర్ తనకు సహాయంగా ఉండటానికి తల్లిదండ్రులు లేని అనాథ పిల్లవాడిని చేరదీశాడు. అతడిని చదివించాడు. అనాథ పిల్లతో పెండ్లి చేశాడు. వారికో పాప పుట్టింది. వాళ్ళతో కలిసి జీవితం చివరిదశలో గడిపాడు. తల్లిదండ్రులు ఇచ్చిన పాత ఇల్లు అమ్మి, వరంగల్‌లో ఫ్లాట్ తీసుకున్నాడు. అదే అతని ఆస్తి. పెన్షన్‌తో కాలం గడిపాడు.

ఉదాత్తమైన వ్యక్తిత్వం, మృదుభాషణం, ఉద్యమస్ఫూర్తి, చెదరని స్థితప్రజ్ఞత కలిస్తే జయశంకర్. ఆబాలగోపాలంతో 'జయశంకర్ సార్' అని పిలిపించుకున్న అధ్యాపకుడు. జయశంకర్ సార్ ఉద్యమ పితామహులుగా, తెలంగాణ జాతిపితగా పేరొందడానికి కారణం కార్యకర్తకు కావల్సిన కార్యదక్షతోపాటు, కేసీఆర్ వంటి నాయకులకు కావలసిన ఆత్మవిశ్వాసాన్ని అందివ్వడమే. అందు కోసం నిద్రాహారాలు మాని కృషిచేశాడు. సహనం, స్థిరచిత్తం, సిద్ధాంతం అనే మూడు అంశాలు ఆయనలో ముప్పిరిగొన్నాయి. వ్యక్తిగతంగా ఆయన క్రమశిక్షణ అలవరచుకోదగినది. ఆయన శనివారం భోజనం చేయడు. ఎందుకట్లా తినరు అని ఎవరైనా ఒత్తిడి చేస్తే చిరునవ్వుతో వారించేవాడు. అతను రెండు విషయాల్లో రాజీపడలేదు. ఒకటి శనివారం పస్తుండటం, రెండు "తెలంగాణ" అంశం మాట్లాడకుండా ఉండలేకపోవటం. తెలంగాణ విషయంలో వారి నిబద్ధత పసిపిల్లవాడికైనా తెలుసు. అట్లాంటి జయశంకర్ తెలంగాణ సాకారం కాకముందే క్యాన్సర్ బారినపడి 21 జూన్ 2011న లోకాన్ని వదిలి వెళ్ళిపోయాడు. ఎంతో మంది మనుషులు, జీవితంలో ఎన్నో తొవ్వల్లో నడుస్తారు. అవసరాన్ని బట్టి, అనుకూల, అనుకూలం కాని పరిస్థితులను బట్టి, ఆలోచనలో మార్పును బట్టి మార్గాలను మార్చుకుంటారు. ప్రొఫెసర్ జయశంకర్ మాత్రం జీవితాంతం ఒకే మార్గంలో నడిచాడు. ఒకే మాట మీద నిలబడ్డాడు. అందరినీ తన మార్గంలో నడిపించాడు. అందుకే అతడు మార్గదర్శి. తెలంగాణకు చిరునామా.

ఉద్యమాగ్ని చల్లారిన విశ్రమించలేదు
వివక్షను నిలదీయుట విస్మరించలేదు
తోడు ఎవరు లేకున్నా తొవ్వ తీసినాడు
ఆంధ్రవలస పాపాలను రాసిపెట్టినాడు
విద్రోహం మూలాలు విప్పి చెప్పె దీక్ష
విడువని జయశంకరెపుడు తెలంగాణ రక్ష

॥ తెలంగాణ చెరువుతీరు మన జయశంకరు సారూ ॥

తెలంగాణ వాదాన్ని తీర్చి దిద్దినావు
మారుతున్న తరానికి మార్గం చూపావు
అరువదేండ్ల తెలంగాణ మనాదివే నీవు
మలిదశ పోరాటానికి పునాదివే నీవు
భావాలను వెదజల్లిన వెల్లువ వైనావు
తెలంగాణ పాటలకు పల్లవి వైనావు
ఒడిదుడుకులలో చెదరని ధైర్యమిచ్చినావు

॥ తెలంగాణ చెరువుతీరు మన జయశంకరు సారూ ॥

ఉపవాచకం



# 5. స్వామి వివేకానంద

భారతీయ ధర్మం అన్ని మతాల్ని అంగీకరిస్తుందనీ, గౌరవిస్తుందనీ, అన్ని మతాలు సత్యాలేననీ, అవన్నీభగవంతుని చేరుకోడానికి మార్గాలనీ స్వామీజీ చెప్పాడు. ఎవరూ మతాన్ని మార్చుకోనవసరంలేదనీ, నా మతమే గొప్పది. నా మతమే నిలవాలి అనుకునేవారు బావిలో కప్పవంటివారనీ స్వామీజీ తెలిపాడు. మిగతా వక్తలు తమ తమ మతాలకే ప్రాతినిధ్యం వహిస్తే, స్వామీజీ మాత్రం అన్ని ధర్మాల తరఫునా మాట్లాడి నిజమైన మతసామరస్యాన్ని చూపించాడు. సదస్యులందరికి స్వామీజీ ప్రసంగమే నచ్చింది.

## బాల నరేన్

ఒక బాలుడు కలకత్తానగర వీధుల్లో నడుస్తూ వెళ్తున్నాడు. హఠాత్తుగా పెద్ద శబ్దం వినబడింది. ఏమయ్యుంటుందబ్బా! చూస్తే... ఒక గుర్రపు బండి రోడ్డుపై దూసుకుపోతున్నది. ఆ బండిని గుర్రం తన బలమంతా ఉపయోగించి వెఱ్ఱివేగంతో లాక్కెళుతూంది. దేన్నో చూసి అది బెదిరిపోయినట్లుంది. దాని నుండి దూరంగా వెళ్ళడానికేమో అన్నట్లు పరుగెడుతున్నది. బండిలో పాపం ఒక మహిళ కూడా ఉంది. చాలా భయంగా చూస్తూ బండిని గట్టిగా పట్టుకుని పడిపోకుండా కూర్చుని ఉండడానికి ప్రయత్నిస్తున్నది. బండి ఎప్పుడు బోల్తా పడుతుందో తెలియదు. ఎవరూ ఆవిడకి సహాయం చేయడానికి ముందుకు రావడంలేదు.

ఇదంతా ఈ బాలుడు చూశాడు. సాహసవంతుడైన అతడు బండి దగ్గరకు రాగానే ప్రాణాలకు తెగించి, పరుగెత్తి ఆ బండిలోకి ఎక్కాడు. జోరుగా పరుగెడుతున్న ఆ గుర్రపు కళ్ళెం చేజిక్కించుకొని, నైపుణ్యంతో కొద్దిసేపట్లోనే ఆ గుర్రాన్ని శాంతపరచి ఆగిపోయేటట్లు చేశాడు. ఆ మహిళ ప్రాణం నిలిచింది. అందరూ ఆ బాలుడి సాహసానికి మెచ్చుకున్నారు. ఆవిడ అతడికి ఎంతగానో కృతజ్ఞతలు తెలుపుకున్నది.

ఎవరీ పిల్లవాడు? అతడి పేరు నరేంద్రనాథ్. అందరూ నరేన్ అని పిలిచేవారు. అతడే తరువాత కాలంలో విశ్వవిఖ్యాతినొంది సింహసదృశమైన మనోబలానికి ప్రతిరూపమై భారతదేశ యువజనులందరికీ ఆదర్శమై నిలిచిన శ్రీ వివేకానందస్వామి. ఈయన జన్మదినమైన జనవరి 12వ తేదీనే మన దేశ ప్రజలంతా 'జాతీయ యువజన దినోత్సవం'గా జరుపుకుంటారు. నరేన్ తండ్రి శ్రీ విశ్వనాథ్ దత్తా. మంచి పేరున్న వకీలు. ఎంతో చదువుకున్నవాడు. అందరి గౌరవాన్నీ పొందేవాడు. తల్లి భువనేశ్వరీదేవి. రూపంలోను, ప్రవర్తనలోను ఒక రాణివలె ఉండేది. అందరూ ఆ తల్లిని ప్రేమించేవారు, గౌరవించేవారు.

మన నరేన్ అల్లరి పిల్లవాడు ఈ గడుసరిని పట్టుకోవడం పాపం ఆ తల్లికి గగనమైపోయేది. అతడిని చూసుకోవడానికి ఇద్దరు నౌకర్లను పెట్టవలసి వచ్చింది. కానీ ఎట్లాగో ఒక ఉపాయం కనుకున్నది. నరేన్ అల్లరి బాగా మితిమీరిపోయినపుడు

SCERT TELANGANA

‘శివశివా’ అంటూ నెత్తిమీద చల్లని నీళ్ళు పోస్తే మాత్రం అల్లరంతా క్షణంలో తగ్గిపోయి శాంతపడిపోయేవాడు. లేదా “ఏయ్, ఇట్లా అల్లరి చేస్తే శివుడు నిన్ను కైలాసానికి మళ్ళీ రానివ్వడు” అనగానే చల్లబడిపోయేవాడు. తన పథకాలేవీ పారనప్పుడు ఆ తల్లికి పాపం ఈ రెండే చివరి అస్త్రాలు.

బాలనరేంద్రుడు తన తల్లివద్ద ఎన్నో విషయాలు నేర్చుకునేవాడు. తల్లి భాగవత, రామాయణ మహాభారతాల్లోని కథలన్నీ చక్కగా కళ్ళకు కట్టినట్లు చెప్పేది. ముఖ్యంగా శ్రీరాముడి కథంటే నరేంద్రుడికి పంచప్రాణాలు. మట్టితో చేసిన చిన్న సీతారాముల విగ్రహాన్ని తెచ్చి రకరకాల పూలతో పూజించేవాడు. రామాయణమంటే ఎంత ప్రేమో! హనుమంతుడు అరటి తోటల్లో తిరుగుతూ రామనామ జపంచేస్తూ ఉంటాడని ఎవరో చెప్పగా విని, ఆ మహావీరుడిని చూడడానికై తరచూ చాలాకాలం ఆ తోటల్లో వెతుకుతూ నిరీక్షిస్తూ గడిపేవాడు. ఆహా! ఎంత విశ్వాసం!

### పాఠశాలలో... ఆటల మైదానంలో

ఆరేళ్ల వయస్సులో నరేంద్రుడు తన విద్యాభ్యాసం మొదలుపెట్టాడు. మొదట్లో కొన్నిరోజులు పాఠశాలకు వెళ్లకుండా, తల్లిదండ్రులు నియమించిన ఉపాధ్యాయుడివద్ద ఇంట్లోనే పాఠాలు నేర్చుకునేవాడు. చదువడం, వ్రాయడం చాలా త్వరగా నేర్చుకున్నాడు. అతడి జ్ఞాపకశక్తి అమోఘం! ఏ పాఠమైనా గురువు ఒక్కసారి చెప్పటంతోనే నేర్చుకునేవాడు. మళ్ళా అప్పజెప్పగలిగేవాడు.

ఏడేళ్ళ వయస్సు వచ్చేటప్పటికి అతడిని ఈశ్వరచంద్ర విద్యాసాగర్ స్థాపించిన మెట్రోపాలిటన్ ఇన్‌స్టిట్యూషన్‌లో చేర్పించారు. నరేంద్రుడి తెలివితేటలూ, చురుకుదనం, ఎప్పుడూ చిరునవ్వు చిందించే ముఖం, అన్నిటా ఎంతో ఉత్సాహంగా పాల్గొనే స్వభావంవల్ల అనతికాలంలోనే తోటిబాలురందరికీ నాయకుడయిపోయాడు. ఆటలంటే ప్రాణం. అందరికంటే ముందే మధ్యాహ్నం టిఫిన్ బాక్సుని ఖాళీచేసేసి ఆటల మైదానంలోకి పరుగెత్తేవాడు. పరుగులు తీయడం, కుస్తీపట్టడం, బాక్సింగు, గోళీఆటలు, కప్పగంతులూ ఒకటేమిటి, ఉన్న ఆటలన్నీ ఆడేవాడు. కొత్తకొత్త ఆటలు కూడా కనిపెట్టేవాడు. రోజుకో లాగు చినిగిపోయేది. రెండురోజులకొక కొత్త దెబ్బ తగిలేది. బాధ తల్లికేగానీ, బాలుడు మాత్రం మళ్ళీ చిచ్చరపిడుగే.

ఒక్కోసారి తరగతి గదిలో ఉపాధ్యాయుడుండగానే ఇతర బాలురతో ముచ్చట్లు చెప్పడం, వారిని నవ్వించడం వంటివి చేసేవాడు. ఒకరోజు నరేంద్రుడూ ఇతర స్నేహితులూ మాట్లాడుకుంటూ ఉండడం చూసి వాళ్ళని ఉపాధ్యాయుడు అప్పటిపాఠం అప్పజెప్పమన్నాడు. ఒక్క నరేంద్రుడు తప్ప ఇంకెవరూ ఆ పాఠం అప్పజెప్పలేకపోయారు. పాఠాన్ని ముందే చదివిన నరేన్ అన్ని ప్రశ్నలకీ సరైన సమాధానాలు చెప్పాడు. ఉపాధ్యాయుడు ఎవరు మాట్లాడారని మళ్ళీ అడిగాడు. అందరూ నరేన్‌వైపు వేలుచూపారు. అది నమ్మలేక, అంతా అబద్ధం చెప్పారని తలచి నరేన్ తప్ప అందరినీ బల్లలెక్కి నుంచోమన్నడు. వారితోపాటు నరేంద్రుడు కూడా నిలబడ్డాడు. ఆశ్చర్యంగా ఉపాధ్యాయుడు ‘నువ్వెందుకు నిలబడ్డావని’ అడిగితే “ఊఁ నేనే నిలబడాలి. ఎందుకంటే వీళ్ళతో మాట్లాడుతున్నవాడిని నేను” అని సమాధానమిచ్చాడు.

### యువ నరేన్

మన కథానాయకుడు పెద్దవాడవుతున్నకొద్దీ పుస్తకాలు చదవడంలో నిమగ్నమై ఆటలు ఆడడంపై మొగ్గుచూపించడం తగ్గించాడు. బడిలో బాగా చదువుతూ ఉండేవాడు. కానీ వాళ్ళ నాన్నగారు కలకత్తా నుంచి రాయ్‌పూర్‌కి బదిలీ అవడంవల్ల రెండేళ్ళు చదువు ఆగిపోయింది. మళ్ళీ తిరిగి బడిలో చేరేసరికి మూడేళ్ళ చదువు ఒక్క సంవత్సరంలో పూర్తిచేయవలసి వచ్చింది. పరీక్షలు దగ్గరపడుతూ ఉంటే నరేన్ శ్రద్ధగా ఎక్కువసేపు కష్టపడి, ఇష్టపడి చదివేవాడు. చివరికి పరీక్షలో

SCERT TELANGANA

మొదటిశ్రేణిలో ఉత్తీర్ణుడైండు. ఆ సంవత్సరంలో తన పాఠశాల నుండి ఆ శ్రేణిలో పాసైన ఏకైక విద్యార్థి అతడే (ఆ రోజుల్లో అదే గొప్ప) తర్వాత ఒక సంవత్సరం ప్రెసిడెన్సీ కాలేజీలో, మరుసటి సంవత్సరం ఇప్పుడు స్కాటిష్ చర్చ్ కాలేజి అని పిలువబడే కళాశాలలో చేరాడు. ఈ కళాశాలలోని ఆచార్యులంతా యువనరేంద్రుడి ప్రతిభాపాటవాల్ని, ఆసక్తినీ, ధారణాశక్తినీ చూసి ఆశ్చర్యచకితు లయ్యారు. దాదాపు పాతికేళ్ళ తన అనుభవంలో ఈ దేశంలోకానీ, పరాయిదేశాల్లో కాని ఇంతటి ప్రతిభని తానెక్కడా చూడలేదని ప్రిన్సిపల్ డబ్ల్యు డబ్ల్యూ హేస్టీ అనేవాడు.

నరేంద్రుడు అన్నిరకాల అంశాలపై ఎన్నెన్నో గ్రంథాలు చదివేవాడు. అతడు విద్యను ఆర్జించే ఒక నిజమైన విద్యార్థి. జ్ఞానసముపార్జనే అతడి లక్ష్యంకానీ, ఇతరులకన్నా ఎక్కువ చదివేయాలి అనే తపన అతనిలో ఉండేది. అందుకే అంత చదివినా అతనికి కష్టమనిపించేది కాదు. పైగా ఆ చదువు ఎంతో తృప్తినీ, ఆనందాన్నీ ఇచ్చేది. 1884లో బి.ఏ. పట్టా కూడా పొందాడు. నలుగురితోను ఉన్నప్పుడు శాస్త్రచర్చలు జరపడంలో మక్కువ చూపేవాడు. ఒక్కోసారి పెద్దవారితోను తాత్త్విక చర్చలు చేసేవాడు. అతడి మేధాసంపత్తి, తర్కించగల శక్తి ముందు ఎవరూ నిలువగలిగేవారు కాదు.

### శ్రీరామకృష్ణులను కలవడం

ఆధ్యాత్మికత అంటే నరేంద్రుడికి ఇష్టం. మతం బోధించే చాలా విషయాలలో అతడికి నమ్మకం పోయింది. ఏది నమ్మాలో, ఏది నమ్మకూడదో స్పష్టంగా తెలియటం లేదు. ఎంతోమంది మతపెద్దలనేవాళ్ళ వద్దకి పోయినా ఏమీ ప్రయోజనం కలుగలేదు. చివరికి ఇద్దరు ముగ్గురు శ్రేయోభిలాషులు చెప్పగా పరమహంస అని అందరూ కీర్తించే శ్రీరామకృష్ణుల వద్దకు వెళదామని నిశ్చయించుకున్నడు.

శ్రీరామకృష్ణులను కలిస్తే తనకు సమాధానం దొరుకుతుందేమోననే ఆశతో నరేంద్రుడు ఇద్దరు ముగ్గురు స్నేహితులతో కలిసి ఆయన వద్దకు వెళ్ళాడు. తన సంశయాన్ని ప్రశ్నరూపంలో "అయ్యా! తమరు భగవంతుడిని చూశారా?" అని సూటిగా అడిగాడు. వెంటనే అంతే సూటిగా ఏ తడబాటు లేకుండా "ఓ చూసిన. నిన్నిప్పుడు ఎంత స్పష్టంగా చూస్తున్నానో అంతకంటే స్పష్టంగా చూశాను. కావాలంటే నీకు కూడా చూపించగలను. కానీ నాయనా! భగవంతుడు కావాలని ఎవరు ఆరాటపడతరు? భార్యా పిల్లలకోసం, ధన సంపాదనకోసం కడవలకొద్దీ కన్నీరు కారుస్తారు. భగవంతుడికోసం ఎవరు విలపిస్తారు? ఎవరైనాసరే భగవంతుడికోసం తీవ్రవ్యాకులతతో విలపిస్తే ఆయన వారికి తప్పకదర్శనమిస్తాడు. ఇది నిజం. నా అనుభవం" అని గుండెపై చేయివేసుకొని శ్రీరామకృష్ణులు సమాధానమిచ్చాడు. నరేంద్రుడికి కొంతసేపు నోటమాటరాలేదు.

"నేను భగవంతుడిని చూశాను" అని ధైర్యంగా చెప్పగలిగిన ధీరుడిని మొదటిసారి చూశాడు.

### గురుశిష్యులు

నరేంద్రుడు శ్రీరామకృష్ణుల వద్దకి తరచూ వెళ్ళడం ప్రారంభించాడు. శ్రీరామకృష్ణులు మహాశక్తి సంపన్నులే కాదు ఆయన జీవితం పవిత్రతకి ప్రతిరూపమని గ్రహించాడు. ఆయన ఏమి ఆలోచించేవాడో అదే చెప్పేవాడనీ, ఏం చెప్పేవాడో అదే చేసేవాడని పరీక్షించి తెలుసుకున్నాడు. వీటన్నిటికీ మించి తనను తన తల్లిదండ్రులకంటే కూడా ఎక్కువగా ప్రేమించే వ్యక్తి శ్రీరామకృష్ణులని తెలుసుకొని ఆయన ప్రేమానురాగ శిక్షణలను మహాప్రసాదంగా స్వీకరించాడు. అలా సమయం గడుస్తుంది. 1884వ సంవత్సరం మొదట్లో నరేంద్రుని తండ్రి మరణించాడు.

### కాశీపూర్‌లో

తండ్రి మరణంతో నరేంద్రుడి జీవితం తెగిన గాలిపటమైంది. మనశ్శాంతి ఎక్కడైనా దొరుకుతుందంటే అది శ్రీరామకృష్ణులవారి పాదపద్మాల చెంత మాత్రమే.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

ఎక్కువ కాలం గురుసేవలో గడిపిన శిష్యుల్లో నరేంద్రుడొకడు. అప్పుడప్పుడూ కుటుంబానికి కావలసిన చిన్న చిన్న పనులుచేయడానికి బయటకు వెళ్ళినా, ఎక్కువకాలం కాశీపూర్‌లోనే గురువుకి సపర్యలు చేస్తూ గడిపేవాడు. ఎప్పటిలాగే శిష్యుల్లో నరేంద్రుడే నాయకుడు.

శ్రీరామకృష్ణులు నరేంద్రుడిని భవిష్యత్తులో అతడు సాధించవలసిన మహత్కార్యాలకోసం సమాయత్తపరుస్తున్నాడు. ఆయన ఇతర శిష్యుల భౌతిక ఆధ్యాత్మిక ప్రగతి బాధ్యతని నరేంద్రుడికి అప్పగించాడు.

## దేశ పర్యటన

స్వామీజీ (నరేన్ / నరేంద్రుడు) బారానగర్ మఠంలో రెండేళ్ళు నివసించాడు. హిందూ సన్యాసుల సంప్రదాయం ప్రకారం ఇతర సోదర సన్యాసులు కొంతమంది మఠాన్ని వదిలి దేశంలోని తీర్థయాత్రలకని ఒక్కొక్కరుగా బయల్దేరారు. స్వామీజీ ఇక ఉండలేక, 1888లో కాశీకి ప్రయాణమయ్యాడు.

కాశీలో ఒక సంఘటన జరిగింది. ఒకరోజు దుర్గా అమ్మవారి ఆలయానికి వెళ్ళి వస్తూంటే దారిలో ఒక కోతులగుంపు కనిపించింది. అవి ఆయనవైపు తిరిగి పరుగెత్తిరాసాగాయి. అవి కరుస్తయనే తలంపుతో స్వామీజీ వెనుదిరిగి చిన్నగా పరుగెత్తనారంభించాడు. అవి ఇంకా వెంబడిస్తూనే ఉన్నాయి. ఏంచేయాలి అని ఆలోచిస్తూ పరుగెడుతున్న స్వామికి అటుగా వెళ్తున్న ఒక వృద్ధ సన్యాసి కనిపించాడు. అడగకుండానే ఆ సన్యాసి అంతా గమనించి "ఆగు! వెనుదిరిగి ఆ జంతువుల నెదుర్కో" అని గట్టిగా అరిచాడు. స్వామీజీ ఆగి వెనక్కి తిరగగానే కోతులు కూడా ఆగి వెనుదిరిగాయి. స్వామీజీ రెండు మూడడుగులు వేసి భయపెట్టగానే అవి పరుగులంకించుకున్నాయి. తరువాతికాలంలో స్వామీజీ అమెరికాలో ప్రసంగిస్తూ ఇది తన జీవితంలో తాను నేర్చుకున్న ఒక గొప్ప పాఠం అనీ, ఆ కోతుల్లాగ కష్టాలు మనల్ని వెన్నాడుతాయని, ఎప్పుడైతే ఆగి మనం వెనుదిరిగి వాటినెదుర్కొంటామో అప్పుడు అవే పారిపోతాయని బోధించాడు.

1890లో మళ్ళీ యాత్రలకు బయల్దేరి ఎన్నో ఏళ్ళదాకా వెనక్కి రాలేదు. ఒక సోదర సన్యాసితో కాశీలోనూ హిమాలయ ప్రాంతాలలోను తిరిగాడు. ఈ పర్యటనలలో స్వామీజీకి ఎన్నో అనుభవాలు ఎదురైనాయి. కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి. చాలాసార్లు ఆయనకి ఎన్నో రోజులు తినడానికి ఏమీ ఉండేది కాదు. చాలా రాత్రులు ఆయనకి ఆకలీ బడలికలే స్నేహితులుగా ఉండేవి.

అప్పుడొక అద్భుతం జరిగింది. ఒక మిఠాయికొట్టు యజమాని వెతుక్కుంటూ వచ్చి స్వామీజీ పాదాలపై వాలి, వెంట తెచ్చిన భోజనం పొట్లాన్ని చూపిస్తూ స్వీకరించమని ప్రాధేయపడ్డాడు. స్వామీజీ "ఎవరు నాయనా నీవు? నేను నిన్నెఱుగనే! పొరబడుతున్నట్లున్నవు. నీవు వెతుకుతున్న వ్యక్తిని నేను కాను" అని అంటూ ఉంటే, ఆ వ్యక్తి స్వామీజీ ముందు చిన్నపీటవేసి భోజనం ఒక ఆకు మీదికి మారుస్తూ "లేదు స్వామీ, నేను కలలో చూసింది మిమ్మల్నే. శ్రీరామచంద్రమూర్తి స్వయంగా నా కలలో కనిపించి మిమ్మల్ని చూపించి, నా బిడ్డ ఆకలితో ఉంటే నువ్వు హాయిగా తిని నిద్రిస్తున్నవా? లే, లేచి అతడికి భోజనం పెట్టు' వెళ్ళమని ఆజ్ఞాపించాడండీ. ఆహా! ఏమి నా భాగ్యం! మీవల్లనే నాకు రామదర్శనం కలిగింది. తండ్రీ బిడ్డలిరువురిదీ ఏమి గాంభీర్యం! ఏమి సౌందర్యం! ఒక్కసారి చూస్తే చాలు, ఎవరూ మరిచిపోలేరు. నేను పొరబడటంలేదు స్వామీ. దయచేసి వేడి చల్లారకముందే ఆరగించండి. చల్లని నీళ్ళు కూడా తెచ్చాను" అన్నాడు. స్వామీజీ కనుల వెంబడి జలజలా నీరుకారింది. ఏ అభయహస్తమైతే తన జీవితమంతా ఆయన్ను కాపాడుతూ వస్తుందో, అదే అభయహస్తమిది. ఎదురుగా నోరు వెళ్ళబెట్టి ఇదంతా చూస్తున్న వడ్డీ వ్యాపారికి సన్యాస జీవితమంటే భగవంతుడి ఒడిలో వసించడమని అర్థమైంది. అశ్రునయనాలతో లేచివచ్చి స్వామికి సాగిలపడి నమస్కరించాడు. ఇలాంటి ఘటనలు స్వామీజీ జీవితంలో ఎన్నో జరిగాయి.


SCERT TELANGANA

స్వామీజీ ఎన్నోసార్లు తనకోసం తాను కొన్ని నియమాలు పెట్టుకునేవాడు. ఎవరైనా పిలిచి ఆపితే తప్ప ఆగకుండా యాత్ర సాగిస్తూనే ఉండాలనీ, ఎవరైనా పిలిచి భిక్ష ఇస్తే తప్ప ఆహారం తీసుకోకూడదనీ ఇలాంటి కఠిన నియమాలెన్నో పాటించేవాడు. స్వామీజీ వద్ద ఒక చిన్న భగవద్గీత; 'ది ఇమిటేషన్ ఆఫ్ క్రైస్ట్' అనే గ్రంథాలు తప్ప ఇంకేవీ ఉండేవి కావు.

ఇట్లా పర్యటిస్తూనే తమిళనాడులోని కన్యాకుమారికి చేరుకొన్నాడు. మూడు సముద్రాలు కలిసే కన్యాకుమారిలో అమ్మవారి ఆలయం సందర్శించాక సముద్రంలో అల్లంత దూరంలో కనిపిస్తూన్న ఒక పెద్ద శిలని చూశాడు స్వామీజీ. ఆ శిలదాకా పడవలో వెళ్ళడానికి స్వామీజీ దగ్గర డబ్బులు లేవు. ఎవరు నా మాతృభూమిని అంధకారంనుంచి మేల్కొలుపుతారు? ఈ దేశ ప్రజల అలసత్వాన్నీ అజ్ఞానాన్నీ పటాపంచలుచేసి మళ్ళీ దానికి తన పూర్వవైభవాన్ని తీసుకురావడం ఎట్లా? ఇన్ని ప్రశ్నలు, ఇంత ఆవేదనా మనస్సులో ఉవ్వెత్తునలేచి చేసే అల్లకల్లోలం ముందు, ఎదుటఉన్న మూడుసముద్రాల అలలజోరు లెక్కలోకి రానిదై స్వామీజీ ఆ సాగరాన్ని ఈది శిలను చేరుకున్నాడు.

### అమెరికా

అమెరికా దేశంలో సకల మతాల మహాసభ ఒకటి జరగబోతున్నదని అంతకుముందు ఎక్కడో విన్నాడు స్వామీజీ. ఆ సభలో పాల్గొని భారతదేశపు ధర్మాన్ని ప్రపంచానికి సరైన విధంగా తెలియజేయడానికి నిశ్చయించుకున్నాడు.

స్వామీజీ మద్రాసుకు వెళ్ళాడు. అక్కడ కొంతమంది యువకులు ఆయన ప్రణాళిక విని సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఖేత్రీ మహారాజు ఈ సమయంలో స్వామివారిని ఆహ్వానించి వారి ఆలోచన విని, కెనడాకు వెళ్ళే ఒక ఓడలో ప్రథమశ్రేణి టిక్కెట్టుకొని ఇచ్చాడు. ఆయన స్వామీజీకి మంచి కాషాయవస్త్రాలు బహూకరించి 'వివేకానంద' అనే నామధేయాన్ని స్వీకరించవలసిందిగా ప్రార్థించాడు. స్వామీజీ ఈ విధంగా వివేకానందస్వామి అయ్యాడు.

వివేకానందస్వామి బొంబాయి నుండి 1893 మే 31వ తారీఖున అమెరికాకు బయలుదేరాడు. ఓడ దారిలో సిలోను, సింగపూరు, హాంగ్‌కాంగ్, చైనా, జపాన్‌లలోని రేవులలో ఆగింది. స్వామీజీ ఆయా ప్రాంతాలను ఎంతో ఆసక్తితో గమనించేవాడు. కొన్నాళ్ళకు ఓడ కెనడా దేశంలోని వాంకోవర్‌లో ఆగింది. స్వామీజీ అక్కడి నుండి షికాగోకి రైలులో వెళ్ళాడు. రైల్లో సాన్‌బోర్న్ అనే ఒక మహిళ స్వామీజీతో మాట్లాడింది. స్వామీజీ ప్రతిభాపాండిత్యాలనీ, పవిత్రతనీ గమనించి 'స్వామీ మీరెపుడైనా బోస్టన్ నగరానికి వస్తే, దయచేసి మా ఇంటికి అతిథిగా వచ్చి మమ్మానందింపజేయండి' అని తన చిరునామా ఇచ్చింది. జూలై నెల మధ్యలో స్వామీజీ షికాగో చేరుకున్నాడు. అదొక చిత్రమైన కొత్త ప్రపంచం. అక్కడి భవంతులు, రోడ్లు, సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలూ, యంత్రాలూ, కర్మాగారపు తయారీలూ, కళలూ మొదలైనవన్నీ చూసి స్వామీజీ విస్తుపోయాడు.

కొన్నిరోజుల తర్వాత స్వామీజీకి కొన్ని విషయాలు తెలిశాయి. ఏ విశ్వమత మహాసభలకై ఆయన వచ్చాడో అవి సెప్టెంబర్ మాసం మధ్యలోగాని మొదలుకావు అనీ, అంతేగాక తనవద్ద కావలసిన ధ్రువపత్రాలేవీ లేనందువల్ల ఆయన వాటిలో వక్తగా పాల్గొనడం కుదరదనీ, పత్రాలు ఒకవేళ ఉన్నా వక్తలనంగీకరించే సమయం మించిపోయిందనీ తెలుసుకున్నాడు. ఇంకొక సమస్యేమిటంటే షికాగో ధనవంతుల నగరం. అక్కడి ధరలకూ తనదగ్గర ఉన్న కొద్దిపాటి డబ్బుకూ పొంతనే లేదని, ఇంకొన్నాళ్ళలో డబ్బులన్నీ ఖర్చయిపోయి పస్తులుండవలసిందేననీ అర్థమైంది.

బోస్టన్ వంటి చోటైతే తక్కువ ఖర్చుతో జీవించవచ్చని ఎవరో చెప్పగా, సాన్‌బోర్న్ ఆహ్వానం కూడా గుర్తుకు వచ్చి ఆ పట్టణానికి ప్రయాణమయ్యాడు. ఆవిడ ఇంట్లో ఉండగానే హార్వర్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసరయిన జె.హెచ్.రైట్ అనే వ్యక్తితో పరిచయమైంది స్వామీజీకి. శాస్త్రీయమైన, తాత్త్వికమైన విషయాలెన్నో చర్చించుకున్నారు వాళ్ళు. ప్రొఫెసర్‌గారు స్వామీజీ పాండిత్యాన్ని చూసి జరగబోయే విశ్వమత మహాసభల్లో హైందవ ధర్మానికి ప్రాతినిధ్యం వహించవలసిందిగా ఆయనను కోరాడు. స్వామీజీ తాను వచ్చింది అందుకనేననీ, కానీ తన వెంట ఏ ధ్రువపత్రాలూ లేవనీ, అందువల్ల సభల్లో


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

పాల్గొనడం కుదరదని విన్నాననీ తెలిపాడు. అది విని విస్తుబోయిన ఆ అమెరికా పండితుడు "స్వామీ! మిమ్మల్ని ధ్రువపత్రాలడగడమంటే, సూర్యుడికి ప్రకాశించే హక్కు ఎవరిచ్చారని అడగడమే" అని జవాబిచ్చాడు.

అంతేకాక, షికాగో విశ్వమత మహాసభల అధ్యక్షుడికి ఒక ధ్రువపత్రం వ్రాస్తూ ప్రొఫెసర్‌గారు "ఈ వ్యక్తి మేదస్సు, పాండిత్యం మన దేశంలోని గొప్ప గొప్ప పండితులందరి పాండిత్యాన్నీ కలిపితే వచ్చే పాండిత్యం కన్నా గొప్పది" అని పరిచయం చేశాడు. షికాగో వరకు ఒక టిక్కెటు కూడా కొని ఇచ్చిండు ప్రొఫెసర్‌గారు. దైవసంకల్పం ఎంత బలమైందో చూసి స్వామీజీ ఆనందించాడు.

షికాగో చేరి చూసుకునేసరికి ఆ కమిటీ చిరునామా ఎక్కడనో పడిపోయిందని అర్థమైంది స్వామీజీకి. అంత మహానగరంలో ఇప్పుడెక్కడికి పోవాలి? అప్పటికే చాలా అలసటగా ఉండి, మరోచోటు దొరక్క కనిపించిన ఒక పెద్ద ఖాళీ డబ్బాలో రాత్రి గడిపాడు. పొద్దునే లేచి ఒక వీధిలో నడుస్తూ తన సన్న్యాస సంప్రదాయం ప్రకారం ఆహారంకోసం యాచించాడు. అక్కడి ఇళ్లు చాలా పెద్దవి, ధనవంతులవి. కానీ అందరూ ఆయన్ని ఛీకొట్టారు. పనివారు కూడా అవమానించారు. పాశ్చాత్యంలో భిక్షాటన చేయడం గర్హనీయం కదా. ఇక ఏం చేయాలె? భగవంతుడే కనుక నన్నిక్కడికి తీసుకువస్తే ఆయనే నాకేదో దారి చూపిస్తాడులే అనుకొని ఒక చెట్టుకింద కూర్చున్నాడు. అప్పుడే ఒక ఇంటి తలుపు తెరుచుకొని, ఒక మహిళ సూటిగా స్వామీజీ వద్దకు వచ్చింది. "మీరు విశ్వమత మహాసభలకి వచ్చినవారా? చూస్తే భారతీయ సన్న్యాసిలా ఉన్నారు!" అని అడిగింది. స్వామీజీ కథ విని ఇంటికి ఆహ్వానించి ఎంతో గౌరవంతో చూసుకుంది ఆ తల్లి. ఆవిడ పేరు జార్జ్ డబ్ల్యూ. హేల్. తర్వాత ఆ కుటుంబమంతా స్వామీజీకి జీవితాంతం మంచి స్నేహితులుగా మిగిలిపోయారు.

1893వ సంవత్సరం, సెప్టెంబర్ 11వ తేదీ సోమవారంనాడు విశ్వమత మహాసభలు మొదలయ్యాయి. కొలంబస్ హాల్ అనే ఒక పెద్ద భవనంలో అవి జరిగాయి.

స్వామీజీకి అంతమంది ముందు మాట్లాడాలంటే కొంత బెరుకు కలిగింది. అందరూ పుటలకొద్దీ వ్రాసుకుని చదివేస్తున్నారు. మరి స్వామీజీ మాత్రం అటువంటి ఏ సన్నాహాలు లేకనే వచ్చాడు. సభాధ్యక్షుడు రెండుమూడుసార్లు మాట్లాడమంటే ఇప్పుడు కాదు తర్వాత అని తోసిపుచ్చాడు. సాయంత్రం ఇక అడక్కుండానే స్వామివారి పేరుని పిలిచేసరికి లేచి, సరస్వతీదేవిని తలచుకొని, శ్రావ్యమైన ఆయన కంఠంతోను, అంతకంటే మధురమూ, పరమపవిత్రమూ అయిన ఆయన హృదయాంతరాళాలలో నుంచి వచ్చిన విశ్వమానవ సౌభ్రాత్ర భావనతోను "నా అమెరికా దేశ సోదర సోదరీమణులారా...." అని మొదలుపెట్టాడు. దాంతో ఆ జనసముద్రమంతా ఒక్కసారిగా లేచి నిలబడి కమ్మని ఆ పిలుపునకు, తమముందు మూర్తీభవించిన ఆ పవిత్రతకూ, ఏ నాగరికత పరిపూర్ణతకైనా చిహ్నమైన ఆ సన్న్యాస స్ఫూర్తికీ తమకు తెలియకనే పులకించిపోయి కరతాళధ్వనుల వర్షం కురిపించింది. ఉపన్యాసపు ఆరంభంలోనే అందిన ఆ అపూర్వ అభినందన మూడు నిమిషాలపాటు సాగింది. మధ్యలో స్వామివారు మళ్ళీ మాట్లాడడానికి చేసిన రెండు మూడు ప్రయత్నాలు విఫలమే అయ్యాయి.

అందరూ కూర్చున్నాక స్వామీజీ కొనసాగించిండు. భారతీయ ధర్మం అన్ని మతాల్ని అంగీకరిస్తుందనీ, గౌరవిస్తుందనీ, అన్నీ మతాలు సత్యాలేనని, మతాలన్నీ భగవంతుని చేరుకోడానికి మార్గాలని స్వామీజీ చెప్పాడు. ఎవరూ మతాన్ని మార్చుకోనవసరంలేదనీ, నా మతమే గొప్పది. నా మతమే నిలవాలి అనుకునేవారు బావిలో కప్పలవంటి వారనీ స్వామీజీ తెలిపాడు. మిగతా వక్తలు తమ తమ మతాలకే ప్రాతినిధ్యం వహిస్తే, స్వామీజీ మాత్రం అన్ని ధర్మాల తరఫునా మాట్లాడి నిజమైన మతసామరస్యాన్ని చూపించాడు. సభ్యులందరికీ స్వామీజీ ప్రసంగమే నచ్చింది. రాత్రికి రాత్రి స్వామీజీ ఖ్యాతి దేశమంతటా వ్యాపించింది. పత్రికలన్నీ స్వామీజీని వేనోళ్ళ పొగిడాయి.



SCERT TELANGANA

### భారతదేశం స్వామీజీకి బ్రహ్మరథం పట్టడం

కొన్నాళ్ళ తరువాత స్వామీజీ భారతదేశానికి తిరిగి రావాలని నిశ్చయించుకున్నాడు.

వచ్చేముందు ఒక ఆంగ్లేయమిత్రుడు స్వామీజీని ఇలా అడిగిందు "స్వామీ! నాలుగేళ్ళు ఎన్నో భోగాలతో నిండిన పాశ్చాత్యంలో గడిపి పేదరికంతో ఉన్న భారతదేశానికి వెళ్తున్నరు ఏమనిపిస్తుంది?"

స్వామీజీ ఇట్లా సమాధానమిచ్చాడు. "నేనిక్కడికి రాకముందు నా దేశాన్ని ప్రేమించేవాడిని. ఇప్పుడు నా దేశపు గాలి, నీరు, ధూళి కూడా నాకు పవిత్రమూ, పూజనీయమూ అయ్యాయి. నా మాతృదేశం ఇప్పుడొక మహాతీర్థస్థానం."

స్వామీజీ తిరిగిరావడం భారతదేశపు జవసత్వాలు తిరిగి రావడమే అయింది. అప్పటికే వివేకానందస్వామి అంటే తెలియనివారు భారతదేశంలో ఎవరూ లేరు.

1897 జనవరి 15వ తారీఖున ఓడ అప్పటి బ్రిటీషు ఇండియాలోని కొలంబో చేరింది. మళ్ళీ తన పవిత్ర భారతభూమిపై కాలుపెట్టగలుగుతున్నారని స్వామీజీ మనస్సు ఆనందంతో పొంగిపోయింది. స్వామీజీకి స్వాగతం పలకడానికి భారతదేశ ప్రజలు చేసిన స్వాగత సన్నాహాల గురించి వారికి తెలియదు. ఆయన్ని స్వాగతించడానికి అన్ని నగరాల్లోను స్వాగత కమిటీలు ఏర్పడ్డాయి. వార్తాపత్రికలు ఎన్నో సంపాదకీయాలు రాశాయి.

తర్వాత స్వామీజీ స్టీమర్‌లో భారతదేశపు ప్రధాన భూమికి వచ్చి పంబన్ అనే గ్రామంలో దిగబోయాడు. రామనాడుకి రాజైన భాస్కర సేతుపతి స్వామీజీకి ఎదురువెళ్ళి, ఆయన ముందు మోకాళ్ళపై కూర్చుని మొదట తన తలపై కాలుమోపి తరువాత భారతభూమిపై దిగమని శిరస్సువంచి ప్రార్థించాడు. స్వామీజీ అందుకు సున్నితంగా నిరాకరించాడు. స్వామీజీకి సపరివారంగా సాష్టాంగ నమస్కారంచేసి స్వయంగా తన రథంలో కూర్చుండబెట్టాడు.

### శరీరాన్ని త్యజించడం

వివేకానందస్వామి వారి ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది.

స్వామీజీ ఎక్కువకాలం జీవించదలుచుకోలేదు. ఎన్నోసార్లు తన శిష్యులకీ, స్నేహితులకీ తాను త్వరలో ఈ ప్రపంచాన్ని వదిలివేయబోతున్నట్లు పరోక్షంగా చెప్పాడు. కానీ ఎవరూ ఇంత త్వరగా ఆ ముహూర్తం వస్తుందని అనుకోలేదు. "నేను నలభై చూడను అని" జోసెఫిన్ మక్లాడ్ అనే స్నేహితురాలితో స్వామీజీ స్పష్టంగా చెప్పాడు. తన అంతిమ దినానికి వారంరోజులముందు ఒక శిష్యుడిని పిలిపించుకుని, పంచాంగం చదవమన్నాడు.

అది 1902, జులై 4వ రోజు. ఆ రోజు స్వామి పొద్దున శ్రీరామకృష్ణుల మందిరానికి వెళ్ళి తన అలవాటుకి భిన్నంగా అన్ని కిటికీలు తలుపులూ మూసుకుని మూడుగంటలసేపు గాఢ ధ్యానంలో గడిపాడు. తర్వాత దినచర్యకు భిన్నంగా సన్న్యాసులందరితో కలిసి భోజనం చేశాడు.

సంధ్యాసమయం. శ్రీరామకృష్ణులకి ఆ రాత్రికి సేవ జరిగేందుకు ముందు శంఖం పూరించడం జరిగింది. స్వామీజీ తన గదికి వెళ్ళి గంగకు అభిముఖంగా కూర్చుని ధ్యానముద్ర ధరించాడు. ఒక గంట తర్వాత ఆయన మంచంపై పడుకున్నాడు. రెండుసార్లు దీర్ఘంగా ఊపిరి పీల్చాడు. పరీక్షిస్తే స్వామి దేహంలో ఊపిరి లేదని గ్రహించారు. స్వామీజీ ఇక శాశ్వతంగా ఆ శరీరాన్ని వదలివేశాడు.

స్వామీజీ తన జీవితాంతం ఎంతో శ్రమపడి కష్టపడి పనిచేశాడు. ఆయన భౌతిక జీవితం ముగిసింది. కాని ఆయన పని కొనసాగుతూనే ఉంది. "లేవండి! మేల్కొనండి! గమ్యం చేరేవరకు విశ్రమించకండి!" అని తన దేశ ప్రజలకి పిలుపునిచ్చాడు. వారంతా ఆ పిలుపు విన్నారు. భరతమాత మేల్కొంచింది. ఆయన భావజ్వాలతో మొదలైన నవభారత నిర్మాణం, దేశానికి స్వాతంత్ర్యం రావడంతోనే కాక ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.....


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21

ఉపవాచకం



# 6. నేను... సావిత్రిబాయిని

"జ్యోతి! సావిత్రికెందుకు చదువు నేర్పుతున్నావు?"

"ఎందుకు నేర్పకూడదు?"

అసలు మన కులంవాళ్ళమే చదువుకోకూడదు. అయినా నిన్ను చదివించా. ఇప్పుడు నువ్వు నీ భార్యకు చదువు చెబుతున్నావు"–

"ఆమె కూడా మనిషేకదా? కాదంటే చెప్పు"

"నిజమే కావచ్చు కానీ ఆడదానికి చదువు పనికిరాదు. చదువుకున్న ఆడది చెడిపోతది. బుద్ధి లేనిదవుతది"–

"నాన్నా! సావిత్రి చదువుకుని ఆ మాటలన్నీ అబద్ధాలని నిరూపిస్తుంది"

నమస్కారం!

ఇవాళ మీ అందరితో మాట్లాడటానికి వచ్చాను.

మొదట్నించి చెప్తా వినండి. నేను పుట్టిందేమో నైగావ్. అయ్యో! అదెక్కడుందో మీకు తెలియదు గదూ! మహారాష్ట్రలో సతారాజిల్లాలో ఖండాలా తాలూకాలో ఉంది. అబ్బో ఎంత కుగ్రామమని,అక్కడసలు మనుషులుంటరా అని అనుమానం కలిగేంత చిన్నఊరు. ఆ రోజుల్లో ఆ ఊళ్ళో అందరూ అందర్నీ ఎరిగి ఉండేవాళ్ళు. నేనా? పాటిల్ గారింట్లో పెద్దకూతుర్ని, మొదటి సంతానాన్ని, అబ్బా– మీకదంతా చూపించేదా? ఆ చేలలో పడి పరుగెత్తుతూ, ఆ గులకరాళ్ళను, దుమ్మునూ తన్నుకుంటూ–ముళ్ళు గుచ్చుకోవా అంటున్నారా? ముళ్ళూ గిళ్ళూ ఏవీ లెక్కలేదు నాకు. విరబోసుకున్న జుట్టు ముఖంమీద పడుతుంటే వెనక్కి తోసుకుంటూ ఊరంతా వెర్రిగా పరిగెత్తేదాన్ని.

చింతకాయలు కొట్టుకొని తినటం, రేగుపళ్లు కోసుకొనితినటంలో నన్ను మించినవాళ్లు లేరు. ఒకరోజు యేమైందో తెలుసా? ఔను మీరనుకుంటున్నట్టే జరిగింది. నేనెక్కిన సీమ చింతచెట్టు కొమ్మ విరిగింది. నేనా కొమ్మ పట్టుకొని ఉయ్యాల ఊగుతున్న – సీమ చింతకాయలు నా పరికిణీలోంచి కిందపడిపోతున్నాయి. 'అమ్మా నా సీమ చింతకాయలు, నేను పడిపోతున్నా, కొమ్మ విరిగింది, నేను పడిపోతున్నా' నా అల్లరికి అమ్మ పరిగెత్తుకొచ్చింది. వచ్చింది నన్ను దించొచ్చు కదా! ఊహూ, వెళ్ళి మా నాన్నను పిల్చుకొచ్చింది. 'చూడండి మీ ముద్దుల కూతురు ఏంచేసిందో' అంటూ అమ్మ నావైపు చూపిస్తూ, నేనేమో కొమ్మకు వేలాడుతూ, మా నాన్న విరగబడి నవ్వుతూ– ఎంత బాగుంది... కదా!

నాన్న నన్ను కిందికి దించాడు. అమ్మ మాత్రం ఆపలేదు. 'ఈ పిల్లకు తొందరగా పెండ్లిచేసి పంపించాలి. ఏ కాలో చెయ్యో విరక్కొట్టుకుంటే ఎవరు చేసుకుంటారు? గుదిబండలా మన మెడకు చుట్టుకొనివేలాడుతుంది. అసలిది ఆడపిల్లనేనా అంటా?'

SCERT TELANGANA

'నేను ఆడపిల్లను కాదమ్మా. ఇదిగో ఈ సీమచింతకాయ చూడు ఎంత తియ్యగా వుందో' అని నోట్లో కుక్కుకుంటూ అమ్మకు ఒకటిచ్చి మళ్ళీ పరుగుతీసే దాన్ని.

నాన్న కూడా పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. పూనాలో వుండే పూలే కుటుంబంలో ఒక అబ్బాయితో నా పెళ్ళి నిశ్చయించాడు. 'ఈ సేఠ్‌జీ ఎట్లా ఉంటాడబ్బా అనుకునేదాన్ని!' చింత చెట్లెక్కుతాడా? బావిలో ఈతగొడుతాడా? రాత్రిళ్ళు ఆరుబైట పడుకునే చుక్కలు లెక్కబెడుతాడా? ఏమో! ఎవరికి తెలుసు? బళ్ళో చదువుకుంటున్నాడని చెప్పారుగా! పుస్తకాలు చదువగలడేమో!

ఆ రోజుల్లో ఆడవాళ్లు గడప దాటకూడదు. ఆడపిల్ల పెరిగిపెద్దదయ్యేసరికి– లక్ష్మణుడు గీసిన గీత దాటడం వల్లనే సీతమ్మవారిని రావణాసురుడు యెత్తుకుపోయాడనే కథ ఎన్ని వందలసార్లు విన్నానో ఎవరూ లెక్కబెట్టలేదు. ఆడదంటే వంటింటికీ, వంటింట్లో పొయ్యికీ కట్టుబడి ఉండాలి. పొయ్యిలో కట్టెలు, పొయ్యి ఊదే గొట్టం ఆ పిల్లచేతిలో వుండాల్సిందే. ఆ పిల్ల ఆ గొట్టం గుండా ఊపిరంతా పొయ్యిలోకి ఊదాల్సిందే. భర్తనీ, అత్తమామల్ని సేవించుకోవాలి. అంతే ఇక నీ పని, ఇప్పుడు మీ పిల్లలు రెండో తరగతి చదువుతుంటే, మీరు బుజ్జగిస్తుంటారే, ఆ వయసులో మేం అత్తగారింట్లో ఉండేవాళ్ళం.

ఒకరోజు నేను ఇల్లు సర్దుతున్నా. పుస్తకాల గుట్టమీద వున్న దుమ్ము దులుపుతున్నా. ఇల్లు శుభ్రంగా ఉండాలి గదా. అదుగో అప్పుడే ఆయనొచ్చాడు. 'నా పుస్తకాలనేం చేస్తున్నావు!' అన్నాడు. 'దుమ్ముదులిపి శుభ్రం చేయొద్దా?' అన్నా. 'పేజీలు పోగొడతావ్ జాగ్రత్త?' అంటే 'ఎక్కడికిపోవు, అన్నీ ఉంటాయి అన్నా. ఇదేంటో మరి?' 'ఏ పేజీ అది' – 'ఏ పేజీనో ఏమిటో నాకేం తెలుస్తుంది? ఏమయిందని మీరిప్పుడీ రగడ చేస్తున్నారు?' అన్నా. 'అవన్నీ జీవితచరిత్రలు. ఇదిగో చూడు. ఇది శివాజీ గురించి రాసింది, ఆయన ఫోటో ఇది. ఇక్కడ వాషింగ్‌టన్ గురించి రాసింది. ఇది ఆయన ఫోటో'. అని సేఠ్‌జీ అన్నాడు. 'ఎవరూ! శివాజీ నాకూ తెలుసు. మనవాడే కదా! కానీ ఈయనెవరూ ?' పరాయిదేశం మనిషివలె వున్నాడు' – 'మన దేశం అయితేనేం కాకపోతేనేం, మనిషి మంచి పనులు చేస్తే మనం అతని జీవితం, వ్యక్తిత్వం, విలువలు అన్నీ తెలుసుకోవాలి.' అన్నాడు. అబ్బో ఈ సంగతులన్నీ మీ బుర్రలో ఉన్నట్టే చెప్తున్నారే' అన్నా. బుర్రలో ఉంచాలనే ప్రయత్నిస్తున్నా. ఈ పుస్తకం చూడు. ఇది థామస్ పెన్ రాసిన 'మానవునిహక్కులు' అన్న పుస్తకం. మనిషికున్న హక్కులేమిటో బాధ్యతలేమిటో అన్నీ ఈ పుస్తకంలో రాసివున్నాయి.' అని చూపించాడు సేఠ్‌జీ.

ఇట్లా ప్రతిరోజూ సేఠ్‌జీ నాకు యేదో వొకటి చదివి విన్పించేవాడు. మధ్యలో ప్రపంచం గురించి, మన చుట్టూ ఉండే ప్రపంచం గురించి నాకర్థమయ్యేటట్లు చెప్పటం కోసం ఆపేవాడు. హిందూ ముస్లిం మతాల మధ్య ఉన్న తేడాలేమిటి? క్రైస్తవమతం మనిషి గురించి ఏం చెప్తుంది? మన కులవ్యవస్థ మన సమాజాన్ని యెట్లా నాశనం చేస్తుందో చెప్పేవాడు. వీటన్నిటి గురించీ ఆయన మాట్లాడుతుంటే చెవులు రిక్కించుకుని వినేదాన్ని. సేఠ్‌జీ నిరంతరం చదివేవాడు. కబీర్, తుకారాం, జ్ఞానేశ్వర్ వంటి భక్తుల సాహిత్యం, భక్తిమార్గాన్ని గురించి, బుద్ధుడు, బసవేశ్వరుడు, తీర్థంకరుడు మొదలైన మతసంస్కర్తల రచనలన్నీ చదివాడు. అవన్నీ నాతో చెప్పేవాడు. స్నేహితులతో చర్చించేవాడు. 'ఇదంతా చదివితే నీకే మొస్తుంది?' ఆపుకోలేక ఒకరోజు అడిగాను. ఒకప్పుడు మంచిగా ఉండే మతం, మూర్ఖపు ఆచారాలలో, సంప్రదాయాలలో చిక్కుకుపోయింది. వీటన్నిటినీ రూపుమాపాలి.' ఈ దరిద్రపు ఆచారాలన్నీ ఎక్కువ తక్కువ కులాలనే విభజన వల్లనే వచ్చాయి. మామూలు మనుషులందరికీ చదువు ఎందుకుండకూడదు?' ఆయనట్లా చెప్పుకపోతున్నాడు.

ఆయన బుర్రలో ఒకే ఒక్క విషయం తిరుగుతున్నది. చదువు, చదువు, చదువు. సదాశివ గోవింద్ ఆ రోజుల్లో సాగర్‌లో ఉండేవారు. ఆయన సేఠ్‌జీని ఫర్రార్ అనే ఆమె నడిపే బడికి తీసుకెళ్ళాడు. ఆమె తెల్లజాతి మనిషి. వీళ్ళిద్దరూ

SCERT TELANGANA

బడిలో ఏం నేర్పాలి, ఎట్లా నేర్పాలి అని ఆమె నడగటానికి వెళ్ళాడు. ఆమె అన్నదిగదా, "ఇంటికి కేంద్రం ఆడమనిషి. ఆమె చదువుకుంటేనే కుటుంబం బాగుపడుతుంది. లేకపోతే లేదు. మీరు మీ ఆడవాళ్ళకు చదువు చెప్పించకపోవడం అన్యాయం. ఘోరం" అన్నది. అంతే, సేర్‌జీ తలలో తొలుస్తున్న పురుగు తన దారి కాస్త మార్చుకున్నది. ప్రతి మగవాడూ తన భార్యకు చదువు నేర్పాలి. అక్కణ్ణుంచి రావడం రావడమే పలక, బలపం, పుస్తకాలతో వచ్చాడు. నేనప్పుడే రొట్టెలు చేసి పొయ్యి ఆర్పబోతుండగా ఆయన ముఖం వెలిగిపోతున్నది. కాళ్ళూ చేతులు కడుక్కుంటూనే నన్ను కేకేశాడు. "అంతా సిద్ధంగా ఉంది. రొట్టెలు, కూర అన్నీ వున్నాయి. నీదే ఆలస్యం" అని నేనూ కేకపెట్టాను – "నాకిప్పుడు రొట్టేగిట్టే ఏమీ వొద్దు– నువ్వు ముందిటురా!" అన్నాడు. అబ్బబ్బా ఇవ్వాళ సేర్‌జీకేమయింది? అనుకుంటూ వచ్చాను. సేర్‌జీ చేతిలో పుస్తకాలరాశి.

అప్పట్నుండి నా చదువు మొదలైంది. సేర్‌జీ పలకమీద వరసగా అచ్చులు, హల్లులు రాసి దిద్దుమన్నాడు. అవే మళ్ళీమళ్ళీ. వేళ్ళు నొప్పెడుతున్నాయి. విసుగుపుట్టేది. సేర్‌జీ ప్రతిక్షణం నా చదువుపై శ్రద్ధపెట్టాడు. నాకిప్పుడు చదువడం వచ్చింది. నిన్నమొన్ననేగా సేర్‌జీ నాకు అన్నీ చదివి వినిపించేవాడు. ఇప్పుడేమో నేను మాటలు గుర్తుపడుతున్నా. అక్షరాలు, మాటలు, వాక్యాలూ నా ముందు నాట్యంచేస్తున్నాయి. గొబ్బిళ్ళ పాటలన్నీ రాయాలనిపించేది. నా పేరు రాయాలనీ, దాన్ని నా వేళ్ళతో తాకి చూసుకోవాలని అనిపించేది. నెమ్మదిగా నాకు చదువటమంటే చాలా ఇష్టం కలిగింది.

ఇదంతా ఒకవైపు జరుగుతుండగానే సేర్‌జీ తక్కువ కులాల ఆడపిల్లల కోసం ఒక బడిపెట్టాడు. ఇక దాంతో ప్రళయం ముంచుకొచ్చింది. ఎవరేమనుకున్నా సేర్‌జీ ఖాతరు చెయ్యలేదు. బడి బ్రహ్మాండంగా ఉంది. అన్నాసాహెబ్ చిప్‌లూంకర్ భవనంలో ఆడపిల్లలకోసం రెండో బడి కూడా మొదలైంది. కేశవరావ్ భవాల్కర్, జగన్నాథ్ సదాశివ్, అన్నాశాస్త్రి బుద్ధే, బాపూరావ్‌జీ మందే, విష్ణుమొరేశ్వర్, భిడే కృష్ణశాస్త్రి, చిప్‌లూంకర్– వీళ్ళందరూ కార్యనిర్వాహకులుగా ఉన్నారు. ఆ బడికూడా చక్కగా నడుస్తున్నది. ఒకరోజు సాయంత్రం సేర్‌జీ ముఖం వేలాడేసుకుని వచ్చాడు. ఏం జరిగిందని అడిగాను. ఆయన మాట్లాడకుండా అటూ యిటూ అశాంతిగా తిరుగుతున్నాడు. మళ్లీ అడిగాను. 'ఏమైంది? జరగరానిది జరిగిందా?' – "స్కూలు నడిపే పంతులుగారు బడిమానివేశారు. ఇప్పుడేం చెయ్యాలి?" అన్నారు. "మనమేం చెయ్యగలం?" అన్నాను. నాకు తెలియటంలేదు. కానీ తక్కువ కులాలవాళ్ళు కూడా చదువుకుని టీచర్లు కావాలి. కానీ అంతవరకూ యేంచెయ్యాలి?" చివరకు కొత్తపంతులుగారు దొరికేవరకు నన్ను బడికి రమ్మన్నాడు. "ఆ పిల్లలకు పుస్తకాలు చదివి వినిపించుదువుగాని" అన్నాడు. "నేనా చదువు చెప్పటమా? నా వల్లగాదు" నేను చెప్పేది వినిపించుకోకుండానే సేర్‌జీ భావాల్కర్‌తో మాట్లాడడానికి వెళ్ళిపోయాడు. వాళ్ళేం మాట్లాడుకున్నారో దేవుడికి తెలియాలి. భవాల్కర్‌గారు వెంటనే మా యింటికొచ్చారు. "అంతా నిర్ణయమైపోయింది. రేపట్నించి నువ్వు బడికొచ్చి పిల్లలకు చదువు చెప్పాలి?" అని అన్నారు. "నేనెట్లా చెప్తాను? ఏం చెప్తాను"– అని అన్నా. "నువ్వు చెప్తావు అంతే, ఎట్లా చెప్పాలో నేను నేర్పిస్తా" వాళ్ళిద్దరూ కూడా నేను చెప్పేది వినిపించుకునే స్థితిలో లేరు. బడిలో పాఠాలు చెప్పడానికి ఒప్పుకోక తప్పలేదు.

నేను బడికిపోతుంటే జనం కిటికీల వెనుక నిలబడి తిట్టేవారు. శాపనార్థాలు పెట్టేవారు. నీచమైన మాటలన్నీ అనేవారు. బడికి వెళ్ళంగానే అక్కడ తలుపులు కిటికీలు మూసే లోపల పిల్లలకు నీతిపద్యాలు, కూడికలు, తీసివేతలూ, భూగోళశాస్త్రం, మరాఠా చరిత్ర ఇవన్నీ చెప్పేదాన్ని. సేర్‌జీ మాల మాదిగల పేటలకు వెళ్ళి చదువు ఎంత అవసరమో ప్రచారం చేస్తుండేవాడు.

మేము ఒక బిడ్డను దత్తత చేసుకున్నాం. మా స్వంత కొడుకువలె అతన్ని పెంచాము. మనిషినీ మనిషినీ కట్టివేసేది రక్తసంబంధం మాత్రమే కాదు. మానవత్వం మరింత బలమైన బంధం. కానీ ఇవాళ కులం పెద్ద సమస్యగా మారింది.

ఎందుకంత పెద్ద సమస్య అయింది? మీరు ఆలోచించండి. మా ఆలోచనలూ మా ఆదర్శాలూ వాటికి కాలం చెల్లిపోయిందా? ఇవాళ, రేపు ఎవరైనా దత్తత తీసుకోవాలంటే కులం, రంగు, జాతి అన్నీ చూస్తున్నారు. అసలు దత్తత తీసుకోవాలనే అనుకోరు. కానీ కొత్తగా ఈ లోకంలోకి వచ్చిన ప్రాణికి కులం ముద్రవేయటం దేనికి?

జ్యోతిరావ్ పూలే మొదటి బాలికల పాఠశాల ప్రారంభించాడంటారు. శిశుహత్యలకు వ్యతిరేకంగా మొదటి ఆశ్రమం స్థాపించాడంటారు. సావిత్రిబాయి మొదటి పంతులమ్మ అని కూడా అంటారు. ఇదంతా నిజమే కావచ్చు. కాని ఆ పని అక్కడితో ముగిసిపోకూడదు. ఆశ్రమాన్ని మా స్వంత డబ్బుతో ప్రారంభించాం. తర్వాత పండరిపురంలో అట్లాంటి ఆశ్రమాన్నే యేర్పరచినపుడు సేఠ్‌జీ మా ఆశ్రమాన్ని యిక పెంచలేదు. ఆయన అనేవాడు, "నిజమే, ఈ పని నేను మొదలుపెట్టాను. కానీ మనం మాత్రమే ఈ పని చెయ్యాలి అని అనుకోకూడదు. యింకొకళ్ళు ఇట్లాంటి పనే చేస్తుంటే మనం ఇంకొక కొత్త పని ప్రారంభించడానికి సంకోచించకూడదు."

మా మనసుల్లో ఒకసారి ఆ ఆలోచనకు బీజం పడిందంటే ఇక అది కార్యరూపం దాల్చవలసిందే. ఆలోచన ఆచరణగా వెంటనే మారవలసిందే. మా ఆలోచనలు అన్నిచోట్లా విస్తరించేటందుకు సంఘం పెట్టాలని అనుకున్నాం. 1873 సెప్టెంబరు 23వ తారీకున సత్యశోధక సమాజాన్ని ఆవిష్కరించుకున్నాం. ఆ సమాజం ఒక మౌలిక సూత్రం మీద ఆధారపడింది. దేవుడు ఒక్కడే. మనందరం ఆయన పిల్లలం. ఆయనను ప్రార్థించటానికి ఈ మధ్య దళారీలు యెందుకు? ఒక మనిషిని మంచివాడుగా, గొప్పవాడుగా చేసేది గుణమేగాని కులం కాదు. మనం సత్యంకోసం అన్వేషిస్తున్నాం. భగవంతుడు అన్నిటినీ సృష్టించాడు. అందువల్ల సేఠ్‌జీ ఆయనను సృష్టికర్త అనేవాడు. ఆయన మన తండ్రి; మనం ఆయన పిల్లలం. ఈ సత్యాన్ని అంగీకరించిన వారెవరైనా సత్యశోధక సమాజంలో సభ్యుడు కావొచ్చు. కులం ఏదనే ప్రసక్తి లేదు. సత్యశోధక సమాజం అధ్వర్యంలో మొదటి వివాహాన్ని 25.12.1873లో సమాజం పద్ధతిలో జరిపించాం. మేం గెలిచినాం. ఇప్పుడు నాలో నేను అనుకుంట. "మా తర్వాత వచ్చిన ఈ ప్రజలు మా విజయాలను ముందుకు తీసుకవెళ్తున్నారా లేక వాటిని అక్కడనే భూస్థాపితం చేసి జీవం లేకుండా చేస్తున్నారా?" అని. సేఠ్‌జీకి పక్షవాతం వచ్చి కోలుకున్నారు కాని ఎప్పుడూ ఇతరమైన జబ్బులేవో చేస్తూనే ఉన్నాయి. అఖండ్ పాటను వింటూనే సేఠ్‌జీ యాత్ర ముగిసింది. హృదయ విదారక రోదనలు మిన్నుముట్టాయి. నిప్పులకుండను పట్టుకుని "సత్యమేవ జయతే – అఖండ సత్యం– సత్యమేవ జయతే– అఖండ సత్యం" అనుకుంటా ఆయన అంతిమయాత్రను నేనే నడిపించాను.

1897 పూనాలో ప్లేగువ్యాధి ప్రబలింది. పట్టణం ఎడారి అయిపోయింది. జనమంతా దగ్గర్లో ఉన్న అడవుల్లోకి పారిపోయారు. ఇట్లాంటి సమయాల్లో తక్కువ కులాలవాళ్లకు సహాయపడాలని ఎవరనుకుంటారు? నేను నా కొడుకు యశ్వంత్, సమాజం సభ్యులు వ్యాధిగ్రస్తులకు సాయంగా వెళ్ళాం. ఒక గుడిసెలో రెండేళ్ళ పసివాడు బాధతో లుంగలు చుట్టుకుపోతూ కనిపించాడు. ఆ పిల్లవాడిని యెత్తుకుని డాక్టర్ దగ్గరకు పరుగెత్తాను. ప్లేగు అంటువ్యాధైనా ప్రాణంకోసం పెనుగులాడుతున్న ఆ పసిగుడ్డును ఎత్తుకోకుండా ఎట్లా ఉండగలను? నా గుండెలకు అదుముకున్నాను. ఆ పసిబిడ్డ చావవలసిఉంటే మరొక మనిషి ప్రేమ ఇచ్చే వెచ్చదనంలో చనిపోనివ్వు. ఆ బిడ్డ చనిపోయాడు. నాకు కూడా ప్లేగువ్యాధి సోకింది. నా ప్రయాణం పరిసమాప్తమయింది.

నేను పనిలో వుండగా మృత్యువు నన్ను వరించటం నా అదృష్టం.

***– మూలం : సుషమా దేశ్‌పాండే, అనువాదం : ఓల్గా***





SCERT TELANGANA

# పదవిజ్ఞానం

## అర్థాలు

**అ**

అంచ = హంస
అకుంఠిత = మొక్కవోనిది, అడ్డులేనిది
అచ్యుతుడు = నాశనం లేనివాడు
అతివ = స్త్రీ
అధోగతి = నరకం, కిందపడటం
అనగిపెనగి = కలిసిమెలసి
అనాథ = దిక్కులేనివాడు
అని = యుద్ధం
అనుగు = ప్రియమైన
అనుజన్ములు = తమ్ముండ్లు
అపార్థము = తప్పుగా అర్థంచేసుకొనుట
అప్రతిముడు = సాటిలేనివాడు
అప్రతిహతము = అడ్డులేనిది
అబ్బురము = ఆశ్చర్యం, వింత
అమేయము = మితిలేని
అరమర = భేదం
అర్మిలి = ప్రేమ
అలరుఁబోఁడి = పుష్పమువంటి స్త్రీ
అవల = ఆవల, అవతల
అవ్యాజం = కపటము లేనిది, సహజమైనది
అహర్నిశలు = పగలు రాత్రి

**ఆ**

ఆగమనము = వచ్చుడు, రావడం
ఆచరణ = ఆచరించేది, చేసేది
ఆటోపము = ఆడంబరం
ఆరామము = తోట
ఆలకించు = విను
ఆస్యము = ముఖం, మొగం
ఆహూతం = ఆహుతి చేయబడినది

**ఇ**

ఇచ్ఛ = కోరిక
ఇరులు = చీకట్లు
ఇల = లోకం

**ఉ**

ఉక్కిరిబిక్కిరి = ఊపిరాడని
ఉత్పాతము = ఉపద్రవం
ఉద్భవించు = పుట్టు
ఉద్యమం = ప్రయత్నం, ప్రయాస
ఉదాత్తత = గొప్పతనము, దానము, వేదమందలి ఊర్ధ్వస్వరము
ఉదాసీనం = దేనియందు ఆసక్తిలేకుండుట
ఉద్దీప్తం = ప్రకాశింపజేయబడింది
ఉన్మూలించు = పెల్లగించు
ఉప్పెన = సముద్రం యొక్క పొంగు
ఉసురు = ప్రాణం

**ఊ**

ఊసుపోక = తోచక, పొద్దుపోక

**ఎ**

ఎడాటము = విషయం
ఎలనాగ = యువతి
ఎసగిన్ = అధికమైన

**ఒ**

ఒజ్జ = గురువు
ఒరిమ = ఒద్దిక

**ఓ**

ఓర్వక = భరించలేక
ఓలి = క్రమము, కన్యాశుల్కము

**క**

కడలేని = అనంతమైన
కడలి = సముద్రం
కరటము = కాకి
కలత = బాధ

SCERT TELANGANA

కలికి = స్త్రీ
కాలుడు = యముడు
కావరము = గర్వము
కావుము = రక్షించుము
కాసు = ధనము
కినుక = అలుక, కోపం
కిణాంకం = చిహ్నం, గుర్తు
కీర్తివిసరుండు = కీర్తి వ్యాపించినవాడు
కులుకు = వెదజల్లు
కూతు = కూతురు, బిడ్డ
కూరిమి = ప్రేమ
కృపాణము = కత్తి
కేరడం = వ్యంగ్యం, కారెద్యం
కొట్నం = చాకిరి
కొడిమెలు = చేపలు పట్టే సాధనాలు
కొదువ = కొరత
కొమ్మ = స్త్రీ
కొరతవేయుట = శూలారోహణ శిక్ష
కోక = వస్త్రం, బట్ట, చీర
కోరస్ = గొంతు కలుపటం
కోస్తాదేశం = సముద్ర తీరప్రాంతం
క్రమ్ము = వ్యాపించు, చుట్టుకొను, పైబడు
క్లుప్తం = సంక్షిప్తం

**ఖ**

ఖలుడు = నీచుడు, క్రూరుడు

**గ**

గడె = చేపలుపట్టే సాధనం
గణకుడు = లెక్కలు చేసేవాడు
గయాళి = గయ్యాళి
గరము = కృత్రిమవిషం
గీము = ఇల్లు, గృహము
గేలి = వెక్కిరింపు
గోప్యం = రహస్యం
గ్రామీయులు = గ్రామస్థులు

**ఘ**

ఘనుడు = గొప్పవాడు
ఘోరము = భయం కల్గించేది
ఘోషించుట = చాటించుట, ప్రకటించుట

**చ**

చలుప = చేయు (సలుప)
చాకచక్యం = నేర్పు, ఇగురం
చారు = అందమైన
చుక్కలదొర = చందమామ, చందురుడు
చెయువు = పని, చేష్ట
చెలిమి = స్నేహం, సోపతి
చెలువ = స్త్రీ
చేబలువు = భుజబలం
చౌటమడుగు = నీళ్ళు ఇంకని గుంట

**జ**

జనత = జన సమూహం
జయవెట్టు = జేజేలు పలుకు
జలధి = సముద్రం
జలపిడుగు = నీటి ఉద్ధృతి, వరద
జిజ్ఞాస = తెలుసుకోవాలనే కోరిక

**త**

తటాకము = చెరువు
తనరు = ఒప్పు, ఒప్పెడి
తనూజుడు = కుమారుడు, కొడుకు
తరి = సమయం
తరువు = చెట్టు
తస్కరుడు = దొంగ
తాలుపు = ధరించెడి
తృష్ణ = దప్పిక, పేరాశ, ఇచ్ఛ
తెగువ = సాహసం, తెగింపు
తేజి = గుర్రం
త్యజించు = విడుచు

**ద**

దర్శనము = చూపు, అద్దము, కన్ను, బుద్ధి
దాస్యము = సేవ, ఊడిగం
దిక్కము = ఏనుగు గున్న
దీప్తి = కాంతి, వెలుగు
దూరదృష్టి = ముందుచూపు
దృక్పథము = చూసేతీరు, ఆలోచనా విధానం, దృష్టి
దొంతులు = పేర్చిన కుండలు, వరుసలు
దోఃఖర్జులు = బాహువుల దురదగలవారు (యుద్ధ పిపాసకలవాడు)
ద్రవ్యం = ధనము, సొమ్ము

SCERT TELANGANA

ధ

| | | |
|---|---|---|
| ధర్మాభిరతి | = | ధర్మము నందు ఆసక్తి |
| ధేనువు | = | ఆవు |
| ధ్వాంక్షము | = | కాకి |

న

| | | |
|---|---|---|
| నజాకతు | = | సున్నితమైన |
| నాన్ | = | అనగా |
| నికృష్టం | = | అధమం, నీచం |
| నిక్షిప్తం | = | దాచబడింది |
| నిబద్ధం | = | కట్టుబడి ఉండడం |
| నిరశన | = | భోజనం చేయకుండుట |
| నిర్దిష్ట | = | నిర్దేశించిన |
| నిర్దుష్ట | = | స్పష్టమైన, కచ్చితమైన |
| నిశ్చలం | = | చలించనిది, కదలనిది |
| నీరాట | = | జలక్రీడ |
| నుడుగు | = | చెప్పు, పలుకు |
| నెగులు | = | బాధ |
| నెట్టన | = | తప్పక |
| నేలవేలుపు | = | బ్రాహ్మణుడు |

ప

| | | |
|---|---|---|
| పట్టము | = | పీఠం, సింహాసనం |
| పట్టి | = | సంతానం, బిడ్డ |
| పతగము | = | పక్షి, పిట్ట |
| పదరి | = | తొందరపడి |
| పరభాగ్యోపజీవి | = | ఇతరుల సంపదపై ఆధారపడినవాడు |
| పరిజనం | = | సేవించువారు, సేవకులు, నౌకర్లు |
| పరిమితం | = | కొద్దిగా నున్నది, మితిగలది |
| పరిహాసం | = | వెక్కిరింత |
| పర్రెవడు | = | బీటలు వారడం, పగుళ్ళు వచ్చుడు |
| పాశ్చాత్యం | = | పడమటి ప్రాంతం / పడమటి దేశాల సంబంధమైన |
| పాషండుడు | = | వేదబాహ్యుడు, సంసార సంబంధమైన విషయాలతో శాస్త్రాన్ని సమర్థించుకునేవాడు |
| పీడ | = | బాధ, కష్టం |
| పుట్టం | = | వస్త్రం |
| పుష్టి | = | పెరుగుదల, బలం, నిండుదనం |
| పూను | = | ధరించు, సిద్ధపడు |
| పెనగు | = | పోరాడు |
| పెరిమ | = | ప్రేమ |
| ప్రతిబింబం | = | ఎదురుగా కనిపించేది |
| ప్రళయం | = | కల్పాంతం, నాశనం |
| ప్రాకారం | = | ప్రహరి / చుట్టుగోడ |
| ప్రాచ్యం | = | తూర్పుప్రాంతం / తూర్పుదేశాల సంబంధమైన |
| ప్రోలు | = | పట్టణం |

బ

| | | |
|---|---|---|
| బందెలదొడ్డి | = | దొంగతనంగా చేనుమేసే పశువులను బంధించే ప్రదేశం |
| బర్బరత్వము | = | నీచత్వము |
| బలిపుష్టము | = | కాకి |
| బహుధా | = | పలురకాలుగా |
| బిడారం | = | విడిది, వాసస్థానం |
| బుధులు | = | పండితులు |
| బొంది | = | శరీరము |
| బొబ్బ | = | కేక, లొల్లి |
| బోకి | = | బోకె, చిప్ప |

భ

| | | |
|---|---|---|
| భయాకులిత చిత్తులు | = | భయంచేత చెదిరిన మనసుకలవారు |
| భవ్యం | = | శుభం, యోగ్యమైనది |
| భ్రాంతి | = | భ్రమ |
| భూపతి | = | రాజు |

మ

| | | |
|---|---|---|
| మందిరము | = | ఇల్లు, పట్టణం |
| మక్కువ | = | ప్రేమ, కూరిమి |
| మగిడి | = | తిరిగి |
| మర్దన | = | నూఋట, చూర్ణనము |
| మర్లబడ్డ | = | తిరుగబడ్డ, ఎదురు తిరిగిన |
| మస్తు | = | చాలా |
| మహిషవాహనుడు | = | యముడు |
| మాన్యము | = | సన్మానంగా ఇవ్వబడిన భూమి |
| మాయి | = | మాయగలవాడు, మాయదారి |
| మార్తుడు | = | శత్రువు |
| మూర్ఖత్వం | = | ఎవరి మాట వినని తీరు, అవివేకం |
| మేధ | = | తెలివి |
| మోతాడు | = | ముక్కుతాడు (పశువులకు వేసేది) |

SCERT TELANGANA

మౌకలి = కాకి

ముచ్చిలి = దొంగిలించి

**య**

యోధుడు = యుద్ధం చేయువాడు

**ర**

రక్కసి ఒజ్జ = రాక్షసుల గురువు

రాజభృత్యులు = రాజును సేవించువారు

రేయి = రాత్రి, రాతిరి

రోయుట = అసహ్యించుకొనుట, చీదరించుకొనుట

**ల**

లలి = క్రమం

లక్ష్యార్థము = ఉద్దేశించబడిన అర్థము

లిబ్బులు = సంపద, ధనం (లిబ్బి = రాశి)

లేబరీ = కూలీ

లేశం = కొంచెం

**వ**

వంగడం = జాతి, వంశం

వక్తృత్వం = ఉపన్యాసం

వగ = బాధ

వడి = వేగం

వదరుబోతు = ఎక్కువగా మాట్లాడేవాడు, వసపిట్ట

వలువలు = వస్త్రాలు, బట్టలు

వసుమతి = భూమి

వాంఛ = కోరిక

వాగర్థం = మాట యొక్క అర్థం

వాగ్మి = వక్త, యుక్తి యుక్తముగా మాటాడువాడు

వాచ్యార్థం = శబ్దానికి సూటిగా ఉండే అర్థం

వాయసము = కాకి

వాయి = నోరు

వాలుగంటి = పెద్ద కన్నులు గల స్త్రీ

విద్వత్తు = పాండిత్యం

విమతులు = శత్రువులు

విషాదం = బాధ

విసపు మేతరి = శివుడు

వీద్వడు = వేరగు

వెట్టి = జీతం లేని పని

వెన్నుడు = విష్ణువు

వేవురు = వెయ్యిమంది

వేసరి = విసుగుచెంది

వ్రతము = నియమం (ఉపవాసాది పుణ్యకార్యం), నోము

వ్రతనిష్ఠ = నియమబద్ధమైన కార్యంలో నిమగ్నమగుట

**శ**

శక్యం = సాధ్యం

శమియించు = శాంతించు, తగ్గు

శోచనీయం = శోకింపదగినది

శ్రుతం = వినబడినది

శ్రోత = వినేవాడు

శ్లథనం = శిథిలం కావడం

**స**

సకి = చెలి

సఖుడు = స్నేహితుడు, సోపతిగాడు, దోస్తు

సన్నాహము = సిద్ధం

సమరం = యుద్ధం

సరాగము = ఒద్దిక

ససేమిరా = ఎట్టిపరిస్థితుల్లోను

సహోదరులు = సోదరులు

సాత్త్వికుడు = సాధుస్వభావి

సిరి = ధనం

సిద్ధి = సిద్ధించుట

సుభిక్షం = కరువు కాటకములు లేనిది

సుబేదారులు = ఒక సభకు అధికారి, సేనలో ఒక అధికారి

సురభి = ఆవు

సురకరువలి = సురగాలి, సురగాడ్పు

సృజించు = సృష్టిచేయు, కలుగజేయు

సేక్‌సింది = సుంకరి, మస్కూరి, ఎల్లోడు, కావలికార్, వి.ఆర్.ఎ.

స్మృతి = జ్ఞాపకం, యాది

**క్ష**

క్షయము = నశించేది

క్ష్మాపతి = భూమికి భర్త, రాజు

క్షితిధరం = పర్వతం, గుట్ట

SCERT TELANGANA

# పర్యాయపదాలు

| | | |
|---|---|---|
| అంధకారం | = | తమస్సు, చీకటి, తిమిరం |
| అతివ | = | స్త్రీ, ఇంతి |
| అని | = | యుద్ధం, పోరు, సమరం, రణం |
| ఆకాశం | = | గగనం, అంబరం |
| ఆభరణం | = | భూషణం, అలంకారం, సొమ్ము, నగ |
| ఆశ | = | కోరిక, వాంఛ, ఇచ్ఛ |
| ఉర్వి | = | భూమి, అవని, ధరణి, పుడమి, నేల |
| ఉసురు | = | ప్రాణం, ఊపిరి, పానం, ఆయువు |
| ఓలి | = | క్రమం, వరుస |
| కష్టాలు | = | బాధలు, తిప్పలు, పుల్లెందలు, గోసలు, యాతనలు |
| కావుము | = | కాపాడుము, రక్షించుము |
| కినుక | = | అలుక, కోపం |
| క్షితి | = | భూమి, ధర, ధాత్రి, ధరణి |
| కృప | = | దయ, కరుణ, జాలి, నెనరు, కనికరం |
| కృపాణం | = | కత్తి, ఖడ్గం, అసి |
| కొండ | = | పర్వతం, అచలం, అద్రి, గుట్ట |
| కోపం | = | ఆగ్రహం, క్రోధం, అలుగుట |
| గేలి | = | వెక్కిరించు, హేళనచేయు, కారెడ్డం ఆడు |
| చుక్క | = | నక్షత్రం, తార |
| చెట్టు | = | వృక్షం, తరువు, మహీజం |
| చౌక | = | అగ్గువ, తక్కువ, చులకన, హీనం |
| జలధి | = | సముద్రం, అంబుధి, వార్ధి, సాగరం |
| జీవితం | = | బతుకు, మనుగడ, జీవనం, మనికి |
| తండ్రి | = | అయ్య, అప్ప, అబ్బ, నాయన, నాన్న |
| తల | = | నెత్తి, శీర్షం, శిరస్సు, మస్తకం, ఉత్తమాంగం |
| తస్కరుడు | = | దొంగ, చోరుడు, ముచ్చు |
| తృష్ణ | = | కోరిక, వాంఛ, ఈప్స |
| తేజి | = | గుర్రం, అశ్వం, తురంగం |
| దిక్కము | = | ఏనుగు గున్న, కరభం |
| ధ్వని | = | శబ్దం, చప్పుడు, సవ్వడి, సద్దు |
| దుఃఖం | = | ఏడ్పు, శోకం, రోదనం |
| నిలయం | = | ఆవాసం, నెలవు, తానం, తావు |
| నెత్తురు | = | రక్తం, రుధిరం |
| పరిహాసం | = | వెక్కిరింత, హేళన, గేలి, కారెడ్డం, దెప్పుడు |
| పల్లె | = | గ్రామం, ఊరు, జనపదం |
| పసిడి | = | బంగారం, స్వర్ణం, పుత్తడి, పైడి |
| పుష్పం | = | పువ్వు, కుసుమం, ప్రసూనం, విరి |
| పూను | = | ధరించు, సిద్ధపడు, పట్టుదలవహించు |
| పొలం | = | క్షేత్రం, పంటభూమి, కేదారం |
| బంధువు | = | చుట్టం, అతిథి |
| బాధ | = | విచారం, చింత, రంది |
| బువ్వ | = | అన్నం, కూడు |
| మడుగు | = | కొలను, గుంట |
| మనస్సు | = | చిత్తం, స్వాంతం, హృదయం, ఎద, మది |
| మనిషి | = | మానవుడు, నరుడు, మర్త్యుడు, మనుజుడు |
| మరుగు | = | అదృశ్యం, రహస్యం, చాటు |
| మస్తు | = | సమృద్ధి, ఎక్కువ, అధికం |
| మార్గం | = | తొవ్వ, పథం, దారి, బాట |
| యోధుడు | = | వీరుడు, బంటు, జోదు |
| రాత్రి | = | నిశ, నిశీథి, రేయి, రజని, యామిని |
| లక్షణం | = | గుణం, స్వభావం |
| వాక్కు | = | మాట, పలుకు, నుడుగు |
| వాన | = | వర్షం, వృష్టి |
| వాయసం | = | కాకి, మౌకలి, ధ్వాంక్షం |
| వివాహం | = | లగ్గం, పెండ్లి, పరిణయం |
| విశ్వాసం | = | నమ్మకం, నమ్మిక |
| వెన్నుడు | = | విష్ణువు, నారాయణుడు, శ్రీహరి |
| సంతోషం | = | ఆనందం, మోదం, సంబురం, హర్షం |
| సకలం | = | సమస్తం, సర్వం |
| సఖుడు | = | స్నేహితుడు, మిత్రుడు, సంగడికాడు, దోస్తు, నేస్తం |
| సత్యం | = | నిజం, యదార్థం, వాస్తవం, నివద్ది |
| సమం | = | సమానం, సరి, సాటి, తుల్యం |
| సరాగం | = | ఒద్దిక, ఒప్పు, రాగంతో కూడినది |
| సహ | = | తోడు, కూడ |
| సాగరం | = | సముద్రం, అంబుధి, జలధి |
| సాటి | = | పోలిక, స్వరూపం |
| సాధనం | = | పనిముట్టు, ఉపకరణం, ఇసిరె |
| సేన | = | సైన్యం, దండు, దళం |
| స్నేహం | = | చెలిమి, మైత్రి, నెయ్యం |
| సోయగం | = | అందం, సొగసు, వన్నె |

SCERT TELANGANA

# నానార్థాలు

అప్పనం = పన్ను, కానుక, అర్పణం
అర్థం = కారణం, ధనం, శబ్దార్థం
ఆడు = ఆడుట, మాట, స్త్రీ
ఉద్యమం = యత్నం, సిద్ధమగుట, పోరాటం
ఉసురు = ప్రాణం, ప్రాణక్షోభం వలని దుష్ఫలం
ఎడాటం = విషయం, ఆట
ఓలి = వరుస, కన్యాశుల్కం, శుల్కం
కళ = చంద్రకళ, రాగం, శిల్పుల నైపుణ్యం
కాక = వేడిమి, చిన్నాన్న, కాకుండ
కాలము = సమయం, నలుపు, చావు, తాడి
కాలు = పాదము, పాతిక, అంటుకొను (నాలుగోవంతు)
కాలుడు = యముడు, శివుడు, శని
కావు = రక్షించు, కాకధ్వని అనుకరణ
కృషి = వ్యవసాయం, పని, ప్రయత్నం
కేరడం = ఉపేక్ష, తిరస్కారం, వంకరమాట
కేసరి = సింహం, గుర్రం, శ్రేష్ఠుడు
గరము = రోగము, తడుపుట, మ్రింగుట, నీరు, కృత్రిమవిషం
చక్రం = గిరక, వృత్తం, గీర, ఒక ఆయుధం
చారు = అందం, చింతపండుతో చేసిన రసం
చీర = నారచీర, గోచి, జుట్టు, రేఖ
చుక్క = నక్షత్రం, బిందువు, బొట్టు
చెలువు = అందం, మనోహరం, విధం
తత్త్వము = నిజస్థితి, మనసు, స్వభావం
తృష్ణ = అత్యాశ, దూప
దండం = కర్ర, నమస్కారం
ద్రవ్యం = ధనం, ఇత్తడి, లక్క, ఔషధం
ధర = నేల, వెల, మెదడు
ధర్మం = పుణ్యం, న్యాయం, యాగం
ధార = ప్రవాహము, పరంపర
ధ్వాంక్షము = కాకి, కొంగ, జలచర పక్షి
నందన = కుమార్తె, ఒక సంవత్సరం
పంచ = ఐదు, గృహ పార్శ్వప్రదేశం, ఆశ్రయం
పాండువు = తెలుపు, ఒకరోగం
బతుకు = జీవితం, ఆధారం
బలం = శక్తి, సైన్యం
భుక్తి = ఆహారం, అనుభవం, మేర
మతం = అభిప్రాయం, శాస్త్రం, సమ్మతి
మతి = మనస్సు, వాంఛ, వాక్కు, బుద్ధి, తలపు
మరుగు = అదృశ్యం, చోటు, దాగు
మాట = నింద, పలుకు
మొక్కు = నమస్కారం, మొక్కుబడి
యోగం = ధాన్యం, అదృష్టం, ఒక శాస్త్రం, కూడిక
రసము = నీరు, చెరుకురసము, నవరసాల్లో ఒకటి, చారు
రాజు = ప్రభువు, ఇంద్రుడు, చంద్రుడు
రూపం = ఆకారం, అందం
లక్షణం = గుణం, గురుతు
వంకలు = సాకులు, నీటికాలువలు
వంశం = కులం, పిల్లనగ్రోవి
వాగ్మి = ఉపన్యాసకుడు, చిలుక
వాయి = కొన, నోరు, వాదర
వాహిని = నది, సైన్యం
విధి = ధాత, కాలం, పని, భాగ్యం
విషము = గరళం, జలం
వేలుపు = దైవం, జ్యోస్యం
శక్తి = బలిమి, చిల్లకోల, పార్వతి
సంతానం = బిడ్డ, ఒక కల్పవృక్షం, కులం
సంసారం = ప్రపంచం, కుటుంబం, పుట్టుక
సభ = పరిషత్తు, ఇల్లు, జూదం
సమాజం = మనుషుల గుంపు, సభ
సమితి = యుద్ధం, సమూహం, సభ, సంగమం
సాధనం = సాధించుట, ఉపకరణము, ఉపాయము
సృష్టి = సృజించుట, ప్రకృతి, స్వభావం

SCERT TELANGANA

# వ్యుత్పత్త్యర్థాలు

| | | |
|---|---|---|
| అచ్యుతుడు | = | తన పదవి నుండి జారనివాడు |
| అదృష్టము | = | చూడబడనిది - భాగ్యం |
| అసూయ | = | గుణములయందు దోషారోపణము చేయుట - ఓర్వలేనితనం |
| అక్షతలు | = | క్షతం లేనివి, నాశనం లేనివి |
| అక్షరం | = | నాశనం పొందనిది |
| ఇతిహాసం | = | ఇట్లు జరిగినదని చెప్పెడు పూర్వరాజుల చరిత్రం కలది - రామాయణం, భారతం ఇతిహాసాలు<br>ఇతి + హ + ఆసీత్ - ఇతిహాసః |
| కాకోదరం | = | కాకి పొట్ట వంటి పొట్ట గలది - పాము |
| ఖలుడు | = | ధర్మం నుండి తప్పినవాడు - దుష్టుడు |
| గురువు | = | అజ్ఞానమనే అంధకారమును భేదించువాడు |
| జలధి | = | జలములు దీనిచే ధరించబడును - సముద్రం |
| జ్వాల | = | జ్వలించునది, మండునది - అగ్నిశిఖ |
| తనూజుడు | = | శరీరం నుండి పుట్టినవాడు - కొడుకు |
| ద్రవ్యము | = | పొందదగినది - ధనం |
| ధర్మతనూజుడు | = | యమధర్మరాజు వరం వలన జన్మించినవాడు - ధర్మరాజు |
| ధ్వాంక్షము | = | మాంసమును కాంక్షించునది - కాకి |
| ధేనువు | = | దూడకు పాలుగుడుపునది - ఆవు |
| నృపాలుడు | = | నరులను పాలించువాడు - రాజు |
| పాషండుడు | = | సంసార బంధాలకు అనుగుణంగా శాస్త్రమును వాడుకొనే వాడు |
| బలిపుష్టము | = | బలిగా ఇవ్వబడిన ఆహారంతో పోషించబడునది - కాకి |
| భాస్కరుడు | = | ప్రకాశమును కలిగించువాడు - సూర్యుడు |
| మానవులు | = | మనువు సంతతివారు - నరులు |
| మున్నీరు | = | సృష్టి ఆది నుండి ఉన్న నీరు - సముద్రం |
| రూపాయి | = | రౌప్యం (వెండి) నుండి వచ్చిన నాణెం |
| వసుమతి | = | బంగారమును గర్భమునందు గలది - భూమి |
| విసపు మేతరి | = | హాలాహలమును (విషమును) మింగినవాడు - శివుడు |
| సింహాసనము | = | సింహాకృతిగా చేయబడిన ఉన్నత పీఠం |
| సహోదరులు | = | తోడబుట్టిన వారు - అన్నదమ్ములు |
| సాగరం | = | సగరులచే త్రవ్వబడినది - సముద్రం |
| హృదయం | = | హరింపబడునది - గుండెకాయ, మనసు |

SCERT TELANGANA

# ప్రకృతి - వికృతి

| | | |
|---|---|---|
| అగ్ని | - | అగ్గి |
| అద్భుతం | - | అబ్బురం |
| అన్యాయం | - | అన్నెము |
| ఆర్య | - | అయ్య |
| ఆవేశం | - | ఆవేసం |
| ఆశ | - | ఆస |
| ఆశ్చర్యం | - | అచ్చెరువు |
| ఆహారం | - | ఓగిరం |
| ఆళి | - | ఓలి |
| ఉపాధ్యాయుడు | - | ఒజ్జ |
| ఏక | - | ఎక్కము |
| కన్య | - | కన్నె |
| కర్కశం | - | కఱకు |
| కలహం | - | కయ్యం |
| కష్టం | - | కస్తి |
| కార్యం | - | కర్జం |
| కీర్తి | - | కీరితి |
| కుమారుడు | - | కొమరుడు |
| కోకిల | - | కోయిల |
| క్షేమము | - | సేమము |
| గర్వము | - | గరువము |
| గృహము | - | గీము |

| | | | | | |
|---|---|---|---|---|---|
| గౌరవం | - | గారవం | ముఖము | - | మొగము |
| చంద్రుడు | - | చందురుడు | యత్నం | - | జతనం |
| దృష్టి | - | దిష్టి | రాజు | - | రాయడు |
| ద్వయీ | - | దోయి | రాక్షసి | - | రక్కసి |
| దేవ | - | దేవర | రాత్రి | - | రాతిరి |
| న్యాయం | - | నాయం | విద్య | - | విద్దె |
| నిజం | - | నిక్కం | విషము | - | విసం |
| నిత్యం | - | నిచ్చలు | వేషం | - | వేసం |
| పర | - | పరాయి | శక్తి | - | సత్తి |
| పరిహాసం | - | పరియాచకం | శిఖ | - | సిగ |
| పశువు | - | పస (లం)రం | శూల | - | సూల |
| ప్రభువు | - | పబువు | సంతోషం | - | సంతసం |
| ప్రాకారం | - | ప్రహరి | సఖి | - | సకి |
| పీఠం | - | పీట | సత్యం | - | సత్తెం |
| బంధం | - | బందం | సన్న్యాసి | - | సన్నాసి |
| భక్తి | - | బత్తి | సహాయం | - | సాయం |
| భాగ్యం | - | బాగ్గెం | సింహం | - | సింగం |
| భాష | - | బాస | సూక్తి | - | సుద్ది |
| భుక్తి | - | బుత్తి | స్త్రీ | - | ఇంతి |
| భోజనము | - | బోనము | హంస | - | అంచ |
| భేరి | - | బేరి | హృదయం | - | ఎద |
| మానుష్య | - | మనిసి | | | |

## జాతీయాలు

01. వాయసం (i) మసిబూసి మారేడుకాయ జేయడం - మోసంజేయడం.
(ii) కాకిబలగం - ఎక్కువ బంధువర్గం కల్గి ఉండటం.

04. చిన్నప్పుడే (i) మాటామంతి - మన రాష్ట్రంలో దీనిని మాటాముచ్చట అనే అర్థంలో వాడుతారు.

06. దీక్షకు సిద్ధంకండి (i) తిలోదకాలు : ఆశవదులుకోవడం అనే అర్థంలో వాడుతారు.
(ii) ఏ ఎండకు ఆ గొడుగు : సందర్భానుసారంగా ఆచరించి కాలం గడుపుట (అవకాశవాదం).

08. ఉద్యమస్ఫూర్తి (i) ఉడుకునెత్తురు : యువతలో ఉండే సహజమైన ఆవేశం.

09. కోరస్ (i) రాళ్ళు విసురుతారు : విమర్శిస్తారు.

10. వాగ్భూషణం (i) బంగారుబాట : మంచితోవ, అభివృద్ధిపథం, ఉన్నతమార్గం.
(ii) కట్టలు తెంచుకొని పారుతుంది : హద్దులు దాటిపోతుంది.

11. ధర్మపాలన (i) కొంగుపసిడి : సులభసాధ్యమైన వస్తువు, ఎక్కువ అందుబాటులో ఉండేది.


తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2020-21
SCERT TELANGANA